# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక జూన్, 2012 ₹ 20



ఒక్క నీవే నాకు...

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dhammapada.*

**సంపుటి 23 జూన్ 2012 సంచిక 6**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాంద్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

కుర్రా జితేంద్రబాబు

నందిగం కృష్ణారావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*

మరిన్ని వివరాలకు 80 వ పుట చూడండి.


## ఈ నెల...


వార్తా పత్రికల 'యథేచ్ఛ' ........................................ 3

*- మార్క్ ట్వేన్*

సిద్ధార్థ గౌతముని జీవన గాథ ................................ 5

*- చెన్నూరు ఆంజనేయ రెడ్డి*

సి.ఆర్.రెడ్డి హైస్కూలు రోజులు ................................ 14

*- గొర్రెపాటి వెంకట సుబ్బయ్య*

అగాథం ........................................................ 17

*- ఆస్కార్ వైల్డ్ - అశ్విని.కె*

తెలుగు నాటకం 'గో టు హెల్' ................................ 25

*- ఎన్నార్కె*

తొలి తరం చారిత్రక, శాసన పరిశోధకులు

దూపాటి వెంకటరమణాచార్యులు .............................. 29

*- కుర్రా జితేంద్రబాబు*

నాన్న పోలికా ? ................................................ 36

*- డాక్టరు వెలగా లక్ష్మి*

ఆట్రుప్పడై ..................................................... 38

*- డాక్టరు జె.వి. సత్యవాణి*

అజరామరం - అజంతా ........................................ 40

*- కాంద్రేగుల నాగేశ్వర రావు*

అంతర్జ్వలనం ................................................... 48

*- కె. శివారెడ్డి*

ధ్రుపద్ గానం .................................................. 57

*- నండూరి పార్థసారథి*

బాపి బావ (అడివి బాపిరాజు) ................................ 62

*- విరియాల లక్ష్మీపతి*

నాటక వాణి .................................................... 70

*- డాక్టరు వోలేటి పార్వతీశం*

సాక్షి ............................................................ 72

*- డాక్టరు వి. భార్గవి*

రావెల సోమయ్యకు లోహియా లేఖ ........................... 74

ముగ్గు ........................................................... 75

*- సి. వేణు*

చదవండి (పుస్తక పరిచయం) ................................ 76

నవ్వులు ......................................................... 78


| | | |
|---|---|---|
| *ముఖచిత్రం* : ఆనందమాయె | రాజా రవివర్మ |
| *రెండవ అట్ట* : ఒక్క నీవే నాకు | శ్రావణకుమార్ |
| *మూడవ అట్ట* : వెలుగు నీడల పొత్తు | |
| *నాల్గవ అట్ట* : దీపాల వేళాయె | ఎమ్.వి. దురంధర్ |


(*వివరాలు : 34వ పుటలో...*)

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు అరవయి ఏండ్ల పండుగ చేసుకుంటున్నాము. తొలి రోజుల్లో చట్టసభల్లో సభ్యులుగా మేధావులు, నైతిక విలువల పరిరక్షకులు, ప్రజల శ్రేయస్సు కోరిన క్రియాశీలురు, భావి భారతాన్ని నిర్మించ దీక్షబూనిన దార్శనికులు ఎన్నిక అయి సభను అలంకరించేవారు. వారి ఔన్నత్యంతో చట్టసభలకు గౌరవం పెరిగేది. మన ప్రజాస్వామ్య విలువలు కాలక్రమేణా దిగజారుతూ వస్తున్న సంగతి మనందరకూ తెలిసిన విషయమే. అలాగే ఈ వ్యవస్థకు మూలస్తంభాలలో ఒకటయిన వార్తాపత్రికల తీరు తెన్నులు ఎన్ని విధాలుగా అడుగంటాయో పాఠకులకు ప్రత్యేకంగా వివరించవలసిన పనిలేదు. అయితే సరిగ్గా 130 సంవత్సరాల క్రితం కూడా పరిస్థితి ఇంత దారుణంగా ఉందనే మార్క్ ట్వేన్ అంటున్నారు. అదే 'పత్రికల యథేచ్ఛ' !

ఎందరో వైతాళికులు ఈ నేలను సుసంపన్నం చేశారు. ఆ వరుసలోనే దూపాటి వారి సేవలు గుదిగుచ్చి అందిస్తున్నారు జితేంద్ర.

ప్రపంచ నాగరకతలో నైలునదీ తీరాన ఉన్న పిరమిడ్లకు అంతులేని ప్రచారం జరిగింది. మరి అజంత చిత్రకళకు సంబంధించిన గ్రంథాలను వేళ్లపై లెక్కించ వచ్చు – ఇంకా ఎంతో ప్రచారానికి, పరిశీలనకు ఆస్కారముందని 'అజరామరం – అజంత' వ్యాసం తెలియజేస్తుంది.

ఎన్నియో విద్యల ఆరితేరిన అడివి బాపిరాజు విశిష్టతను విరియాల లక్ష్మీపతి వ్యాసంలో అందిస్తున్నాం.

తన సుదీర్ఘ ప్రయాణాన్ని, కవితా జీవితాన్ని మననం చేసుకుంటూ ఆసువుగా ప్రసంగించిన శివారెడ్డి మా మాట మీద ఆ ప్రసంగాన్ని వ్యాసరూపంలో ఇచ్చారు. ఎన్నో జ్ఞాపకాలు కలబోసిన పరిణతవాణి చదవండి.

లోహియాలాంటి మేధావులు ఎవరినీ లెక్కచేయరు. ఎమ్.ఎన్.రాయ్ సిద్ధాంతాన్ని ఏ విధంగా ఆచరణ యోగ్యం కాదని చెప్పారో 'లోహియా లేఖ' లో చూడవచ్చు.

అక్షరాలు దిద్దితేనే రావు. ముగ్గులు వేసినా నేర్చుకోవచ్చని 'ముగ్గు'లో దిగితే తెలుస్తుంది.



– సంపాదకులు



### వార్తా పత్రికల 'యథేచ్ఛ'

# విచ్చలవిడి ప్రజాస్వామ్యం

**- మార్క్ ట్వేన్**

పత్రికలు ఏమైనా చేయదలుచుకుంటే, దయాదాక్షిణ్యాలు లేకుండా చేయగలవు. పైగా అదే సరైన చర్య అని సమర్థించుకోగలవు కూడా. అధికారంలో ఉన్న నేరగాళ్ళను సమర్థిస్తుంది. అదీ ప్రజాస్వామ్య పార్టీల వంకతో. ఇది ఎంత దూరం వెళ్ళిందంటే ఇప్పుడు అమెరికా సెనేట్ సభ్యుల రూపురేఖలను, గుణగణాలను వార్తాపత్రికలే తయారు చేస్తున్నాయి. అందులోని సభ్యులు చట్టానికి జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకోలేని స్థితిలో ఉన్నారు. వారి గౌరవ స్థానమేమిటో కూడా గుర్తించలేని చీకటిలో ఉండిపోయారు. అంతగా నైతిక అజ్ఞానంలో ఉన్న కాంగ్రెస్ సభ్యులు ఎంత అగౌరవం పాలయ్యారో కూడా ఈ పత్రికలే వెలుగులోకి తెచ్చాయి. వారు కాంగ్రెస్ సభ్యులుగా పనిచేయటానికి జీతభత్యాలు తీసుకుంటూనే ప్రజల సొమ్మును నిస్సిగ్గుగా చిల్లరఖర్చుల పేరుతో కొల్లగొడుతున్నారు. పత్రికలు ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోవలసిన అక్రమంగా, బాధపడవలసిన అన్యాయంగా చూపించలేదు. ఇదంతా వార్తాపత్రికల నిర్వాకమే అని చెప్పటానికి వెనుకాడను. ఎందుకంటే పత్రికలకు మన ప్రజాస్వామ్యంలో అంత స్వేచ్ఛ ఉంది. ఆ స్వేచ్ఛను అవి ఇష్టానుసారం వాడుకుంటున్నాయి.

***పత్రికలన్నీ ఈ 'యథేచ్ఛ'తో ఎటువంటి ఆరోపణలు, అదీ అధికారంలో ఉన్న వ్యక్తిపై గాని, ఒక సామాన్య పౌరునిపైగాని చేయటానికి వెనుకాడవు. అంతేకాదు ఎటువంటి చెత్త సిద్ధాంతాన్ని సమర్థించటానికైనా భయపడవు. ఈ 'యథేచ్ఛ'కు ఎటువంటి బంధనాలు లేవు. ఇవి కాపాడవలసిన ప్రజాభిప్రాయాన్ని ఎంతగానో దిగజార్చాయి. పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు చాలా చట్టాలున్నాయి. కాని వాటి నుంచి ప్రజలను కాపాడేందుకు ఎటువంటి న్యాయనియమాలు లేవు. ఒకవేళ ఎవరైనా పరువునష్టం దావా వేస్తే, పత్రికలన్నీ మూకుమ్మడిగా అటువంటి వ్యక్తిని తమ 'న్యాయస్థానంలో' నిలబెట్టి నిర్దాక్షిణ్యంగా చీల్చి చెండాడుతాయి - న్యాయస్థానాలు తీర్పులు చెప్పేలోపుగానే.***

నిజానికి **చార్లెస్ రీడ్** ఇంగ్లీషు వార్తా పత్రికలను కోర్టుకీడ్చి తీర్పు పొందవచ్చు. కాని ఈ పత్రికలు తప్పనిసరిగా అతనికి గుణపాఠం చెప్పటానికి వెనుకాడవు. కోర్టుకెక్కడం, న్యాయాన్ని అర్థించటం ఎంత హాస్యాస్పదమో తప్పనిసరిగా అతనికి అర్థమౌతుంది. ఈ వార్తా పత్రికల సంఖ్య ఎంతగా పెరిగితే మన నైతిక విలువలు అంతగా పతనమౌతాయనిపిస్తుంది. ఎక్కువ పత్రికలు తక్కువ విలువలు అన్నమాట. ఒక్క వార్తా పత్రిక ఉన్నప్పుడు ప్రజలకు జరిగిన మేలు యాభై పత్రికలు వచ్చిన తరువాత అంతకీడు చేస్తున్నాయి. ఈ వార్తా పత్రికల యాజమాన్య వ్యవస్థను సమూలంగా పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉంది. వారి అవసరాలను, స్వార్థ నేపథ్యాలను కూడా వెలికి తేవలసిన సమయం ఇది.

నిజానికి ముప్పై, నలభై ఏళ్ల కిందట పత్రికల ధోరణికి, ఇప్పటి వార్తా పత్రికల విపరీతపు నైజానికి ఎంతైనా వ్యత్యాసం ఉంది. ఇది లోతుగా విచారించ వలసిన పరిస్థితి. ఆ రోజుల్లో పత్రికలే ప్రజల క్షేమాన్ని, అభిప్రాయాన్ని, నిజాన్ని నిలబెట్టడానికి కృషి చేసేవి. ఇప్పటి పరిస్థితి అలా లేదు. నిన్న కాక మొన్న ఒక న్యూయార్క్ దిన పత్రిక కాంగ్రెస్ సభ్యుల జీతభత్యాలు, చిల్లరఖర్చులు (దొంగతనంగా) తీసుకోవటంలో ఏమీ తప్పు లేదని సమర్థించింది. ఎందుకంటే వారి అవసరాలకు సరిపడా జీతాలు అందటం లేదని సంపాదకీయం రాసింది - జీతాలు చాలకపోతే దొంగతనం చేయటంలో తప్పు లేదు అన్నట్లు. ఆ విధంగా సంపాదకీయం రాయటంలో సామాన్య పౌరుని ఆలోచనను ఎంతగానో ప్రభావితం చేస్తుంది. చివరికి 'దినపత్రికలో వచ్చిందా? అయితే నిజమే అయి ఉంటుంద'ని అనుకునే స్థితికి తీసుకువచ్చాయి. ప్రజలకు ఇదే ప్రమాణమై పోతుంది కూడా. కాని జరిగేదేమిటి? ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రజాస్వామ్య దేశాలలో మూర్ఖపు ప్రజలు వార్తా ప్రతికలను విశ్వసిస్తూ వాటి మూసలోనే పడిపోతున్నారు. నిజానికి ఇక్కడే అసలైన ప్రమాదం దాగి ఉంది.

ఇప్పుడు వార్తాపత్రికలకు విపరీతమైన శక్తి ఉంది. ఎవరినైనా ఏమైనా చేయగల సామర్థ్యం వీటికున్నది. ఒక వ్యక్తిని ఆకాశానికెత్తగలవు, ఇష్టం లేకపోతే పాతాళానికి తొక్కివేయగలవు. ఒక రౌడీని, గూండాని ఎంతో గౌరవస్థానంలో నిలబెట్టి,

నైతిక విలువలతో జీవించే వాడిని అబద్ధాల కోరుగా, అవినీతిపరునిగా చిత్రించగలవు – ప్రజలను నమ్మించగలవు. ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని న్యాయాన్ని, ధర్మాన్ని అపహాస్యం చేయగలవు.

ఇక్కడ వార్తా పత్రికలకు ఒక లైనుకు ఒక డాలరు లెక్కన తీసుకుని ఏ పనికిరాని సిద్ధాంతాన్నైనా సమర్థించగల సత్తా ఉంది. న్యూయార్కు వార్తా పత్రికలు **ఫాస్టర్** హత్య విషయంలో గవర్నరుకు మద్దతు యిమ్మని అర్థిస్తూనే ప్రక్కనే డబ్బు తీసుకుని నేరస్తుని క్షమాభిక్ష ఇవ్వాలని ప్రకటన రూపంలో ప్రచురించింది. ఇంకా ఎవరైనా డబ్బు యిచ్చి ఉంటే గవర్నరు మీద కూడా అసమర్థుడని ప్రచారం చేసేది, అదీ వ్యాపార ప్రకటన రూపంలో. ఇలా డబ్బు కోసం అమ్ముడుపోయే పత్రికలు ప్రజలకు, ప్రజాస్వామ్యానికి బద్ధ శత్రువులు.

***ఇప్పుడు ప్రజాస్వామ్య దేశాలలో పత్రికల చేతుల్లో అంతులేని శక్తి, స్వేచ్ఛ ఉంది. అది ప్రజల అభిప్రాయాలని, ఎంతగానో ప్రభావితం చేస్తున్నది – నిజానికి ఈ శక్తి గలిగిన వాళ్లు ఎవరు? మిడి మిడి జ్ఞానంతో, స్వార్థబుద్ధితో, మిగతా ఏ ప్రవృత్తిలో ప్రావీణ్యం లేని అతిసాధారణ అసమర్థులైన వారందరూ ఈ 'జర్నలిజం' దారిలోకి వచ్చి పత్రికల్లో చేరుతున్నారు.***

ఇటువంటి వాళ్లు వందల సంఖ్యలో నాకు తెలుసు! వారికి ఇంగితజ్ఞానం – అదీ మనలాంటి వారితో వున్నపుడు – ఇసుమంత కూడా వుండదు – కాని వారే పత్రికలకు రాసినపుడు – ప్రజలు చూసేది 'పత్రికనే' (ఈ మరుగుజ్జు విలేఖర్లు కనపడరు కదా.) వీరి ప్రేలాపనలే పత్రికల్లో మార్మోగే ఉరుములు.

నాకు వ్యక్తిగతంగా తెలుసు – వీరు, విలేఖరులు ఎలా అబద్ధాలు అలవోకగా చెప్పగలరో – అది నిజానికి వారికి ఒక అలవాటు – అలవాట్లు మానుకోవడం చాలా కష్టం కదా! ఈ పత్రికల 'యథేచ్ఛ' ఎవ్వరినైనా నాశనం చేయగలదు. దీనిలో నాకెలాంటి సందేహం లేదు. ఇంగ్లండులో **స్టాన్లీ** చాలా గొప్పవాడు. అతని ప్రతిభను అందరూ మెచ్చుకుంటారు. అతను ఆఫ్రికాలో చేసిన సేవలు మరువలేనివి. కానీ, అమెరికాలో ఈ పత్రికలు ఆయనను కైమా కొట్టి వదిలి పెట్టాయి ఎందుకు ? కేవలం ఆయన గొంతు పీలగా ఉంటుందని. సరిగ్గా, అంటే ఆడంబరంగా మాట్లాడలేడని, ఈ తీరం నుంచి కాలిఫోర్నియా వరకూ పత్రికలు ఆయన గౌరవాన్ని ఎంతగా దిగజార్చాయో, ఆయన సేవా కీర్తినంతా మర్చిపోయాయి. ఆయన ఏదో నేరం చేసిన వాడిలాగా చిత్రించి వెంటాడాయి.

**బ్రెట్ హార్ట్** ని ఎక్కడి నుంచి పట్టుకొచ్చాయో అతన్ని సింహాసనం మీద కూర్చోబెట్టి మబ్బుల్లో ఊరేగించాయి. పత్రికల సంపాదకులందరూ ఆయనను పొగడలేక బొంగురుపోయారు. వారి టోపీలు గాలికి చిరిగిపోయేవరకు ఊపుతూనే ఉన్నారు. ఒకసారి ఆయన కుటుంబం రోగాల బారిన పడినపుడు, ఆయన వ్రాసింది పేలవంగా ఉందని 'అరె ఇతనికి ఏమీ రాదే –' అని ఎవరో అన్నారు. అంతే ఇదే సంపాదకులు ఆయన వెంటబడి కిందికి లాగి ఆయన మీదే నడుచుకుంటూ వెళ్లారు. అప్పటినుంచి ఆయన మీద దుమ్ము పోస్తూనే ఉన్నారు. చివరకు ఆయనను సర్వనాశనం చేశారు. నిజానికి ఈయన ఒక విలేఖరి పట్ల జాలి చూపటమే ఆయన చేసిన నేరం. అదే విలేఖరి కాలిఫోర్నియా వెళ్లి ఆయన మీద లేనిపోని కథలు వ్రాశాడు. అంటే అవి ఆ పత్రికలు వ్రాసినట్లే కదా. పత్రికలకింత స్వేచ్ఛ అవసరమా?

మిచిగన్ రాష్ట్రంలోని ఒక పట్టణంలో నేను ఒక సంపాదకునితో భోజనానికి కూర్చొనన్నాను – ఆయన తాగి ఉన్నాడని. తరువాత ఆయన తన పత్రికలో నా ప్రసంగం చెత్తగా ఉందని, వదరుబోతు తనంగా ఉందని వ్రాశాడు – వినకుండానే. కాని ఆయన విని ఉంటే కాస్తయినా జ్ఞానం కలిగేదేమో. ఒక డెట్రాయిట్ పత్రిక ఒక సారి వ్రాసింది: నాకు నా భార్యను రోజూ కొట్టే అలవాటుందని, ఇప్పటికీ ఈ వినోదాన్ని ఆనందిస్తున్నానని. ఆ విధంగా ఆమెను లేవకుండా చేశానని. ఇందులో ఏమాత్రం నిజంలేదని తెలుసు. నేను పరువు నష్టం దావా వేయవచ్చు. కానీ నాకు దాని పర్యవసానం తెలుసు. అమెరికాలో పత్రికలన్నీ దీనికి విపరీతమైన ప్రచారం యిచ్చి, యిదే నిజమని ప్రజలను నమ్మించగలవు. ఇలా ఎన్నైనా చెప్పగలను. కానీ మన వార్తా పత్రికలకు యిచ్చిన 'యథేచ్ఛ', విచ్చల విడి స్వేచ్ఛ వారి అజ్ఞానంతో, అహంకారంతో ఎంతగానో దుర్వినియోగం చేస్తున్నారు. ఇది దేశానికి ప్రజా శ్రేయస్సుకు ముప్పు తెస్తోంది. చివరకు దేశ స్వాతంత్ర్యాన్ని హరిస్తుంది కూడ.

పత్రికల 'యథేచ్ఛ'* విచ్చలవిడి ప్రజాస్వామ్యానికి దారి తీస్తుంది. ఇదీ ఈనాటి పరిస్థితి.....

**– మార్క్ ట్వేన్** (1875)

*Licence to Pressss...

## సిద్ధార్థ గౌతముని

# జీవన గాథ

*గత సంచిక తరువాయి...*

**- చెన్నూరు ఆంజనేయ రెడ్డి**

అసాధారణ బౌద్ధిక, నైతిక శక్తులు మూర్తీభవించిన ఒక మహోన్నత మనీషి యొక్క అపూర్వ జీవనయాత్ర పూర్వాపరాలను మాయామర్మాలు లేకుండా నిజాయితీగా వివరించటమే 'సిద్ధార్థ గౌతముని జీవనగాథ' పూర్తిగా అందించటంలోని ఉద్దేశ్యం.

గౌతముడు లోనయిన సంఘర్షణ, అన్వేషణ, ఎదుర్కొన్న అవరోధాలు, ఆయన జ్ఞానసిద్ధి- ఆ తరువాత దాదాపు అర్ధశతాబ్దం కాలినడకన పర్యటిస్తూ బోధించిన ధర్మపథం, ప్రపంచానికి అందించిన జ్ఞానసంపద, అనుచరుల తిరుగుబాటుతో సహా దాపరికం లేకుండా తెలియజెప్పటమే దీని మరో ఉద్దేశ్యం. వీటిలో చాలా వరకు తిపిటకాల్లో ఆధారం ఉన్నవే.

రెండువేల అయిదువందల సంవత్సరాల తరువాత కూడా ఈ భూగోళం నివాస యోగ్యంగా ఉండి మనం మనుగడ సాగించటంలో బుద్ధుని దార్శనికత ఉండి వుండాలి. మన తరువాతి తరం వారికి మనం అందించగలిగిన వారసత్వం ఈ జ్ఞాన సంపదే. మిగతావన్నీ బుద్ధుడు చెప్పినట్లు నశించేవే. ***'ఈ విశ్వానికి సృష్టికర్త ఎవరూ లేరు. శాశ్వతమైన ఆత్మ అనేది ఏదీ లేదు. అస్తిత్వంలోకి వచ్చిన, సంయోగికమైన ప్రతి దానిలోను విచ్ఛిన్నావశ్యకత అంతర్లీనంగా నిక్షిప్తమై ఉంటుంద'ని నిర్ద్వందంగా భిక్షు సంఘానికి బోధించాడు.*** అహం, మోహం, అవిద్య అనే మహాదోషాల నుంచి విముక్తి పొందటానికి అహరహము సాధన చేయమన్నాడు.

ఐన్‌స్టీన్ తర్వాత అంతటి ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ *వెలువరించిన* ***ది గ్రాండ్ డిజైన్*** అనే గ్రంథంలో బుద్ధుని వాక్యాలే ప్రతిధ్వనిస్తాయి. ***ఈ విశ్వాలు వాటంతటవే సంభవించాయి. అందులో మనం ఉన్నాము, దీనికి ఏ మంత్రదండము ఉండటానికి అవకాశమే లేదు.*** ఇన్ని వేల సంవత్సరాల తరువాత కూడా ఈ విషయం చెప్పటానికి, అంగీకరించటానికి ఇంకా మనం సంకోచిస్తూనే ఉన్నాము.

**కపిలవస్తు పురానికి పునరాగమనం :**

కోత పెట్టే శీతాకాలం గతించింది. పచ్చని లేత పచ్చిక బయళ్లూ, రంగు రంగులతో విరబూసిన పూల చెట్లు నేల తల్లికి క్రొంగొత్త అలంకారాలు సమకూర్చాయి. ఈ ఋతువు లీలా విలాసాలతో రహదారులు యాత్రికులకు మనోహరంగా ఆహ్లాదకరంగా మారిపోయాయి. ఒక నిండుపున్నమి నాడు బుద్ధుడు తన భిక్షుసంఘంతో కపిలవస్తుకు బయలుదేరాడు. ఉత్తమ వంశీకులైన చాలామంది అర్హతులతో రోజుకొక క్రోసుదూరం నడుస్తూ, దారి పొడుగునా ధార్మిక ప్రబోధంచేస్తూ రెండు నెలలకు గమ్యం చేరుకున్నాడు. రాచకుటుంబాలకు చెందిన పురుషులు, కన్యలు, పిల్లలూ బుద్ధ పరివారానికి ఎదురేగి పుష్పగుచ్ఛాలతో మహానందంగా స్వాగతం పలికారు. ఆయన కోసం ఎంపిక చేసిన నయన మనోహరమైన నిగ్రోధవనానికి బుద్ధుని తీసుకెళ్లారు.

**శాక్య కుమారులకు దీక్ష :**

మరునాడు బుద్ధుడు అనేక అర్హతులతో కలిసి కపిలవస్తులో భిక్షాటన సాగించాడు. రాజకుమారుడైన సిద్ధార్థుడు పట్టణంలో ఇంటింటికి తిరిగి బిచ్చమెత్తుతున్నాడన్న వార్త సర్వత్రా సంభ్రమాశ్చర్యాలు కలిగించింది. ఉన్నత సౌధాల గవాక్షాల నుంచి జనం ఆ దృశ్యాన్ని తొంగిచూశారు. సిద్ధార్థుని అర్ధాంగి యశోధర స్వయంగా ఈ అపూర్వ, విచిత్ర దృశ్యాన్ని తిలకించి ఆశ్చర్యచకితయై ఆ ఉదంతాన్ని శుద్ధోదనునికి తెలిపింది. తన కుమారుడు తిండికోసం తిరిపమెత్తడమా? శాక్యక్షత్రియ వంశానికి ఇది అవమానంకాదా? అని ఖిన్నుడైన శుద్ధోదనుడు ఇది తగదని కొడుక్కు నచ్చ జెప్పడానికి యత్నించాడు. నాయనా నీకూ, నీ భిక్షుసంఘానికి మేం తిండి పెట్టలేమా? అని గద్గద స్వరంతో ప్రశ్నించాడు. బుద్ధుడు భిక్షమెత్తడం మా సంప్రదాయం అన్నాడు. మన పూర్వులెవరూ

---

ఆంగ్లం నుంచి అనువాదం : గజ్జెల అశోక్ రెడ్డి

భిక్షాటన చేయలేదుగదా? అన్న తండ్రి ప్రశ్నకు బదులు చెబుతూ సిద్ధార్థుడు "మీరు రాజవంశంలో జన్మించారు. నేను బుద్ధుల పరంపరలో ఒకడుగా జన్మించాను. వారంతా భిక్షాటనతోనే జీవన యాత్ర సాగించారు" అన్నాడు. అంతటితో ఆగక నడివీధిలో నిలబడి సందేశమిస్తూ...

**"చాలు నాలస్యమికనైన మేలుకొనుడు/పాపమార్గాన్ని వీడి పావనులు కందు ఇహపరమ్ముల ధార్మికుండెచ్చటయిన/అవ్యయమ్మైన ఆనందమనుభవించు."**

అని ప్రబోధించాడు. శుద్ధోదన మహారాజు కొన్ని క్షణాల పాటు ఈ ధార్మిక భావానందాన్ని బుద్ధుని పవిత్ర భిక్షాపాత్రను స్వీకరించి ఆయననూ భిక్షుసంఘాన్ని ప్రాసాదానికి తీసుకెళ్లి ఇష్టమృష్టాన్నాలతో షడ్రసోపేతమైన భోజనాన్ని పెట్టించాడు. భోజనానంతరం శుద్ధాంత కాంతలంతా వచ్చి బుద్ధునికి అభివందనాలర్పిచారు. కానీ, యశోధర వారితో కలిసి భగవానుని దర్శించలేదు. "నా స్వామి దృష్టిలో నాకు ఏ కొంచెం విలువున్నా ఆయనే నా దగ్గరకు వచ్చి నా అభివందనాలు స్వీకరిస్తాడు అనుకుంది. ఆమె మనోభావాలను గ్రహించిన బుద్ధుడు ఇద్దరు శిష్యులతో యశోధర గృహానికి స్వయంగా వెళ్లి తన కోసం ఏర్పాటు చేసిన ఆసనాన్ని అధిష్టించాడు.

యశోధర హర్షానంద పులకితగాత్రయై పరుగు పరుగున వచ్చి ఆయన కాళ్లను చేతులతో చుట్టేసుకుని పాదాల మీద తలవాల్చి భక్తి పారవశ్యంతో ప్రణతులర్పించింది. కొడుకు రాహులునుద్దేశించి నాయనా! ఈయనే మీ తండ్రి, వచ్చి నీ వారసత్వ ఆస్తి ఇవ్వమని అడుగుమన్నది. రాహులుడు బుద్ధుని ముందు నిలబడి వినమ్రుడై "భిక్షూ! మీ నీడ ఆనంద మయమైంది" అన్నాడు. బుద్ధుడు ఆసనం నుంచి లేచి దూరంగా వెళ్ళాడు. రాహులుడు "భిక్షూ, నా దాయభాగం ఇవ్వండి" అని ఆయనను వెంబడించాడు. అప్పుడు బుద్ధుడు



తన ప్రధాన శిష్యునితో "సారిపుత్రా! ఈ బాలునికి సంఘ ప్రవేశం కల్పించు" అన్నాడు. అప్పటి నుంచే రాహులుడు భిక్షువుల్లో చేరిపోయాడు. ఈ పరిణామంతో సంతప్త హృదయుడైన శుద్ధోదనుడు బుద్ధుని దగ్గరకు వెళ్లి, అభినందన మాచరించి ఒక వరం అర్థించాడు. "సిద్ధార్థుడు సంసారాన్ని పరిత్యజించడమే నాకు చాలా బాధకలిగించింది. నందుడు అదే మార్గాన్ని అవలంబించడం నన్ను కృంగదీసింది. చివరకు రాహులుడు కూడా భిక్షువు కావడం నాకు అమిత మనస్తాపం కల్గించింది. పుత్ర, పౌత్ర ప్రేమానుబంధాలు చాలా బలీయమైనవి. కాబట్టి తల్లిదండ్రుల అనుమతిలేకుండా కుమారులకు దీక్ష ఇవ్వరాదని ఆదేశించండి.'' ఇది శుద్ధోదనుని అభ్యర్థన. బుద్ధుడు దాన్ని ఆమోదించాడు. బుద్ధుడు కపిలవస్తుపురంలో ఉన్న కాలంలో చాలామంది శాక్య రాజకుమారులు సంఘంలో చేరారు. వారిలో బుద్ధుని జ్ఞాతులయిన నందుడు, దేవదత్తుడు కూడా ఉన్నారు. ఆ తర్వాత ఆనందుడు సన్నిహిత సహచరుడు కాగా, దేవదత్తుడు ప్రధాన ప్రత్యర్థి అయ్యాడు. బుద్ధుని కపిలవస్తు సందర్శనం తర్వాత నాలుగేళ్లకు శుద్ధోదనుడు మరణించాడు.

**అనాథ పిండకుని పరివర్తనం:**

ఆరోజుల్లో శ్రావస్తిలో అనాథ పిండకుడనే ధనిక వణిక్ ప్రముఖుడుండేవాడు. అతడు రాజగృహలో తన స్నేహితుని ఇంట్లో ఉండగా లోకానికి సద్ధర్మం బోధించే బుద్ధుని గురించి విన్నాడు. ఒకనాడు వేకువ జామునే అనాథ పిండకుడు బుద్ధుడున్న చోటికి వెళ్లి, ఆయన బోధనలు ఆలకించి బౌద్ధ ధర్మం స్వీకరించడమే కాక, సంఘానికి భూరి విరాళం కూడా ఇచ్చాడు. శ్రావస్తిలో తన ఇంటికి వచ్చేట్లు బుద్ధునితో వాగ్దానం కూడా తీసుకున్నాడు. ఇంటికి తిరిగి వెళ్లాక అనాథ పిండకుడు భారీ మూల్యం చెల్లించి జేతవనాన్ని కొని అందులో బుద్ధుని కోసం మనోహరమైన కుటీరాన్ని కట్టించాడు. దాని చుట్టూ ప్రధాన భిక్షువుల కోసం ఎనిమిది కుటీరాలు ఏర్పాటు చేయించాడు. వాటితో పాటు విశాలమైన గదులున్న మరి కొన్ని ఆరామాలూ, అందమైన జలాశయాలు నిర్మించి, అన్ని వసతులు సమకూర్చినట్లు బుద్ధునికి వర్తమానం పంపించాడు. బుద్ధుడు రాజగృహ నుంచి బయలుదేరి కొన్ని రోజుల్లో శ్రావస్తి చేరుకున్నాడు. అనాథ పిండకుడు బంధుమిత్రకుటుంబ పరివారసమేతంగా ఎదురేగి సాదరంగా స్వాగతం పలికి ఆహ్వానించాడు. బుద్ధుడు నిరుపమాన తేజో గాంభీర్య ముద్రతో తన కోసం నిర్మించిన జేతవనారామంలో ప్రవేశించాడు. ఆ

కుటీర ఆరామ సముదాయాన్ని సంఘానికి దానంగా ఇవ్వాలన్న అనాథపిండకుని ఆకాంక్షనూ అభ్యర్థనను తథాగతుడు ఆమోదించాడు. శ్రావస్తినగరంలోనే విశాఖ అనే ప్రముఖ మహిళ ఉండేది. ఆమె పుణ్యవర్ధనుడన్న సంపన్న వ్యాపారి భార్య. ఆమె సంఘ అభిమానిగా, పోషకురాలుగా మారడమేకాక, దిగంబర జైన ధర్మానుయాయి అయిన తన మామగారిని కూడా బౌద్ధ ధర్మానుయాయిగా మార్చింది. అనాథ పిండకుడు నిర్మించిన ఆరామం తర్వాత విలువలో, వైభవంలో దానికి దాదాపు దీటైన పూర్వారామాన్ని సంఘానికి దానంగా విశాఖ అర్పించింది.

**నదీజల వివాద పరిష్కారం:**

సిద్ధార్థుడు బుద్ధుడుగా మారిన ఐదేళ్ళ తర్వాత వైశాలి సమీపంలోని మహారణ్యంలో నివసించాడు. ఆ సమయంలో శాక్యులకూ, కొలియులన్న మరో క్షత్రియ వర్గానికీ మధ్య రోహిణీ నదీజలాల విషయంలో తీవ్రవివాదం ఏర్పడింది. ఆ ఏడు సంభవించిన దారుణక్షామ పరిస్థితుల వల్ల రోహిణీ నదీజలాలు సాగు భూమికి సరిపోలేదు. తత్ఫలితంగా ఉభయ క్షత్రియ వర్గాలూ నీటి కోసం ఘర్షణకు సన్నద్ధమయ్యాయి. ఆ సందర్భంలో నదీ తీరంలో గుమికూడిన రాజవంశీకులను అక్కడికి వాహ్యాళికి వచ్చిన బుద్ధుడు ఆ కోలాహలానికి హేతువేమిటని అడిగాడు. రోహిణీ జలాల కోసం యుద్ధానికి తలపడిన వర్గాలను ఆ నీటి విలువెంత అని ప్రశ్నించాడు. చాలా స్వల్పమన్నారు. అలాగే భూమి విలువ గురించి అడిగితే అది కూడా అత్యల్పమేనన్నారు. ఆ మీదట బుద్ధుడు రాజవంశీకుల, ఇతర యోధుల రక్తం విలువెంత అని ప్రశ్నించాడు. దానికి విలువ కట్టలేమన్నారు ఉభయులూ, అలాంటప్పుడు అత్యల్పమైన వాటికోసం అనల్పమూ అమూల్యమూ అయిన రక్తాన్ని ధారబోస్తారా? అన్నాడు బుద్ధుడు. ఈ ప్రశ్నలతో వారి ఆవేశం, ఉద్రేకం చల్లబడ్డాయి. వివేకవంతమైన ఆయన సలహాను అంగీకరించి రాజీపడ్డారు. ఆయన జ్ఞానానికి ముగ్ధులై వారిలో చాలా మంది సంఘంలో చేరారు.

**స్త్రీలకు సంఘ ప్రవేశ సమస్య:**

శుద్ధోదనుడు తీవ్ర వ్యాధిగ్రస్తుడై మంచం పట్టాడని తెలిసి బుద్ధుడు కపిలవస్తుపురం వెళ్లి తండ్రిని కడసారి సందర్శించి సర్వం అనిత్యం, అశాశ్వతం, జీవితం క్షణభంగురమన్న సత్యాన్ని పునరుద్ఘాటించాడు. శుద్ధోదనుడు ప్రశాంతచిత్తుడై, అర్హతుడై జీవయాత్ర ముగించి నిర్వాణం పొందాడు.



భర్త మరణానంతరం మహారాణి ప్రజాపతి గౌతమి సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకుని శిరోముండనం చేయించుకుని బుద్ధుని దగ్గరికి వెళ్లింది. అప్పటికే సంఘంలో చేరిన శాక్య వంశీయుల భార్యలు చాలా మంది ఆమెననుసరించారు. శుద్ధోదనుడు గతించాక, నందుడూ, రాహులుడు భిక్షువులుగా మారాక తాను ఏకాకిగా ఉండిపోదలుచుకోలేదనీ, తననూ, తనతో వచ్చిన ఇతర మహిళలనూ సంఘంలో చేర్చుకోవాలని ప్రజాపతి గౌతమి అభ్యర్థించింది. బుద్ధుడు మూడుసార్లు ఈ విన్నపాన్ని తిరస్కరించాడు. స్త్రీలకు సంఘ ప్రవేశం కల్పిస్తే అపరిణత మనస్కులయిన భిక్షువులకు చిత్త చాంచల్యం కలుగ వచ్చునని సంఘాన్ని గురించి ఇతరులకు చెడుగా, చులకనగా మాట్లాడే అవకాశం ఏర్పడుతుందని ఆయన భావించాడు. ఆ తర్వాత బుద్ధుడు అక్కడ నుంచి వైశాలి సమీపంలోని కూటాగార పర్వతానికి వెళ్లిపోయాడు.

ఏమైనా సరే సంఘంలో చేరి తీరాలన్న తిరుగులేని నిర్ణయానికి వచ్చిన ప్రజాపతి గౌతమి, ఇతర శాక్య స్త్రీలు కాషాయవస్త్రాలు ధరించి, మృణ్మయ భిక్షా పాత్రలతో కాలినడకన కపిల వస్తునుంచి వైశాలికి ప్రయాణించారు. అంతవరకూ అంతఃపుర సౌధాల నుంచి కిందికి దిగని అసూర్యంపశ్యలయిన రాజకుటుంబాల రమణీ సమూహం ముళ్లూ రాళ్లూ కొల్లలుగా ఉన్న కాలిబాటల్లో నడుస్తూ సాయంకాలానికి బుద్ధుడున్న కుటీరానికి చేరుకుంది. భిక్షువు ఆనందుడు ఆ మహిళా సమూహానికి ఎదురేగి ఆహ్వానించాడు. ధూళి ధూసరితమై, రక్తం స్రవిస్తున్న పాదాలతో నీరసించిన ఆ సుకుమార మూర్తుల దైన్యస్థితిని చూసిన ఆనందుని హృదయం కరుణారసార్ద్రమైంది. కళ్లు కాసారాలయ్యాయి. వారి ఆగమన కారణాన్ని తెలుసుకొని ఆ విషయాన్ని బుద్ధునికి నివేదించాడు.

బుద్ధుడు అదంతా ఆలకించాక ఇలా అన్నాడు. "ఇక చాలు ఆనందా! స్త్రీలు కూడా గార్హస్థ్యజీవితం వదిలి, తథాగత ధర్మాన్ని, సంఘనియమాలనూ పాటిస్తూ అనికేతనలై జీవించాలని మాత్రం కోరవద్దు, అన్నాడు. ఇలా ముమ్మారు నిరాకరించినా ఆనందుడు తన పట్టు వదల్లేదు. "గృహస్థ ధర్మాన్ని వీడి అనికేతనలైన స్త్రీలు ధార్మిక జీవన ఫలం పొంది అర్హత్వాన్ని సాధించడానికి అర్హులు, సమర్థులు కారా భగవాన్" అని భావోద్వేగంతో ప్రశ్నించాడు. బుద్ధుడు ఈ విషయంలో స్త్రీల అర్హతను, సామర్థ్యాన్ని కాదనలేకపోయాడు. "లోకంలో బుద్ధులు పురుష జనోద్ధరణకే ఉద్భవిస్తున్నారా?" అని కూడా ఆనందుడు ప్రశ్నిస్తూ, స్త్రీ పురుష విచక్షణలేకుండా మానవులందరి సముద్ధరణార్థమే బుద్ధులు జన్మిస్తున్నారన్న తన విశ్వాసాన్ని కూడా ఆనందుడు ఉద్ఘాటించాడు. చివరకు బుద్ధుడు స్త్రీల సంఘ ప్రవేశానికి అనుమతించాడు. అయితే ఆ మహిళలు సోదర భిక్షువులకు విధేయులై ఉండాలంటూ అందుకోసం ఎనిమిది నిబంధనలు విధించాడు. స్త్రీల సంఘ ప్రవేశం వల్ల ఉత్పన్నమయ్యే అవరోధాల గురించి వ్యాఖ్యానిస్తూ" అన్నాడు. "బలమైన ఆనకట్టలేనిదే జలాశయం నిలబడదు, అందువల్లనే సంఘ సంరక్షణార్థం ఎనిమిది నిబంధనల అడ్డుకట్టలను నిర్మిస్తున్నాను. వాటిని ఎవరూ ఉల్లంఘించ కూడదు" అని ఆదేశిచాడు. సిద్ధార్థుడు బుద్ధుడైన ఆరేళ్ళకు ఈ ఉదంతం జరిగింది.

**బుద్ధుని ఆచార్యత్వం:**

బుద్ధుడు సంఘాన్ని ఎలా నిర్వహించాడో తెలియజేసే సంఘటనా పరంపరను పిటకాలు వివరిస్తాయి. అయితే ఆయా సంఘటనల క్రమం ఏమిటి? అన్న విషయాలను అవి తెలియజేయవు. పిటకాల సంకలన కర్తలు బుద్ధుని బోధనలతో సంబంధం ఉన్న సంఘటనల పట్ల మాత్రం చాలా శ్రద్ధవహించారు. ఆయన జీవితానికి సంబంధించిన ఇతర సంఘటనల పట్ల బొత్తిగా ఆసక్తి చూపలేదు. సంఘాన్ని స్థాపించి ధర్మాన్ని బోధించడమే బుద్ధుని లక్ష్యం. దానికే పిటకాలు ప్రాముఖ్యం ఇచ్చాయి. ఆయన ఎప్పుడు ఏయే ప్రాంతాల్లో సంచరించాడు? జీవితంలో ఎలాంటి కష్టనష్టాలను అనుభవించాడు? అన్న విషయాలను పిటకాలు పట్టించు కోలేదు. అయినా ఆ వివరాల్లో ఎక్కువభాగం మనకు దక్కకుండా పోలేదు.

నాలుగు దశాబ్దాల పాటు బుద్ధుడు కోసల, మగధ, అంగరాజ్యాల్లో సంచరించాడు. రాజధాని నగరాలయిన రాజగృహ (నేటి బీహారులోని రాజఘుర్), శ్రావస్తి (నేటి సాహెబ్‌మెహత్) లను తరుచుగా సందర్శించాడు. రాజకీయాల్లో, ఇతర లౌకిక విషయాల్లో ఆయన బొత్తిగా ఆసక్తి చూపలేదు. కానీ, రాజకుటుంబాలూ, సంపన్న వర్గాలూ ఆయనను ఎంతో గౌరవించి ఆదరించాయి. బ్రాహ్మణులు, నవయువకులు భిక్షువులుగా మారడం మింగుడుపడని పెద్ద మనుషులు మాత్రం బుద్ధుని పట్ల విముఖత చూపారు. ప్రశాంతమూ, గతిశీలమూ, గంభీరమూ, ధీరోదాత్తమైన బుద్ధుని ఏకాంత జీవితానికి సంబంధించిన చారిత్రక సంఘటనల వివరాలు నిర్దిష్టంగా కాకపోయినా వాటి రూపురేఖలు మాత్రం స్పష్టంగానే లభించాయి. బుద్ధుని భిక్షుసంఘం అన్ని ఋతువుల్లోనూ దేశాటన చేశారు. పరివ్రాజకులు సంవత్సరంలో ఎక్కువ కాలం పర్యటించాలని, వర్షఋతువులో మాత్రం మూడుమాసాలు ఒకే చోట, విశ్రాంతి తీసుకోవచ్చుననే సంప్రదాయం అప్పటికే ఉంది. దాన్నే వర్షావాసమనేవారు. భిక్షువులు కూడా ఈ నియమాన్ని పాటించాలని బుద్ధుడు ఆదేశించాడు.

బుద్ధుడు దేశ సంచారం చేసేప్పుడు రోజుకు ఐదునుంచి పదిమైళ్లవరకూ నడిచేవాడు. మధ్యాహ్న భోజనానికి భిక్షకు వెళ్లాలి కాబట్టి ఆ సమయానికి ఏదో ఒక ఊరు చేరుకొనే విధంగా అనుదిన కార్యక్రమం నిర్ధారించుకొనేవాడు. మధ్యాహ్నకాలాన్ని ఆయన ధ్యానానికి కేటాయించుకునే వాడు. సాధారణంగా ఆయన గ్రామాలకు, పట్టణాలకు వెలుపల అడవుల్లో, వనాల్లో, నదీ తటాకాల ఒడ్డున విడిదిచేసేవాడు. ఈ పర్యటనల్లో బుద్ధునితో చాలా మంది భిక్షువులు వేళ్లేవారు.

బుద్ధుని బోధనలకు సంబంధించిన సూత్రాలు, ఏ ప్రాంతాల్లో ఆ చర్చలు జరిగాయో వాటి పరిసరాల వర్ణలతో మొదలవుతాయి. ఆయన రాజగృహ, నలందల మధ్య రహదారిలో ప్రయాణిస్తున్నా, కోసల రాజ్యంలో సంచరిస్తూ చిరావతీ నదీ తీరంలోని మామిడితోటలో బసచేసినా, బ్రాహ్మణ గ్రామపరిసరాల్లో ఉన్నా ప్రజానీకం బుద్ధుని సందర్శించడానికి తరలి వేళ్లేది. బ్రాహ్మణ ప్రముఖులు గుంపులుగా వెళ్లుతున్న జనాన్ని మిద్దెల పై నుంచి చూసి విషయం తెలుసుకుని తాము వెళ్లి బుద్ధుని చూడాలా? లేక ఆయనే మొదట తమ వద్దకు రావాలా? అని చర్చించు కొనేవారు. అయితే తుదకు వారే ఆయన వద్దకు వెళ్లేవారు. చంపా పక్కన గగ్గర సరోవర తీరంలో సువాసనలు వెదజల్లే తెల్లని పూలు పూసిన చంపక వృక్షాల కింద బుద్ధుడు

కూర్చొనేవాడు. మరొకప్పుడు రాజగృహకు ఎగువన ఉన్న కొండల్లో ఉండేవాడు. నెమళ్లు ఎక్కువగా సంచరించే ఆ కొండలను దేశద్రిమ్మరులైన సన్యాసులు తరుచు సందర్శించే వారు.

బుద్ధుడు చాలా వరకు యాత్రికుల కోసం నిర్మించిన విశ్రాంతి గృహాల్లో విడిది చేసేవాడు. అయితే కాలం గడిచే కొద్దీ అభిమానులు బుద్ధుని కోసం ప్రత్యేకంగా విశ్రాంతి గృహాలు నిర్మించారు. ఆయన జీవితకాలంలోనే అవి ఆరామాల స్థాయికి చేరుకున్నాయి. వైశాలి ప్రజలు ఆయనకోసం నగరానికి ఉత్తరాన అడవిలో ఒక విశ్రాంతి గృహాన్ని నిర్మించారు. శాక్యులు కపిలవస్తులో 'శాంతాగార' మనే పేరుతో నూతన భవనాన్ని కట్టించారు. కానీ, అనాథ పిండకుడు సంఘానికి సమర్పించిన జేతవనం అన్నిట్లో బాగా ప్రసిద్ధికెక్కింది. బౌద్ధ ధార్మిక సాహిత్యంలో దాని ప్రస్తావన ఎక్కువగా అగుపిస్తుంది. బింబిసారుడు రాజగృహలోని తన విహారవనమైన వేణువనాన్ని సంఘానికి అప్పగించాడు.

బుద్ధుడు సూర్యోదయానికి ముందే నిద్రలేచి భిక్షాటనకు వెళ్లే వరకూ ధ్యానంలో గడిపేవాడు. అనంతరం భిక్షాపాత్రతో శిష్యసమేతంగా ఊరంతా తిరిగేవాడు. భిక్షాపాత్రలో ఎవరేది వేసినా స్వీకరించేవాడు. ఆయన నడుస్తున్నప్పుడు కూడా ధార్మిక విషయాలు చర్చించేవాడు. అప్పుడప్పుడు భిక్షాటన జరుపకుండా భోజనానికి ఎవరైనా ఆహ్వానిస్తే శిష్యులతో పాటు వెళ్ళేవాడు. భోజనానంతరం ధార్మిక విషయాలపై ప్రశ్నోత్తరాల రూపంలో బుద్ధుని ప్రవచనాలు సాగేవి. ఆయన రోజుకు ఒకసారే మధ్యాహ్నానికి కొంచెం ముందు భోంచేసేవాడు. భోజనానంతరం శిష్యులతో సంభాషణ ముగిశాక ఆయన తన కుటీరానికి వచ్చేవాడు లేదా బయటనే నీడలో విశ్రమించేవాడు. తర్వాత సాయంకాలం వరకూ ధర్మ బోధనలు ఉండేవి కావు. బౌద్ధ ధర్మానుయాయులంతా బుద్ధుని ఎంతో గౌరవించేవారని పిటకాలు తెలియజేస్తాయి.

బుద్ధుడు ఇతరులతో సంభాషించేటప్పుడు పవిత్ర వాతావరణం, ఆరాధనాభావం ఆ పరిసరాలంతా వ్యాపించేవి. అయితే ఈ ఆరాధనా భావం మితిమీరి వ్యక్తం కావడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. అతిగా జరిగే ప్రశంసలను బుద్ధుడు మృదువుగా, వ్యంగ్యంగా ఆక్షేపించేవాడు. మీ కంటే మహాజ్ఞాని, గురువు గతంలో వర్తమానంలో లేడనీ భవిష్యత్తులో ఉండబోడనీ నా నమ్మకమని సారిపుత్రుడు బుద్ధునితో అన్నప్పుడు వారిద్దరి మధ్య సంభాషణ ఇలా సాగింది.

"సారిపుత్రా గతంలో వచ్చిన బుద్ధులంతా నీకు తెలుసా?"

"తెలియదు భంతే"

"రాబోయే బుద్ధుల గురించి తెలుసా?"

"అదీ తెలియదు భంతే"

"అయితే నా గురించి నీకు బాగా తెలిసినట్లుంది. నా మనసు లో లోతులకు వెళ్ళి పరిశీలించినట్లుంది."

"లేదు భంతే, మీ గురించి కూడా నాకు పూర్తిగా తెలియదు."

"అలాంటప్పుడు సారిపుత్రా! అంత సాధికారంగా, గొప్ప గొప్ప మాటలెలా చెప్పగలిగావు?"

బుద్ధుడు సంఘానికి అభిమానులు సమర్పించే ఆహారం, వస్త్రాలు, తోటలు, గృహాల వంటి కానుకలను ఆమోదించేవాడు. కానీ లాంఛనపూర్వకమైన అట్టహాసాలను అంగీకరించేవాడు. బోధి రాకుమారుడు బుద్ధుని ఆగమన సందర్భంలో భవనమంతా తెల్ల తివాచీలు పరిపించాడు. కానీ, బుద్ధుడు ఆ తివాచీల మీద నడవడానికి నిరాకరించి వాటిని తీసి వేసేవరకు భవన ద్వారం బయటనే నిలబడ్డాడు.

బుద్ధుని కార్యక్రమాల్లో శిష్యులకు జ్ఞానబోధ ఇతర సంఘ వ్యవహారాలు ప్రధాన పాత్ర వహించాయి. ఎవరేది చెప్పినా వినడానికీ ఎవరికైనా బోధించడానికీ ఆయన ఎప్పుడూ సిద్ధమే. కానీ, పిటకాల ద్వారా తెలిసే సమాచారం మేరకు ఆయన విశేషంగా జనాన్ని ఆకర్షించి ఉపదేశాలు ఇచ్చినట్లు అగుపించదు. తన శిష్యులకూ, సత్యాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస నిజంగా ఉన్న వాళ్ళకూ బోధించడానికే ఆయన ఎక్కువ కాలాన్ని వినియోగించినట్లు విదితమవుతుంది. మీరు కొంతమందికి ప్రత్యేక శ్రద్ధాసక్తులతో సమధికోత్సాహంతో బోధించడానికి కారణమేమిటని ఒక వ్యక్తి బుద్ధుని ప్రశ్నించాడు. దానికి సమాధానం ఇస్తూ ఆయన ఇలా అన్నాడు. "ఒక రైతుకు మూడు రకాలయిన పంట పొలాలు ఉంటే అందులో ఎక్కువ సారవంతమైన పొలాన్ని మొదట, మధ్య తరహా భూమిని ఆ తర్వాత, పశుగ్రాసానికి మాత్రమే పనికి వచ్చే భూమిని చివరలో సాగు చేస్తాడు. అలాగే బుద్ధుడు మొదట భిక్షువులకూ ఆ తర్వాత సాధారణ విశ్వాసులకూ బోధిస్తాడు. తక్కువ రకానికి చెందిన పొలాన్ని రైతు చివరలో సాగు చేసినట్లు బ్రాహ్మణులకూ, ఇతర ధార్మిక శాఖలకు చెందిన సన్యాసులకూ, తన బోధనల్లో ఒకమాట అర్థం చేసుకున్నా వాళ్లకు అది ఎంతో ఉపయోగకరమని

భావించి చివరలో బోధిస్తాడు." తన అనుచరులకు బోధనలో బుద్ధుడు ప్రముఖ శిష్యుల సహకారం తీసుకునేవాడు. అలాంటి సహాయకుల్లో సారిపుత్రుడు, మౌద్గల్యాయనుడూ ముఖ్యులు. ఈ ఇద్దరూ సంజయుని శిష్యరికం వదలి సంఘంలో చేరినవాళ్లు. సారిపుత్రుడు బుద్ధునికి చాలా అభిమాన పాత్రుడు. ఆయన బుద్ధుని సాధికార ప్రతినిధి హోదాలో బౌద్ధ ధర్మానికి ముఖ్యమైన వ్యాఖ్యలు చేశాడు. వివరణలు ఇచ్చాడు. శాక్యులకు క్షుర కర్మచేసే ఉపాలి కూడా సంఘంలో చేరాక బుద్ధునికి సన్నిహితుడై వినయ పిటకాన్ని క్రోడీకరించాడు. అతను సమాజంలో తక్కువ స్థాయికి చెందినా, బౌద్ధ సంఘంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికీ, బుద్ధునికి సన్నిహితం కావడానికీ అదేమీ అవరోధం కాలేదు. సంఘ నిర్వహణలో బుద్ధునికి సమస్యలు కూడా ఎదురవుతుండేవి. భిక్షువుల మధ్య వివాదాలు ముదిరి తగాదాలుగా మారినప్పుడు బుద్ధుని జోక్యంతో తుదకు పరిష్కారమవుతూ ఉండేవి. ఒకసారి ఇలాంటి తగాదా విషమించింది. ఈసారి ఆయన జోక్యం ఫలించలేదు. ఒక భిక్షువు ఎదురు తిరిగి "భగవాన్, మీరు ఈ జీవితంలో సాధించిన అలౌకిక ఆనందం అనుభవిస్తూ ఈ గొడవలకు దూరంగా ఉండడం మంచిది. అదే బుద్ధులకు బాగుంటుంది. ఈ సమస్యలు మాకు వదిలెయ్యండి" అని నిష్ఠూరంగా మాట్లాడాడు. పదే పదే ఆదేశించినా ఫలితం లేక పోవడంతో, ఈ మూర్ఖులు నిజంగానే విచక్షణా జ్ఞానరహితులయ్యారని భావించి బుద్ధుడు తన ఆసనం వదిలి వెళ్లిపోయాడు. ఈ విషయం గ్రంథాల్లో ఉల్లేఖితమైంది.

బుద్ధునికి ఎదురైన సమస్యల్లో దేవదత్తుని శత్రువైఖరి ప్రధానమైంది. అతడు బుద్ధునికి దగ్గరి బంధువు. ఆనందుడూ మొదలయిన శాక్యులతో పాటు సంఘంలో చేరాడు. దేవదత్తుడు మగధయువరాజైన అజాత శత్రువుకు మిత్రుడు కూడా. యువరాజు అండతో బుద్ధుని సంఘ ఆధిపత్యం నుంచి తప్పించి ఆస్థానాన్ని తాను ఆక్రమించాలనీ దేవదత్తుడు ప్రయత్నించాడు. భిక్షువులకు మరింత కఠినమైన నిబంధనలు విధించాలని వాదించాడు. బుద్ధుడు సంఘ ఆధిపత్యం నుంచి వైదొలగి విశ్రాంతి తీసుకోవాలని బహిరంగంగా ప్రకటించాడు.

యువరాజైన అజాతశత్రువును బింబిసారుని హత్యకు సైతం దేవదత్తుడు ప్రేరేపించాడు. బింబిసారునిపై జరిగిన హత్యాయత్నాన్ని మంత్రులు భగ్నం చేసినా కొడుకు దురాశను గ్రహించిన బింబిసారుడు ఇచ్ఛికంగా రాజ్యాధికారాన్ని త్యజించాడు. అయినా మహాక్రూరుడైన అజాతశత్రువు తండ్రిని నిర్బంధంలో ఉంచి, పస్తులతో మాడ్చి చంపేశాడు. అజాతశత్రువు మగధ రాజయ్యాక దేవదత్తుడు బుద్ధుని హత్యకు కుట్ర చేశాడు. మొదట ఆ పనికి హంతకులను నియమించాడు. కానీ, బుద్ధుని చూడగానే ఆ హంతకుల మనసులు మారిపోయాయి. ఆ తర్వాత దేవదత్తుడే స్వయంగా కొండపై నుంచి పెద్ద బండరాయి ఆయన మీదికి దొర్లించాడు. కానీ, అది గురితప్పి చిన్న శకలం తగిలి కాలికి గాయమైంది. తుదకు భిక్షార్థం వెళ్ళినప్పుడు ఒక మదపుటేనుగును ఆయన మీదికి పురికొల్పించాడు. కానీ బుద్ధుని ప్రశాంత, ప్రసన్న వ్యక్తిత్వం ముందు ఆ మత్త గజం కూడా తలవంచింది. ఈ దుష్ప్రయత్నాలన్నీ విఫలమయ్యాక దేవదత్తుడు నెత్తురు కక్కుకుని దుర్మరణం పాలయ్యాడు.

ఇంకో సందర్భంలో కొందరు అన్యమతస్థులు సుందరి అనే సన్యాసినిని ప్రలోభపెట్టి బుద్ధునితో తనకు అక్రమ సంబంధం ఉన్నట్లు చెప్పించారు. ఆ తర్వాత వారే ఆమెను హత్య చేయించి బౌద్ధ భిక్షువులే తమ గురువు పాపాన్ని కప్పిపుచ్చేందుకు ఆమెను చంపినట్లు ప్రచారం చేశారు. కానీ, అసలు హంతకులు తమకు ముట్టిన డబ్బుతో తప్పతాగి ఆ మత్తులో వాస్తవాన్ని తామే బయటపెట్టారు. ఇలాంటి కొన్ని ఘటనలు మినహా మొత్తం మీద బుద్ధుని జీవితం శాంతియుతంగా, స్నేహార్ద్రంగా గడిచింది. *ఈ విశ్వానికి సృష్టికర్త ఎవరూ లేరనీ, శాశ్వతమైన ఆత్మ అనేది ఏదీ లేదనీ, వైదిక కర్మకాండలు నిరర్థకమని బుద్ధుడు అసందిగ్ధంగా ప్రకటించాడు.* ఈ విధంగా ఆనాడు మౌలికంగా పూర్తిగా భిన్నమైన మార్గాన్ని ప్రబోధించినా ఆయన జీవితం శాంతియుతంగా సాగడం ఆశ్చర్యకరంగానే అగుపిస్తుంది.

వైదిక కర్మకాండలను తీవ్రంగా ఖండించినా వాటిని పాటించే వారి పట్ల బుద్ధుడు మృదువుగా వ్యవహరించాడు. వారి మనోభావాలను కించపరచకుండా జాగ్రత్త వహించాడు. బ్రాహ్మణుల పవిత్ర అగ్నిహోత్రం ముందు కూర్చుని వారితో చర్చలు జరిపేవాడు. కానీ ఆ కర్మకాండను మాత్రం తూలనాడేవాడు కాదు. లిచ్ఛవుల సేనాని శిహాను బుద్ధుడు జైన ధర్మం నుంచి బౌద్ధ ధర్మానికి మార్చాడు. అయితే శిహా తన ఇంటికి వచ్చే జైన భిక్షువులను పూర్వం లాగే ఆదరించాలనీ, ఆతిథ్యమివ్వాలనీ కానుకలు ఇవ్వాలనీ బుద్ధుడు ఆదేశించాడు. దీన్ని బట్టి అన్య ధర్మాల పట్ల ఆయన సహన భావం వ్యక్త మవుతుంది. తన మీద హత్యాయత్నాలు చేసిన దేవదత్తునికి అజాతశత్రువు అండదండలు ఉన్నాయని

తెలిసినప్పటికీ బుద్ధుడు ఆ విషయాన్ని పట్టించుకోకుండా రాజగృహకు వెళ్లివస్తూ ఉండేవాడు. అజాతశత్రువుకు అత్యుత్తమ ధార్మిక సందేశం ఇచ్చాడు కూడా. ఆయన సంకల్ప శక్తి అజేయమైంది. నిరుపమానమైంది. భయానికి ఆయన మనస్సులో స్థానమేలేదు. తప్పు చేసిన వాళ్లను దండించే విషయంలో మృదువుగా వ్యవహరించడంలో తనకు తనే సాటి. ఇతరుల దోషాలను ఎత్తి చూపే వాడు కాదు. "ఇతర గురువులు చెప్పేది తప్పో, ఒప్పో పట్టించుకోకు. నా మాటవిను. నేను నీకు సత్యాన్ని బోధిస్తాను". మరణశయ్యపై నుండి కొత్తగా సంఘంలో చేరిన భిక్షువుకు బుద్ధుడు ఇచ్చిన సందేశం ఇది.

వివాదాస్పద విషయాలను ప్రస్తావించదల్చుకున్నప్పుడు ఆయన పాత పదాలు ప్రయోగిస్తూనే వాటికి నూతనార్థాలు కల్పించేవాడు. ఆయన బ్రాహ్మణులను నిందించకుండానే జ్ఞానమూ, నైతిక సమగ్రత కలిగిన వాడే నిజమైన బ్రాహ్మణుడన్నాడు. పాపకర్మలకు పాల్పడకుండా, సత్యాన్ని అనుసరించడమే నిజమైన యజ్ఞమన్నాడు. 'దమ్మపదం'లో బ్రాహ్మణుని గురించి ఎంతో ఉదాత్తంగా వ్యాఖ్యానించాడు.

**"ధ్యాని రజోగుణ రహితుడు / జ్ఞాని మహాస్థిరచిత్తుడు**
**మాలిన్యం లేనివాడు / కృతకృత్యుందుత్తముడే బ్రాహ్మణుడంటాను నేను".**

స్త్రీలకు బుద్ధుడు వారి శక్తి సామర్థ్యాలకూ, ప్రవృత్తికీ తగిన స్థానం కల్పించాడు. చాలా ముఖ్యమైన సంఘ పోషకుల్లో విశాఖ కూడా ఒకరు. ఒకసారి కోసల రాజుతో బుద్ధుడు ధార్మిక విషయాలపై సంభాషిస్తుండగా ఒక పరిచారిక వచ్చి రాణి మల్లిక ఆడ శిశువును ప్రసవించిందని రాజు చెవిలో చెప్పింది. ఆ వార్త రాజుకు సంతోషం కలిగించలేదు. కొడుకు పుట్టి ఉంటే ఆయన ఆనందించి ఉండేవాడు. ఈ విషయాన్ని గమనించిన బుద్ధుడు ఇలా అన్నాడు. "రాజా! కొందరు స్త్రీలు పురుషుల కన్నా ఉన్నతులు. ఈ పాపను ప్రేమతో పెంచండి. విజ్ఞానం, సౌశీల్యం మూర్తీభవించిన స్త్రీలు పురుషుల కన్నా ఉన్నతులు. విజ్ఞానం, సౌశీల్యం, మూర్తీభవించిన స్త్రీలు ఎందరో ఉన్నారు. వాళ్లు అత్తను దేవతలా గౌరవిస్తారు. అలాంటి సుగుణాల రాశి కడుపున మహా పరాక్రమంతుడైన పురుషుడు జన్మించి సువిశాల సామ్రాజ్యాన్ని నిర్మించి సమర్థంగా పాలిస్తాడు". తన జీవితపు చివరి సంవత్సరంలో ఆయన ఆమ్రపాలి అనే వేశ్యతో కలిసి భోజనం చేశాడు. బుద్ధుడు ఆమ్రపాలితో కాకుండా తమతో కలిసి భోంచేయాలని వైశాలి రాజకుమారులు ప్రయత్నించి విఫలులయ్యారు. స్వయంగా రాకుమారుడైన బుద్ధుని సాటి రాజకుమారుల ఆహ్వానం ఆకర్షించలేకపోయింది.

**చివరి మజిలి :**

వైశాలి నుంచి బుద్ధుడు పొరుగునే ఉన్న 'బెలువ' అనే గ్రామానికి వెళ్లి చివరి రోజులు అక్కడే గడిపాడు. అక్కడే ఆయన తీవ్రవ్యాధి గ్రస్తుడయ్యాడు. కానీ, తాను తనువు చాలించవలసిన తరుణమింకా రాలేదనీ, అదీగాక సంఘం నుంచి వీడ్కోలు తీసుకోకుండా వెళ్లిపోవడం సముచితం కాదని తథాగతుడు భావించాడు. అసాధారణ సంకల్ప బలంతో ఆయన వ్యాధిని అణచిపెట్టి, తాను నిర్ణయించుకున్న కాలం సమీపించే వరకూ ప్రాణాలపై పట్టును నిలబెట్టుకున్నాడు.

వ్యాధి నుంచి కోలుకున్నాక, బుద్ధుడు కుటీరం నుంచి బయటికి వచ్చి కూర్చున్నాడు. అప్పుడు ఆనందుడు ఆయన దగ్గరికి వచ్చి నమస్కరించి "తథాగతుడు రుజాగ్రస్తుడు కావడం చూసి నా దేహం వాడిన తీగలాగ బలహీనమైంది. దిఙ్మండలం తేజో విహీనమైనట్లు అగుపించింది. మనసు అయోమయంలో పడింది. కానీ, తథాగతుడు సంఘానికి అంతిమ సందేశం ఇవ్వకుండా వెళ్లడనే ఆలోచన నాకు కొంత ఉపశమనం కలిగించింది." అన్నాడు. దానిపై బుద్ధుడు "ఆనందా! సంఘం నా నుంచి ఏమి ఆశిస్తోంది? నేను ఏమీ దాపరికంలేకుండా సత్యాన్ని బోధించాను. తథాగతుడు ఏ సత్యాన్నీ గుప్పిట్లో మూసి పెట్టలేదు. సంఘం తన మీదనే ఆధారపడి ఉందనీ తానే సంఘాన్ని నడుపుతాననీ భావించే వ్యక్తి మాత్రమే సంఘానికి సబంధించిన విషయాల మీద ఆదేశాలిస్తాడు. తథాగతుడు సంఘం తన మీదనే ఆధారపడి ఉందని అనుకోవడం లేదు. అలాంటప్పుడు సూచనలు ఎందుకివ్వాలి?" అని ప్రశ్నించాడు.

"ఆనందా నేను వృద్ధుడినయ్యాను. వయసు పైబడింది. నా జీవనయాత్ర ముగింపు దగ్గరలోకి వచ్చింది. చివరిదినాలకు చేరుకున్నాను. శిథిలావస్థలో ఉన్న బండి కట్టుడు తాళ్లు బిగింపు మీద నడిచినట్లు తథాగతుని దేహం కూడా కేవలం ఔషధాల బలం మీద ఆధారపడింది. అందుచేత ఆనందా! మీకు మీరే దీపాలు కండి. ఇతరుల ఆశ్రయం మీద ఆధారపడకుండా మీకు మీరు ఆశ్రయంగా వర్ధిల్లండి. ధర్మాన్ని దీపంగా చేసుకోండి ధర్మాన్నే ఆశ్రయించండి." (అత్తదీప, అత్తసరణ, అనన్నసరణ, ధమ్మదీప, ధమ్మసరణ అని పాళీ భాషలో బుద్ధుడు చేసిన ప్రబోధం అదే). బుద్ధుడు ఆనందునితో కలిసి కపాలమందిరం వరకూ నడిచి వెళ్లుతూ తనకు మరణం ఆసన్నమైందని అన్నాడు. మూడు మాసాల్లో తథాగతుడు అస్తమించనున్నాడన్న వదంతి జనంలో వ్యాపించింది. బుద్ధుడు

ఆనందునితో కలిసి కూటాగార ఆరామానికి వెళ్లాడు. అక్కడ చేరిన భిక్షువులనుద్దేశించి ప్రసంగిస్తూ తనకు రాబోయే మరణాన్ని గురించి ఇలా ప్రకటించాడు. "భిక్షువులారా! తథాగతుని అస్తమయం సమీపించింది. నేటి నుంచి మూడు నెలలు పూర్తికాగానే తథాగతుడు మరణిస్తాడు."

**అంతిమ భిక్ష:**

ఒక మధ్యాహ్నం బుద్ధుడు నగరం వైపు పరికించి "తథాగతుడు వైశాలిని చూడడం ఇదే కడసారి ఆనందా! భండగ్రామం వెళ్దాంరా" అన్నాడు. మూడు మజిలీల తర్వాత 'పావ' చేరుకుని చుందుని మామిడితోటలో బసచేశాడు. కమ్మరి పనిచేసే చుందుడు వారిని భిక్షకు ఆహ్వానించి మధురాన్నం, రొట్టెనూ, పుట్టగొడుగుల కూర వడ్డించాడు. (ఈ విషయం మీద రెండు రకాలైన అభిప్రాయాలున్నాయి. కొంతమంది చుందుడు బుద్ధునికి వడ్డించినది అడవిపంది మాంసమని కూడా చెబుతారు). బుద్ధుడు మధురాన్నం, రొట్టెలు భిక్షువులకు వడ్డించమని చెప్పి పుట్టగొడుగుల కూరమాత్రం వారికి వద్దని వారించారు. తనకే వడ్డించు కున్నాడు. దాన్ని తాను కొంత తిని మిగిలింది పూడ్చి పెట్టమన్నాడు. చుందుని ఇంట్లో భోంచేసి వెళ్లాక బుద్ధునికి తీవ్రమైన విరేచనాలు పట్టుకున్నాయి. ఆ బాధను ఆయన తనలోనే భరించాడు.

బాధ కొంచెం ఉపశమించాక ఆనందునితో కుసినార పోదాం రమ్మన్నాడు. అలాగే భంతే అని ఆనందుడు ఆయనను అనుసరించాడు. దారిలో బుద్ధుడు కాకుస్థనదిలో స్నానం చేసి అలసటతో ఒక చెట్టు నీడలో ఆనందుడు పరిచిన వస్త్రం మీద మేనువాల్చాడు. గతంలో అలారకలామ వద్ద శిష్యరికం చేసిన పుక్కుసుడనే యువకుడు బుద్ధుని కలిసి, ఆయన మాటలు విని శిష్యుడుగా మారి ఒక బంగారు వస్త్రాన్ని బహూకరించాడు. ఆ సమయంలోని తథాగతుని దేహకాంతి ముందు ఆయన కప్పుకున్న వస్త్రం వెలవెలబోయింది. జ్ఞానసిద్ధి పొందిన రాత్రి, మరణానికి ముందు రాత్రి – ఈ రెండు సందర్భాల్లో మాత్రమే బుద్ధుని శరీరం అలా ప్రకాశిస్తుందని గౌతముడు వివరించాడు. హిరణ్యవతీ నదికి అవతలి గట్టున ఉన్న మల్లుల సాలవనానికి వెళ్దాం రమ్మని బుద్ధుడు ఆనందునితో అన్నాడు. అక్కడికి చేరాక రెండు సాలవృక్షాల మధ్యన ఉత్తరాభిముఖంగా తల్పం సిద్ధం చేయమన్నాడు. దాని మీద కుడివైపు తిరిగి కాలు మీద కాలు వేసుకుని శయనించి అంతర్ముఖుడయ్యాడు. అది వసంత ఋతువు కాకపోయినా ఆవనంలో వృక్షశాఖలనిండా పూలు విరబూశాయి. దివ్య సంగీతంతో, అద్భుత పరిమళాలతో వాతావరణం నిడిపోయింది. అగోచరశక్తులు తథాగతుని పానుపు చుట్టూ చేరాయి. ఆనందుడు ఆవనంలో దూరంగా వెళ్లి దుఃఖించసాగాడు. బుద్ధుడు ఆనందుని పిలిపించి – "దుఃఖించవద్దు, మనకు అత్యంత ప్రియమైన వాటికి మనం దూరం కావడం, వాటిని మనం కోల్పోవడం వస్తువుల స్వాభావిక లక్షణమని నేను మీకు చెప్పలేదా? అస్తిత్వంలోకి వచ్చిన, సంయోగికమైన ప్రతిదానిలోను విచ్ఛిన్నావశ్యకత లోపలే నిక్షిప్తమై ఉంటుంది. అలాంటిది నశించకుండా ఎలా ఉంటుంది?"

ఏదీ శాశ్వతం కాదు. "ఆనందా! చాలాకాలంగా నీవునాకు ఎంతో సన్నిహితంగా ఉంటున్నావు. నన్ను ఎంతో ప్రేమతో ఆదరించావు. చిత్తశుద్ధితో కృషిచేస్తే నీవుకూడా ఇంద్రియాసక్తి, అహం, మోహం, అవిద్య అనే మహాదోషాల నుంచి త్వరలో విముక్తి చెందుతావు" అని ఊరడించాడు. అడవి మధ్యలో ఉన్న ఈ కుగ్రామంలో కాకుండా ఏదైనా పెద్ద నగరంలో దేహత్యాగం చేయాలని ఆనందుడు బుద్ధుని ప్రార్థించాడు. ఈ కుసినార గ్రామం ఒకప్పుడు మహాసుదర్శన రాజు పాలనలో రాజధాని నగరంగా ఎంతో వైభవాన్ని సంతరించుకుందని దాని గత ప్రశస్తిని గురించి బుద్ధుడు ఆనందునికి వివరించాడు.

కుసినార మల్లుల రాజధాని. మల్లులు కూడా శాక్యులు, వజ్జీయులలాగే గణతంత్ర విధానాన్ని అనుసరించారు. బుద్ధుని ఆదేశం మేరకు ఆనందుడు సభామందిరానికి వెళ్ళి ప్రజలను పిలిచి "తథాగతుడు మా ఊళ్ళో మరణించినా, ఆయన అంత్యకాలంలో మేము ఆ మహనీయుని దర్శించలేక పోయామని మీరు ఆత్మనిందవేసుకొనే దుస్థితి రానీయకండి" అని హెచ్చరించాడు. అప్పుడు మల్లులు కుటుంబ పరివార సమేతంగా బుద్ధ దర్శనం చేసుకున్నారు. విరబూసిన చెట్లనీడన మృత్యుశయ్యమీద ఉన్న తథాగతునికి వారంతా పాదాభివందనం చేసి తుది వీడ్కోలు ఇచ్చారు.

సుభద్రుడనే అన్యధర్మావలంబియైన ఒక సన్యాసి కూడా బుద్ధ దర్శనానికి వచ్చాడు. ఆనందుడు ఆ యతిని దూరంగా పంపాలని ప్రయత్నించాడు. ఆ సంగతి గ్రహించిన బుద్ధుడు "సుభద్రుని దూరంగా పంపవద్దు. అతడు జ్ఞానతృష్ణతోనే నన్ను ప్రశ్నిస్తాడు. నన్ను వేధించాలనీ, సాధించాలనీకాదు. నా సమాధానాలను కూడా అతడు త్వరగా అర్థం చేసుకుంటాడు"

అన్నాడు. బుద్ధునితో తుది ఉపదేశం పొందిన చిట్టచివరి వ్యక్తి సుభద్రుడే. అతడు కాలక్రమంలో అర్హంతుడయ్యాడు.

రాత్రి చివరి జాములో తథాగతుడు ఆనందునితో ఇలా అన్నాడు. “ఆనందా! ఇక బుద్ధుని పలుకులు వినబడవు. మీలో కొందరు ఇక మనకు బుద్ధుడు లేడని భావించవచ్చు. కానీ అది తప్పు. నేను బోధించిన సత్యాలు, విధించిన నియమనిబంధనలే మీకు కాంతి పథం చూపుతాయి. నేను మరణించాక మీరు పరస్పరం ఇప్పటిలాగా మిత్రమా అని సంబోధించుకోవద్దు. వయసులో పెద్ద వారయిన భిక్షువులు చిన్నవారిని పేరుతో కానీ, మిత్రమా అని కానీ పిలువ వచ్చు. కానీ, పిన్నలు పెద్దలను గౌరవపూర్వకంగా ‘భన్తే’ అని సంబోధించాలి” అన్నాడు. “కమ్మరి చుందుని భిక్ష తీసుకున్నాక తథాగతుడు మరణించాడన్న కారణంతో అతడిని ఎవరూ నిందించకూడదు.” గౌతమునికి జ్ఞానసిద్ధి కలిగి బుద్ధుడయ్యాక సమర్పించిన మొదటి భోజనం, అతడు మరణించే ముందు పెట్టిన తుది భోజనం ఈ రెండూ ఉత్తమమైనవి. అందుచేత చుందుడు అపరాధ భావంతో కుమిలి కుంగిపోవలసిన అవసరం లేదు” అని కూడా బుద్ధుడు ఆనందునితో అన్నాడు. తథాగతుడు జన్మించిన, మరణించిన స్థలాలూ, అతనికి జ్ఞానసిదికధ పొందిన చోటూ, ధర్మ చక్రప్రవర్తన మొదలైన తావు – ఈ నాలుగు స్థలాలు బౌద్ధభిక్షువులకు పవిత్రక్షేత్రాలని బుద్ధుడు సూచించాడు. భిక్షువులనుద్దేశించి చేసిన తుది ప్రసంగంలో ఆయన ఇంకా ఇలా అన్నాడు “ధర్మమార్గాల గురించికానీ, సంఘ సమస్యల గురించికానీ సోదర భిక్షువుల కెవరికైనా సందేహాలు ఉండవచ్చు. తథాగతుడు ఉన్నప్పుడు వాటిని నివృత్తి చేసుకోలేకపోయామే అని తర్వాత విచారించ కుండా ఇప్పుడే నిస్సంకోచంగా అడగండి”. ఎవరూ ఏమీ అడుగక పోవడంతో ఆనందుడు ఇలా వ్యాఖ్యానిస్తూ “ఈ సభలో సందేహాలు ఉన్న భిక్షువు ఒక్కడు కూడ లేదు. ఇది అద్భుతమైన విషయం” అన్నాడు. బుద్ధుడు ఆనందునితో ఏకీభవిస్తూ “ఈ అయిదు వందల మంది భిక్షు సోదరుల్లో అందరికన్నా వెనుక బడిన భిక్షువు కూడా మళ్లీ బాధావహమైన జన్మ ఎత్తబోడు. అతనికి అర్హత్వం లభించి తీరుతుంది.” అని స్పష్టం చేశాడు. ఆ తర్వాత మరోసారి భిక్షువులను సంబోధిస్తూ పంచస్కంధాలతో కూడిన ప్రతిదీ నశిస్తుందనీ సంయోగికాలకు నశించడం స్వాభావిక లక్షణమని అన్నాడు. శ్రద్ధగా ధర్మాన్ని ఆచరించి నిర్వాణాన్ని సాధించాలని చెప్పాడు. ఈ అంతిమ వాక్యాల తర్వాత బుద్ధ భగవానుడు అన్ని సమాధి దశలూ గడిచి మహాపరి నిర్వాణం చెందాడు. అనిరుద్ధుడనే అర్హతుడు బుద్ధుని నిర్వాణంపై ప్రశంసాప్రస్తావనలో నిశ్చలచిత్తుడైన మహాజ్ఞాని మహాపరి నిర్వాణం పొందాడనీ ఆయనలో మరణవేదనకు అణుమాత్రం కూడా చోటులేదనీ అన్నాడు. ఆనందుడు తీవ్రంగా చలించిపోయాడు. యువభిక్షువులు బాధా సంతప్త హృదయాలతో ప్రపంచ జ్ఞాన చక్షువు మూత బడిందా అని ఆక్రోశించారు. నేల మీద దొర్లుతూ ఎలుగెత్తి విలపించారు. వృద్ధ భిక్షువులు వారిని ఓదార్చుతూ సంయోగిక వస్తు జాలమంతా నశించి పోయేదే అని గుర్తు చేశారు.

బుద్ధుని మరణవార్తను ఆనందుడు వినిపించగానే మల్లులు “ఇంతలోనే తథాగతుడు అస్తమించాడా? ఇంత త్వరగా ప్రపంచం నుంచి వెలుగు వెళ్ళిపోయిందా” అంటూ బిగ్గరగా విలపించారు.

బుద్ధుని భౌతిక కాయానికి దహన సంస్కారం జరిగాక అస్థికలను కపిలవస్తు శాక్యులూ, కుసినారమల్లులూ, పవ మల్లులూ, వైశాలి లిచ్ఛవులూ, అల్లకప్ప బులియలూ, రామగ్రామ కొలియలు, మగధరాజు అజాతశత్రువు, వేతదీప బ్రాహ్మణులు పంచుకున్నారు. పంపిణీ చేసిన ద్రోణుడనే బ్రాహ్మణుడు దహనం చేయడానికి ఉపయోగించిన లోహ పేటికను తీసుకున్నాడు. ఆలస్యంగా అస్థికల కోసం వచ్చిన పిప్పలవన మోరియులకు చితాభస్మం మాత్రమే లభించింది. వీటి మీద పది స్థూపాల నిర్మాణం జరిగింది.



అసాధారణ బౌద్ధిక నైతిక శక్తులు మూర్తీభవించిన ఒక మహోన్నత మనీషి అపూర్వ జీవన యాత్ర అలా పరిసమాప్తి చెందింది.



# సి.ఆర్.రెడ్డి హైస్కూలు రోజులు

*– గౌరెపాటి వెంకట సుబ్బయ్య*

చిత్తూరు వెనుకబడ్డ జిల్లా అయినప్పటికి అక్కడ హైస్కూలు పురాతనమైన ఉన్నత పాఠశాలలో ఒకటి. అది 1854వ సంవత్సరమున స్థాపించబడినది. చూడ ముచ్చటైన భవనము. విశాలమైన గదులు. ఆ ఉన్నత భవనమున 'ఊర్ధ్వ దృష్టి గలిగి ఉన్నతాశయముల కొరకు ప్రయత్నించుము' అను నీతి వాక్యము పిల్లలకు, ఉపాధ్యాయులకు ఎంతో ఉత్తేజమును కలిగించెడిది. ఆ 'చిత్-ఊరు' ఉన్నతపాఠశాల తన పేరును సార్థకము చేసుకొన్నది. ఆ ఉన్నత పాఠశాల ప్రాచీన గురుకుల పద్ధతిని పరిఢవిల్లినది.

ఉపాధ్యాయులు పిల్లల అభివృద్ధియే తమ అభివృద్ధిగా భావించిరి. వారు జీతము, ప్రమోషను, పెన్షనులకై పెనుగులాడలేదు. బాల రామలింగారెడ్డి ఈ పాఠశాలలో 1890వ సంవత్సరములో మొదటి ఫారములో ప్రవేశించెను. ఆయన తన పాఠశాలానుభవములను ఈ విధముగా గ్రంథస్థము చేసెను.

"ఒకానొకప్పుడు – నేను రెండవ ఫారములో జదువు చుండిన కాలమున–సహపాఠియైన బ్రాహ్మణ బాలకుఁడొక్కడు రెడ్డివంశమును హేళనము చేయుచు మా జిల్లాలో వాడుకగా నుండు 'రెడ్డిమడ్డి–సారాయిబుడ్డి' యను నిందావాక్యమును బహిరంగముగ నుడివెను. బాలకుండనగుట చేత నేను పంతులువారితో చెప్పితిని. కుప్పనప్పనయ్యంగార్లా గ్రహావేశులై, ఈ కాలపుటనాచార పూరితులైన బ్రాహ్మణులను జెడఁదిట్టి, మా ఇంటియొక్క సంప్రదాయమును వెల్లడించుచు దమ గురువులైన మా ముత్తాతగారి స్తుతిని దీర్ఘముగఁ జేసి, తమ యొక్క గురువు కులమును దూలనాడి నందులకు శ్రీనివాసాచారిని అనరానిమాటలనిరి. కుప్పన్యంగార్ల యుపాధ్యాయత్వము వలెఁ బ్రసిద్ధి వహించిన గురుత్వమును మా జిల్లాలో నొక్క తిరువేంగడసామి నాయుడుగారు తప్ప నింకెవ్వరు గడించియుండలేదు. 'చిత్తూరు పులి' యని బిరుదుగాంచిన తిరువేంగడసామి నాయుడును, గుప్పనయ్యంగార్లును జనుల స్మరణలో నేఁటికిని బచ్చఁగ బదిలముగానున్నారు. 'నీవేమీ కుప్పనయ్యంగారా?' యని ప్రశ్నరూపమైన తిరస్కారము. 'ఏమయ్యా! కుప్పనయ్యం గార్లవలె మాటాడుచున్నావు?' అని చెప్పిన నతిశయోక్తులు, ముఖస్తుతులు బాగుగఁ గలిపి చందనమలఁదు చున్నా'వని భావన. వారివద్ద నేర్చుకొని స్కూలు పండితులైన వారి సంఖ్య మిక్కిలి పెద్దది. నా మట్టుకు నా సాక్ష్య మిచ్చుచున్నాను. కుప్పనయ్యంగార్లును, వారి యనంతరము పండితులుగా వచ్చిన వేంకట కృష్ణమాచార్యులును నేర్పిన దానికంటె నెక్కువ నేను కాలేజీకి వెళ్ళిన తరువాత నేర్చుకోలేదు. అనఁగా కాలేజీ పండితులు చెప్పలేదని కాదు. నేను నేర్చుకోలేదు. ఆ వచ్చిన దానితోనే భాషా యాత్ర గడుపుచున్నాను.

కుప్పనయ్యంగారి వయసు రమారమి 80 ఏండ్లని వదంతి. మిక్కిలి పొడుగైన మానిసి. దాదపాఱడుగుల పొడుగు. నిమ్మపండు వంటి మనోహరమైన ఛాయ. శ్వేతవస్త్రుండు. పండ్లు లేకున్నను ఉచ్చారణ స్పష్టముగ నుండును. గంభీరమైన కంఠనాదము. సాధారణముగ నేదైన నత్తరు పూసికొని క్లాసునకు వచ్చును. 'ఏమండీ! మీ క్లాసు ఎంత మంచి సువాసనగా నున్నది!' అని యొకప్పుడు నేను బొగడఁగా 'బాలులారా! మాతృభాష యొక్క పరిమళము సుమండీ! మీ యింగ్లీషు ... వోలె దుర్గంధ పూరితము కాదు అని సింహపునవ్వు నవ్వినారు. వారి మాటలనేకము లసభ్యములు, అయ్యు నెవరికిఁ గోపము రాదు.

వారి క్లాసులో ఇంగ్లీషు నేమాత్రము పలుకఁగూడదని యాజ్ఞ. ఎవరైన తెలియక పలికిరో వారి తల్లి యొక్క

పాతివ్రత్యమునకు వచ్చిన భంగముఁ జెప్పరాదు. తాను మాత్ర మాగ్రహావేశములో 'On the bench' అని శిక్షించును. అది తప్ప వేరు ఇంగ్లీషుముక్క వీరు వాక్రుచ్చుట నే నెఱుంగను. 'Home Exercise' అనఁగూడదు. 'గైహిక' మనవలయును. 'Dictation' అని పొరపాటునఁ జెప్పిన మా కులస్త్రీలు కులట లగుట తప్పదు. 'ఉక్తలేఖన'మని దాని పేరు. వారమునకు మూఁడు పర్యాయములు, పర్యాయమునకుఁ బది నిమిషముల చొప్పునఁ గఠినపదములకు ఉక్త లేఖనము వ్రాయించుట వారి పద్ధతి. అందుఁ బ్రాణకంటకములైన మాటలివ్వి. 'త్ర్యంబకశాస్త్రి' 'అవాఙ్మానసగోచరుఁడు', 'పయఃకాంతి', 'యశఃపాళి', 'శత్రుఘ్నుఁడు, 'కఱ' (బండిఱా వెధవ!) 'కంతుఁడు' (కడుపులో సున్నవుండే వత్తు తా రా గాడ్దెకొడకా!) ఇత్యాదులు వారమున కొక పర్యాము 'గైహికము'. ఇంటిలో వ్యాసములు వ్రాసి చూపించువారి సంఖ్య యల్పము; పంతుల వారి యాగ్రహ మనల్పము.

"వీరు హైస్కూలులో బునఃప్రవేశము చేయునపుడు (1890) నేను మొదటి ఫారములో విద్యార్థిని. వీరివద్ద నేఁ జదివిన మూడేండ్లు చదివినది యొక్క పుస్తకమే. నలోపాఖ్యానము. అయిన నెట్టి చదువు ! వ్యుత్పత్త్యర్థములు, నానార్థములు, సంధులు, సమాసములు, వ్యాకరణము, ఛందస్సు, అలంకారములు మొదలగు విషయము లన్నియుఁ గూలంకషముగా బోధించిరి. సర్వలక్షణ సారములోని విషయము లన్నియు నలోపాఖ్యాన ప్రయుక్తముగను, సరసముగను మనసున నాటి వికసించునట్లుఁజేసిరి. "కుప్పనయ్యంగార్లకుఁ దమశిష్యుల యందుఁ బ్రీతి యపరిమితము. తాను మాత్రము మమ్ముఁజెడదిట్టవచ్చును. ఇంకెవ్వరు మా జోలికి రాఁగూడదు. ఇంకెవరివల్ల మాకే ఇబ్బందియుఁ గలుగఁగూడదు. తుదకుఁ బరీక్షల క్రమము సైతము మాయందుఁ జెల్లరాదు.

"ఆ కాలమున సాంవత్సరిక విచారణకు వచ్చువారు 'మిల్టన్' అను ఆంగ్ల కవీశ్వరునకు వ్యాఖ్యాన కర్తయైన 'బ్రాడ్షా' యను దొర. అతఁడును మిక్కిలి వృద్ధుఁడు. ఆ యిరువురు ముసలి వారికిని నొకరి భాష యొకరికిఁ తెలియక పోయినను సఖ్యము సంపూర్ణము. ఒకరి నొకరు చూచి చిఱునవ్వులు ప్రయోగించుకొందురు. ఇంతకంటె నెక్కువ సంబంధము వారి కసాధ్యమైన యాప్సితము. ఆ బ్రాడ్షా దొరగారితోఁ దెనుఁగు క్లాసుల తనిఖీకి వచ్చువారికసాధ్యమైన యాప్సితము. జానకిరామయ్య అను సబ్ అసిస్టెంటు ఇన్‌స్పెక్టరు బ్రాహ్మణుడు. తెలుఁగు తెలిసినట్లు నటించువాడు. జానకిరామయ్య యనిన మా కుప్పనయ్యంగారికి సరిపడదు.

"ఏమండీ ! శుద్ధ వెధవ, ఓ అంటే నా రాని... కొడుకు నా తరగతి పరీక్షించటమా! బాలులారా ! ఆ వెధవను చూచి భయపడవద్దు. వాఁడు వ్యాకరణ సూత్రాల నడుగును. మీకు తెలిస్తే తెనుఁగు సూత్రాలు చెప్పండి. తెలియకుంటే ఈ సంస్కృత సూత్రములలో మీకు అప్పుడు తట్టిన దేదైనా ధైర్యముగా చెప్పి గంభీరముగ కూర్చోండి – జ్ఞప్తియున్నదా? కొడుకులారా!

*అకస్సవర్ణేదీర్ఘః, అదేఙ్గుణః, వృద్ధిరాదైచ్* వల్లించండి, ఇంకా బాగా వల్లించండి! బాగా జ్ఞప్తి యున్నదా, ఏదైనా చెప్పివేసి కూర్చోండి. నిలువబడి యుండకూడదు. తెలిసిందా కొడుకులారా!" ఈ రీతిని రంగము సిద్ధము చేయబడి యుండును. జానకిరామయ్యగారి ప్రవేశము. పొడుగు మానిసి, ఎఱ్ఱని రంగు, జరీ తలపాగా, గర్వపు జూపులు; అదలింపు మాటలు; వచ్చినదే వైయాకరణత్వము ప్రకటింపఁబూనును. "విచ్చేం గలువలు" సూత్రమేమి రాధాకృష్ణయ్యా! జల్దీ చెప్పు!" రాధా కృష్ణయ్యకు దెనుఁగులో శక్తి రక్తి పూజ్యము. "అదేఙ్గుణః" అని కేక వేసి, గభాలున ప్రక్కనుండు బాలునిపై గూర్చుండును. "ఎంత బాగా చెప్పినాడండీ! జవాబంటే అట్లు గదా యుండవలయును. ఆహా! ఆహా! సరియైన సూత్రము. సంస్కృత ఫక్కీని చెప్పినాడు.

"చూచితిరా ! జానకి రామయ్యగారూ ! నా బాలుని ధోరణి" అని కుప్పనయ్యంగారు జయధ్యానము చేసి బిగ్గరగా నవ్వుదురు. పాపము జానికి రామయ్య యేమి చేయఁగలడు? మహా విద్వాంసులు మెచ్చుకొనిరి. తనకా, 'తల' యిది, 'తోక' యిది, యని తెలియదు. "అవునండీ! మీ బాలురు బాగుగా ఉత్తర మిచ్చుచున్నారు" అని కొంతసేపు *అదేఙ్గుణః, వృద్ధిరాదైచ్, అకస్సవర్ణేదీర్ఘః,* ల నాలకించి, యాందోళన చెంది, వెళ్ళుచుండెడివారు. జానకిరామయ్యగారు క్లాసు విడిచి పెట్టినదే చాలును. మా పంతులుగారి దుర్భాషా ప్రయోగము మాపైన జడివాన కురిసినట్లు పడకపోవు.

"పరీక్షా సమయములో వీరిని సూపరింటెండెంటుగా, బెట్టిరేని ప్రతివాఁడెట్లు వ్రాయుచున్నాఁడో యని చూచి, సదుత్తరముల సలహాల నిడి వారి చెవిలో నూఁదుచుఁ

దిరుగుచుండును. చక్కఁగా నుత్తరములు వ్రాయు వాని కాగితములు తీసికొని మొద్దన్నల బల్లమీఁద రహస్యముగా బెట్టి "నఖలు త్వరలో తీయరా–కొడకా!" యని సహాయము చేయుటయుఁగలదు. ఈ విషయమై వీరితో నే హెడ్మాష్టరుఁ బోరాడి గెలువఁ జాలఁడాయెను. "ఏమండీ! ఈ వెధవ పరీక్షలు! నా బాలురు ఫెయిల్ అవుతూంటే నేనూరక చూచుకొని యుంటానా యేమి? ప్యాసైన వెనుకవారిని దిద్దుకొంటాను. "ఉత్తరేఖనములో వచ్చు చిక్కులు ర, ఱ, లు, శ, స లు చదివితి వంటే బండి ఱ, శ వర్ణము కొడుకులారా! మామూలు రెండు సార్లు చదివితినంటే మామూలు ర, స కారమున్నూ వెధవల్లారా !" అని సూత్రధారిత్వము చేయును.

"మా హెడ్ మాస్టరులలో నగ్రగణ్యులనదగినవారలు భాష్యం అయ్యంగార్లు! అరవాయన. శిక్షా పద్ధతులలోఁ బారంగతుఁడు. మంచివాడు. మే మెపుడైన శ్రమ కోర్వఁజాలక యాట విడుపు దినముఁ గోరి, కుప్పనయ్యంగారితో మొఱబెట్టుకొంటిమేని, అలాగే రేపు సెల విప్పిస్తాను" అని చెప్పి, తత్క్షణమే ఆ మఱునాఁడు మహావ్రతదిన మనియు, బాలురకు సెలవిచ్చుట సంప్రదాయ మనియు, హెడ్ మాస్టరు వారితో జెప్పి, 'రజా' గోరుదురు. కుప్పనయ్యంగారి యందలి గౌరవభావమున భాష్యమయ్యంగార్లు ముసి ముసి నవ్వులతో నంగీకరింతురు. ఇట్టివి కుప్పనయ్యం గారి పక్షపాత లీలలు.

కాణిపాక వినాయకుడు చిత్తూరునకుఁ బోవు రోడ్డు ప్రక్కన నెలకొల్పబడి యున్నాఁడు. మేము పరీక్షలకుఁ జిత్తూరునకు బోవునపుడెల్ల జయసిద్ధికై మ్రొక్కుకొనుట యీ దేవునికే, ప్యాసైన యెడల టెంకాయల గొట్టి కర్పూరము వెలిఁగించుటయు, దప్పిన యెడల స్వామినిఁదిరస్క రించుటయు మా పద్ధతులు. "నాకు చాల మంచి స్వామి; నే నెప్పుడు పరీక్షలలో నోటమి చెంద నందున."

ఆనాటి యుపాధ్యాయుల ప్రకృతి, విద్యా పద్ధతి తెలిసి కొనుట మంచిది కదా! మన రెడ్డి చెప్పగా మిగిలినది విచారింతము. రెడ్డి చదువుకొను కాలమున ఆ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు సి. భాష్యమయ్యంగారు. వారు గొప్ప ప్రధానోపాధ్యాయులలో నొకరు. చదువు చెప్పుటలోను, విద్యార్థులను క్రమశిక్షణలో నుంచుటలోను దక్షులు. "నేను అయిదు వందల మంది పిల్లల తండ్రిని!' అని ఆయన సగర్వంగా చెప్పుకొనుట కద్దు. పరిశుభ్రత ఆయనకు ప్రాణము. మలిన వస్త్రధారులగు విద్యార్థులను చూసినదే తడవుగా 'మంచి దుస్తులను ధరించి మరి బడికి రావలసిన'దని యిండ్లకు పంపెడువాడాయన. తప్పు చేసిన విద్యార్థులను శిక్షించుటలో నాయన బెత్తము నిర్విరామముగా విహరించెడిది. 'దండం దశగుణం భవే"త్తన్నది నాటి మాట. బెత్తముతో గొట్టుట, చెవులు మెలివైచుట, నాటి శిక్షలు. ప్రశ్నములకు తత్క్షణము సదుత్తరము లీయగల విద్యార్థులు తోడివారిలో నగ్రేసరులగు చుండుట ప్రోత్సాహకరముగా నుండెడిది. ఒక విద్యార్థి యడిగిన ప్రశ్నమునకు సమాధాన మీయలేని వాడు దిగువకు పోవలె. ఇట్లు కాలపు విద్యార్థులలో ప్రబలెడు విద్యా మాత్సర్యము మహోత్సాహ హేతువై దీపించెడిది.

చిన్న తరగతులకు చదువు చెప్పునుపాధ్యాయులెవరైన పాఠశాలకు రానినాడు పెద్ద తరగతులలోని విద్యార్థులా యుపాధ్యాయులకు బదులుగా పాఠములు బోధింపవలసి యుండెడిది. ఇదియును విద్యార్థుల కుత్సాహకరముగా నుండెను. వివేకము, సత్ప్రవర్తనము గల విద్యార్థులలో నుత్తముడయిన వాడు తరగతి పెద్ద. తక్కిన పిల్లల కాతని నడవడి యాదర్శప్రాయము. ఈ పాఠశాలలోని మెట్రిక్ విద్యార్థులు ప్రెసిడెన్సీలో తఱచుగా ప్రథమ శ్రేణిలో నుతీర్ణులయ్యెడి వారు.

మన రామలింగారెడ్డి ఆకారముచేతను, తెలివితేటల చేతను గూడ ఎల్లరను ఆకర్షించెడివాడు. దృఢగాత్రుడై ఉంగరాలు తిరిగిన జుట్టుతో, ముడిమీద టోపీతో చూపరుల కన్నుల నరకట్టి, ఇంగ్లీషులో మంచినీళ్ళ ప్రాయముగా మాటలాడుటతో, తెలుగులో పద్యాలు నట్లే చెప్పుటతో కర్ణపర్వము గావించెడివాడు.

ఆరవఫారము చదువుచుండగా అనిబిసెంటు దివ్యజ్ఞాన సమాజ మాయన నాకర్షించినది. ఆ బోధనములలో పడి పాఠాలు సరిగా చదువకున్నను పరీక్షకు ముందొక నెల నాళ్ళు మాత్రమే నిగ్రహముతో జదివి, 1896వ సంవత్సరములో ఆయన ఉన్నత పాఠశాలా పరీక్షలలో ఉత్తీర్ణత నందినాడు. ఈ హైస్కూలుపై ఆయనకు మంచి యభిమాన ముండెడిది. 1924వ సంవత్సరములో పూర్వ విద్యార్థి సంఘమున కధ్యక్షుడయినాడు. తన గ్రంథాలయము లోని గ్రంథాలను కొన్నింటిని ఈ పాఠశాలకు ఇచ్చెడివాడు. పాఠశాలోపాధ్యాయులను ఆయన నెంతో అభిమానించి ఆదరించెడి వాడు. అచట చదివిన యెల్లరిలో విశ్వ విఖ్యాతుడతడే కదా!



# అగాథం

(DE PROFUNDIS)

- ఆస్కార్ వైల్డ్

- అశ్విని.కె

*గత సంచిక తరువాయి... (3)*

క్రీస్తు గొప్ప గానాన్ని – Renan ఎంత బాగా చెప్పాడు. (5గానాల్లో) ఆయన జీవించి వుండగా ఎంత ప్రేమించబడినాడో – తరువాత కూడా అంతకంటే ఎక్కువగా ఆరాధించబడినాడని. నిజానికి ఆయన కవుల సరసనే వుంటే ఆయన కంటే ప్రేమికుడు ఎవరుంటారు? ప్రేమ ప్రపంచపు రహస్యమని ఆయన దర్శించాడు! ఆ ప్రేమ ద్వారానే – దేవుని పాదాలు చేరవచ్చు – కుష్ఠురోగుని హృదయాన్ని తాకవచ్చు!

అన్నింటికంటే – క్రీస్తు గొప్ప వ్యక్తిత్వం గలవాడు – అవమానాన్ని అంగీకరించటం – ఒక కళాకారుడిగా, అదే గొప్ప ఆవిష్కారం–మూర్తిభావనం. అన్ని రకాల అనుభవాలకు అదే పరిష్కారం.

*ఆయన వెతికేది – మనిషి అంతరంగాన్ని – అదే 'దేవుని సామ్రాజ్య' మన్నాడు. ప్రతి ఒక్కరిలోనూ వుందన్నాడు. అది అతిచిన్న విత్తనంలోనూ – గుప్పెడు మట్టిలోనూ – సముద్రంలోని ముత్యంలోను వుందన్నాడు – ఈ అంతరంగం, అన్ని బాహిర కోర్కెలను వదిలించుకుంటే – (నాగరకత ద్వారా అంటగట్టుకున్నవే) అన్ని భౌతిక స్వాధీనతలనుండి అవి మంచివా చెడ్డవా – అని చూడకుండా – బైటపడాలనే ఆశించాడు.*

* * *

నేను అన్నింటినీ భరించాను. దృఢనిశ్చయంతోనే ఎదిరించి! తిరుగుబాటు మనసుతో – ఈ ప్రపంచంలో నాకంటూ ఏమీ లేకుండా పోయినంత వరకూ – నా కీర్తి పోయింది – నా గౌరవ స్థానం పోయింది. నా సంతోషం పోయింది. నా ధనమంతా కరగిపోయింది – ఇప్పుడు ఖైదులో దిక్కులేని దారిద్ర్యంలో వున్నాను. కాని నా సంతానం వున్నారు – వారిని ఈ చట్టం నాకు దూరం చేసింది. ఎంత దారుణమైన ఘాతమంటే, ఏమి చేయాలో కూడా ఆలోచించలేక పోయాను. ఒక్కసారి నా మోకాళ్ళపై వాలిపోయి – నా శిరస్సు వంచి, దుఃఖించాను – 'పసివాడి శరీరం దేవుని దేహమే, నాకు దేనికీ అర్హతలేదు' అని విలపించాను. అదిగో ఆ క్షణాలే నన్ను రక్షించాయి. అన్నింటినీ అంగీకరించ గలగటమే నేను చేయగలిగింది – అదిగో అప్పటినుంచి సంతోషంగా వుండగలుగుతున్నాను – ఇది వింతగానే అన్పించవచ్చు– కాని నిజం యిదే – నా అంతరంగపు లోతులకు చేరగలిగాను. ఇప్పటివరకు నేను దానికి శత్రువుగానే వుండి పోయాను. కాని ఈ క్షణం – నా కోసం స్నేహితునిలాగా ఎదురు చూస్తున్నట్లు అనిపించింది. నీ అంతరంగానికి దగ్గరగా వచ్చినపుడు మనం చిన్న పిల్లలయిపోతామని కదా క్రీస్తు చెప్పాడు.

*చాలా కొద్ది మంది మాత్రమే తమ చివరి క్షణం వరకు తమను తాము తెలుసుకోగలుగుతారు – ఇది విచారించ దగిన విషయమే – ఎమర్సన్ "మనిషి లో అరుదైన విషయం తనను తను తెలుసుకోవటమే !" అన్నాడు. ఇది నిజమే. చాలామంది – 'ఇతరులే' ! వాళ్ళ ఆలోచనలు, ఇతరుల అభిప్రాయాలనే ప్రతిబింబిస్తాయి. వారి జీవితాలు కేవలం అనుకరణే – వారి ఉద్వేగాలు ఇతరుల ఉదాహరణలే!*

క్రీస్తు కేవలం ప్రత్యేక వ్యక్తేకాదు – చరిత్రలోనే మొదట ఉన్నతమైన వ్యక్తిత్వంగల వాడు! కాని అతనిని ఒక లోకోపకారిగా, సర్వసమ్మతమైన వ్యక్తిగా, జ్ఞాన – భావావేశాల పరంగానే జూశారు. కాని ఆయన దీనికి అతీతుడు – ఆయనలో అపారమైన కరుణ వుంది – పేదలపైనా –

ధనికులపైనా అంతులేని జాలి వుంది. జైళ్లలో మ్రగ్గేవాళ్లపై – దిగజారిపోయి భగ్నమైన వారిపైనా – కాని ఆయనకు ధనికులపైనే ఎక్కువ కారుణ్యం – జాలి వుంది – వీరే కదా తమ స్వేచ్ఛను వృధాగా గడిపేస్తారు – సుఖసంతోషాలకు బానిసలవుతారు! మెత్తటి వెల్వెట్టు బట్టలు వేసుకుని రాజప్రాసాదాలలో నివసిస్తారు.

పేదరికానికి, బాధకంటే కూడా భౌతిక సుఖాలే నిజమైన విషాదమని నమ్మినవాడు – ఇక సర్వ సమ్మతమైన విషయంలో – స్వసంకల్పం కంటే మన వ్యాపకమే మనలను నడుపుతుందని కూడా అని ఆయనకు బాగా తెలుసు! మనం ముళ్లపొదల నుండి ద్రాక్షపండ్లు తీయగలమా?

లోకుల కోసం బ్రతకడం – ఆయన వుద్దేశ్యం కాకపోవచ్చు – నీ 'శత్రువులను క్షమించు' అని అన్నపుడు – అది వారి కోసం కాదు – అది నిన్ను నువ్వు రక్షించుకోవటానికే – కేవలం ప్రేమే నిన్ను కాపాడుతుంది – ద్వేషభావం క్షయమే. 'నీకున్నదంతా పేదలకిచ్చేయి' అన్నపుడు – ఈ 'ఉన్నది' నీ అంతరంగాన్ని మబ్బులా కమ్మివేస్తున్నది. ఆయన జీవితాన్ని చూసిన కోణంలో – ఒక కళాకారుడు తనను తాను రక్షించుకొనే వ్యాపకంలోనే పాడతాడు, శిల్పాలు చెక్కుతాడు, చిత్రిస్తాడు – ఈ ప్రపంచాన్ని తన భావదృశ్యాలకు అద్దంలా పడతాడు. వసంతంలో ముళ్లపొదలు పూసినట్లు – జొన్న పొత్తులు బంగారు రంగులోకి మారినట్లు – చందురుడు తన కళలన్ని ప్రదర్శించినట్లు !!

'మీరు ఇతరుల కోసం బ్రతకండి' అని అనలేదు – కాని అందరి జీవితాలు ఒక్కటే అన్నాడు – నీ జీవితానికి – మరొకని జీవితానికి వ్యత్యాసం లేదనే అన్నాడు – దీని మూలంగా – వ్యక్తి జీవితానికి ఒక గొప్ప పరిమాణం ఇవ్వ దలిచాడు – క్రీస్తు వచ్చిన తర్వాతనే వ్యక్తి జీవితచరిత్ర ప్రపంచచరిత్రగా మారిపోయింది. నాగరకత మనిషి వ్యక్తిత్వాన్ని బరువుగా మార్చింది – కళాకారులకు ఆలోచనలనేకంగా వుంటాయి. పక్షుల గుంపులు మూగినట్లు – అందుకేనేమో వాళ్ళు దూరంగా వెళ్ళి పోతుంటారు– డాంటే తో – ఇతరుల రొట్టెల్లో ఉప్పెంత వుంది? మెట్లు ఎత్తు ఎంత అని – తెలుసుకోవటానికి తహతహలాడతారు –

గోతే తో పాటు – ప్రశాంతంగా, నిర్మలంగా ఉండాలని అనుకుంటారు.

కాని బోడి లైర్ (Baudelaire)

*O Lord Seigneur, donner moi la force et le courage De contempler mon corps et mon coeur sans degout.*

ఓ లార్డ్ ! నా శరీరాన్ని అసహ్యంతో చూడకుండా వుండే శక్తినివ్వు అని కదా ప్రార్థించాడు?

* * *

కళాకారునికి (సృజనకారునికి) భావప్రకాశం ఒక్కటే జీవితాన్ని ఊహించగలిగిన మార్గం. అతనికి చైతన్యం లేనిదేదీ పనికి రానిదే – మృతప్రాయమే. కాని క్రీస్తుకి అలాకాదు. ఆయన విస్తృతమూ ఆశ్చర్యకరమైన అద్భుతమైన ఊహతో – స్తబ్దమైన ప్రపంచాన్ని, నిశ్శబ్ద విషాద ప్రపంచాన్ని మొత్తాన్ని ఆయన సామ్రాజ్యంగా చేసుకొని, ఆ దుఃఖానికి ఆయనే వాచ్యకారుడయినాడు. ఇంతకు ముందు నేను చెప్పిన అణచివేయబడిన నిర్భాగ్యులు, దేవుడు మాత్రమే వినగలిగిన వారి నిశ్శబ్దం – వీరందరినీ తన సోదరులుగా స్వీకరించాడు.

అంధులకు తానే చూపై వెలిగాడు. బధిరులకు శబ్దమై వినిపించాడు – మూగపోయిన అభాగ్యులకు తానే మాటగా మారాడు. ఈ నిర్భాగ్యులయిన గుంపులకు తానే దారి చూపే నక్షత్రం కావాలనుకున్నాడు. సృజనకారునికి ఒక ఆలోచన – ఒక ఊహ అది చిత్రమో, శిల్పంగానో మారే వరకు ఆలోచనలు కేవలం నిరాధారంగా – ఏ విలువా సంతరించుకోనట్లు, క్రీస్తు – 'విషాద దుఃఖాలకు మూర్తి మంతమై' కళాకారులందరినీ ఆశ్చర్య పరిచి – అధిగమించాడు. అంతవరకు ఏ గ్రీకు దేవుడూ చేయలేని మహత్కార్యమిది.

గ్రీకు దేవతలు – వారి లేత గులాబీ శరీరాకృతులతో కూడా, నిజానికి వారు అలా అనిపించరు – అపోలో కనుబొమ్మ – పర్వతాగ్రం పై చంద్రవంకలా వుంటుంది. అతని పాదాలు ఉదయరాగాలలో రెక్కల లాగా వుంటాయి. కాని తాను మార్సియస్ (Marsyas) ను కర్కశంగా శిక్షించాడు నియోబ్ (Niobe) ని సంతానహీనుని చేశాడు! అథెనా (Athena) నిర్దాక్షిణ్యమైన వీక్షణాలలో అరాచిని (Arachne) మీద కారుణ్యమే లేదు – హీరా (Hera) గొప్పదనం, ఆమె ఆడంబరం – నెమలి ఈకల్లోనే వుండిపోయింది.

ఈ దేవతల తండ్రికి కేవలం మానవ స్త్రీ సంతానం పై దయ, ప్రేమతోనే సరిపోయింది.

ఈ గ్రీకు పురాణ దేవుళ్లలో మతపరంగా భూమాత డీమీటర్ (Demeter) – కళలకు (Dionysus) –ఈయన మర్త్యకన్యకు పుట్టి – తన పుట్టుకతోనే తల్లి ప్రాణాలు పోగొట్టిన వాడు.

కాని – (Proserpina) సిమలి (Semale) సంతానం కంటే కూడా అద్భుతమైన సృష్టి – ప్రకృతిమాత మట్టి ఒడిలోనుంచి జరిగింది:

నజిరత్‌లోని – వడ్రంగి కొట్టులో నుంచి – ఏ కథా – కల్పనలో కంటే కూడా – అద్భుతమైన వ్యక్తి ఉద్భవించాడు– నమ్మశక్యంకాని విధంగా ప్రపంచానికి, మధువు మార్మికమైన రుచిని, లిలీపూల అందాలను – తెలియ జెప్పాడు– ఇంతకుపూర్వం – ఎవ్వరూ చేయని విధంగా. (Isaiah) ఇజయ 'విషాద మూర్తి, దుఃఖపు లోతులు తెలిసిన వాడు – నిర్లక్ష్యాన్ని – నిందను మోసినవాడు – మనమే – ఆయనను చూడలేక ముఖాలు తిప్పుకుంటున్నాము.' అని కదా అన్నాడు. అపుడే ఆయనలోని దైవత్వం ప్రస్ఫుటమైనది. దీనిని మనం భయంతో చూడకూడదు. ప్రతి కళారూపం ఒక రకంగా ఒక సంభవాన్ని తెలియజేస్తుంది, కాలజ్ఞానంతోనే. ప్రతి మానవుడు చిత్తోద్భూతమైన ఒక ఆవిష్కరణ – దేవునికిగాని – మనిషి ప్రపంచంలోగాని.

క్రీస్తు దీనిని గ్రహించి స్థిరీకరించాడు – Virgilian కవి – స్వప్నాన్ని – అది జెరూసలేమ్‌లో గాని – బాబిలోనులో గాని – తర్వాత శతాబ్దాల సుదీర్ఘ కాలంలో గాని ఈ పరిణామంతో ఆయనలో పునర్జన్మ పొందింది – అందుకోసమే ప్రపంచం వేచి వున్నట్లు. నా దృష్టిలో – చరిత్రలో ఎంతో విచారించ దగినది, క్రీస్తు పునర్వికాస చరిత్ర : Chartres లోని కాథెడ్రిల్ (Cathedral) లో Arthurian కథల్లో – సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అసిసి, కళలో – డాంటే Divine Comedy లో ఆ పునర్వికాస చరిత్రను నిజాయితీగా చిత్రించలేకపోయాయి. పైగా, Petrarch, రాఫెల్ కుడ్య చిత్రాలలో, Palladian కట్టడాలలో, ఫ్రెంచ్ విషాద గాథల్లో – St. Paul's చర్చిలో, చివరికి Pope's poetry లో కూడా – Classical Renaissance ఛాయలతో ముసుగు వేశారు. చాల కఠినమైన చట్రంలో అనాత్మకంగా ప్రకటించారు–

కాని కళాసాహిత్యాలలో రమణీయకత వున్న సందర్భంలో – క్రీస్తు అంతరంగాన్ని చూడవచ్చు. రోమియో – జూలియట్‌లో, వింటర్ టేల్ (Winter's Tale) లో, Provencal కవిత్వంలో, Ancient Mariner, LA Belle Dame Sans Merci, చాటర్‌టన్ Ballad of Charity క్రీస్తు పునర్వికాసం చూడవచ్చు.

నిజానికి ఆయనకు మనం ఎంతో ఋణపడివున్నాం – Hugo's - Les Miserables, Baudelaire's - Fleurs Du Mal, రష్యన్ నవలల్లోని – అనుకంప రచన (జాలి) చర్చి భవనాల్లో – రంగు రంగుల అద్దాలు – అద్దకాల వస్త్రాలు – అద్భుతమైన కట్టడాలు అన్నీ ఆయనకే చెందుతాయి.

మైకలేంజిలో పాలరాతి కళాకృతులు – చిన్నారుల ప్రేమ, పూలు– ఒకరకంగా ఈ రెంటికీ క్లాసికల్ ఆర్ట్‌లో స్థానం తక్కువే కాని, 12వ శతాబ్దంనుంచి ఇప్పటి వరకూ అక్కడక్కడా కనిపిస్తున్నాయి. కళ, సాహిత్యాలలో చిన్నారులు, పూవులు అనేక రకాలుగా మనకు దర్శనమిస్తున్నారు.

ఇప్పటివరకూ – చీకటిలో దాగి – వెలుతురులోనే బయల్పడినట్లు – ఒకవేళ పెద్దలు తమను చూసి విసుగు చెందుతారేమోనని భావిస్తున్నట్లు – ఒక్క వసంతంలోనే అలా కనపడి కనుమరుగవుతున్నారు.

* * *

క్రీస్తుకు గల సహజసిద్ధమైన ఊహాశక్తి – అతనిని – ఈ చైతన్యవంతమైన రమణీయకతకు కేంద్రబిందువు చేసింది.

కవితా నాటకాలు – నృత్య రూప నాటకాలలోని వింత పాత్రలు – అవి ఇతరులచే సృష్టించబడినాయి. కాని తన స్వకీయ ఆలోచనలోనుంచే నజరత్ జీసస్ తనను తను సృష్టించుకున్నాడు! చంద్రోదయ వేళలో నైటింగేల్ పాడినట్లే – క్రీస్తు రాక సందర్భంలో ఇజయ ఏడ్పు వినపడటం, ప్రబోధకుని ఆవిర్భావానికి.

ఆయన నెరవేర్చిన ప్రతి కల్పనకూ మరోకోణంలో వికల్పమూ కనపడుతుంది. బేకన్ – ప్రతి సౌందర్యంలోనూ – ఒక వింత కోణం దాగివుంటుంది అంటాడు.

'చైతన్యంతో జన్మించిన వాడు – ఎక్కడ నుంచి వస్తుందో – ఏవైపు పోతుందో తెలియని గాలిలాగా మార్మిక శక్తితో

వుంటాడు' అని కదా క్రీస్తు అన్నాడు! అదిగో ఆ విషయంలోనే – ఆయన చిత్రకారులకు, శిల్పులకు ఆసక్తి కలిగించాడు.

మార్మికమూ, అపరిచితమూ, విషాదమూ, ఆనందమూ, ప్రేమ, ఇన్ని సహజ మూలకాలలోనే ఆయన దర్శన మిస్తాడు.

ఆయన ప్రేరణజేసే ఆశ్చర్యకర తన్యతాపూరమైన భావోద్భవంతోనే ఆయనను అర్థం చేసుకోవాలి!

నా వరకు నేను ఆయనను 'ఊహా ప్రపంచపు సారంగానే' గుర్తించటంలో ఆనందిస్తాను. నిజానికి ఈ ప్రపంచంకూడా అదే పదార్థభూతమై వుంది!

నేను Dorian Gray లో రాశాను – ప్రపంచంలోని పాపాలన్నీ బుద్ధిజనితమేనని! కాని నిజానికి 'బుద్ధిలోనే' సర్వకార్యాలు మొదలవుతాయి.

ఇప్పుడు మనకు తెలుసు – మనం కనులతో చూడం – చెవులతో వినం – ఇవన్నీ నిజానికి ఇంద్రియజ్ఞానానికి సమగ్రమో – అసమగ్రమో అయిన వాహకాలేనని!

గులాబి ఎరుపూ, యాపిల్ వాసనా, కోయిల పాట ఇవన్నీ మన మేధ గుర్తింపు లోనే వుంటాయి సుమా!

ఈ మధ్య క్రీస్తు గురించి వ్రాసిన నాలుగు వచన పద్యాలను ఎంతో శ్రద్ధగా చదువుతున్నాను.

మొన్న క్రిస్టమస్ రోజున – ఎలాగో గ్రీకు టెస్ట్‌మెంటు సంపాదించాను. ప్రతి వుదయం– నా జైలుగది నేల తుడిచి – గిన్నెలు కడిగిన తర్వాత, గాస్పెల్స్ ఒక డజను సూక్తులు ఏవైనా తీసి చదువుతాను. ఒక కొత్త రోజు అలా ప్రారంభమవుతుంది. ప్రతి వాడు – ఎటువంటి క్రమశిక్షణ లేని వ్యక్తి అయినాసరే ఈ పనే చేయాలి.

*ఈ బుతుసంహారపు ఆవృత్త జీవనం – మనలను ఈ స్వచ్ఛంద, నిరాడంబర రమణీయకతకు దూరం చేసింది.*

ఈ గాస్పెల్స్ మనం చాలా తరుచుగా వింటాము. అదీ ఎంతో వికారంగా వింటాము. అందులో ఆధ్యాత్మికత ఏమీ వుండదు.

కాని గ్రీకు గాస్పెల్స్ వినటం మొదలు పెడితే – చీకటి గదిలో నుంచి – లిలీపూల తోటలోకి వచ్చినట్లుంది. క్రీస్తు వుపయోగించిన Iprissima verba మాటలు చదివినపుడు నాకు ఈ ఆనందం రెట్టింపయింది. క్రీస్తు ఎప్పుడూ Aramaic లోనే మాట్లాడాడని అంటారు. రినాన్ (Renan) కూడా అదే అనుకున్నాడు.

ఆరు వారాల క్రితం – వైద్యుని సలహా మేరకు రోజూ ఇచ్చే నల్లని మోటు రొట్టి బదులు – White Bread ఇచ్చారు. అది చాలా రుచిగా వుంది. నిజానికి ఎండి పోయిన రొట్టి రుచిగా వుందంటే – అది వింతగానే ధ్వనిస్తుంది. నాకు మాత్రం – ప్రతి భోజన సమయంలో – చిన్న చిన్న రొట్టి ముక్కలు కూడా నా తెల్ల సత్తు పళ్ళెంలో వదలకుండా తింటాను. అంతే కాదు – బల్ల తుడవటానికి పరచిన ముతక గుడ్డమీద పడిన చిన్న ముక్కలు కూడా వదిలిపెట్టను – ఇదంతా ఆకలితో కాదు సుమా – కాని నాకు ఆహారం సరిపడా అందుతోంది – అయినా ఏదీ వృథా పరచకూడదు – నాకు అందినదేదీ చేజారనీయకూడదు– అలాగే ప్రేమ, అనురాగ విషయంలో కూడా – పూర్తిగా అందుకోవాలి – ఎవ్వరైనా!

సెయింట్ మార్క్ గ్రీకు స్త్రీ గురించి చెప్పిన కథ కూడా నచ్చింది.

ఆమె నమ్మకాన్ని పరీక్షించాలని – ఇజ్రాయిల్ చిన్నారులకు చెందిన ఆహారాన్ని ఇవ్వనని అన్నపుడు – ఆమె – అదిగో బల్లక్రింద 'చిన్న కుక్క'పిల్లలు తింటున్నాయి – ఆ రొట్టె ముక్కలు చాలు – అవి ఆ చిన్నారులు వదిలి వేసినవే కదా అంటుంది!

ఎక్కువ మంది ప్రేమకోసం, మెప్పుకోసం బ్రతుకుతారు. కాని మనం – ప్రేమలో, ఆశ్చర్యంలో బ్రతకాలి.

*మన మీద ఎవ్వరైనా ప్రేమ చూపారంటే దానికి మనకు అర్హత లేదనే అనుకోవాలి. ఎవరికీ ప్రేమించబడే అర్హత లేదు.* దేవుడు మానవుణ్ణి ప్రేమిస్తున్నాడంటే – ఆయన ఆద్యంతరహితమైన ప్రేమను – నిరంతర అయోగ్యుడైన మనిషి పై వర్షిస్తున్నట్లే – ఇది వినటానికి కఠినంగా వుంటుంది. పోనీ ఇలా అనుకుందాం – అందరికీ ప్రేమకు అర్హతవుంది – అలా అనుకునే వాడికిదక్కు!

ప్రేమ – ఒక దివ్య ప్రసాదం, జ్ఞానానుపానం!
దానిని మోకాళ్ళపై వంగి స్వీకరించాలి!
DOMINE, NON SUM DIGNUS
అని ఉచ్చరిస్తూ – మనసును నింపుకోవాలి.

* * *

మళ్ళీ నేను రచన సాగిస్తే – అదే కళాత్మకమైన సృజనను చేయగలిగితే – రెండు విషయాల ద్వారానే నన్ను నేను తెలియ పరుచుకోవాలి –

**ఒకటి – క్రీస్తు : మానవ జీవితంలోని రమణీయ సంవేదనకు మూల పురుషుడని –**

**రెండోది – కళాకారుని సృజనకు వ్యక్తిత్వానికి గల సంబంధం గురించి!**

మొదటిది ఎంతో మనోహరమైనది. నాకు క్రీస్తు వ్యక్తిత్వంలో సర్వసంపూర్ణమైన గుణాలన్నీ ప్రోది చేసి వున్నట్లు కనపడతాయి.

ఆయనే కదా – 'పువ్వుల్లా' జీవించండి అని అన్నాడు! 'Flower like lives' అనే పద బంధాన్ని నిర్మించాడు! చిన్నారులను ఆదర్శంగా తమను తాము మార్చుకోమని అన్నాడు – వారినే పెద్దలకు మార్గదర్శకులుగా చూపాడు !

చిన్నారులను గూర్చి నేనుకూడా ఎంతో ఆలోచించాను – వారి ముఖ్య ఉపయోగం ఏమాటా అని – పరిపక్వమైనది – ఉపయోగకరంగా వుండాలి కదా !

డాంటే – మనిషిని, దేవుని చేతినుంచి – 'ఏడుస్తూ నవ్వుతూ వస్తున్న చిన్నారు'నిగా వర్ణించాడు.

క్రీస్తు కూడా ప్రతివానిని –

A GUISA DI FANCIULLA CHE PIANGENDO ERIDENDO PARGO LEGGIA (A little girl weeping and now laughing)

*జీవితం మారుతూ వుండాలి – ఝరిలాగా ప్రవహిస్తూ వుండాలి. చైతన్యంతో వెలిగిపోతుండాలి. ఒక మూసలో బిగిసిపోవటం మరణించటంలాంటిదే ! వస్తు ప్రపంచం మీద అనురక్తి పెంచుకోకూడదు – సాధారణ జీవితం మీద మోజు పనికి రాదు.*

*అనిర్దుష్టమైన గమనంలో గొప్ప సాహసం వుంటుంది. సామాన్య వ్యవహారాల పై ఎక్కువ సమయం వెచ్చించ కూడదు – పక్షులు అలా చేయవు కదా!*

*రేపటి గురించి ఆలోచించకు – తోలుతిత్తి కంటే ఆత్మ గొప్పది – నీవు కప్పుకున్న వస్త్రం కంటే నీ శరీరం గొప్పది కాదా, అని కదా అడిగాడు!*

ఒక గ్రీకు మాత్రమే ఇలా చెప్పగలడు – ఇది గ్రీకు ఆలోచనతో నిండి వుంది. క్రీస్తు – జీవితాన్ని నిర్దుష్టంగా నిర్వచించాడు. ఆయన నైతికత కేవలం కరుణపూరితమే, దయాగుణమే. అదే నైతిక భావన!

'ఆమె పాపాలన్ని క్షమించబడినాయి – ఆమె ప్రేమించింది కాబట్టి' – ఎంత గొప్పవాక్యం!

ఆయన ధార్మికత కవితాత్మకం – అదే అసలు ధర్మం! బిచ్చగాడు స్వర్గానికి వెళ్ళాడు – అతడు కష్టాలలో వున్నాడు కాబట్టి! అంతకంటే ఏమి హేతువు కావాలి, స్వర్గారోహణకు?

ద్రాక్షతోటలో సాయంత్రం ఒక గంట పని చేసిన వారికి – రోజంతా ఎండలో మ్రగ్గిన వారితో సమానంగానే ముట్ట చెప్తూతారు. అలా ఎందుకు ఇవ్వకూడదు?

అసలు ఎవ్వరికీ దేనికీ అర్హత లేదు – లేక వారు భిన్నమైన వ్యక్తులేమో –

కాని క్రీస్తుకి – మనుష్యుల్ని యంత్రాలలాగా చూసే వ్యవస్థ మీద ఏమీ ఆసక్తి లేదు. అందరినీ సమాన ప్రతిపత్తితో సమాన దృక్పథంతో చూడాలన్నాడు. దీనికి ఏ చట్టమూ పనికిరాదు. కేవలం కొన్ని మినహాయింపులే – *ఎవ్వరైనా ఏదైనా – ప్రపంచంలో ఏది ఏమైనా సరే –*

అసలు రమణీయ కళాప్రపంచానికి ఏది ముఖ్యమైనదో ఆయనకు అదే సహజమైన జీవనానికి ఆధారం ! అంతకంటే భిన్నమైన మూలాన్ని చూడలేదు.

ఆయన ముందుకు, మరో ఆధారాన్ని – అదీ పాపకర్మలో పట్టుపడిన స్త్రీని తీసుకువచ్చినపుడు – ఆమె శిక్షా వాక్యాన్ని చూసినపుడు –

తన వేలితో నేలమీద రాశాడు – 'మీలో పాపం చేయని వాడే మొదటి రాయి విసరండి' అని ! అంతకంటే జీవితానికి సాఫల్యం ఏమికావాలి?

ఆయన అమాయకుల్ని ప్రేమించాడు. బహుశా ఆయనకు తెలుసునేమో – అమాయకుల హృదయ మూలాల్లో గొప్ప ఆలోచనలుంటాయని!

అలాగే మూర్ఖులను భరించేవాడు కాదు – ముఖ్యంగా చదువుకున్న మూర్ఖులను! అభిప్రాయాల సంకటంలో కూరుకుపోయి – వాటి అర్థంకూడా తెలుసుకోలేని ఆధునికుల సమూహాలను ప్రత్యేకించి దూరంగా వుంచాడు. వీరందరికీ జ్ఞానం వుంది – అది వారికీ పనికిరాదు, ఎదుటివారికీ

పనికిరాదు – కాని ఆ జ్ఞానమే దేవుని దగ్గరకు చేరటానికి ఉపయోగపడుతుంది.

ఆయన పోరాటమంతా శత్రువుల (ఫిలిస్టయినల) తోనే; వెలుగులో వున్న ప్రతివాడు పోరాడ వలసిన యుద్ధమే అది!

ఆ పగవాళ్ళతోనే – వారి సమాజంలోనే ఆయన బ్రతికాడు. వారి మూర్ఖత్వంతో – వారి అగౌరవ మత ఛాందస ప్రవృత్తిలో, అసహ్యకరమైన భౌతిక సుఖలాలస జీవితాలతో – వారి అహంకార ప్రవృత్తితోనే పోరాడాడు – అప్పటి జెరూసలేం యూదులు – సరిగ్గా ఇప్పటి మన 'బ్రిటిష్ ఫిలిస్టన్' లాంటివారే.

క్రీస్తు 'Whited Sepulchre'ని నిరసించాడు. ఆ పదాన్ని శాశ్వతంగా నిర్మించాడు !

*ప్రాపంచిక కార్యసిద్ధిని పనికిమాలిన ఫలితంగా చూశాడు. సంపదను మనిషిని కబళించే అనవసర విషయంగా పరిగణించాడు – దానిని మోయలేని బరువుగా గుర్తించాడు–*

*జీవితాన్ని ఏ ఒక్క సిద్ధాంతానికో, నైతిక చట్రంలోనో బంధించి నాశనం చేయకూడదంటాడు. కార్యాలు, క్రతువులు మనిషి కోసమని – మనిషి వాటి కోసం కాదని అంటాడు. పరోపకారులు, డాంబికమైన ధార్మిక సంస్థలు మధ్యతరగతి మనుషులను ఎంతగా ప్రలోభపెట్టి ప్రభావితం చేస్తాయో తెలియచెప్పి, తిప్పి కొట్టాడు.*

వాళ్ళు సదాచారమని దేనిని అంటారో, అది కేవలం అతిసులభమైన తెలివితక్కువ అగీంకారమే – కాని వారి చేతిలోనే అంతులేని అధికారం చిక్కుకుని వుంటుంది– జాగ్రత్త! అన్నాడు ! ఇవన్నీ ప్రక్కలకు తోసి వేశాడు.

కేవలం ఆధ్యాత్మికతే ప్రమాణమన్నాడు. మీరు – చట్టాన్ని – బోధనల్ని చదువుతున్నారు అని ఎత్తిచూపాడు. కాని వాటి కనీసార్థం తెలిసికాదన్నాడు. రోజువారీ ఆవృత్తంలో జీవించడంలోని లేకితనాన్ని ఎండకట్టాడు. ప్రతిక్షణం అర్థవంతంగా బ్రతకటంలోని ఆనందాన్ని బోధించాడు!

* * *

పాపకర్మల నుండి ఆయన రక్షించిన వాళ్ళందర్నీ కూడ కేవలం వారి జీవితాలలోని మధుర క్షణాలకోసమే రక్షించాడనిపిస్తుంది.

క్రీస్తును చూడగానే మేరీ మగ్దలీనా (Mary Magdalen), ఆమె ప్రియులలో ఒకరిచ్చిన అత్యంత ఖరీదైన పింగాణీ పూల కలశాన్ని పగలకొట్టి అందులోని సుగంధద్రవ్యాలను ధూళిధూసరితమైన ఆయన పాదాలపై ఒలికించింది. అదుగో ఆ క్షణం కారణంగానే ఆమె రూత్, బియాట్రిస్‌తోను కలిసి మంచుపూల స్వర్గసీమలో సంచరిస్తోంది.

క్రీస్తు మనకు తెలియజెప్పేది, హెచ్చరించేది– జీవితంలో ప్రతిక్షణం అందంగా ఉండాలని– అంతరంగం రాబోయే పెళ్లికొడుకు, అతని ప్రియమైన పిలుపుకోసం వేచివుండాలని.

ఫిలిస్టీనిజమ్, దీనికి వ్యతిరేకం: ఊహాజనిత చైతన్యం గురించి ఏమాత్రం అవగాహన లేనిది.

ప్రేమ ప్రభావంతోనే జీవితంలో వెలుగులు నిండుతాయని, కల్పనా శక్తి మాత్రమే ప్రపంచాన్ని ప్రకాశింపజేస్తుందని దర్శించాడు. ఈ భావనాశక్తే ప్రేమస్వరూపం, దీని సారూప్యతలోని వ్యత్యాసమే మనిషికి మరొకనికి గల భేదం. ఇదే ప్రపంచం అర్థం చేసుకోవలసిన సత్యం.

పాపిని దరిజేర్చినపుడే క్రీస్తు చాల కమనీయంగా సత్యానికి దగ్గరగా కనిపిస్తాడు. ప్రపంచం సాధువులు, సత్పురుషుల ద్వారానే దైవసన్నిధిని త్వరగా చేరగలదని భావిస్తుంది. క్రీస్తు తన సహజ దైవగుణంతో, పాపకర్మలే మనిషిని సంపూర్ణుడిగా చేస్తాయని నమ్మినట్లు కనపడుతుంది.

ఆయన ప్రాథమిక కోరిక జనుల గుణదోషాలను సరిచేయటం కాదు. కాని వారి దుఃఖాన్ని నివృత్తి చేయటమే. కరుడు కట్టిన దొంగను గుణవంతునిగా సంస్కరించటం ఆయన లక్ష్యం కాదు. ఒక సామాన్యుని సాధువుగా మార్చటంలో గొప్పగా సాధించేదేమీలేదని నమ్మాడు. ఆయనకు 'ఖైదీల సేవాకేంద్రం' గురించి తెలిసే అవకాశం లేదుకదా. ఇంకా ఈ ప్రపంచానికి అవగాహనకు రానిది 'పాపకర్మ – బాధలే' మానవుని సంపూర్ణతకు ఎంతో పవిత్రమైన, రమణీయమైన దారులని తెలుసుకోవటమే.

ఇది చాలా ప్రమాదకరమైన అభిప్రాయమే– అవును అన్ని గొప్ప ఆలోచనలూ ప్రమాదకరమైనవే. కానీ నిస్సందేహంగా క్రీస్తు మతమే ఇది. నేను కూడా ఇది పూర్తిగా నమ్ముతాను. అవును పాపాత్ముడు పశ్చాత్తాప పడాలి.

ఎందుకు? లేకపోతే తాను చేసిన తప్పు అతనికి తెలియవచ్చేదేలా? పశ్చాత్తాపం మొదలైన క్షణాలే ప్రథమ శిక్ష, అంతే కాదు దాని ద్వారానే అతని గతాన్ని మార్చుకోవచ్చు.

గ్రీకులు ఇది సమ్మతించరు. వారు తరచు 'దేవుడు కూడ గతాన్ని మార్చలేడు' అని Gnomic aphorism లో అని గట్టిగానే చెప్పారు.

క్రీస్తు సామాన్యుడు కూడా ఆపని చేయగలడని నిరూపించాడు. ఆ పని తాను చేయగలనన్నాడు. ఏ విధంగా అని అడిగితే ఇలా సమాధానం చెప్పి ఉండేవాడు– 'ఈ విషయంలో నాకెలాంటి సందేహం లేదు–

'దుర్నీతిపరుడు తన మోకాళ్లపై వంగి దుఃఖిస్తున్నప్పుడే – తన జీవితంలోని విలువైన కాలాన్ని బజారు స్త్రీలతో, అడ్డమైన గడ్డితినే పందుల గుంపులతో వృథా పుచ్చినట్లు గుర్తించగలడు.'

ఎవరైనా సరే జైలు జీవితాన్ని అనుభవించినప్పుడే ఇది ఎరుకలోకి వస్తుందని చెప్పటానికి సాహసిస్తున్నాను. ఆ విధంగా తెలుసుకోగలిగినప్పుడు జైలుకు వెళ్ళడంలో కూడా తప్పు లేదు.

క్రీస్తులో ఒక ప్రత్యేకత ఉంది –

ఉషోదయం ముందుగా కొన్ని వెలుగులు కనపడినట్లు, శీతాకాలంలోని ఎండ క్రోకస్ పూలను బంగారు రంగులోకి ముందుగానే మారుస్తుంది. సమయానికి ముందే ఏదో పక్షి తన జంటను పిలుస్తుంది. ఇదే విధంగా –



ఆస్కార్ వైల్డ్ నివాస గృహం

క్రీస్తు కంటే ముందు క్రిస్టియన్లు ఉన్నారు. దీనికి మనం కృతజ్ఞత తెలుపవలసిందే, కాని దురదృష్టం ఏమిటంటే క్రీస్తు తరువాత మరొకరెవరూ లేకపోవడం.

దీనికి ఒకే ఒక మినహాయింపు St. Francis of Assissi- దేవుడు ఆయనకు పుట్టుకతోనే కవి హృదయాన్నిచ్చాడు. తరవాత ఆయన పేదరికాన్ని పెళ్ళాడాడు. కవితాత్మతో, భిక్షగాని శరీరంతో పరిపూర్ణతకు మార్గం సులభమైంది. ఆయన క్రీస్తును పూర్తిగా అర్థం చేసుకున్నాడు. అందుకే ఆయనలాగానే మారగలిగాడు.

మనకు ఈ విషయాన్ని బోధించటానికి Liber Conformitatum అవసరం లేదు.

St. Francis జీవితం– IMITATIO CHRISTI ఈ పేరుతో ఉన్న పుస్తకంలో వచన కవిత్వంలో అదే చెప్తోంది.

క్రీస్తు ఎంతో మనోహరమైనవ వాడు. క్రీస్తు వ్యక్తిత్వంలో ఎంతో రమ్యత ఉంది.

ఆయన ఒక కళాకృతి. ఒక చూడామణి. ఎవరికీ ఏమీ బోధించడు. కాని ఒకసారి ఆయన సన్నిధిలోకి వస్తే మనలో ఏదో మార్పు సంభవిస్తుంది. ప్రతి వ్యక్తి ఏదో ఒకనాడు ఈ సంఘటనకు సిద్ధమై ఉంటాడు. తన జీవితంలో కనీసం ఒక్కసారైనా క్రీస్తుతో కలిసి Emmaus వరకు నడుస్తాడు.

* * *

**ఇక రెండో విషయం:** కళాకారునికి, సృజనకారునికి అతని బ్రతుకు నడతకు ఉండవలసిన సంబంధం.

మీకు ఆశ్చర్యంగా ఉండవచ్చు ఈ విషయాన్ని నేను ప్రస్తావిస్తున్నందుకు.

ప్రజలు 'రీడింగ్ గోయల్' జైలు వైపు చూపి "అదుగో అక్కడికే ఒక కళాకారుని జీవితం తీసుకువెళ్లేది..." అని అంటారు. కాని అంతకంటే ఇంకా నికృష్టమైన చోటుకు కూడ నడిపించవచ్చు.

జీవితాన్ని యాంత్రికంగా గడిపే వారికి వారి బాట ఏదో గమ్యమేమిటో స్పష్టంగా ఉండవచ్చు. దానికి కావలసిన ప్రణాళికతో వనరుల లభ్యతను బట్టి వారు అక్కడికే చేరతారు కూడ. వారు సదాలోచనతోనే పురోహితునిగా మారాలని

ప్రయాణం మొదలు పెడతారు. ఎటువంటి జీవన వృత్తిలో ఉన్నా చివరకు మొదలు పెట్టిన ఆలోచన ప్రకారమే రూపొందుతారు.

పార్లమెంటు సభ్యులవ్వాలని, గొప్ప వ్యాపారి కావాలని, న్యాయవాదిగా పేరుగాంచాలని, న్యాయాధిపతిగా ఎదగాలని, ఇలా కోరికను కష్టపడి సాధించేవారు తప్పనిసరిగా ఫలితాన్ని పొందుతారు. ఇదే వారికి శిక్ష. ఏ ముసుగు వేసుకోవాలను కుంటారో దానినే ధరించాలి – ముఖానికి కప్పుకోవాలి.

కాని జీవన వైరుధ్యంలోని శక్తులతో నిండినవాడు – వీని జీవితం వేరుగా ఉంటుంది. తన్ను తాను తెలుసుకోవాలని తపించేవాడు తాను ఎక్కడకు వెళుతున్నాడో తెలుసుకోలేక పోవచ్చు. వారికి తెలియదు కదా, గ్రీకు ఒరాకిల్ చెప్పినట్లు ఒక విధంగా 'నిన్ను నువ్వు తెలుసుకో' అనేది ఎంతో అవసరమైనది. జ్ఞాన తృష్ణకు ఇదే పరాకాష్ఠ. కాని దీనిని గుర్తించటం – అదే మనిషి అంతరంగంపు లోతులు తెలుసుకోవటం – అసాధ్యమని ఎరుక గలగటం– అదే 'తెలివి' గలగటం! చిట్టచివరి రహస్యం – అది నీవే, నీ మనసే.

*నీవు, సూర్యుణ్ణి తులామానంలో పెట్టి బరువు తెలుసుకున్న తరువాత, చంద్రుణ్ణి చేరే మెట్లన్నీ కొలిచిన తరువాత, నక్షత్రవీథిలో సప్తలోకాలకావలి స్వర్గాన్ని చేరిన తరువాత కూడా ఇంకా మిగిలింది 'నీవే' సుమా!*

నీ అంతరంగం తిరిగే కక్ష్యను తెలుసుకొని కొలిచేదెలా?

*నీ కొడుకు నీ చిదుగుల కోసం మరుభూమికి వెళ్లినప్పుడు అతనికి తెలియదు, అప్పటికే ఒక దేవదూత తన తండ్రికి సంస్కార తైల మర్దన చేయిస్తున్నాడని – తన తండ్రి ఆత్మ పరమాత్మలో లీనమైపోయిందని.*

'ఇదిగో ఇక్కడికే నా కళా జీవితం నన్ను తీసుకు వచ్చింది' అని గర్వంగా చెప్పగల వ్యక్తిత్వం గల వానిగా, ఒక అద్భుత సృష్టి చేయగలనని ఆశిస్తున్నాను.

ఈ విషయంలో ఇద్దరి జీవితాలను అవలోకిస్తే –

మొదటిది Verlaine; రెండోది Kropotkin రాకుమారుడు.

వీరిద్దరు చాలా సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. Verlaine క్రిస్టియన్ కవి, డాంటే తరువాతి వాడు. Kropotkin రాకుమారుడు క్రీస్తు ఆత్మతోనే రష్యా నుంచి వచ్చినట్లున్నాడు.

గత ఏడెనిమిది నెలలుగా ఎన్నో కష్టాల పరంపరలకు నేను లోనవుతున్నా బయటి ప్రపంచం నుంచి నా మీద నిరంతరం నిందలు వచ్చి పడుతున్నా, ఇక్కడ నేను లోనయిన మానసిక, శారీరక శ్రమ నన్ను మాటలే లేకుండా చేసిన సందర్భంగా మొదటి సంవత్సరమంతా ఈ చెరలో పడి నా బలహీనమైన చేతులు తిప్పుకుంటూ 'అరే! ఎటువంటి ముగింపు, ఎలాంటి ముగింపు' అని వాపోయా.

కాని ఇప్పుడు నరకయాతన అనుభవిస్తూ కూడ 'ఎలాంటి ఆరంభం, ఎంత అద్భుతమైన ప్రారంభం' అని ఆశ్చర్యపోతుంటాను. ఇది ఇలాగే ఉంటుందేమో. అలాగే అయితే ప్రతి వ్యక్తిని సరిదిద్దగల స్థలం ఇదే అని అంగీకరించాలి.

పోయిన మే నెలలో నేను ముందుగా అనుకున్నట్లు విడుదలై ఉంటే బయటకు వచ్చి ఇక్కడి చేదు అనుభవాలతో ఈ కారాగారాన్ని అసహ్యంతోనే చూసేవాడిని. అది నాకెంతో కీడు చేసి ఉండేది. కాని నా శిక్ష మరొక సంవత్సరం పొడిగించ బడింది. నాతో పాటు ఈ చెరలో మానవత్వం కూడ ఉంది.

ఇప్పుడు నా విడుదల తరువాత ఇక్కడ నాకు లభించిన దయా దాక్షిణ్యాలకు కారకులయిన అందరినీ కృతజ్ఞతతో గుర్తుంచుకుంటాను. అంతేకాదు నా విడుదల రోజున వీరందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపి వారి జ్ఞాపకాలతోనే బయటి ప్రపంచంలో అడుగు పెడతాను.

ఈ జైలు తీరుతెన్నులు పూర్తిగా లోపభూయిష్టం. నేను బయటకు వచ్చిన తరువాత దీనిని మార్చటానికి నేను ఏమైనా సరే చేస్తాను. ఆ ప్రయత్నం చేయాలనే అనుకుంటున్నాను. కాని ఒక్క విషయం ప్రపంచంలో మనిషి చైతన్యాన్ని, అంతరంగాన్ని, ఆత్మను, క్రీస్తు దయారసాన్ని (ఈయన చర్చిల్లో లేదు) ప్రేమ తత్వాన్ని ఏ శక్తి ధ్వంస పరచలేదు. కనీసం సన్మార్గంలో పెట్టలేకపోయినా విధ్వంస పరచలేదు.

*ఇంకావుంది...*

బీభత్స రస ప్రధాన తెలుగు నాటకం

# గో టు హెల్

- ఎన్నార్కె

మరాఠీ భాషలో ఆధునిక ఆలోచనా ధోరణులు, కొత్త ప్రయోగాలతో కూడిన నాటకాలెన్నో వచ్చాయి. అక్కడ నాటకాలను శ్వాసగా పీలుస్తూ ఊపిరి తీసుకుంటున్న లబ్ధప్రతిష్ఠులైన విజయ టెండూల్కర్, డాక్టర్ శ్రీమాన్ లగ్గూ లున్నారు. మరి మనకేరి అంటారా? సరిగ్గా దృష్టి పరికించండి. వారితో సమాన ప్రతిభా సంపత్తి గల్గిన డాక్టరు చాట్ల లేరూ మనకి! ఉన్నారు. ఎటొచ్చి, ఇక్కడ ప్రయోగాత్మక నాటకాలను ఆదరించే ప్రేక్షకులు లేరు.

యుద్ధం ఒక ఉన్మాదం, ఒక విధ్వంసం, ఒక దయనీయమైన స్థితి. ఈ మూడు భావోద్వేగాలనూ కలుపుతూ, ఒక పక్క భయాన్ని, మరొక పక్క కరుణను చూపుతూ పికాసో చిత్రించిన గుయెర్నికా ప్రపంచ చిత్రకళలో తనదైన ఒక స్థానాన్ని సంపాదించుకుంది. అందుకే జుగుప్స కూడా నవరసాలలో ఒకటని మరోసారి గుర్తుకు తెచ్చుకుందాం. అత్యంత హేయమైన ఈ రసాస్వాదన కూడా కళే. దీనికి ప్రతిరూపంగా వచ్చిన నాటకమే గొల్లపూడి మారుతీ రావు వ్రాసిన *గో టు హెల్*.

ఒక రోజు నేను చాట్ల వారికి ఫోను చేస్తే, తాను గత 15 రోజుల నుంచీ ఒక నాటకానికి రిహార్సల్ జరుపుతున్నానని, త్వరలోనే అది కొందరి మిత్రుల సమక్షంలో ప్రదర్శించ బోతున్నానని, మీరూ, అశ్వినీ తప్పక రావాలని కోరారు. ఆశ్చర్య పోవటం నా వంతయింది. అప్పటికి చాట్ల వారి పెద్దబ్బాయి యాక్సిడెంటుకు గురై మరణించి కొన్ని నెలలు కూడా కాలేదు. ఈ విషయంపై నేను వ్రాసిన సంతాప ఉత్తరానికి సమాధానంగా నాకు తిరిగి ఉత్తరం వ్రాస్తూ



చాట్ల శ్రీరామమూర్తి

For the rest of my life I am condemned to live with this curse అన్నారు. అష్టపదులు దాటిన వయస్సులో మనవలతో అష్టా-చెమ్మా లాడుకునే వయసులో ఆయనకు తగిలిన శరాఘాతమిది. ఆయనను మానసికంగా నిట్టనిలువునా కూల్చిన సంఘటన. కంటి కొనలలోని తడి ఇంకా ఆరకముందే, గుండెలోని పుండు పచ్చిగా అలావుండగానే ఆయన తన వృత్తికి మాత్రం విశ్రాంతి నివ్వలేదు. స్థితప్రజ్ఞతకు ఇంతకు మించిన నిలువెత్తు సంతక ముంటుందా?

ఈ నాటకం చూసిన వారికి ఒక షాక్ ఇస్తుంది. ఇంచుమించుగా ఇటువంటి భావనే టెనిస్ విలియమ్స్ వ్రాసిన *ఏ స్ట్రీట్ కార్ నేమ్డ్ డిజైర్* అన్న నాటకం 1947వ సంవత్సరంలో ప్రదర్శించబడినప్పుడు అమెరికన్ ప్రేక్షకులు గురైయ్యారు. ఇది 1956వ సంవత్సరంలో సినిమాగా వచ్చినపుడు అందరిలానే నేను షాక్‌కు గురైనాను. చాలాకాలం తరువాత ఈ నాటకం మళ్లీ అటువంటి (షాక్) అనుభూతిని నాకు ఇచ్చింది.

విజయ టెండూల్కర్ మరాఠీలో వ్రాసిన ఘాషీరామ్ కొత్వాల్ మొదలైన నాటకాలు ప్రభంజనాన్ని సృష్టించాయి. ఆయనకు సరస్వతీ సమ్మాన్ గౌరవం దక్కింది. ఆ సభలో నాటక ప్రదర్శనప్పుడు టెండూల్కర్ మీద ఎవరో చెప్పు విసిరారు. అప్పుడాయన ఈ రెండు అభిప్రాయాలను (సరస్వతీ సమ్మాన్‌ను, విసిరిన చెప్పును) నేను సమానంగా గౌరవిస్తున్నా నన్నారు. చాట్ల కూడా అలాంటి వారే! తాను నమ్మింది, తనకు నచ్చింది ఫలితాన్ని ఆశించకుండా చేస్తారు. ఈ నాటక కథాకార్యక్రమం గురించి ఇక్కడ చెప్పబోవటం లేదు. ఈ నాటకంలో ఏం ఉంది. అన్నది రచయిత వ్రాసిన ఇంట్రోద్వారా మీరు గ్రహించ గల్గుతారు. బంజారాహిల్స్‌లోని లామకాన్‌లో ఈ ప్రదర్శన నిరాడంబరంగా 200 మంది ప్రేక్షకుల మధ్య జరిగింది. (22-4-2012 న) పాత్ర ధారుల్వెరికీ మేకప్‌లేదు.

గెటప్ మాత్రమే వుంది. ఎవరి వయసుకు తగ్గ పాత్రలు వారు ధరించారు. అందువల్లనే నటుల నటన కనిపించలేదు. పాత్రలు రంగస్థలంపై ప్రాణం పోసుకున్నాయి. శాస్త్రి నుంచి, ముఖ్యపాత్రధారి, త్రాగుబోతు పాత్రవరకూ – అందరూ పాత్రోచితంగా నటించారు. కథంతా ఒకే సెట్‌లో జరుగుతుంది.

### ఆలస్యంగా ఆఖరి సంజాయిషీ

సరిగ్గా 35 సంవత్సరాల క్రితం *గోటు హెల్* నాటకాన్ని రాశాను. చదివి "గొల్లపూడి మారుతీరావు 35 సంవత్సరాలు ముందుగా ఈ నాటకం రాశాడు" అన్నాడు చాట్ల శ్రీరాములు. ఆ 35 సంవత్సరాలూ ఇప్పుడు గడిచిపోయాయి.

ఆరోజుల్లోనే ఈ నాటకానికి చాలా కితాబులు అందాయి. మద్రాసు వాణీ మహల్‌లో ఈ నాటకాన్ని ప్రదర్శించినప్పుడు నేను నాలుగో వరసలో ఉన్నాను. ప్రేక్షకులు ఈ నాటకాన్ని షాక్‌తో చూశారు. నాటకం అయ్యాక ముందు వరుసలో కూర్చున్న ఓ బ్రాహ్మణ ప్రేక్షకుడు ఆవేశంతో రెండు వరసల కుర్చీల్ని తోసుకుని నా మీదకు వచ్చాడు. మరో వరుస కుర్చీలు లేకపోతే నా చొక్కా పట్టుకోవడమో, కొట్టడమో చేసేవాడేమో.

అతను సంగమేశ్వర శాస్త్రి వారసుడు. నా నాటకానికి దక్కిన మొదటి కితాబు అది. మొదటి ప్రదర్శనకి శ్రీరాములు తన సొంత ఖర్చుతో యిద్దరు ప్రేక్షుల్ని ఆహ్వానించాడు. యండమూరి వీరేంద్రనాథ్, ఎన్.ఆర్. నంది, ఇద్దరూ నాటకాన్ని చూసి భేషరతుగా అసహించుకున్నారు. అది నాటకానికి దక్కిన రెండో కితాబు. ఇదేమిటి? వెక్కిరింతా? పరిహాసమా? పొగురుబోతుతనమా? అనిపించవచ్చు చాలామందికి. వివరించడానికి ఒక కథ–కాస్త వివరంగా చెప్పాలి.

నా దృష్టిలో అత్యద్భుతమైన ఇతివృత్తాన్ని – అంతే అద్భుతంగా రచించిన గొప్ప నాటకం ఫ్రెంచి రచయిత ANOUILH నాటకం *బెకెట్*. దానికి ఆయన రాసిన ఉపోద్ఘాతం ఇది.

ANOUILH ఓ రోజు సెకెండ్ హ్యాండ్ పుస్తకాల దుకాణంలో నడుస్తున్నాడు. ఎర్ర బైండుతో ఉన్న ఓ పుస్తకం అతని దృష్టిని ఆకర్షించింది. మరో ఆలోచనలేకుండా ఆ పుస్తకాన్ని కొన్నాడు. అదేమిటో కూడ చూడకుండా తెచ్చి తన అలమరలో ఉంచేశాడు. చాలా రోజుల తర్వాత ఓనాడు భార్య మేడమెట్ల మీంచి దిగివచ్చి "చాల విషాదకరమైన ఇతివృత్తం ఉన్న పుస్తకం ఏదయినా చదవడానికి ఇస్తావా?" అని అడిగింది. పుస్తకాల అలమర దగ్గరికి వెళ్ళాడు. ఈ ఎర్రబైండు పుస్తకం ఆకర్షించింది. తీసి యిచ్చాడు. కొన్ని గంటల తర్వాత కళ్లనీళ్లతో మెట్లు దిగింది భార్య. పుస్తకాన్ని మళ్లా అలమర్లో ఉంచేశాడు–ఇప్పుడూ అదేమిటో చూడకుండా. మరి కొన్నాళ్ల తర్వాత మళ్లీ మెట్లుదిగి వచ్చి "చాలా హాస్యకరమైన ఇతివృత్తం ఉన్న పుస్తకం ఏదయినా ఇస్తావా? అని అడిగింది భార్య.

ఈ సారి అలమర తెరిస్తే మళ్లీ ఆ ఎర్రబైండే కనిపించింది. తీసి ఇచ్చాడు. కొన్ని గంటల తర్వాత కితకితలు పెట్టినట్టు నవ్వుతూ మెట్లు దిగింది భార్య– "ఎంత సరదాగా వుందో" అంటూ, ఎర్రబైండు పుస్తకం మళ్లీ అలమరలో పెడుతూండగా ఆయనకి గుర్తుకొచ్చింది –

కొన్నాళ్ళ క్రితం ఇదే పుస్తకం ఆమెని ఏడిపించింది – అని. ఒకే ఇతివృత్తం పాఠకుడిని నవ్వించి, ఏడిపిస్తే – అది తప్పక నాటకమే అయివుంటుందనుకుంటూ పుస్తకం తెరిచాడు. తీరా అది చరిత్ర! తెల్లబోయాడు. అయినా వదల్లేదు. ఆ ఇతివృత్తంతోనే నాటకం రాశాడు. తీరా రచన పూర్తయ్యాక – చరిత్రని నాటకంగా రాశాడు కనుక ఓ చరిత్ర ప్రొఫెసర్‌కి చదవడానికి ఇచ్చాడట. ఆయన చదివి "ఇదేం దరిద్రం చరిత్ర" అన్నాడట.

అప్పుడు ANOUILH కి నమ్మకం కలిగింది – అది గొప్ప నాటకమని.

ఆ విధంగా 35 ఏళ్ళ క్రితం ఇద్దరు రచయితలు (యన్.ఆర్.నంది, యండమూరి వీరేంద్రనాథ్) నా నాటకం మీద నాకు నమ్మకాన్ని పెంచారు. ఈ నాటకాన్ని ఎక్కువమంది ప్రదర్శించలేదు. నిజానికి శ్రీరాములు తప్ప ఎవరూ ప్రదర్శించలేదు.

ఈ మధ్య మా పెద్దబ్బాయి ఆలస్యంగా ఎమ్మే చదివి అనుకోకుండా *గోటు హెల్* మీద ఎమ్.ఫిల్. పరిశోధన చేస్తానన్నాడు. అతనికి తెలుగులో అంత ప్రవేశం లేదు. అతని కోసం నాటకాన్ని పూర్తిగా ఇంగ్లీషులో రాశాను. ఇంగ్లీషు రచన కనుక – ఏమైనా పొరపాట్లుంటే సవరించమని పెద్దలు

అండవిల్లి సత్యనారాయణ గారికి పంపాను. ఆయన చదివి తిప్పి పంపుతూ – ఆయనకి నేనంటే గౌరవం – "తప్పులు లేవుగాని – ఈ నాటకమే పెద్ద తప్పు" అనే సూచన వచ్చేటట్టు ఫోన్‌లో సణిగారు.

మా అబ్బాయి ఎమ్.ఫిల్. ఇతివృత్తం The colour of anger in East and West : A comparative study of John Osbome's "Look Back in Anger" and Gollapudi Maruthi Rao's 'Go To Hell' ఈ రచయిత కొడుకు పట్టాకి గైడ్ – మరో రచయిత కొడుకు మధురాంతకం రాజారాంగారబ్బాయి. – నరేంద్ర, ఓ పి.హెచ్.డి.కి సరిపోయే పరిశోధన చేశాడని కితాబునిచ్చారాయన శ్రీరాములతో సహా.

ఈ మధ్య మరీ వయస్సు మళ్ళాక ఎందుకో శ్రీరాములుకి ఈ నాటకం మీద మళ్ళీ మోజు పుట్టింది. మళ్ళీ revival చేస్తున్నానని ఫోన్ చేస్తే ఆశ్చర్యపడ్డాను. ఇప్పటికే ఈ నాటకం unpresented play గా నా అభిమాన రచన అయింది. ఈ నాటకం వేస్తున్నాడని తెలిసి శ్రీరాములు– 19 సంవత్సరాలుగా సభ్యుడుగా, ఉపాధ్యక్షుడిగా వున్న 'రసరంజని' సభ్యులు అభ్యంతరం తెలిపారట – "ఆ దిక్కుమాలిన నాటకం వెయ్యక పోతేనేం?" అంటూ. శ్రీరాములు సమాధానంగా ఆ సంస్థతో వున్న 19 సంవత్సరాల బంధుత్వం వదులుకుని, తన సభ్యత్వానికి రాజీనామా చేసి ఈ నాటకాన్ని వేస్తున్నాడు. ఇది సింప్సన్ అనే సామాన్యురాలి కోసం రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్య సింహాసనాన్ని వదులుకున్న ఎడ్వర్డ్ VIII త్యాగం లాంటిది. థాంక్స్ శ్రీరాములూ! మరో ప్రముఖ విమర్శకులు (పేరు రాయాలనిపించడం లేదు) "మరో నాటకమేదయినా వెయ్యరాదా?" అని మొహమాటంగా అన్నారట. ఆయన బొత్తిగా పెద్దమనిషి, ఆయన్ని నేను క్షమించగలను. మరో ప్రముఖ సంస్థ చాట్ల థియేటర్ ట్రస్ట్‌తో సహసమర్పణకి అంగీకారం తెలిపి తదుపరి మొహంచాటు వేసింది.

ఆర్షధర్మానికి అద్భుతంగా గొడుగుపట్టే ఒకే ఒక్క వ్యవస్థ భారతీయ వ్యవస్థ. చాలా కారణాలకి – ఆ విలువలు లుప్తమైపోగా – ఇంకా చూరుని పట్టుకు వేలాడుతున్న సంప్రదాయజ్ఞులు కొందరున్నారు. లేదని బుకాయించి కళ్ళు మూసుకునేవారూ మరి కొందరున్నారు. కొన ఊపిరితో కొన్ని విలువలు మిగిలాయి. కాలక్రమేణా కొన్ని మారాయి. కొన్ని మాయమయ్యాయి. కాని – ఆ నిజాన్ని ఒప్పుకోవడానికి మనస్సురాక ఆత్మవంచన చేసుకొనే వారు మరి కొందరున్నారు. మన వ్యవస్థ ఇంగువ కట్టిన గుడ్డ.

కుండ బద్దలుకొట్టే పని 35 ఏళ్ళ కిందట చేశాను. నిజం కోపం తెప్పిస్తుంది. అబద్ధం దొంగచూపులు చూసి దారులు వెదుకుతుంది. ఈ నాటకం అందరికీ నచ్చలేదు. కాని ఎందుకు నచ్చలేదో దాదావు అందరికీ అర్థమయ్యేవుంటుంది. ఆ నచ్చనితనానికి ప్రతినిధే సంగమేశ్వర శాస్త్రి. అయితే బ్రాహ్మణ్యం ఎందుకు? మానవ విలువల పతనానికి ఆవలిగట్టును నిర్ణయించడానికి – పైమెట్టు అక్కడినుంచి ప్రారంభమవుతుదంది కనుక. కాశ్మీరు నుంచి కన్యాకుమారి అంటూ ఎల్లలను చెప్పుకుంటాం. కాని నాగపూరునుంచి చెన్నై అనం. ఆవలిగట్టు బ్రాహ్మణ్యం కనుక. అతను నిజానికి వీరయ్య నాయుడో, వెంకయ్య చౌదరో కావచ్చు.

విలువల్ని పరిరక్షించడానికి తాపత్రయపడుతూ, పట్టుకు వేలాడే వర్గానికి ప్రాతినిధ్యం – ఆ స్కేలులో బ్రాహ్మణ్యం ప్రసక్తి. అంతవరకే Decadence of values need not confine to Brahmins alone. భగవద్గీతలో శ్రీకృష్ణుడి పేరు లేకపోయినా దాని విలువ తగ్గదు. దేవుడి లేబుల్ శాశ్వత విలువలకి గొప్పదన్ను. "యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః" అని చెప్పడానికి దేవుడే అక్కరలేదు. దేవుడే అయితే ఆ నీతికి మన్నిక ఎక్కువ. అదీ ఆనాటి పెద్దల ఆశ. దేవుడినే అటకెక్కించే రోజులొస్తాయని తెలియని అమాయకులు వాళ్ళు.

విలువలు మరింతగా దిగజారి హిపోక్రసీ జీవనవిధానంగా మారి – పతనాన్ని తెలిసి కూడా తలవొంచుకోనక్కరలేని మొండితనాన్నీ, ధైర్యాన్నీ కూడదీసుకునే ధోరణి ఈ వ్యవస్థలో స్థిరపడడానికి 35 ఏళ్ళు సరిపోయింది. ఇప్పుడు సంగమేశ్వర శాస్త్రి – పోనీ – పరమేశ్వర గౌడ్ కొడుకుని కత్తితో పొడవడం ప్రేక్షకులకు షాక్ అనిపించదు. కారణం ఇప్పుడు – కాదు. ఇప్పటికి ఆ కారణాలన్నీ – రామశాస్త్రి – పోనీ – రామయ్యానాయుడు చచ్చిపోవడానికి అన్ని అర్హతల్ని సంపాదించి పెట్టాయి కనుక.

సంప్రదాయం అంటే అనూచానంగా ఓ వ్యవస్థ సుగమమైన జీవితానికి ఏర్పరచుకున్న ఒరవడి. వాటిని ఛేదించడంలో కట్టడి అక్కరలేదని నమ్మే తరాలు ఈ మధ్య

| **చాట్ల థియేటర్‌లో ట్రస్ట్ సమర్పణ** | | **సహదర్శకులు** | |
|---|---|---|---|
| పాత్రధారులు (ప్రవేశ క్రమంలో) | | రంగాకృతి, రంగోద్దీపనం | : జాలీ, శివ |
| సంగమేశ్వర శాస్త్రి | : బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి | సంగీతం | : రవీంద్రతేజస్వి |
| అమీనా | : మాధవి | ఆహార్యం | : ఆర్.ఆర్.హరిశ్చంద్ర |
| రామశాస్త్రి | : వై.యస్.కృష్ణేశ్వరరావు | స్టేజ్‌మేనేజర్ | : అనుపవన్ |
| జాన్ | : అనుపవన్ | వీడియోగ్రఫీ | : యుగంధర్ |
| లక్ష్మి | : చేతన | సహప్రయోక్తలు | : రామశాస్త్రి, మహమ్మద్ షఫీ |
| రవి | : మహమ్మద్ షఫి | | |

మరీ దూసుకు వచ్చేశాయి. ఇప్పుడే నాటకం పేరూ మారిస్తే బాగుంటుందేమో ననిపిస్తోంది. Go To Hell అనికాక Let's go to our chosen Heaven అంటే బాగుంటుందేమో, నా నాటకం శీర్షికల మీద శ్రీరాములుకి బొత్తిగా గౌరవం లేదు. Let him go to Hell !

ఇప్పటికీ ఈ నాటకం నచ్చని ప్రేక్షకులు ఈ సభాస్థలిలో ఉంటే వారికి మా విన్నపం – మరో 35 సంవత్సరాల తర్వాత మళ్ళీ ఈ నాటకాన్ని చూడండని. అప్పటికి ఈ నాటకం ఉంటుంది. కాని ఈ సమాజం ఇలా ఉండదు.

The Play can wait for a few decades more until the decadence of the so called "organised" society is complete and total.

అప్పటికి నేనూ శ్రీరాములూ ఉండము. కాని నాటకం ఉంటుంది. ఈ నాటకాన్ని నిజమనిపించే అప్పటి సమాజం మాకు మద్దతు పలుకుతుంది. అప్పటికి మీరూ ఉంటారు. అప్పటి ప్రేక్షకులు తప్పక చప్పట్లు కొడతారు. ఆ చప్పట్లు చరిత్రలో నిలుస్తాయి. ఎందుకంటే Theatre does not live by its masterpieces, but between them.



## దర్శక ఉవాచ

2005 సం॥లో "మై నాథూరామ్ గాడ్సే బోల్ రహాహూ" అనే నాటకం నిషేధించబడింది. గాంధీజీని హత్య చేసిన గాడ్సే కథ ఇది. కొన్నాళ్ళ తర్వాత మహారాష్ట్ర ప్రేక్షక సంఘాల ఆందోళనలతో ఈ నిషేధాన్ని ఎత్తివేశారు. ఈ నాటకం నేను చూశాను. ప్రదర్శనానంతరం ఒక ప్రముఖ ఉర్దూ విలేఖరి 'గాడ్సే భావాలతో మీరు ఏకీభవిస్తారా?' అని ప్రశ్నిస్తే "గాడ్సే దృక్కోణం పరిశీలించడానికి వచ్చాను కాని అతన్ని పొగడ్డానిక్కానీ, వ్యతిరేకించడానికి కాని రాలేదు" అని ఖచ్చితంగా చెప్పాను.

అప్పుడు మిత్రులు గోటేటి రామచంద్రరావు గారు చెప్పిన ఒక విషయం గుర్తొంచింది. వాల్టేర్ అనే ఫ్రెంచి విప్లవకారుడు, ప్రముఖ నాటక రచయిత అభిప్రాయాలతో ఏకీభవించని నాటి రాచరికం వాల్టేర్‌ని చంపంవలసిందిగా కొందరు దుండగుల్ని పంపింది. వాళ్ళనుద్దేశించి ఆయనన్న మాటలు ఇవి I will never agree with you of what you are saying as long as I am alive but I will fight for your right to say that till I die మాటలు మారుతీ రావుకీ వర్తిస్తాయి.

మారుతీ రావు భావాలతో ఏకీభవించిన నేను 35 ఏళ్ళ తర్వాత ఈ నాటక పునః ప్రదర్శనకి సిద్ధమయితే నాగరిక ప్రపంచం నన్ను బహిష్కరించింది. మనిషిలో "నైతిక అవినీతి" పేట్రేగిపోతున్నంత కాలం ఈ నాటకం బతికి ఉంటుంది. ఈ నాటకం జుగుప్స కలిగిస్తుందన్న కొందరికి మారుతీ రావు సమాధానం ఈ నా అభిప్రాయంతో ఏకీభవిస్తారో విభేదిస్తారో నాటకం చూసి నిర్ణయించండి.

### తొలి తరం చారిత్రక, శాసన పరిశోధకులు

# దూపాటి వెంకటరమణాచార్యులు

**- కుర్రా జితేంద్రబాబు**

దూపాటి వెంకటరమణాచార్యులు తెలుగుభాషా సాహిత్యోపాధ్యాయునిగా, శాసన, చరిత్ర, సంస్కృతి పరిశోధకులుగా తెలంగాణా అంతటా విస్తృతంగా పర్యటించి చారిత్రక సాహిత్య విశేషాలను రాసులుగా పోసిన మహానుభావుడు. శేషాద్రి రమణ కవులుగా ప్రసిద్ధికెక్కిన జంటకవులలో మొదటివారైన దూపాటి శేషాద్రి గారు, వెంకటరమణాచార్యులవారి మూడవ అన్నగారు. 20వ శతాబ్ది ఆరంభంలో అవధానోద్యమం సంస్థానాల్లో ఊరేగుతున్నపుడు ఈ సోదరద్వయం కూడ జంటకవులుగా అవధాన కవితారంగంలో నిలదొక్కుకోవటానికి ప్రయత్నించి విఫలమైనారు. ఆనాటికే అవధాన సాహిత్య బ్రాహ్మణికం, నియోగి, వైదిక భేదాలచేత రెండుగా చీలింది. వైష్ణవులయిన ఈ జంటకవులు నిలబడటానికి కష్టమై ఎవరికివారే జీవికకోసం వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దూపాటి వెంకటరమణాచార్యులు తెలంగాణా ప్రాంతానికి జీవికకోసం వచ్చి ఉపాధ్యాయులుగా స్థిరపడి యిచ్చటే ఉద్యోగించి చివరి వరకు తెలంగాణాలోనే గడిపినా రచనలు మాత్రం శేషాద్రి రమణ కవుల పేరునే జీవితాంతం ప్రచురించారు.

దూపాటి రంగాచార్యులు, లక్ష్మమ్మ దంపతులకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఇందులో నాల్గవ కుమారుడు వెంకటరమణాచార్యులు. ఇతను గుంటూరు జిల్లా పెద్ద ఎనమదల గ్రామంలో నందన నామ సంవత్సరం (క్రీ.శ. 1892లో) మేనమామ ఆకలంక రామాచార్యుల ఇంట్లో జన్మించారు (వారు స్కూలు రికార్డులో 15 జూన్, 1893 అని వ్రాసుకున్నారు). ప్రాథమిక విద్యాభ్యాసం తండ్రివద్దనే చిలకలూరి పేటలో కొంతకాలం, సత్తెనపల్లిలో రెండవ అన్నయిన శ్రీనివాసాచార్యుల వద్ద కొంతకాలం, ఆ తరువాత వినుకొండ, కమ్మవారి పాలెం గ్రామాల్లో పెద్దన్న వద్ద కొంతకాలం జరిగింది. ఆ కాలంలోనే స్వేచ్ఛా సంచారం, దుస్సాంగత్యంతో అన్ని దురలవాటులకు లోనయ్యారు. దీనితో రమణాచార్యుల తండ్రి వారిని తిమ్మాపురంలో ఉన్న పెద్దకుమారుని వద్దకు పంపగా అక్కడ అన్నతోపాటు వీధిబడిలో చదువుచెప్తూ కొంతకాలం గడిపారు. అన్నతో కలిసి కవితారచన సాధన చేసి గ్రామ సంచారం కూడా చేశారు. 1908లో తిమ్మాపురం వీధిబడి మూతపడటంతో సొంతంగా వీధిబడిని ప్రారంభించి క్రీ.శ. 1909లో తండ్రి మరణించడంతో దానిని మూసివేసినాడు. అక్కడనుండి బాపట్ల చేరి ప్లీడరు వద్ద గుమస్తాగా కుదిరి ఆ పని నేర్చుకుంటూనే బాపట్ల, నాదెండ్ల గ్రామాల్లోగల కవిపండితులతో పరిచయం పెంచుకొని సంస్కృతాంధ్రభాషా జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నారు. కొంతకాలం పత్తిపాడు వీధిబడిలో రమణాచార్యులు, వీరిసోదరుడు శేషాచార్యులు తక్కెళ్ళ పాడు వీధిబడిలో ఉపాధ్యాయులుగా పనిచేశారు.

ఆ రోజుల్లో అనగా క్రీ.శ. 1910 ప్రాంతంలో చింతలపాడులో శతావధానులైన కొప్పవరపు సోదరులు ఆశు కవిత్వ సభను నిర్వహించారు. ఆ సభలో దూపాటి శేషాచార్యులు, రమణాచార్యులు తమ కవిత్వ ప్రతిభను ప్రదర్శించటంతో కొప్పవరపు సోదరులు వీరికి 'శేషాద్రిరమణ'కవులని నామకరణం చేశారు. ఆ తరువాత కొంతకాలానికి కొప్పవరపు కవుల సాంగత్యాన్ని వదిలి తిరుపతి వెంకటకవుల అనుయాయులుగా మారి నియోగి, వైదిక వివాదాల్లో తలదూర్చి ఉపాధ్యాయవృత్తికి స్వస్తి చెప్పి మాచర్లలో తొలిసారి అవధానం చేశారు.

క్రీ.శ 1912లో తమ బంధువుల కుమార్తె అయిన ఆండాళ్ళమ్మను మార్కాపురంలోని చెన్నకేశవుల ఆలయంలో రమణాచార్యులు వివాహం చేసుకున్నారు. వివాహానంతరం ఋణాలక్రింద వున్న ఆస్తి ఊడ్చిపెట్టుకు పోవటంతో ఉద్యోగాలు దొరకక జీవితం నడవటం కష్టమై క్రీ.శ. 1912

కుర్రా జితేంద్రబాబు, ఫోన్ : 9848882600

ఆగష్టులో మదరాసు సంచారార్థం వెళ్లి తిరిగి రెండునెలల తరువాత రమణాచార్యులు మాచెర్ల చేరారు. ఈ సోదరులిద్దరు ఒకసారి తెలంగాణా ప్రాంతానికి వచ్చి, నల్లగొండలో షబ్నవీసు నరసింహారావు సహకారంతో ఒక అవధానాన్ని, హైదరాబాదులో రెండు, కరీంనగరులో ఒకటి, హనుమకొండ, హుజూరాబాద్, భూదాన పోచంపల్లిలలో అవధానాలు చేసి కొంత డబ్బు సంపాదించారు.

ఆ కాలంలో గుంటూరులో అసిస్టెంటు కలెక్టరుగా వున్న జయంతి రామయ్య పంతులుగారిని రమణాచార్యులు దర్శించి తాను రచించిన 'అర్జున పరాభవము' లోని కొన్ని పద్యాలను వినిపించి, ఆశుకవిత్వాన్ని కూడా చెప్పగా వారు ఆంధ్రసాహిత్య పరిషత్తు పక్షాన నైజాం రాష్ట్రంలో పర్యటన చేసి శాసనాలను సేకరించవలసిందిగా కోరినారు. శేషాచార్యుల వారికి గుంటూరు జిల్లాలో శాసనాలు సేకరించే పని అప్పచెప్పినారు. రమణాచార్యులునకు రూ. 25/- అడ్వాన్సు, రూ. 20/- నెలజీతం రోజుకు 0-8-0 భత్యం, రైలుప్రయాణపు ఖర్చు మైలుకు 0-2-0 ఇస్తానని వాగ్దానము చేయటంతో తెలంగాణ ప్రవేశించి, ఎర్రుపాలెం చేరి, జమలాపురం వెంకటకిషన్‌రావు, మాడపాటి తిరుమలరావుల సహకారంతో వరంగల్లు, కరీంనగరు, నల్లగొండ జిల్లాలలో అనేక ప్రాచీన గ్రంథాలను, శాసనాలను సేకరించారు. వీరి పనికి సంతోషించి జయంతి రామయ్య పంతులు వేములవాడ భీమకవి నివాస స్థలచర్చ 'కవిజానాశ్రయము' పీఠిక వ్రాయటానికి అవసరమైన వివరాలు సేకరించమని వేములవాడకు వెళ్ళమని రమణాచార్యులకు పని పురమాయించారు.

వీరు వేములవాడకు వెళ్లకుండానే అక్కడికి వెళ్ళినట్లు, అది వేములవాడ భీమకవి నివాసంకాదని అక్కడ భీమేశ్వరాలయం లేదని నివేదిక పంపటంతో జయంతి రామయ్యపంతులు ఇతను అక్కడికి వెళ్లలేదని గమనించి మందలించడంతో క్షమాపణ కోరి ఈసారి వరంగల్లునుండి నడుచుకుంటూ రమణాచార్యులు వేములవాడ వెళ్లి వివరాలు సేకరించి జయంతిరామయ్య పంతులుకు అందించారు. ఆ సందర్భంలోనే పోతన వరంగల్లు దగ్గరి బమ్మెర గ్రామస్థుడని ఆధారాలు సేకరించి జయంతిరామయ్య పంతులుకు అందించడంతో పాటు, కడపలో జరిగిన ఆంధ్రసాహిత్య పరిషత్తు వార్షికోత్సవ సభలో ఈ ఆధారాలతో వ్యాసం కూడ చదివినారు.

1916లో ఒక సందర్భంలో జగ్గయ్యపేట దగ్గర గ్రామమైన మక్కపేట గ్రామంలో ఒక వైష్ణవుని ఇంట రమణాచార్యులు దిగి భోజనాది కార్యక్రమాలను ముగించుకొన్నారు. ఆ సమయంలో ఇంటి యజమాని లేడు. ఇంటి యజమాని తరువాత వచ్చి తన భార్య తన ఇష్టం లేకుండా సంపాదించుకొన్న అల్లునిగా రమణాచార్యులను భావించి కొంత గోల చెయ్యటం జరుగగా ఆ గ్రామస్థులు కొందరు అతని మాట నమ్మి వివాదం చేసినారు. ఎలాగో బయటపడి జగ్గయ్యపేట చేరి ఆ తరువాత కృష్ణాపత్రికలో "నేనా, అల్లుఁడనా"? అనువ్యాసం కూడ ప్రకటించారు.

రమణాచార్యులు గంపలగూడెం కుమారరాజాతో పరిచయం పెంచుకొని రూ.30/-లు వేతనం మీద వారి సంస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా చేరి వారి పుస్తకాలు సంస్కరించుటకు ఒప్పుకొని 'పాదుషా పరాభవం', 'యౌవన నిగర్హణము', 'గోషావ్యాసఖండనము', 'చాటుపద్యాలు' పరిష్కరించారు. వారిపేరుతో కొన్ని వ్యాసాలను కూడా రచించారు. కృష్ణరాయ గ్రంథమాలను స్థాపించినప్పటికి ఆ తరువాత 'పాపారాయ నిర్యాణము' అన్న నాటక రచనతో కొంత వివాదము ఏర్పడి కుమారరాజా వద్దనుంచి తప్పుకున్నారు. రమణాచార్యులు తిరువూరులో ఒక అవధానాన్ని నిర్వహించినారు. చిత్రాడ జమీందారు చెలికాని లచ్చారావు నిర్వహించిన ఆంధ్రపరిశోధనా మండలి వార్షికోత్సవ సభలో నిజాం రాష్ట్రకవుల గురించి వ్యాసం చదివినారు.

గంపలగూడెం సంస్థానం వదిలివేసిన తరువాత 1921లో బెజవాడలో గ్రంథాలయప్రెస్సులో పనిచేస్తూ తన రచనలైన 1. పాపరాయనిర్యాణము (1921) చారిత్రక నాటకం, 2. వసుంధర (1922) చారిత్రక నవల, 3. ఆంధ్రమంత్రులు (1923) రచనలను ఈ ప్రెస్సులో ముద్రించుకొన్నారు.

1. 'ప్రణయిని' (ఖండకావ్యం), 2. 'ఋతుసంహారం', (ఆంధ్రీకరణం), 3. 'సర్వలోకేశ్వర శతకం', 4.'విక్రమోర్వశీయం' పద్యకావం మొదలైన గ్రంథాలను రచించారు. మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్రరావులను కలిసి ఛాదర్‌ఘాట్ హైస్కూలు, మహబూబ్ కాలేజీలలో ఉద్యోగ ప్రయత్నం చేయగా ఫలించలేదు.

నందిగామ బోర్డు హైస్కూలులో ప్రధాన ఆంధ్రోపాధ్యాయ పదవిని, బెజవాడలోని తుర్లపాటి వెంకటేశ్వరరావు సహకారంతో సంపాదించారు. నందిగామలో ఉద్యోగం చేస్తున్న కాలంలో తనుసేకరించిన 250 తాళపత్ర గ్రంథాలను పిఠాపురం రాజావారికి ఇచ్చివేశాడు. వారు వరంగల్ జిల్లా రామప్ప గుడిలోగల శాసనప్రతి తెచ్చుటకు రూ. 50/-లు ఇచ్చినారు. అదే శాసనప్రతిని సంపాదించి ఇవ్వమని కొల్లాపూరు రాజా రూ.50/-లు, మునగాల సంస్థాన దివాన్ కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు కూడా ఆ శాసనప్రతిని సేకరించుటకు రూ.20/-లు ఇచ్చారు. వేంకట రమణాచార్యులు వారి బావమరిది సింగరాచార్యులను వెంటబెట్టుకొని రామప్ప శాసనప్రతిని సంపాదించటంతో పాటు, నల్లగొండ జిల్లాలోని కొలనుపాకలో గల కొన్ని శాసనముల ప్రతులను కూడా సేకరించారు.

నందిగామ బోర్డు హైస్కూలులో తొమ్మిది సంవత్సరములు ఉపాధ్యాయునిగా రమణాచార్యులు పనిచేశారు. ఆ సమయంలో 'పోతరాజు వేమన' అను చిన్న పుస్తకాన్ని ప్రచురించారు. నందిగామలో ఉన్న కాలంలోనే ఆంధ్రభారతి, అభ్యుదయ, నీలగిరి, కళ, విద్యార్థి, కృష్ణాపత్రిక, ప్రబుద్ధ ఆంధ్ర, గృహలక్ష్మి, శారద లాంటి పత్రికలకు అనేక వ్యాసాలు రచించారు. ఆ కాలంలోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు వరంగల్లు జిల్లాలో ప్రాచీన గ్రంథాలను సంపాదించుటకు నెలకు రూ.100/- వేతనం చొప్పున రమణాచార్యులను నియమించి ఇచ్చారు. మద్రాసులోని వావిళ్ళ వారి సంస్థకు అనేక కావ్య ప్రబంధాలు పరిష్కరించి పీఠికలు రచించి ఇచ్చారు. క్రీ.శ. 1923లో 'నీలగిరి' పత్రికా సంపాదకులు షబ్నవీసు నరసింహారావుతో వున్న మైత్రిని పురస్కరించుకొని ఆయన భార్య జానకీబాయి మృతి సందర్భంగా ఉదయలక్ష్మి అను స్మృతి కావ్యాన్ని కూడా రచించారు. ఈ కావ్యంలో 1 నుంచి 107 పద్యాల్లో జానకీబాయి బాల్యం, నిర్యాణము, జీవిత చరిత్రము రచించబడింది. కావ్యం చివరలో 'శాంతి పంచకం' అను పేరుతో అయిదు పద్యాలను రచించారు. ఈ గ్రంథములో

> **"రమణిగాత్రంబు పంచభూతములఁ గలిసె**
> **సాధ్వి శీలంబు భాషతో సంగమించె**
> **భావవీధిని జానకీబాయి గలదు"**
>
> (ఉదయలక్ష్మి - 95వ పద్యం)

జానకీబాయి ఫోటొకింద పై పద్యాన్ని పేర్కొన్నారు.

'నిజాంరాష్ట్రప్రశంస' అను కావ్యాన్ని 1926లో రమణాచార్యులు ప్రచురించారు. 1920 ప్రాంతంలో నీలగిరి పత్రికలో ఐదు పద్యాలు, నిజాంరాష్ట్రాన్ని ప్రశంసిస్తూ రచించగా అవి ప్రఖ్యాతి పొందినవి. దానితో మరొక ఇరవై పద్యాలు వ్రాసి పై గ్రంథాన్ని ప్రచురించారు. ఇది చారిత్రక ఖండకావ్యము. ఈ గ్రంథానికి చరిత్రాచార్యులు సిరువూరి హనుమంతరావు పరిచయం రచించారు.

వావిళ్ళ ప్రచురణ సంస్థకు 1. వేమన పద్యాలకు తాత్పర్యం దిద్ది వ్రాయుట, పీఠిక 2. వసుచరిత్రమునకు పీఠిక, కొత్త వ్యాఖ్య 3. సీతారామాంజనేయం పీఠిక 4. విష్ణుపురాణం పీఠిక 5. సాముద్రిక శాస్త్రం పీఠిక తాత్పర్యం 6. మేదిని, హారావళి, ఏకాక్షర నిఘంటువు, విశ్వనిఘంటువు, అమరశేషము మొదలైన గ్రంథాలకు అర్థాలు వ్రాయుట 7. మనుచరిత్ర వ్యాఖ్యానము 8. భాగవతమునకు పీఠిక 9. కవిరాజమనోరంజనమునకు పీఠిక 10. మార్కండేయ పురాణం పీఠిక 11. కేతన దశకుమార చరిత్రకు పీఠిక 12. హరివంశము పీఠిక, పాఠాంతరముల శుద్ధి మొదలైన పనులు చేసిపెట్టారు. వెంకట్రామా అండ్ కో వారికి వెంకట రమణాచార్యులు రచించిన పుస్తకములు: 1. ఆంధ్రవీరులు, (రెండు భాగాలు) 2. ఇతిహాస మంజరి 3. భక్తమంజరి 4. పురాణకళామంజరి 5. నీతికథలు 6. వ్యాకరణం (మూడుభాగాలు) 7. రామాయణ కథలు 8. భక్తవత్సల శతకం 9. వ్యాకరణ సర్వస్వం 10. కుశలవులు 11. ఆంధ్రవాచికముల సంస్కరణ 12. IV, V ఫారముల సెలక్షన్ 13. పద్యవాచకములు 1 నుండి 5 తరగతులు 14. భాగవత సార ముక్తావళి దిద్దుట 15. భారత సార ముక్తావళిని దిద్దుట 16. కొండపల్లి ముట్టడి మొదలయిన సాహితీ పరిశ్రమను రమణాచార్యులు చేసినారు.

దోమకొండ సంస్థానాధీశుల కోరికపై 'రెడ్డికుల నిర్ణయ చంద్రిక' అను గ్రంథాన్ని రచించినారు. దాన్ని వేంకటకృష్ణకవి అనునతడు తాను పైగ్రంథాన్ని రచించినట్లుగా సంస్థానాధీశులకు తెలిపి తన పేరున ప్రచురించినాడు. ఈ విషయాన్ని శ్రీకృష్ణ దేవరాయాంధ్రభాషానిలయ రజతోత్సవ సభలలో ప్రసంగించటానికి వచ్చిన శ్రీ కావ్యకంఠగణపతిమునికి తెలిపి తరువాతి ముద్రణలో వేంకటరమణాచార్యులు తమ పేరు పునర్ముద్రణలో వేయించుకొన్నారు. హనుమకొండ నందలి రాజరాజ నరేంద్రభాషానిలయ వార్షికోత్సవ సభకు

వచ్చినపుడు మాదిరాజు రామకోటేశ్వరరావు సలహా, సహాయాలతో హనుమకొండలో 23 జూన్, 1930లో ఉపాధ్యాయులుగా ప్రవేశించినారు. హనుమకొండలో ఉండగా 'విచిత్ర వివాహము', 'చంద్రలేఖ', 'సుశీల' అను నాటికలను విద్యార్థులకొరకు రచించినారు. 1938 జూన్ ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌కు బదిలీఅయినారు.

లక్ష్మణరాయపరిశోధకమండలి పక్షాన తెలంగాణా అంతా తిరిగి శాసనాలను సేకరించారు. మధిర, సూర్యాపేట, జోగిపేట, ఖమ్మంమెట్టు, షాద్‌నగర్‌లలో జరిగిన ఆంధ్రమహాసభలలో, వారు నిర్వహించిన కార్యక్రమాలలో వెంకటరమణాచార్యులు వక్తగా అనేక ఉన్యాసాలు చేశారు. ఆదిలాబాదునందలి శ్రీకృష్ణ దేవరాయాంధ్రభాషానిలయంలో మూడుసార్లు, బాలసరస్వతీ గ్రంథాలయంలో ప్రధాన వక్తగా, వరంగల్ గ్రంథాలయ వార్షికోత్సవంలో ముఖ్య ఉపన్యాసకునిగా, హనుమకొండ రజతోత్సవ సభలలోను, కాకతీయ సభలలోను, నిజాం కాలేజి చర్చా సంఘంలోను ఉపన్యసించారు. వెంకటరమణాచార్యులవారు కాకతీయ చరిత్రగురించి ఆంధ్రపత్రికలో రచించిన వ్యాసాన్ని కోకిల సీతారామశర్మ గ్రంథరూపంగా ముద్రించారు. తూము రంగయ్య, వరదరాజులు గారలు వారి తండ్రిచేత రచించబడిన 'ఆంధ్రపద నిదానము' అను గ్రంథాన్ని వెంకటరమణాచార్యులు ప్రచురించారు. భక్తవత్సల శతకం, సర్వలోకేశ్వర శతకం, బాలనీతి శతకం, స్త్రీ బోధ శతకం, సూర్య శతకంలను రచించారు.

ఆంధ్రదేశ పురావైభవము, కాకతీయ రాజ్య వైభవములపై అనేక కవితలను దూపాటి వారు రచించారు. అవి: ఆంధ్రనగరం, (1924 జూన్, శారద పత్రిక, సం. 2 -1, పుట-447); మాతృవందనం (1927 జనవరి, భారతి, సం. 4-1, పుటలు 119, 120); ఆంధ్రసామ్రాజ్యము (1928 గోల్కొండ పత్రిక, పుటలు 9-13); ఆంధ్రభూమి (1933 ఆగష్టు, ఆంధ్రభూమి, సం.1-4, పుట - 12); ఆంధ్రభూమి (1935 డిసెంబరు 5, గోల్కొండ పత్రిక, పుట-2);




మిసిమి
మాసపత్రిక
చందాదారులుగా చేర్పించండి

**బహుమతి**
పొందండి!

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు *మిసిమి* ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా ₹240 పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

**(మీరు అయిదు సంవత్సరాల చందా కట్టి *మిసిమి* 12 నెలల (2010 జూన్ - 2011 మే) అందమైన బైండు ఒకటి, 6 నెలల (2011 జూలై - 2011 డిసెంబరు) బైండు ఒకటి ఉచితంగా పొందండి)**



ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 3. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 4. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 5. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 6. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 6. | నాలో నేను (కవితలు) " " | 60.00 |
| 7. | సిద్ధార్థ " " | 50.00 |

మీ చందా *మిసిమి* పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

మిసిమి
మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi

ఆంధ్రపతాకం (1938 జనవరి, భారతి, సం. 15-1, పుట-2); తెలంగాణ (1938 ఆంధ్రపత్రిక, ఉగాది సంచిక, పుట- 46 - 47); తెలుగు తల్లి (1939 డిసెంబరు, ఆంధ్రభూమి, సం.8-5, పుట - 179); కాకతీయాంధ్రలక్ష్మి (1924 సెప్టెంబరు, భారతి, సం.1-7, పుట -32); ఓరుగల్లు కోట (1926 అక్టోబరు, భారతి, సం. 3-11, కవరుపేజి); ప్రతాపరుద్ర చక్రవర్తి (1928 అక్టోబరు భారతి, సం.5-10, పుట-551-555); కాకతీయ ప్రోలరాజు (1932 మార్చి, భారతి, సం. 9-3, పుట - 451); రాణి రుద్రమదేవి (1933 మార్చి, గృహలక్ష్మి, సం.6-1, పుట - 15); ఓరుగంటి శిథిలములు- శోభనముల బావి (1935, ఆంధ్రపత్రిక, పుటలు 207-208); ఓరుగల్లు (1931 జూలై 25, గోల్కొండ పత్రిక, సం. 10-23, పుట - 2); విస్మృతనగరం, (1935 ఆంధ్రభూమి. సం.3-10, పుట -857); శిథిల నగరములు (1952 నవంబరు 15, సుజాత, సం. 3-4, పుట -1); దేశభక్తి పూరితమైన ఈ కవితలను ఒక సంపుటిగా ప్రచురించిన ఎంతో ఉపయుక్తం కాగలదు.

తన మిత్రులు ఆత్మీయులు చనిపోయినప్పుడు అనేక స్మృతి కవితలను రచించారు. అవి: చామర్తి, రాజశేఖర రాయస్మృతి (ఆంధ్రపత్రిక, దుందుభి ఉగాది సంచిక); అశ్రు భిక్ష (సాహితి 1923); కావ్యనిధి చెలికాని లచ్చారాయస్మృతి (1924 జనవరి, భారతి); సంతాప పద్యములు (నీలగిరి పత్రికా సంపాదకులు, షబ్నవీసు వేంకటనరసింహారావు మరణించినపుడు రచించినవి, 1929 డిసెంబరు 7, గోల్కొండ పత్రిక, సం.4-57, పుట-4);

**"రసవంతముగఁ గృతి వ్రాయుడంకితమేను**
**కొనెదనటంచు వాక్రుచ్చినావు**
**మిమ్ముఁ బోషింతు మామిళ్ళ గూడెమునకు**
**రండని జాబులు వ్రాసినావు**
**పరిశోధనంబున బడలిన మముఁ జూచి**
**మించువేడుక కౌగిలించినావు**
**నేను స్వతంత్రుండనైనచో మిము వీడి**
**పరితపింతునె యంచుఁ బల్కినావు**
**దినమునకు నొక్కమాఱు మీ తెనుగుకైత**
**చెవిని పడకనైపలేనని చెప్పినావు**
**అకట యా యైహికంబు లెట్లుడిచి పరము**
**చేరితివి షబ్నవీసు నృసింహరాయ"**

(3వ పద్యం)

ఈ పద్యం వల్ల శేషాద్రి రమణకవులకు షబ్నవీసు వేంకటనరసింహారావుకు మధ్య గల అనుబంధాన్ని గమనించవచ్చు.

విషాదగీతములు, (1938 మే భారతి, కాశీనాథుని నాగేశ్వరరావు స్మృత్యర్థం రచించింది); అన్నపూర్ణాదేవి ప్రశంస (మాగంటి బాపినీడు సతీమణి అన్నపూర్ణాదేవి (1927 అక్టోబరు 10న మరణించినపుడు రచించిన స్మృతి (1928 ఆంధ్రపత్రిక) మొదలయినవి.

దూపాటి వారు 5000 పేజీలు పద్య సారస్వతముతో, పదాల సంఖ్యతో, చారిత్రక నవలలతో పాటు వందలాది చారిత్రక పరిశోధనా వ్యాసాలను, ఆనాటి వివిధ పత్రికలలో ప్రచురించారు. ఈ సాహితీ సంపదను పరిశోధన సంస్థలు గాని, విశ్వవిద్యాలయాలు గాని సంపుటాలుగా ప్రచురిస్తే చరిత్ర పునర్నిర్మాణంలో ఉపయోగపడగలవు. ఎన్నో వ్యాసాలు క్రిందటి శతాబ్ది తొలి దశలో చరిత్ర నిర్మాణ క్రమములో దూపాటి వెంకటరమణాచార్యులు స్వయంగా విస్తృతంగా తెలంగాణ అంతటా పర్యటించి సేకరించిన ఎన్నో చారిత్రక విశేషాల సమాహారం.

దూపాటి వేంకటరమణాచార్యులవారు 1942నుండి మధుమేహం వ్యాధికి గురై అనారోగ్యము పాలవుతూ కూడ రచనా వ్యాసంగాన్ని కొనసాగించారు. 1950లో ఆంధ్రప్రదేశ్ పురావస్తుశాఖలో కొంతకాలం శాసన పరిశోధకులుగా ఉద్యోగించారు. 1955 నుంచి వ్యవసాయం చేయించు కుంటూ కరింనగర్ జిల్లాలోని కొంపల్లి గ్రామంలో జీవితాన్ని గడుపుతూ 1961 మార్చి 2న సాయంకాలం గం॥ 4.30॥లకు మరణించారు.

1940లో వారి స్వీయచరిత్రను రచించటం ప్రారంభించి అసంపూర్తిగానే వదిలివేశారు. కాకతీయవిశ్వవిద్యాలయ తెలుగువిభాగము పురావస్తు కేంద్రము 1987లో "దూపాటి వేంకటరమణాచార్యులు జీవితచరిత్రము" పేరున వారి స్వీయచరిత్రను ప్రచురించి మహోపకారం చేశారు. అలాగే రమణాచార్యులవారి అనేకానేక రచనలను ఏ విశ్వవిద్యాలయ మైనా సంపుటాలుగా ప్రచురించిన తెలుగువారికి, భవిష్యత్తరాలకు ఎంతో ఉపయుక్తం.

# అట్టమీది బొమ్మలు

**ముఖచిత్రం :** రాజా రవివర్మ : వివరాలు అక్టోబరు,2006 ***మిసిమి*** చూడండి.

**అట్టమీది బొమ్మలు :** రెండు, మూడు.

**భ**రాఖత్ గూడెం రెండు వేలమంది కంటే తక్కువ జనాభాని కలిగిన ఒక చిన్న గ్రామం. అందులో గవర్నమెంట్ ప్రైమరీ స్కూలులో సైన్సు, సోషల్ చెప్పే ఒక స్కూలు టీచర్ గడ్డం కాంతయ్య. పిల్లలకు పాఠాలు చెప్పటం వృత్తయితే బొమ్మల పటాలు వేయటం ప్రవృత్తి. గాంధీ నెహ్రూ, బోసు, బుద్ధుడు చిత్రాలను కాగితంపై పెన్సిల్‌తో వేసి దానికి తగినంత షేడ్ ఇచ్చేవాడు. చూపరులకవి తెలుపు నలుపులలో తీసిన ఛాయాచిత్రాల్లా వుండేవి. ఆయన అసలు వూరు విజయవాడ. ఆయన చిన్నతనమంతా అక్కడే గడిచింది.

చిత్రకారుడు కావాలన్నది ఆయన అభిలాష. అయితే విజయవాడలో Cutout paintersను చూశాడు వాళ్ళలో చాలామంది మండుటెండలో మాడుతూ, చిరిగిన బనీన్లతో, చొక్కాలతో మాటి మాటికి టీ తాగుతూ రాత్రి వేళల్లో బికారిలా తిరగటం గమనించి తన ఆశలకు కళ్ళెం వేసుకున్నాడు. Painter గా మాత్రం బ్రతకకూడదనుకున్నాడు. Paintingను వృత్తిగా కాక ప్రవృత్తిగా మార్చుకున్నాడు. తండ్రి వేసిన చిత్రాలు ఒకసారి శ్రావణ్ కుమార్ కంట పడ్డాయి. అంతే తానుకూడా అలా కావాలనుకున్నాడు. తనకు నచ్చిన వాటిని కాగితంపై వేసి తండ్రికి చూపేవాడు. ఆయన వాటిని సరిదిద్దేవాడు. సలహాలిచ్చే వాడు. చిత్రకళా మజిలీ – 1972లో జన్మించిన గడ్డం కాంతయ్య శ్రావణ్ కుమార్ (తండ్రి తన పేరును కొడుకు పేరుతో కలుపుకున్నాడు).



చిత్రకళంటే తండ్రీకొడుకులకు ప్రాణమే. కానీ అదే జీవిక కాకూడదని భావించి శ్రావణ్‌ను ITI చదివించాడు. అప్పుడే అక్కడే శ్రావణ్ కొక గురువు దొరికాడు. ఆయన పేరు రామచంద్ర. పేరు మోసిన పోర్ట్రెయిట్ చిత్రకారుడు. ఆయన వేసిన చిత్రాలు ఆ జిల్లాలో చాల ప్రసిద్ధి పొందాయి. ఆయన వద్దనే శ్రావణ్ గీతలను, రంగులను సరిదిద్దుకున్నాడు. రామచంద్ర కొంతకాలం బొంబాయిలోని జె.జె. స్కూల్‌లో చిత్రకళను అభ్యసించి కొన్ని కారణాలవల్ల చదువును మధ్యలో ఆపి సూర్యాపేట చేరుకొని చిత్రకళను వృత్తిగా తీసుకొని పేరు సంపాదించుకొన్నాడు. ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో BFA డిగ్రీ 1996లో పొందగలిగాడు. అప్పట్లో అక్కడ లెక్చరర్‌గా పనిచేసిన అంజనీ రెడ్డి ప్రోత్సాహం మరువలేనిదంటాడు. పై చదువులకు బరోడా కాని, అహ్మదాబాద్ కానీ వెళ్ళాలనుకోలేదు. దీనికో కారణం ఉంది. శ్రావణ్ ఎనిమిదవ తరగతి చదువుతున్నపుడే అతనికి పోస్టర్ డిజైన్ పై మక్కువ ఏర్పడింది. మరీ ముఖ్యంగా ఈశ్వర్, భాస్కర్, సురేష్‌లు చేసిన పబ్లిసిటీ డిజైనులు అతన్ని ఎక్కువగా ఆకర్షించాయి. ఇప్పుడు ఏం చేయాలి? అనే ప్రశ్న తలెత్తింది. అప్పటికే పెళ్ళయింది. ఇద్దర బిడ్డల తండ్రయినాడు. వయసు 30కి చేరుకుంది. ఒక నెలపాటు ఆలోచించాడు. ఇంతలో బాపూ వద్ద నున్న కోడైరెక్టరు శ్రీనివాస్, బాపూ తన సినిమాలకు వేసుకున్న స్టోరీ బోర్డు (సినిమాను సంభాషణలతో పాటు బొమ్మలు వేయటం – అమరచిత్రకథలలోలాగ) ను చూపించాడు. Hollywood story board ను కూడా చూశాడు. స్టోరీ బోర్డు చిత్రకారునిగా పవన్ కళ్యాణ్ నిర్మించి, దర్శకత్వం వహించిన జానీ చిత్రానికి పనిచేశాడు. శ్రావణ్ వేసిన చిత్రాలను చూసి పవన్ కళ్యాణ్ చాలా సంతోషించేవాడు. ఆ కళను తనకు నేర్పమని కూడా అడిగేవాడు. కానీ సమయం, సందర్భం కలసి రాలేదు. ఆ తరువాత చిత్రసీమలో తనతో పరిచయముండి, తన ప్రతిభ తెలిసిన ఛాయా గ్రాహకుడైన ఎస్.కె. భూపతి ప్రముఖ దర్శకుడైన రాఘవేంద్రరావుకు పరిచయం చేశాడు. దాని ఫలితవే శ్రీరామదాసు. ఆ చిత్రానికి స్టోరీబోర్డు పనంతా శ్రావణే చేశాడు.

దర్శకేంద్రుడు శ్రావణ్‌ను ఆకాశానికెత్తి నంత పనిచేశాడు. అయినా శ్రావణ్‌లో ఏదో అసంతృప్తి, డైరెక్షన్ నేర్చుకోవాలనే కోరికతో ఇప్పుడు కథలు తయారు చేసుకొని, తగిన భూమికను ఏర్పరచుకోవటం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాడు. రామచరణ్ నటించిన రచ్చ ఇప్పటికి అతను చేసిన చివరి చిత్రం. ఆ చిత్రంలో పని 2011 మధ్యలోనే పూర్తికావటంతో తిరిగి పెయింటింగ్‌లపై దృష్టి పెట్టాడు. అతని చిత్రాలలో జానపద నేపథ్యమే కాదు, ఎంతో చేయితిరిగిన కళాకారునికి మాత్రమే సాధ్యమయ్యే సరళత ఉంది. చిత్రంలో కుంచె విన్యాసాలు, కుంచెనుంచి వచ్చిన రంగులు, నీటిబిందువుల్లా జాలువారటంతో నిశ్చలన చిత్రమా? లేక కదులుతున్న చిత్రమా అనే భ్రాంతిని కలిగిస్తుంది. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన వార్షిక పోటీలో అతని చిత్రం బంగారు పతకం గెలుచుకోవటం ఆశ్చర్యమనిపించదు. ఈ నెల రెండు, మూడు అట్టమీది బొమ్మలు శ్రావణ్ కుమార్ వేసినవే.

# రావు బహదూర్ మహదేవ్ విశ్వనాథ్ దురంధర్



**దీపాల వేళాయె** (నాల్గవ అట్ట) **చిత్రకారుడు:** రావు బహదూర్ మహదేవ్ విశ్వనాథ్ దురంధర్ 20వ శతాబ్దపు తొలి దశలో బొంబాయి కళా ప్రపంచంలో ఒక విస్ఫోటన కలిగించిన చిత్రకారుడు. రవివర్మ తరువాత 20 సంవత్సరాలకు పుట్టిన దురంధర్ రవివర్మకు వారసునిగా పేరు తెచ్చుకున్నాడు. వ్యక్తి చిత్రాలు, ప్రకృతి దృశ్యాలు, పోస్టర్లు, అట్టమీద బొమ్మలు, నలుపు–తెలుపుల రేఖా చిత్రాలు ఇలా చిత్రకళకు చెందిన అన్ని రంగాలలోనూ పేరు గాంచాడు.

కోల్హాపూర్ లోని ఒక ఉన్నత కుటుంబానికి చెందిన దురంధర్ బొంబాయిలో జన్మించినా చిన్నతనమంతా కోల్హాపూర్‌లోనే గడిచింది. బాల్యంలో స్కూలులో జరిగే డ్రాయింగ్ పోటీలో ఎప్పుడూ ముందుండేవాడు. అప్పుడే అబాలాల్ రహమాన్ అనే ప్రాంతీయ చిత్రకారుని ప్రకృతి చిత్రాలు అతనిపై ప్రగాఢ ముద్రవేశాయి. చిత్రకళలో ఆయనే ఇతని తొలిగురువు. 1890 బొంబాయిలోని ఆర్టిస్ట్‌ల ముఖ్యకేంద్రమైన జె.జె.స్కూల్‌లో విద్యార్థిగా చేరాడు.



విద్యార్థిగా ఉండగానే అద్వితీయ ప్రతిభను కనపరిచాడు. 1892 నాటికే నలుపు–తెలుపులో వేసిన స్కెచ్‌లు బహుమతి పొందటమే కాదు, స్కాలర్‌షిప్‌కు సహితం అర్హత సంపాదించాయి. విద్యార్థి దశలోనే 5 సార్లు పోటీలో బంగారు పతకం గెలుచుకున్నాడు. దురంధర్ పెన్సిల్ స్కెచ్‌లు, చార్‌కోల్ స్కెచ్‌లు, నూనెరంగు మాధ్యమంగా, నీటి రంగు మాధ్యమంగా వేసిన అన్ని ప్రక్రియలలోను తన ప్రతిభను చూపగలిగేవాడు.

అప్పటికీ రవివర్మ వేసిన పౌరాణిక చిత్రాలు కాశ్మీర్ నుండి కాన్యాకుమారి వరకూ ఆబాలగోపాలాన్ని ఆకర్షించి చిత్రకళపై ప్రజలలో ఒక క్రేజ్‌ను ఏర్పరిచింది. ఈ పూర్వ భూమిక దురంధర్‌కు చాలా సులువుగా చిత్రకళాప్రపంచంలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించడానికి దోహదం చేసింది. 1907లో రవివర్మ మరణానంతరం రవివర్మ శైలిలో చిత్రకళ వేసినవాళ్లలో దురంధర్‌దే పై చేయి.

భారతీయుల పండుగలు, పబ్బాలు, వివాహాది ఉత్సవాలు అన్నిటినీ అతను ఐరోపా వాస్తవ శైలిలో చిత్రించి అందరి మన్ననలను పొందాడు. భారత, రామాయణ, భాగవత, నలదమయంతి, రుబాయత్‌లు, హిందుస్థానీ సంగీత రాగాలు మొదలైన వాటిని కేన్వాస్‌పై సర్వాంగసుందరంగా చిత్రించాడు.

అతని చిత్రాలలో శివాజీ, కైకేయ లాంటివి అంతర్జాతీయ స్థాయికి ఏమాత్రం తీసిపోనటువంటివి.

1930 లండన్‌లో జరిగిన వెంబ్లే ప్రదర్శనలో అతని చిత్రకళ విదేశస్థులను సహితం మంత్రముగ్ధులను చేసింది.

ఢిల్లీలో ఉన్న ఇంపీరియల్ సెక్రటరేయట్‌లో అతని చేత మూడు చిత్రాలు (ఇవి మూరల్స్, నిజానికి ఇతనితోపాటు దామెర్ల రామారావు కూడ చిత్రాలు వేయడానికి ఎంపిక కాబడినా అకాల మృత్యువు వాత బడటంతో ఢిల్లీలో తెలుగువారి చిత్రకళా వెలుగు ప్రదర్శించే చారిత్రక అవకాశం తప్పి పోయింది) వేయించారు.

అతను వేసిన భారతీయ వివాహం అన్న చిత్రం ఇంగ్లండ్‌లో ప్రదర్శించబడినపుడు ఆ చిత్రాన్ని మేరీ మహారాణి కొనుగోలు చేసారు.

విద్యార్థి దశనుంచి జీవిత చివరి అధ్యాయం వరకు ఆయన ఎన్నో స్కెచ్‌లు వేసుకున్నారు. చనిపోయేనాటికి అవి వందకు పైగా పుస్తకాలయ్యాయి. తాను విద్యనభ్యసించిన జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్‌కు ఆయన 1910లో ప్రిన్సిపాల్‌గా నియమితులైనారు. 1930లో అదే కాలేజీకి డైరెక్టరుగా నియమితులైన మొట్టమొదటి భారతీయుడు దురంధరే. చిత్రకళపై మరాఠీ భాషలో అనేక వ్యాసాలు వ్రాసారు. తన సమకాలీన చిత్రకారులైన భాంస్లే, అహివాసి, ధూపేసివక్కర్ లాంటి మిత్రుల చిత్రకళను విశ్లేషిస్తూ రాసిన వ్యాసాలు నిత్య పఠనా గ్రంథాలు. ఎనభైయొక్క సంవత్సరాల నిండు జీవితం గడిపి రంగులలోకంలో లీనమయ్యాడు దురంధర్. మి

# నాన్న పోలికా?

*- వెలగా లక్ష్మి*

దైవం మనకిచ్చిన గొప్ప వరం పిల్లలు. పిల్లలు లేకపోతే జీవితానికి అర్థం లేదన్ని నూరు శాతం నిజం. అప్పటివరకు పూర్తిగా పరిణతి చెందని భార్యాభర్తలలో పిల్లల పుట్టుక గణనీయమైన మార్పు తీసుకు వస్తుంది. ఉదాహరణకు ఓర్పు, ఆర్థిక విషయాలలో జాగ్రత్త మొదలైనవి.

పిల్లల్ని ఎంతో బాధ్యతగా పెంచి యుక్త వయసులో వాళ్ళకి మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాం. కొందరిలో మన పిల్లలు బాగా చదువుకుని, ఉద్యోగంలో స్థిరపడ్డాక పెళ్ళి చేద్దాం అని ఉన్నా, ఇంట్లో పెద్దవాళ్ళు మనవడి / మనవరాలి పెళ్ళి చూడాలని ఉంది అనడం, మనం వారి మాట తీసెయ్యలేక తల ఊపడం మామూలే. ఇంక వివాహమైన నాలుగు నెలలు నిండగానే వాళ్ళ కడుపున ఒక నలుసు పుడితే చూడాలనుకోవడం సహజం. ఆడపిల్ల నెల తప్పిందనగానే ఇంట్లో సంబరం మొదలవుతుంది. ఎక్కడో దూరాన ఇద్దరే ఉన్నారు, ఏం వండుకుంటున్నారో ఏమిటో, బాగా తిను, బరువు పనులు చెయ్యకు – అని సలహాలు, ఊళ్ళో ఏ డాక్టర్ అయితే మెరుగు, ఏ నెలలో పుట్టింటికి తీసుకురావాలి లాంటి సంప్రదింపులు మొదలవుతాయి. పుట్టబోయే బిడ్డ ఆడా, మగా అనే ఉత్కంఠ భార్యాభర్తలతో పాటు అటు ఇటు తల్లిదండ్రులకు కూడా ఉంటుంది. నెలలు నిండి ప్రసవమయ్యాక, అయ్యో ఆడపిల్లా, వాళ్ళమ్మ సాలు వచ్చినట్లుంది లాంటి మాటలు తల్లికి చాలా బాధ కలిగిస్తాయి.

పాప అంతా వాళ్ళ తండ్రి పోలికే, ఆ కళ్ళు, ముక్కు జుట్టు చూడండి. ఆ బుగ్గ మీద సొట్ట మాత్రం వాళ్ళ అమ్మది వచ్చింది. ఇలాంటి వ్యాఖ్యలు మనం తరచు వింటూనే ఉంటాం. ఈ పోలికలకు కారణం తల్లి, తండ్రి నుండి సంక్రమించిన జన్యువులే (జీన్సు). ఇంతెందుకు పిల్లల ప్రవర్తన, రోగ నిరోధక శక్తి, తెలివితేటలు వంటి వాటికి కూడా చాలా వరకు తల్లిదండ్రుల ఇరువురి జన్యువులే కారణం. అయితే లింగ నిర్ధాలకు ఎవరు కారణం? ఇది తెలుసుకోబోయే ముందు కీటకాల్లో, సరీసృపాలలో, పక్షులు మొదలైన వాటిల్లో లింగ నిర్ధారణ ఎలా జరుగుతుందో చూద్దాం. కొన్ని కీటకాలలో లింగ నిర్ధారణ మగ కీటకం మీద ఆధారపడి ఉంటుంది. సీతాకోకచిలుక, కప్పలు, పక్షులలో లింగ నిర్ధారణ ఆడవాటి మీద ఆధారపడి ఉంటుంది. సరీసృపాలలో (అంటే బల్లులు, పాములు, మొసళ్ళు, తాబేళ్ళు మొదలైనవి) లింగ నిర్ధారణ రెండు జరగవచ్చు. కొన్ని రకాల తాబేళ్ళు, బల్లులలో లింగ నిర్ధారణ మగవాటి మీద, పాములలో ఆడవాటి మీద ఆధారపడి ఉంటుంది. లింగ నిర్ధారణ క్రోమోజోముల్లో తేడా వలన వస్తుంది. ఇది కాక సరీసృపాలలో రెండవ రకం లింగ నిర్ధారణ ఉష్ణోగ్రత మీద ఆధారపడి ఉంటుంది. కొన్ని సముద్రంలో ఉండే తాబేళ్ళలో గుడ్లు $28^0$ C కన్నా తక్కువ ఉష్ణోగ్రతలో పొదగబడి ఉంటే ఆడపిల్లలు బయటకు వస్తాయి. మొసళ్ళలో ఎక్కువ లేదా తక్కువ ఉష్ణోగ్రతలో గుడ్లు పొదగబడి ఉంటే ఆడపిల్లలు, ఉష్ణోగ్రత మధ్యస్థంగా ఉంటే మగపిల్లలు బయటకు వస్తాయి.

ఇప్పుడు క్షీరద జాతికి చెందిన మనిషి విషయంలో లింగ నిర్ధారణ ఎలా జరుగుతుందో చూద్దాం. మానవుని శరీరంలో కొన్ని కోట్ల కణాలు ఉంటాయి. ఒక్కొక్కకణంలో 23 జతలు అంటే 46 క్రోమోజోములు ఉంటాయి. డి.ఎన్.ఏ. (డీఆక్సీ రైబోన్యూక్లిక్ యాసిడ్), ప్రొటీన్లతో ఏర్పడినదే క్రోమోజోము. అంటే మనకు 46 డిఎన్ఏ మాలిక్యూల్స్ ఉంటాయి. వీటి మీదే జన్యువులన్నీ ఉంటాయి. మన ఎత్తు, రంగు, అందం మొదలైనవి వీటి మీదే ఆధారపడి ఉంటాయి. పిల్లలకు తల్లిదండ్రుల పోలిక, లక్షణాలు మొదలైనవి కనిపించడానికి కారణం వారి నుండి పిల్లలకు సరఫరా అయిన క్రోమోజోములే. ఈ 46 జతల క్రోమోజోములలో ఒక జతను సెక్స్ క్రోమోజోములు అంటారు 'X క్రోమోజోము, Y క్రోమోజోము). ఒక వ్యక్తి ఆడా, మగా అని నిర్ధారించేది ఈ సెక్స్ క్రోమోజోములే. ఆడవారిలో అయితే రెండు X క్రోమోజోములు, మగవారిలో అయితే ఒక X, ఒక Y క్రోమోజోము ఉంటాయి. బీజ కణాలలో క్రోమోజోముల సంఖ్య 23 మాత్రమే ఉంటుంది. ఆడవాళ్ళ అండాలు అన్నింటిలోనూ మొత్తం 23 క్రోమోజోములు, అందులో ఒకటి X క్రోమోజోము అయి ఉంటాయి. మగవారి శుక్ర కణాలలో కూడా 23 క్రోమోజోములే ఉన్నా, సెక్స్ క్రోమోజోము మాత్రం X లేదా Y అయి ఉంటాయి. ఇంకా విశదంగా చెప్పాలంటే కొన్ని శుక్ర కణాలు X, మరి కొన్ని శుక్ర కణాలు Y క్రోమోజోము కలిగి ఉంటాయి.

---

డాక్టరు వెలగా లక్ష్మి ఫోన్ : 94901 33021

స్త్రీ, పురుషులలో క్రోమోజోముల సంఖ్యను ఈ క్రింది విధంగా రాస్తారు.

**స్త్రీ – 46,** X X , **పురుషుడు – 46,** Y Y

భార్యాభర్తలు సెక్స్‌లో పాల్గొన్నప్పుడు అండాన్ని X క్రోమోజోము ఉన్న శుక్రకణం ఫలదీకరిస్తే ఆడబిడ్డ, Y క్రోమోజోము ఉన్న శుక్రకణం ఫలదీకరిస్తే మగబిడ్డ పుడతాడు.

అండం X + X శుక్రకణం = ఆడ 46, X X
అండం X + Y శుక్రకణం = మగ 46, X Y

బిడ్డ ఆడపిల్లగాను లేదా మగపిల్లవాడిగాను తగిన మార్పులు చెందుతూ ఎదగడానికి కొన్ని జన్యువులు కారణమైనప్పటికీ, లింగ నిర్ధారణకు ముఖ్యంగా కావలసినది Y క్రోమోజోము మీద ఉండే SRY అనే జన్యువు. కాబట్టి పుట్టే బిడ్డ ఆడా, మగా అన్నది నిర్ధారించే Y క్రోమోజోము ఆడవారిలో లేనే లేదు. కాబట్టి ఆడపిల్ల పుట్టడానికి తల్లి ఎంత మాత్రం బాధ్యురాలు కాదు. లింగ నిర్ధారణపై తండ్రికి నియంత్రణ ఉండకపోవచ్చు కానీ అతని బీజకణాలలో ఉండే Y క్రోమోజోము మీదే లింగ నిర్ధారణ ఆధారపడి ఉంది. మనం వార్తా పత్రికలలో అడపాదడప చూస్తూనే ఉంటాం – మూడు సార్లూ ఆడపిల్లనే కన్నది అని కోడలిని చిన్న చూపు చూడటం, వంశోద్ధారకుడు కావాలి అని – కొడుకుకి రెండవ పెళ్ళి చెయ్యడం, భార్యకు విడాకులివ్వడం. ఇలా చెయ్యని నేరానికి తల్లులను శిక్షించడం ఎంతవరకు సమంజసం? ఇప్పటికీ మన దేశంలో మగ పిల్లల మీద మోజు ఉండటం, సంతానాన్ని ఒకరికే పరిమితం చేసుకుంటూ ఆ ఒకరు మగ పిల్లవాడు అయితే బాగుండు అనుకునేవారు చాలా మంది ఉండటం బాధాకరమైన విషయం. కొన్ని ఇతర దేశాలలో ఆడపిల్లల సంఖ్య 1000 కన్నా తక్కువగా ఉన్నా ఆ సంఖ్య మెరుగుపడుతూ వస్తుంది. మన దేశంలో మాత్రం ఇంకా తగ్గుతుంది. (2001 లో 927 మంది 6 సం.ల లోపు ఆడపిల్లలు ఉంటే 2011 లో 914 మందే ఉన్నారు).

దీనికి గల కారణాలలో ఒకటి ఇంకా కొన్ని రాష్ట్రాలలో అల్ట్రాసౌండ్ ద్వారా నాలుగు నెలల లోపే బిడ్డ ఆడా, మగా తెలుసుకుని ఆడబిడ్డ అయితే అబార్షన్ చేయించుకోవడం. ఇవి ఉత్తరాన ఉన్న పంజాబ్, హర్యానా, చండీగడ్ లాంటి రాష్ట్రాలలో ఒకప్పుడు ఎక్కువగా జరిగేవి. ఇప్పటికీ దిన పత్రికల్లోల్ల చెత్త కుండీలలో బయటపడ్డ ఆడ శిశువుల గురించి మనం చదువుతూనే ఉన్నాం.

లింగ నిర్ధారణ పరీక్షలు కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే చేస్తారు. ఉదాహరణకు పుట్టబోయే బిడ్డ మగబిడ్డ అయితే జన్యు సంబంధమైన వ్యాధి వస్తుంది. (కొన్ని రకాల జన్యు సంబంధిత వ్యాధులు ఉన్న కుటుంబాలలో మాత్రమే) కనుక పరీక్షించి మగబిడ్డ అయితే అబార్షన్ చేయించుకోమని చెబుతారు. స్కానింగ్ బిడ్డ అవయవాలన్నీ బాగున్నాయో లేదా నిర్ధారించుకోవడానికి వాడాలి తప్ప లింగ నిర్ధారణకు చేయరాదు. దీన్ని కొంతమంది దుర్వినియోగం చేసి ఏ వ్యాధులు లేకపోయినా పరీక్ష చేయించి ఆడ బిడ్డ అయితే అబార్షన్ చేయించటం వల్ల, ప్రభుత్వం దీనిని నిరోధించటానికి 196లో ఒక చట్టాన్ని అమలులోకి తెచ్చింది. 2003లో దానికి కొన్ని సవరణలు చేసి ఇంకా కఠినతరం చేసింది. ఇది కాక ఒకే ఆడపిల్ల ఉన్నవారిని ప్రోత్సహించడానికి కొన్ని పథకాలను ప్రవేశపెట్టింది. అయినా 2011లో మన జనాభా లెక్కలలో చూస్తే మన దేశంలో ఆడపిల్లల సంఖ్య తక్కువగానే ఉంది. ఒక దేశపు సామాజిక స్థితి ఆ దేశపు ఆడవారి హోదా మీద ఆధారపడి ఉంటుంది. ఆడపిల్లల సంఖ్య తగ్గితే సమాజంలో చాలా సమస్యలు ఎదురవ్వొచ్చు. వధువుల కొరత ఏర్పడటం, దాని వలన ఒక వర్గంలో అబ్బాయి వేరే వర్గంలోని అమ్మాయిని, లేదా వేరే దేశంలోని అమ్మాయిని చేసుకోవలసి రావడం, నేరాలు పెరగడం, ఆస్తి, ఉద్యోగం, అందం లేని అబ్బాయిలకు పెళ్ళి అయ్యే అవకాశం తగ్గడం మొదలైనవి. ఈ సందర్భంలో ఇంకో విషయం కూడా ఇక్కడ ప్రస్తావించటం ఎంతైనా అవసరం. భార్యాభర్తలకు పిల్లలు కలుగపోతే, లోపం ఎవరిదైనప్పటికీ, సామాజికంగా ఒత్తిడి స్త్రీ పై ఉంటుంది. నలుగురిలో ఎక్కడకు వెళ్లినా, ఏమ్మా, ఏమన్నా విశేషమా? మీ అత్తగారు ఎప్పట్నుంచో మనవడి కోసం ఆశపడుతుంది, ఫలానా పూజ చేయించండి. ఫలానా డాక్టరుకి చూపించండి అంటూ ఉంటారు. ఇవన్నీ పురుషుడు దగ్గర ప్రస్తావని రావు. వంధ్యత్వానికి మూడవ వంతు కారణం ఆడవారి లోపం అయితే మూడవ వంతు కారణం మగవారిది. కొంత ఇద్దరి కారణం అయితే కొన్నిటికి కారణం తెలియదు. ఈ విషయంపై అందరికీ అవగాహన ఉంటే పిల్లలు లేని ఆడవారిని ఇలాంటి ఇబ్బందికర ప్రశ్నలు అడగరు. ఆడపిల్ల పుడితే తండ్రిని నిందించకపోయినా, తల్లిని మాత్రం నిదించడం న్యాయం కాదు. పిల్లలు పుట్టని దంపతుల్లో ఇద్దరి పాత్ర ఉండొచ్చు లేదా భర్తది అయి ఉండొచ్చు. ఆడపిల్ల వద్దని అబార్షన్ చేయించుకోవడం కూడా హత్యతో సమానం. ఆడ శిశువుని కాపాడండి. ఆఖరుగా ఆడైనా, మగైనా దేవుడు మనకిచ్చిన బహుమతి అని ఆనందంగా స్వీకరించండి. మి

# ఆట్రుప్పడై

**- జె.వి. సత్యవాణి**

ఆట్రుప్పడై రెండు పదాల కలయిక. ఆఱు+పడై ఆఱు - దారి, దోవ: పడై - చూపుట, చెప్పుట (డా.ము.వరదరాజన్, తమిళ్ ఇలక్కియ వరలాఱు, సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీ, 1996 పు. 52) "కూత్తరాయినుం, పాణరాయినుం, పొరునరాయినుం, విఱలియాయినుం నెఱియిడై కాట్చిక్కణ్ణే ఎదిర్న దోర్ ఉఱైళ్ళి యాల్ తాం పెట్ర పెరువలన్ నుమక్కుం పెఱలాగుం ఎనపుం చొన్న పాక్కముం" (తొల్. పెరుళ్. 88) ఆటగాళ్ళైనా, పిచ్చుకుంట్ల వంటి వారైనా, పొరునర్ (ఒక రకం వాయిద్యాన్ని వాయించే వారు) అయినా, వేశ్యలైనా, కాడుదాటి, ఊరిలోకి ప్రవేశించి, ఎవరైనా సరే తమ దరిద్రం తీరేలా, ఒక దాతను చేరి ఈవి కోసం ప్రయత్నించి దానం పొంది, దారిలో ఎదురైన ఇతర అర్థులకు ఆ దాతను కలవడానికి తగిన తోవ చూపించటం ఆట్రుప్పడై అన్న ఈ వివరణను *తొల్కాప్పియం* మొదలు అన్ని లక్షణగ్రంథాలు చెప్తున్నాయి. తమిళ సాహిత్యానికి చెందిన *సిఱ్రిలక్కియం* అని పిలవబడే వివిధ సాహితీ ప్రక్రియల్లో ఇది కూడా ఒకటి.

తమిళ సాహిత్యంలో ముఖ్యంగా సంగసాహిత్యంలో అగం (ప్రేమ లేదా కుటుంబ వ్యవస్థకు సంబంధించిన రచనల సంకలనం) పుఱం (దానం, వీరం వంటి సమాజంతో సంబంధమున్న రచనల సంకలనం) అనే భేదం కన్పిస్తుంది. పుఱంకు సంబంధించిన రచనల్లో ఈ ఆట్రుప్పడై రచనలు విరివిగా అగుపిస్తాయి. అప్పటికే ఇదొక ప్రక్రియా వైవిధ్యంగా ఏర్పడిందని చెప్పవచ్చు. ఒక దాతవల్ల లబ్ధి పొందిన వారు, ఆ దాతను చేరే మార్గాన్ని చెప్పటం, ఆ దాత గుణగణాల్ని పొగడటం ఈ ప్రక్రియలో కన్పించే ప్రధాన లక్షణాలు. "ఇవుర్కణ్ వానత్తివైయో రుళైప్-పెరుంబుల్ వనై ఆట్రుప్పుదుత్తంద్రు" (పుఱ పొరుళ్ వెణ్బా-కొళు-౨౩౦ (230) ఈ ప్రక్రియలో మరొక చిన్న భేదం చోటుచేసుకుంది. *పుఱప్పొరుళ్ వెణ్బా* అనే లక్షణ గ్రంథం దాన్నిలా వివరిస్తోంది- "అలవిలేక వెడదైన ఆకాశాన్ని తన నెలవుగా చేసుకొన్న భగవంతుని తన కవితా కుసుమాలతో అర్చించి అతని పాదాలను చేరుకొనే విధానాన్ని ఎరిగిన ఒక కవి తనలాగే ఆ భగవంతుని సన్నిధి చేరాలనుకునే మరొక కవికి ఆ మార్గాన్ని చూపటం పులవరాట్రప్పడై "పులవర్ - కవి / పండితుడు అని అర్థం. పులవర్ ఆట్రుప్పడైను *తొల్కాప్పియం*, తొన్నూలా *సిరియం* పేర్కొనక పోవడం వల్ల ఈ రచనలు అర్వాచీనాల"ని విమర్శకులు భావిస్తున్నారు. *నా. జయరామన్ పుఱనానూఱు* లోని మూడు 48, 49, 141 ఈ కోవకు చెందినవని చెప్తూ అందులోనూ పులవర్ అని కాక, 'ఇరవలర్' (యాచకుడు) అనే ఉండటం వల్ల అవి విడి అనీ అంగీకరించవలసిన అవసరం లేదంటారు (*నా. జయరామన్, సంగకాల ఇలక్కియత్తిల్ పాడాన్ తిరణ్, మీనాట్చి పుత్తగ నిలైయం, మదురై* పు. ౧౫౪ (154)). కానీ, నిజానికి ఈ రెండు విధాల రచనలకీ విషయంలో భేదం ఉండటం వల్ల అంగీకరించక తప్పదు. సంగసాహిత్యకాలంలోనే ఇటువంటి రచనలు కన్పించడం వల్ల ఆ రచనలు సమాన ప్రతిపత్తి గలవనీ, ఒకే కాలఘట్టానికి చెందినవనీ చెప్పవచ్చు. మానవ ప్రపంచంలో దాతలను చేరి వేడుకొనే ప్రక్రియలో భౌతిక జీవనాన్ని తృణప్రాయంగా ఎంచి సకల జగత్తుకు కర్త అయిన, ఆ సర్వేశ్వరుని చేరుకొనే మోక్ష మార్గ ప్రయోక్తగా కవి మారటం-భౌతిక జీవనం నుంచి భౌద్ధిక ప్రపంచంలో అడుగిడి, ఆది భౌక్తిక మూల్యాల్ని వెతుక్కుంటూ చేసే ప్రయాణం. ఈ ప్రయాణం కవులకు కష్టసాధ్యం కాదు. "నా నృషిః కురుతే కావ్యం" అన్న మాటలను అక్షరసత్యాలని నిరూపించేవి ఇలాటి రచనలే. అయితే, ఈ రెండూ లక్షణాల్ని బట్టి వివిధ రచనలైనా, ఆధారమైన లక్షణం ఒకటే కనుక రెండింటినీ ఒకే ప్రక్రియగా అంగీకరించాలని సాహితీ విమర్శకుల అభిప్రాయం.

యాళ్ అనే వాయిద్యాన్ని వాయిస్తూ అడుగుకొనే వాళ్ళు పాణర్. ఒక కులానికి చెందిన స్త్రీలు ఆటపాటలు నేర్చి వాటిని ప్రదర్శించి అడుక్కుంటారు, వాళ్ళను విఱలియర్ అంటారు. మగవారిలో ఆటపాటలతో మెప్పించే వారు కూత్తర్. పలు వేషాలతో వచ్చేవారు పొరునర్ (డా. ము. వరదరాజన్, తమిళ ఇలక్కియ వరలాఱు, సాహిత్య అకాడెమి, న్యూఢిల్లీ, 1996 పు. 51,52) ఈ జాతుల వాళ్ళు క్రీ.శ. 5-6 శతాబ్దాల మధ్య తమ తమ కళలతో మెప్పించి, తద్వారా వచ్చే డబ్బుతో జీవనం గడిపేవారట. అంటే, తమ పేదరికంలో భుక్తికని వీళ్ళు దాతలను వెదుకుకుంటూ, ఊరూరా తిరగటం, తమ కళను ప్రదర్శించి భుక్తి గడుపుకోవటం అన్నవి ఈ కోవకు చెందిన రచనల్లో సాధారణం. పత్తుపాట్టు సంకలనానికి

డాక్టరు జె.వి. సత్యవాణి, ఫోన్ : 94411 34856

చెందిన *తిరుమురుగాట్రుప్పడై, పోరునరాట్రుప్పడై, పెరుంపాణాట్రుప్పడై, సిఱుపానాట్రుప్పడై* ఈ కోవకు చెందిన రచనల్లో ప్రసిద్ధి చెందినవి.

**తిరుమురుగాట్రుప్పడై:** మదురై *కణక్కాయనార్* (కరణం) కొడుకైన నక్కీరర్ రాసినది. మురుగన్‌గా పిలవబడే (కుమారస్వామి) కరుణ పొందిన ఒక భక్తుడు, తనలాగే కుమారస్వామి కరుణ కోసం పరితపిస్తున్న మరొక భక్తుడికి దైవ సన్నిధికి, దైవాన్ని చేరుకోవడానికి తగిన మార్గాన్ని బోధించడం. ౩౧౭ (317) పంక్తులున్న ఈ పాట సంగసాహిత్యంలో అత్యంత నిడివి గల పాట. ఆ సాహిత్యంలో పూర్తిగా భక్తి నిండిన తొలి రచనగా, ఏ దాక్షిణాత్య భాషా సాహిత్యాలలోనే భక్తికి పూర్తి స్థానాన్నిచ్చిన తొలి రచన అనవచ్చు. ఇది భక్తి సాహిత్యమే కాదు, ఒక స్తోత్రరచన కూడా అంటారు. డా. వరదరాజన్. ఈ రచన మూడు భాగాలుగా విభజింపబడింది. మొదటి భాగంలో తిరుప్పరం కుండ్రం అనే కొండ మీద వెలసిన కుమారస్వామి, కొండ చుట్టు ఉన్న ప్రకృతి సౌందర్యం వర్ణన, రెండవ భాగంలో కుమారస్వామి వెలసిన ఆఱు పుణ్యస్థలాల, పన్నెండు చేతులతో తిరుచ్చెందూరులో కనిపించే తిరుకోలం వర్ణన, మూడవ భాగంలో కుమారస్వామిని ధ్యానించే మునులు, పళని క్షేత్రంలో స్వామిని పూజింపవచ్చే స్త్రీల గురించిన ఆకాలం నాటి ఇతర గుళ్ళు, పుణ్యస్థలాలు, ప్రకృతి సంపద, కుమారస్వామి పూజా విధానం, అందం, సూరన్ (తారకాసుర) వధ మొదలైనవి ఈ రచన వివరిస్తుంది. కవి ఈ రచనను సముద్రతీరంలో సూర్యోదయ వర్ణనతో ప్రారంభించి, మధ్యలో వనాలు, కొండలు వర్ణించి, చివరికి కొండపై నుండి ఉరికే జలపాతంతో ముగిస్తాడు.

**పొరునరాట్రుప్పడై:** ముడత్తాం కణ్ణియర్ రచించిన ఈ రచన కరికాలచోళుని గొప్పతనాన్ని చెప్తుంది. చోళుడికి పొరునర్ వంటి కళాకారుల మీదున్న అభిమానం, కావేరి నది వర్ణనలు ఇందులో ఎన్నదగ్గవి.

**"అఱలై కళ్వర్ పడైవిడ అరుళిన్**
**మాఱుదలై పెయర్ క్కుం మరువిన్ పాలై..."**

అడవుల్లో పడి బలవంతంగా దోచుకునే గజదొంగలు కూడా చక్కటి సంగీతానికి మైమరచి, మనసు మారి కొల్లగొట్టడం మాని, తమను వదిలేస్తారన్న భావాన్ని ఇందులో కవి పొందుపరిచాడు. సంగీతం గొప్పదనం గురించి వివరించాలన్న ఉద్దేశంతోనే కవి ఈ రచన చేశాడనిపిస్తుంది.

ఈ వాద్యకారుల కులదైవం "ఏళిన్ తలైవ" అంటే, ఏడు స్వరాలకధిపతి అని అర్థం. సంగీత విశేషాలను చెప్పే ఈ రచన ఇతర కళలను వివరించే రచనల కోవలో చాలా ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ రచనలో కనిపించే మరొక విశేషం చోళుడు కళాకారులకిచ్చే వస్త్రాలు, ఆ వస్త్రాలలో దారప్పోగులు ఏ దిశలో నేసారో కూడా కనపడవట. పాము కుబుసం అంత పలచగా ఉండేవి అని వర్ణింపబడ్డాయి. తమ ఇంటికి ఎవరైనా అతిథులు వస్తే వారిని సాగనంపేటప్పుడు వారితో పాటు ఏడడుగులు వెళ్ళి సాగనంపటం ఒక ఆచారంగా ఉండేదని కూడా రచయిత తెలియబరుస్తాడు.

**సిఱుపానాట్రుప్పడై:** *ఇడైక్కళినాట్టు* నల్లూర్ నత్తత్తనార్ వ్రాసిన ఈ రచన ఒక పాణర్ అనే, సంగీత కళాకారుల దారిద్ర్యావస్థను చిత్రిస్తుంది. ఆ కళాకారుల ఇల్లు దరిద్రానికి మారుపేరులా ఉంది. ఆ పాత గోడలు పెచ్చులూడి పోయి, అక్కడక్కడ చెదలు పట్టి ఉన్నాయి. కప్పుకున్న వాసాలు ఎప్పుడు పడిపోతాయో అన్నట్టున్నాయి. వంటిట్లో మొలిచిన కుక్కగొడుగులు, పేరుకున్న ధూళి చూస్తే అది వాడుకలో లేదని తెలుస్తుంది. ఆ ఇంటి ఇల్లాలు చాలా బాధ్యత కలది. ఇంట్లో వాళ్ళ ఆకలి తీర్చాలని వేళైక్కీరై (తోటకూరలాంటి ఆకుకూర) పెరట్లో నుంచి కోసి వండింది కానీ, అందులోకి ఉప్పులేదు. అలాటి స్థితిలో వారిని కలిసి మరొక కళాకారుడు ఒక దాత గురించి చెప్తే ఆ దాతను తమ కళతో మెప్పించి, తమ కష్టాన్ని తీర్చినందుకు ధన్యవాదాలర్పించడంతో రచన పూర్తవుతుంది.

**పెరుంబాణార్ ఆట్రుప్పడై:** కంచిని పాలించిన రాజు ఇళంతిరైయన్ పరిపాలనా దక్షతను, రాజ్యాన్ని, కడలి సమీపానున్న రేవు పట్టణాన్ని, అక్కడున్న దీపస్థంభాన్ని కడియలూర్ ఉరుత్తిరం కణ్ణనార్ చాలా చక్కగా వర్ణించాడు. రాజు తానే కళాకారుల్నీ గౌరవించి స్వయంగా వారికి వడ్డించేటంత ఉత్తముడనీ వివరిస్తాడు. ఈ రచనల పట్ల ఎన్నో వివాదాలున్నా ఈ ప్రక్రియ ఆధునిక కాలం వరకూ సాగుతూనే ఉంది. ఈ ప్రక్రియలో వెలువడ్డ రచనలు కవితాపరంగానే కాదు, సాంఘికపరంగానూ చాలా ప్రసిద్ధి చెందాయి. ఆధునిక కాలంలో మాణాక్కర్ (విద్యార్థులు) ఆట్రుప్పడై తొండర్ (సభ్యులు/పనివారు) ఆట్రుప్పడై, ఇరవలర్ (యాచకులు) ఆట్రుప్పడై వంటివి వెలువడ్డాయి. కోరేవారు, ఇచ్చేవారు ఉన్నంత కాలం దాతలు, యాచకులు ఉన్నంత కాలం ఈ రచనలు సమాజానికి తగినవే. మి



బోధిసత్త్వ పద్మపాణి: 1వ గుహ

# అజరామరం - అజంత

- కాంద్రేగుల నాగేశ్వర రావు

అజంత అజరామరమైన భారతీయతకు ఒక సంస్కృతీ దర్పణం. వ్యక్తులుగా చరిత్ర పుటలకెక్కని ఎందరో బౌద్ధ భిక్షువులు కఠోర శ్రమతో, శ్రద్ధతో, శతాబ్దాలుగా కుడ్యాలపై ఆలపించిన రంగుల రాగాలవి. ఇక్కడ నిర్జీవమైన శిలలు అమృతపానంచేసి సజీవమూర్తులుగా రూపాంతరం చెందాయా అనిపిస్తుంది. ఉత్తర భారతీయులు పశ్చిమాభిముఖంగా దక్షిణాదిలోనికి కాలుపెట్టి తపతి నదీలోయనుదాటి దక్కను పీఠభూమిని తాకే స్థలం ఔరంగాబాద్. అజంత గుహలు ఔరంగాబాదుకు 110 కిలోమీటర్ల దూరంలో పశ్చిమదిశగా ఉన్నాయి. అజంత అనే పేరుతో నున్న ఒక పల్లెకు ఇది దగ్గరలో ఉండటంతో దీనిని అజంత గుహలుగా పేర్కొంటున్నారు.

పాడ్యమి నాటి నెలవంక బాలునిలా తళుక్కున మెరిసే అర్ధవృత్తాకారపు వంపుతో ఎంతో కళాత్మకంగా భాసించే ఈ సహ్యాద్రి కొండల సముదాయంలో నున్న కళాక్షేత్రమే అజంత. 150 అడుగుల ఎత్తునుండి జలజలమని పారే 'శాంతికుండము' మడుగై లోయలలో పారుతుంటుంది. ఈ సహ్యాద్రి కొండలలో తొలచబడ్డ మొత్తం గుహల సంఖ్య 29. వీటిలో ఎక్కడా వైదిక, జైన సాంప్రదాయాలు కనిపించవు. ఇవి అచ్చంగా బౌద్ధ ధర్మానికి చెందినవే. ఈ గుహలను చూడడానికి వచ్చేవారి సౌకర్యార్థం, వారు గుర్తుపట్టడానికి వీలుగా ఈ గుహలకు సంఖ్యలు (నెంబరు) ఇచ్చారు. ఈ గుహలకు ఇచ్చిన సంఖ్యలకు చరిత్రలోని కాలానికి ఏమీ సంబంధంలేదు. ఇందులో అత్యంత ప్రాచీనమయినవి, ముందుగా తొలచబడ్డవి 9,10 నెంబరు గల గుహలు. వాటితో పోలిస్తే 1,2 నెంబరు గల గుహలు తదుపరి, చిట్టచివరి కాలంనాటివి. అలానే ఒక గుహలో వేసిన చిత్రాలన్నీ ఒకే కాలంనాటివి కావు.

ఇందులో 9,10, 19, 26 నెంబర్లు గల గుహలు చైత్యాలు. ఇవి ప్రార్థనకు , బౌద్ధ ఆరాధనకు సంబంధించినవి. మిగిలిన గుహలు విహారాలు, ఇవి బౌద్ధ భిక్షువులు నివాసముండే విశ్రాంతి గృహాలు. ఈ గుహల నిర్మాణం క్రీ.పూ. 2వ శతాబ్దపు తొలికాలం నుంచి, 6వ శతాబ్దపు చివరి వరకూ కొన సాగింది. అజంత, ఎల్లోరా, భాగ్, ఎలిఫెంటా గుహలు బౌద్ధులు కొండను తొలిచి తయారు చేసుకున్న నివాస గృహాలు. ఈ విధంగా గుహలను తొలచిన మొట్టమొదటివారు బౌద్ధులే. ప్రపంచంలో మరెక్కడా ఇటువంటి Rockcut నిర్మాణాలు ఇంత విశాలంగా తొలచబడలేదు. అజంతలో మొదట తొలచబడ్డ గుహలు హీనయానానికీ, తరువాతవి మహాయానానికి సంబంధించినవి. వీటిలో వజ్రయాన ప్రసక్తి లేదు. బౌద్ధ చైత్యలు హిందూమత గుడులకు పూర్వరూపాలు. అజంత గుహ చిత్రాల కాలం నాటికి హిందూ మతంలో గుళ్ళు, గోపురాలు లేవు.

అజంతలోని క్రీస్తు పూర్వము తొలచబడ్డ గుహలకు ఎవరు సహాయ సహకారాలు అందించారో తెలియదు. వీటికి ఖచ్చితమైన ఆధారాలు లభించలేదు. చరిత్రపరంగా అశోకుని మరణానంతరం అతని మనుమడైన బృహద్రధుని సంహరించి క్రీ.పూర్వం 185లో పుష్యమిత్రుడు శృంగ వంశాన్ని స్థాపించి, తిరిగి వైదిక మతాన్ని పునరుజ్జీవింప చేశాడు. అప్పటినుంచి బౌద్ధమత క్షీణత ప్రారంభమయింది. శృంగవంశం తరువాత వచ్చిన ఒక్కొక్క రాజవంశమువారు ఒక్కొక్క ప్రాంతాన్ని పరిపాలించారు. వీరిలో పెక్కుమంది వైదిక మత సంప్రదాయాన్ని అనుసరించినవారే. శాతవాహన వంశాన్ని

శ్రీముఖుడు క్రీ॥పూ. 230 లో స్థాపించారు. ఈ వంశంలో సుమారు 30 మంది రాజులు క్రీ.శ. 225 వరకూ రాజ్యము చేశారు. అంతటి దీర్ఘకాలము భారత దేశమును పాలించిన వంశము మరొకటి లేదు. శాతవాహనులు ఆంధ్రులు. వీరి రాజధాని ధాన్యకటకము. ప్రస్తుతము ఇది అమరావతిగా పిలువబడుతుంది. ఇది కాక కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళము, మహారాష్ట్రలోని ప్రతిష్ఠాన పురము (ఔరంగాబాద్ దగ్గర ఉన్న పైఠాన్) ముఖ్యమయినవి. అశోకుని అనంతరం వీరు స్వాతంత్ర్యం ప్రకటించి స్వతంత్ర రాజ్యం ఏర్పాటు చేసుకున్నారు. తమ వీర, శౌర్యాలతో శృంగుల నోడించి విదర్భ, మాళవ దేశాలను ఆక్ర మించుకున్నారు. శాతవాహన రాజైన గౌతమీపుత్ర శాతకర్ణి శకులను ఓడించి తన దిగ్విజయ యాత్రను శాసనంపై చెక్కి నాసిక్‌లో ప్రతిష్ఠించాడు. అంతకు పూర్వమే మహారాష్ట్ర రఠకుల కుమార్తయిన నాగనికను శాతవాహన చక్రవర్తయిన మొదటి శాతకర్ణి వివాహం చేసుకున్నాడు. ఈ విధంగా ఆంధ్రులయిన శాతవాహనులు కృష్ణాతీరపు ఒడ్డున వున్న అమరావతి నుంచి మహారాష్ట్రలోని నాసిక్ వరకూ తమ జైత్రయాత్ర కొనసాగించాడు. అప్పుడు అజంత ప్రాంతమంతా వీరి ఏలుబడిలోనే ఉండేది. శాత వాహనులు వైదిక ధర్మాన్ని ఆచరించినా బౌద్ధాన్ని అనాదరణ చేయలేదు. వీరిలో పెక్కుమంది రాణులు బౌద్ధ మతావలంబీకులు కావటం ఒక విశేషం. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, జగ్గయ్యపేట, నాగార్జున కొండ వీరి కాలంలోనే, వీరి సహాయ సహకారాల తోనే అభివృద్ధిపరచబడ్డాయి. కానీ అజంత గుహలపై వారి ప్రోద్భవం ఎక్కువ ఉన్నట్లు శాసనాధారాలు లేవు.

ఒక రకమైన మత అస్థిరత వల్ల అజంత నిర్మాణం (కొండను తొలచే ప్రక్రియ) ఒక్కోసారి కొన్ని శతాబ్దాల పాటు మందంగా సాగిందని తెలుస్తుంది. ఆ తరువాత కాలంలో శాతవాహనుల పిమ్మట వచ్చిన వాకాట రాజులైన వింధ్యశక్తి (355-400) ప్రవరసేన (475-500) హరిసేన (500-450) కాలంలో వారి ప్రోత్సాహక, ప్రోద్భలలాతో వీటి నిర్మాణం కొనసాగి వుంటుందని భావిస్తున్నారు. ఇందులో 16, 17 గుహలు హరిసేనుని కాలంనాటివి. వాకాట రాజులలో చివరి వాడైన హరిసేనుని మరణానంతరం (AC 477) క్రీ.శ.480లో వాకాట రాజ్యం పతనమైంది. వాకాటుల వల్లనే అసంపూర్ణంగా నున్న కొన్ని గుహలు సంపూర్ణతను సంతరించుకున్నాయి. కొందరు వ్యాపారస్తులు, సామాన్యుల ఆర్థిక సహకారం వల్లనే ఈ నిర్మాణాలు జరిగాయని తలంచవచ్చు. అందుచేతనే ఆ కాలంలో వచ్చిన ప్రముఖ సాహిత్య ప్రక్రియలైన కావ్యం, నాటకాలలో అజంత ప్రసక్తి కానరాదు. హర్షుని కాలంలో భారతదేశం వచ్చిన చైనా బౌద్ధ యాత్రికుడు హుయాన్ త్సాంగ్ మాత్రమే అజంత గురించి పేర్కొన్నాడు. హర్షుని తరువాత, కొంతకాలం పిదప రాజ్యానికి వచ్చిన కనిష్కుని కాలంలో బౌద్ధం కొద్దిగా ఊపిరి తీసుకున్నా అతని మరణానంతరం కుషాన్ సామ్రాజ్యం అంతరించటముతో బౌద్ధం నామ మాత్రంగా భారత దేశంలో మిగిలింది. బౌద్ధంతో పాటు అజంత కూడా మరుగున పడింది.

అజంతలో చిత్రాలు, శిల్పాలూ నువ్వానేనా అని పోటిపడుతున్నట్లు కనిపించినా, ఇందులో చిత్రకళదే అగ్రస్థానం.

తదనంతరం బౌద్ధ మత క్షీణతతో ఇవి క్రమేపీ మరుగున పడ్డాయని, చరిత్రకు అందనంతగా కనుమరుగైనాయని తెలుస్తుంది. ఇప్పటికీ అజంత గుహల చరిత్ర ఇది అంటూ సంపూర్ణంగా ఆవిష్కరించబడలేదు. కొన్ని శతాబ్దాలుగా ఇవి జనావాసం లేని దుర్గమారణ్యాలలో ప్రకృతి ఒడిలో శయనించాయి.



స్త్రీ దృశ్యము : 1 వ గుహ

కొన్ని శతాబ్దాల అజ్ఞాతవాసం అనంతరం, 1819వ సంవత్సరం ఏప్రిల్ మాసంలో మద్రాసు రెసిడెన్సీలోని 26వ Cavelryకి చెందిన జాన్‌స్మిత్ అనే సైనికాధిగారి వేటలో గాయపడిన పెద్దపులిని వేటాడుతూ ఊహించని పరిస్థితుల్లో 10వ నెంబరు గుహను మొదటిసారిగా కనుగొన్నాడు. దీనికి సంబంధించిన ఈ విషయం రాయల్ ఆసియాటిక్ సొసైటీలో వ్రాయబడ్డ వ్యాసంతో ప్రపంచం ఒక్కసారి తుళ్ళిపడింది. 1843 ఫెర్గున్‌సన్ దీనిని వర్ణించిన తీరును చూసి ప్రపంచం నలుమూలల నుండి, ముఖ్యంగా ఐరోపా ఖండం నుండి, కళాభిమానులు అనేక వ్యయప్రయాసల కోర్చి దీన్ని చూడ వచ్చారు. 1844 నాటికల్లా ఇదొక ప్రముఖ దర్శనీయ స్థలమయింది.

1843వ సంవత్సరంలో మద్రాసు ఆర్మీ రాయల్ ఆసియాటిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్.గిల్ అనే అధికారి అధ్యక్షతలో దీనికి నకళ్ళు వేయడానికి 30 మంది చిత్రకారులను ఎంపిక చేసి పంపింది. వారు 1849 నుంచి 1855 వరకు సుమారు ఆరు సంవత్సరాల కాలం అక్కడే వుంటూ నకళ్ళు వేశారు. అప్పటికి గుహలలోని చిత్రాలేవి పాడుకాలేదు. రంగులు వెలియ లేదు. అరణ్యగర్భంలో చుట్టూ మొలిచిన చెట్లు, లతల మూలంగా వేడిగాలులు, వర్షపు తుంపరలకు, లోనుకాక సమశీతోష్ణత కలిగి ఉండటముతో భద్రంగా వున్నాయి. ఈ నకళ్ళ చిత్రాలను మొదటిసారిగా 1844 నుండి 1866 వరకూ లండన్‌లో ప్రదర్శించారు. తరువాత కొంతకాలానికి లండన్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆ నకళ్ళులో ఐదు మినహా మిగిలినవన్నీ కాలి బూడిదయ్యాయి. 1875వ సంవత్సరములో గ్రిఫత్ అనే బ్రిటిష్ అధికారి బొంబాయిలో నున్న చిత్రకళా విద్యార్థులతో తిరిగి కొత్తగా నకళ్ళను తయారు చేశాడు. వీటిని 1896వ సంవత్సరంలో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ప్రచురించింది. విచిత్రంగా ఈ నకళ్ళు కూడా అగ్నికి ఆహుతయ్యాయి.

1909వ సంవత్సరంలో హెర్రింగ్‌హామ్ సతి మరొక్కసారి నకళ్ళు తయారు చేయించడానికి పూనుకుంది. దీనికిగాను హైదరాబాదుకు చెందిన సయ్యద్ అహమ్మద్, మహమ్మద్ ఫజులుద్దీన్‌లను, బెంగాల్ నుంచి నందలాల్ బోసు, అనిల్‌కుమార్ హల్దార్, అమరేంద్రనాథ్‌లను ఎంపిక చేసింది. 1910 నుంచి 1912 వరకూ వారు ఆపనిని కొనసాగించారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆర్క్యలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు దీని బాధ్యతలు అప్పగించబడ్డాయి. వారు సమర్థవంతంగా దీనికి అధికారయుత నకళ్ళ (Authentic copies) ను ప్రచురించారు. 1983వ సంవత్సరంలో యునెస్కో దీనిని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది.

హైదరాబాదీయులైన విద్యాభూషణ్, జలాన్ వేసిన నకలు అజంతా చిత్రాలు హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో నున్న స్టేట్ మ్యూజియంలో ఇప్పుడు ప్రదర్శించబడుతున్నాయి.

అజంతలోని మొత్తం 29 గుహలను చూడవలసిన అవసరము సామాన్య యాత్రికునికి లేదు. ఇందులో 1, 2, 9, 10, 12, 16, 17, 19, 26 సంఖ్యగల గుహలే ముఖ్యమైనవి.

అజంతలో కుడ్యచిత్ర విధానం ఈ విధంగా సాగుతుంది. మొదట తొలచబడ్డ గుహలోని గోడల యొక్క ఉపరితలం గరుకుగా ఉంచబడుతుంది. దీనిపై తగుపాళ్ళల్లో కలిపిన మట్టి, ఆవుపేడ, వరితవుడులను మెత్తగా కలిపి గోడలపై పొరలు పొరలుగా అలుకుతారు. ఇది మొదటి దశ. ఈ ప్రక్రియ 1 1/2 సెంటీమీటర్ల మందంగా వచ్చేంత వరకూ సాగుతుంది. దానిపై మెత్తని రాతి సున్నాన్ని అద్దుతారు. అది చేయిపడితే జారేటంత నునుపుగా వచ్చిన తరువాత దానిపై వేయబోయే చిత్రపు నమూనాన్ని ముందు రేఖలతో చిత్రించి, ఆ తరువాత దానికి రంగులు అద్దుతారు. వీటన్నిటికీ కుంచెలు వాడుతారు. వర్ణమిశ్రమంను రంగుమట్టి, పసుపుకొమ్ములు, ఇటుకపొడుం, ఆముదపు దీపం నుంచి వచ్చిన కాటుక మొదలయిన వాటినుంచి సేకరిస్తారు. అవి ఆరిన తరువాత మరోసారి సున్నపు రాతితో పలచగా మరో పొరను లేపనం చేస్తారు. ఈ తదుపరి ప్రక్రియ వల్ల చిత్రం కనుమరుగు కాదు కానీ, దాని కాంతి తగ్గుతుంది. ఇప్పుడు దీనిపై తిరిగి అదే చిత్రాన్ని గీతలతో వేసి రంగులతో నింపుతారు. ఈ చిత్రం పరిపక్వత పొందింది అనిపించేంత వరకూ ఈ ప్రక్రియ సాగుతుంది.

అజంత చిత్రాలలో కేరింతలాడు పశువులు, వాటి వెనుక గొల్లవాని పరుగులు, సమీపంలోనే స్వేచ్ఛగా తిరుగాడు తున్న అడవి మృగాలు, లోన స్థంభాలపై నిర్వికల్ప బౌద్ధ భిక్షువులు, గవాక్షాల గోడలపై బౌద్ధ సంబంధ గాథలైన సిద్ధార్థుని జననము, అసితుడు పరిశీలిస్తున్న గౌతముని జాతక పరిశీలన, విద్యార్థిదశ, రాజగృహ గమనము, జరామరణాది దృశ్యాలు,

సిద్ధార్థునికి సుజాత, తపస్సి, భల్లిక లొసగిన భిక్షాదృశ్యాలు కానవస్తాయి.

ఇందులో అత్యంత ప్రాచీనమైనది 10 నెంబరు గుహ (చైత్యం). దీనిలో నున్న స్థూపం ఆధారంగా ఒక విశిష్ఠి పుత్త కటహాడి అనే వ్యక్తి ఈ గృహ ముఖభాగానికి దాత అని క్రీస్తు పూర్వపు 2వ శతాబ్దపు శాసనం చెబుతుంది. ఇందులోని చిత్రాలు బోధి వృక్షపు ఆరాధనను, సామ జాతకాన్ని, చద్ధంత జాతకాన్ని కథారూపంలో ప్రదర్శిస్తాయి.

సామ జాతక కథ సంక్షిప్తంగా ఇలా సాగుతుంది. అరణ్యంలో ఋషులుగా జీవిస్తున్న గ్రుడ్డి తల్లిదండ్రులకు జన్మించి వారిని పోషిస్తూ సామ అనే పేరుతో వున్నాడు బోధిసత్త్వుడు. ఒకనాడు పాత్రతో నదిలో నీరు నింపు కొంటుండగా ఆ బాలుడు వేటకు వచ్చిన కాశీరాజు చేత బాణంతో చంపబడతాడు. తాను చేసిన విషాదపు పొరపాటును కొంత ఆలస్యంగా రాజు తెలుసుకొని, మరణిస్తున బాలుని ద్వారా నిస్సహాయులైన తల్లిదండ్రుల సంగతి గ్రహించి తాను వారి ప్రియమైన కుమారుని స్థానాన్ని స్వీకరిస్తానని వారికి విన్నవించుకొంటాడు. ఒక దేవత నిస్సహాయులైన ఆ తల్లిదండ్రుల దుఃఖానికి చలించి వారి గ్రుడ్డితనాన్ని పోగొట్టటమేకాక వారి తనయుడిని కూడ బ్రతికించింది. ఈ చిత్రం, వేటకాడైన రాజును, బాణం తగిలివున్న సామను, రాజు పరితాపస్థితిలో వుండటాన్ని, దుఃఖిస్తున్న సామ తల్లిదండ్రులను, ఋషికుమారుడు తిరిగి బ్రతికి వుండటాన్ని వ్యక్తం చేస్తుంది.

బౌద్ధ నిర్మాణాల్లో విరివిగా పునరావృత్తి చేయబడిన ఛద్దంత జాతకం బోధిసత్త్వుని మరో పూర్వజన్మ గాథను చెపుతుంది; బోధిసత్త్వుడు ఒక అభిజాతమైన ఏనుగుగా జన్మించి, తన ఇద్దరు రాణులు మహాసుభద్ద, చుల్ల సుభద్దలతో హిమాలయ ప్రాంతపు ఒక తామర కొలనులో, తన బృందానికి నాయకుడుగా ఉన్నతస్థాయిలో నివసిస్తున్నాడు. మహాసుభద్ద తన భర్తకు తనకంటే ఎక్కువ అభిమాన పాత్ర అని ఈర్ష్యపడి చుల్లసుభద్ద తన సపత్నియందు పక్షపాతంగా వున్న ఆరు దంతాల ఏనుగుపై కక్ష సాధించే నిమిత్తం కాశీ రాణీగా జన్మించాలని ఆమె ప్రార్థిస్తూ మరణిస్తుంది. ఆ విధంగానే రాకుమారిగా జన్మించిన తరువాత తనకు జబ్బు చేసినట్లు నటించి తన జబ్బుకు మందుగా ఛదంతుని దంతాలు కావాలని కోరుతుంది. సోమత్తర అనే వేటకాడు ఈ పని నిమిత్తం నియోగించబడగా అతడు పోయి ఆ జంతువును గాయపరుస్తాడు. అయినప్పటికీ, ఆ ఏనుగు ఆ కిరాతుని క్షమించి తన ఇష్టానుసారం తన దంతాలను ఇచ్చి వేస్తుంది. అయితే, రాణి ఆ దంతాలను చూడగానే మూర్ఛపోతుంది. పరితాపంతో నిండి ఆమె ముడుచుకుపోయి మరణిస్తుంది.

బృహత్తర వటవృక్ష సమీపంలోని తామరకొలనులో తన రాణితో ఆరుదంతాల ఏనుగు గడుపుతున్న సుఖప్రద జీవితాన్ని, కాశీరాణి రోగాన్ని అభినయించటం, దంతాలను తేవటానికి పంపబడిన వేటకానిని, వాటిని కోసి రాణి దగ్గరకు తేవటాన్ని, వాటిని చూసి రాణి మూర్ఛపోవటాన్నీ – చూపుతాయి ఈ చిత్రాలు.

10వ గుహలోని చిత్రాల రూపాలకు, అమరావతి శిల్పాల్లో కనిపించే రూపాలకు సామ్యమెక్కువ. తలపాగాలు, కంఠాభరణాలు, చెవిపోగులు, ముఖాకృతులు, ఆరాధన నిమిత్తం జోడించబడ్డ చేతుల తీరులో ఎన్నో పోలికలు కానవస్తాయి. ఇందులో కొన్ని చిత్రాలు క్రీ॥పూ 2వ శతాబ్దానికి చెందినవయితే మరికొన్ని ఐదవ శతాబ్దపునాటివి. 9,10వ నెంబరు గుహలలోని చిత్రాలు ఒక శైలిని కలిగి ఉంటాయి. పోలికను బట్టి ఈ మొదటి గుహల రూప కల్పన ఆంధ్రులయిన శాతవాహునుల కాలంలోనే జరిగిందని ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. (9,10,12,15–A నెంబరు గల గుహలు క్రీస్తుకు పూర్వము తొలచబడ్డవి.)



అజంత గుహ తోరణం

1వ గుహలోని అవలోకితేశ్వరుని చిత్రము పద్మపాణి చిత్రాలు చిత్రకళకే మేలు బంతి.

2వ గుహలో హంసజాతకము, మాయాదేవి స్వప్నము, చూలు, లుంబినీ వనదర్శనము, సిద్ధార్థుని జననం, సప్తపది, తుషితస్వర్గం మొదలైన ఘట్టాలు చిత్రించబడ్డాయి. వీరి కాలం లోని ఉజ్వలమైన బౌద్ధగుహలు, నాశిక, బౌదశా, బజ్జా కొండలు మలచబడ్డాయి.

**4వ నెంబరు గుహ:** ఇది విహారం. దీని ముఖప్రాగణం అత్యంత అలంకారిత శోభితం. గుహచాలా పెద్దది. లోపల 28 స్తంభాలపై ఇది నిలచినట్లుగా మనం భ్రమించేటట్లు చెక్కబడింది. తమ కష్టాలు తొలగించమంటూ భక్తులు గౌతముని ప్రార్థించటం– ఏనుగు అంబారీపై ఎగురుతున్న ఒక జంట స్త్రీ పురుషులు; ఏనుగు దంతంపై అలవోకగా చేతిలో నున్న ఒక ఉడుతతో ఆడుకుంటున్నట్టున్న ఒక వనిత; ఒక స్త్రీ వ్యామోహంలో పడితే తప్పించుకోలేని ఒక పురుషుడు చిత్రించబడ్డారు.

**6వ నెంబరు గుహ:** ఈ గుహ ప్రాంగణంలోనికి ఇరువైపులా సాలభంజికలు చెక్కబడ్డాయి. లోపల బుద్ధుని శిల్పాలు ఎన్నో కనిపిస్తాయి. గుహలోపల రెండంతస్థులుగా ఉన్న ఏకైక గుహ ఇది.

**16వ నెంబరు గుహ:** 16వ గుహలోని శాసనం ప్రకారం క్రీ॥శ॥ ఐదవ శతాబ్దంలోని చివరి కాలంలో హరిసేనుని మంత్రి వరాహ దేవుని చేత ఇది బౌద్ధ భిక్షువులకు అంకితం చేయబడినదని తెలుస్తుంది. నందుని కథ, శ్రావస్తిమహిమ, సుజాత, ఏరువాక పండుగ. అసితుని ఆగమనం చిత్రాలుగా చేయబడినవి. నాగార్జునకొండలో నందుని ఇతివృత్తం శిల్పంగా ఉంది.

ఈ గుహప్రాంగణం నుంచి లోయలో ప్రవహిస్తున్న నది కనిపిస్తుంది. ముఖద్వారానికి ఇరువైపులా రెండు ఏనుగుల ప్రతిమలు కానవస్తాయి. శిల్పనిర్మాణ కౌశలంలో ఈ గుహ అత్యంత ప్రశస్తమయింది. ఇందులోని కుడ్య చిత్రాలు చాలా వరకూ కాలం కడలిలో జీర్ణించిపోయాయి. అక్కడ వున్న ఒక శాసనం ఆధారంగా ఇది అత్యున్నతమైన ఒక భిక్షువుకి కానుకగా ఒక మంత్రి సాయంతో, ఆరవ శతాబ్దం చివరిభాగంలో తొలచబడిందని తెలుస్తుంది. రెండవ గుహలో శిల్పించబడ్డ కొన్ని కథలకు ఇందులో కొనసాగింపుంది. సిద్ధార్థుని విద్యాభ్యాసం, విలువిద్య నేర్చుకోవటం రక్తమోడుతున్న ఎద్దు, పక్కనే నిరాశాపూరితుడైన రైతు శిల్పం ఉంది. బుద్ధుని వైరాగ్యానికి తొలిమెట్టుగా ఇది కానవస్తుంది.

సిద్ధార్థుని తల్లయిన మాయ, ఆమెకు వచ్చిన కలపై జరుగుతున్న చర్చ మరొక శిల్పం.

**17వ నెంబరు గుహ:** 17వ గుహలో హంస జాతకంలోని బాతులు, సింహళ విజయం, చిత్రించబడ్డాయి. గాయకులు ఆకాశంలో తేలిపోయే సుందర దృశ్యం కన్నులపండుగగా చిత్రించబడింది. ఇదే గుహలో బుద్ధుడు స్వర్గం నుండి సంకేసా వద్ద దిగటం – శ్రావస్తి మహిమ, విధుర పండిత జాతకం తో బాటుగా ప్రసిద్ధిగాంచిన తొలినాటి ఏడుగురు బుద్ధులయిన విపస్సి, సిఖి, వెస్సభ, కకుసంధ, కోనాగమ, కస్సప, గోతమ, ఇది కాక మైత్రేయగా రానున్న కాలంలోని బుద్ధుడు, బుద్ధునికి నాలాగిరి అనే ఏనుగు లొంగుబాటు చిత్రించబడ్డాయి.

ఇది ఇంచుమించుగా 16వ నెంబరు గల గుహలానే ఉంటుంది. ఇంచుమించుగా అదేకాలానికి చెందినది. అయితే ఈ గుహలో ఒక అంతస్థును కలిగి ఉండటము దీని ప్రత్యేకత. ఈ గుహ ద్వారబంధానికి ఇరువైపులా సుందరమైన స్త్రీ శిల్పాలు మనకు స్వాగతం పలుకుతాయి. కుడ్యచిత్ర కళకిదొక పెద్ద భాండాగారమని చెప్పవచ్చు. ఇందులోనున్న కుడ్యచిత్రాలు పరిణామంలో పెద్దవి. కొన్ని చిత్రాలు శిథిలం కాకుండా చూడదగ్గ రీతిలో వున్నాయి. ఈ గుహలోని గోడలపై, పైకప్పుపై ఎక్కడా ఒక్క అంగుళం మేర ఖాళీ లేకుండా చిత్రించ బడ్డాయి. పోర్టికో నుండి లోనికి వెళ్ళగానే ఎడమవైపు మనిషి జీవితంలో ఎదురు పడే కష్టసుఖాలు జీవన చక్రం అనే పేరుతో చిత్రించ బడింది. ఈ చక్రపు నమూనా టిబెటన్ల బౌద్ధంలో కనిపిస్తుంది. ఇందులో ఇద్దరు ప్రేమికులు ఒకరి పక్క మరొకరు ఆసీనులై ఉండగా పురుషుడు పానపాత్రను స్త్రీకి ఇవ్వచూపటం కనిపిస్తుంది. బుద్ధుని జ్ఞాతయిన దేవదత్తుడు బుద్ధుని అంతమొందించడానికి రెండు సార్లు ప్రయత్నించి విఫలుడై చివరి ప్రయత్నంగా మదించిన నాలాగిరి అన్న ఏనుగును బుద్ధుని పైకి పంపుతాడు. ఆ ఏనుగు బుద్ధుని ముందు మోకరిల్లటం ద్వారబంధానికి రెండవ వైపు చిత్రించ బడింది.

బోధిసత్త్వుడు ఏనుగుగా చేసిన ఆత్మ బలిదానం మరోచిత్రపు కథా వస్తువు. మరో చిత్రంలో బోధిసత్త్వుడు విశ్వంతర అన్న పేరుగల రాకుమారుడిగా జన్మించి, చేతికి ఎముక లేకుండా దానాలు చేస్తూ వస్తాడు. చివరకు

కోరినప్పుడు వర్షాలు కురిపించే మహిమాన్వితం గల భద్ర గజాన్ని కూడా దానం చేస్తాడు. దీనితో విసిగిపోయిన ప్రజలు అతన్ని రాజ్యభ్రష్టుని చేసి రెండు గుఱ్ఱాలు పూన్చిన రథాన్నిచ్చి దేశ బహిష్కరణ చేస్తారు. తన భార్యా, ఇద్దరు కుమారులతో ప్రయాణం చేస్తూ చివరకు గుఱ్ఱాలను, రథాన్నేకాక కుమారులను కూడా దానం చేస్తాడు. దానగుణ వైశిష్ట్యం తెలిపే ఈ చిత్రం మానవతా వాదానికి తలమానికగా కానవస్తుంది. ఇది ఇప్పటికే జీర్ణావస్తకు చేరుకుంది. కొంతకాలానికి పూర్తిగా కనుమరుగు కావచ్చు.

మరొక గొప్పచిత్రం సింహళుని శ్రీలంక విజయం. 500 మంది వర్తకులతో శ్రీలంకకు బయలుదేరిన సింహళుడు నౌకాభంగమై ఎలాగో తన పరివారంతో శ్రీలంక ఒడ్డుకు చేరుకుంటాడు. తరువాత లంకను జయించి రాజవుతాడు. ఈ గుహలో అద్దం చేతిలో పట్టుకొని ముస్తాబు అవుతున్న స్త్రీ, భిక్షాపాత్రతో నున్న బుద్ధుని కలిసిన యశోధర, రాహులుల చిత్రం అత్యంత ఆకర్షణీయంగా చిత్రించబడింది. రాహులుడు 7 సంవత్సరాల బాలునిగా తండ్రిని తన దాయా భాగమడగటం మనసుల్ని కదలిస్తుంది.


అప్సరస స్త్రీ: వసారా
17వ గుహ అజంత

**18వ నెంబరుగల గుహ:** ఇది అసంపూర్ణంగా నిలిపివేయబడినది.

**19వ నెంబరు గుహ:** అందమైన శిలకృతమైన ద్వారబంధం. లోపల అతిపెద్ద బుద్ధ విగ్రహాలు గుఱ్ఱపునాడా ఆకారంతో నున్న గవాక్షం దీని ప్రత్యేకతలు.

**20వ నెంబరుగల గుహ:** వరండా స్తంభంపై స్త్రీమూర్తుల విగ్రహాలు చెక్కబడినవి.

**21వ నెంబరుగల గుహ:** శిల్ప, కుడ్యచిత్రాలతో శోభిల్లే ఈ గుహ ఒక సమావేశ మందిరం.

**22వ నెంబరుగల గుహ:** అసంపూర్ణం

**23వ నెంబరుగల గుహ:** అసంపూర్ణం

**24వ నెంబరుగల గుహ:** వైశాల్యంలో పెద్దదయినా అసంపూర్ణంగా దీని నిర్మాణం ఆగిపోయింది.

**25వ నెంబరుగల గుహ:** అసంపూర్ణం

**26వ నెంబరుగల గుహ:** ఇది కొన్ని ప్రత్యేకతలు కలిగినది. 19వ నెంబరు గుహ కంటే ఇది విశాలమైంది. కుడి చేతిని తలక్రింద పెట్టుకొని *మహాపరినిర్వాణ* దిశగా పవళించిన అతి పెద్ద బుద్ధవిగ్రహం దీని ప్రత్యేకత. రాజులు, వారి దేవేరులు, పరివారం, బౌద్ధ భిక్షువులు బుద్ధుని చుట్టూ పరివేష్టించి ఉండటము శిల్పించబడింది. బుద్ధుని విషయ వాంఛలకు లోబరిచే మారుని ప్రయత్నం ఇందులో ఉల్బన శిల్పంగా రూపు దిద్దుకుంది. ఏనుగుపై ఉన్న మారుడు గౌతముని ఎదుర్కోవటం, పరాజయం పొందిన మారుడు వెనుతిరగటం- మారుని కుమార్తెలు తమ శరీర సౌందర్యంతో గౌతముని లోబరచుకొనే విఫలయత్నం చూడవచ్చు.

బోధిసత్త్వుని జన్మలకు, బుద్ధునికి జీవితానికి సంబంధించిన చిత్రాలు చిత్రించ బడ్డాయి. ఇందులో సామాన్య జనజీవనం విశేషంగా చిత్రించబడింది.

అజంత ప్రపంచ చరిత్రలో అతిప్రాచీనమైన చిత్రకళలో అగ్రగామి. క్రీ.పూ 2వ శతాబ్దం నుండి క్రీ.శ. 6వ శతాబ్దం వరకూ అప్రతిహతంగా సాగిన సుదీర్ఘ చిత్రకళా ప్రస్థానంలో, దీనితో ధీటైనది దీనిముందు నిలబడే చిత్రకళా వైదుష్యం మరెక్కడా కనిపించదు.

ఆదిమానవుని గుహాచిత్రాలు, తరువాత వచ్చిన చిత్రలిపి వీటి మధ్యకాలంలో అంటే క్రీ.పూ. 1500 సం॥లు నాటి నుంచి క్రీ.పూ. మొదటి శకం వరకూ వున్న ప్రపంచ చిత్రకళను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది.

ఈజిప్షియన్ చిత్రకళకు నమూనాగా మనకు ఈజిప్ట్‌లోని నెబామన్ సమాధి చుట్టూ కుడ్య చిత్రాలు వున్నాయి. మెస్సీరియన్ చిత్రకళకు ఉదాహరణగా టిల్‌బార్సిబ్ (705



వాల్టర్ స్పింక్

అజంత గుహ చిత్రాల గురించి మనం చెప్పుకొనేటప్పుడు, వాల్టర్ ఎమ్.స్పింక్, ప్రొఫెసర్ ఎమిరటస్, మిచిగన్ యూనివర్సిటీ గురించి తప్పకుండా తెలుసుకోవాలి. వాల్టర్ స్పింక్ ఫిబ్రవరి 16, 1928లో అమెరికాలో జన్మించారు. తండ్రి మసాచుసెట్స్ ప్రాంతంలో 250 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. స్పింక్‌కు చిన్నతనం నుంచి జానపద సాహిత్యమన్నా, జానపదులతో కలిసి తిరగటమన్నా ఎంతో ఇష్టంగా ఉండేది. తమపొలంవున్న ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మాణం కావటంతో అవన్నీ ముంపుకు గురికావటంతో కుటుంబం మొత్తం పట్టణానికి తరలి పోవలసి వచ్చింది. చిన్నతనంలో ఈ సంఘటన ఆయనపై తీవ్ర ప్రభావం చూపింది. ముంపుకు గురైన గ్రీన్‌విచ్ అన్న గ్రామంకోసం ఆయన ఆవేశంతో ఒక గేయాన్ని వ్రాశాడు. రైతు నేపథ్యం నుంచి పట్టణ వాతావరణానికి వచ్చినా ఆయన కదేమీ నచ్చలేదు. ప్రకృతిలో మమేకమవటంలో వున్న ఆనందం పట్టణ జీవితంలో దొరకక ఏదో కోల్పోయినట్లు అసంతృప్తితో ఉండేవాడు. ప్రకృతి అందానికి పరితపించే స్పింక్ బయాలజీ పాఠ్యాంశంగా చదివాడు. కొంతకాలం ఒక జూకు డైరెక్టరుగా పనిచేశాడు.

1949వ సంవత్సరంలో హార్వర్డ్ యూనివర్సిటీలో చరిత్ర–కళలు అన్నవిషయంపై కృషి చేశారు. అక్కడ ప్రొఫెసర్‌గా వున్న బెంజిమన్ రెలండ్ అనే ఆయనను కలిశారు. ఆయనకు భారతీయమైన చరిత్ర, కళలపై మక్కువ ఎక్కువ. ఆయన నుంచి స్పింక్ ప్రేరణ పొందారు. దానికి తగ్గట్టుగానే స్పింక్ భార్య నెస్టాకు. ఆమెకు చైనా చిత్రకళ అభిమాన వస్తువు. దీనితో భార్యాభర్తలిద్దరూ హనీమూన్‌కు భారతదేశం వచ్చి అలానే చాలా కాలం ఇక్కడే ఉండిపోయారు. మొట్టమొదట కలకత్తాలో, ఆ తరువాత బొంబాయిలో జీవించారు. బొంబాయిలో వున్నపుడు అజంత గుహల పట్ల ఆకర్షితులైనారు. అప్పటినుంచి సుమారు ఒక 50 సంవత్సరాల కాలంలో ఆయన ఎన్నోసార్లు అజంతా దర్శించాడు. ఆ పరిశోధన ఫలితంగా ఇప్పటి వరకూ అజంతకళపై Ajanta History and Development అనే పేరుతో ఆరు పెద్ద పుస్తకాలు వ్రాసి ప్రచురించారు (2006). ఆయన భారతదేశం ఎప్పుడు వచ్చినా ఊరుపేరులేని ఒక చిన్న గ్రామాన్ని ఎన్నుకొని అందులో నివసిస్తూ అజంత గుహలకు వెళ్ళి వస్తూ వుంటారు. ప్రతి సంవత్సరం అజంతాలో దేశవిదేశీ విద్యార్థులకు సైట్ సెమినార్‌ను 1970వ సంవత్సరం నుంచి 25 సంవత్సరాలు నిర్విఘ్నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొట్టమొదటగా ఉషోదయ కాలంలో విద్యార్థులతో పాటు ఒకటి రెండు గుహలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. తరువాత దానిపై అజంతా గుహల ప్రాంగణంలోనే చర్చ జరుగుతుంది. ఇది సూర్యాస్తమయం వరకూ సాగుతుంది. ఇలా ఒకటి రెండు వారాలు సాగుతుంది. దీనిని ఆయన Site seminar అని పిలుస్తారు. "మీరు గుహలోని ప్రతి అంగుళాన్ని జాగ్రత్తగా పరిశీలించండి. పరిశీలించిన దాన్ని అంత జాగ్రత్తగానూ విశ్లేషించుకోండి. మన ఆలోచనలు తప్పయినప్పుడు వాటిని మనఃఫలకం నుంచి తొలగించుకొని మరొక సరికొత్త ఆలోచనకు రూపుదిద్దుకోండి అంటారు". 1954వ సంవత్సరంలో ఆయనకు హార్వర్డ్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చింది. Rock cut monuments of the Andhra period styled and Chronology ఈ పరిశోధనా వ్యాసం ఆయనకు ఎంతగానో పేరు తెచ్చింది. 1956 నుంచి 1961 వరకూ ఆయన భారత దేశంలోనే ఉన్నారు. ప్రొఫెసరుగా ప్రపంచంలో అజంతను మించినది మరొకటి లేదన్నది ఆయన స్థిర అభిప్రాయం. తన వద్ద పరిశోధనలు చేసే విద్యార్థులకు స్వయంగా వండి, వడ్డించటం ఆయనకొక సరదా. సాయంత్రమంతా సంగీతం వినడంలో గడుపుతారు. మొజార్ట్, రవిశంకరుల సంగీతం ఆయనకు చాల ఇష్టం. 1960 నుంచి సిండ్రోమ్‌తో బాధపడుతున్నారు. దానివల్ల ఒక కాలు కుంటిదయింది. చేతులకు వణుకు వచ్చింది. ఇవేమీ ఆయన పరిశోధనలను అడ్డగించలేకపోయాయి.

బి.సి) చిత్రాలు మనముందున్నాయి. గ్రీసు కుడ్యచిత్రాలలో కానవచ్చే వేట, యుద్ధ దృశ్యాలు కీ॥పూ. 16వ శతాబ్దం నాటివి. ఆకారంలో చిన్నవైనా చితా భస్మపు పేటికల (Urns) చుట్టూ, పూలకుండీలపై వేయబడ్డ చిత్రాలు వున్నాయి. క్రీ॥పూ. 530కి చెందిన Tomb of the Augurus గోడలపై విశాలవంతమైన ఉద్యాన వనాలు సహజత్వానికి దగ్గరలో వుండే శైలిలో చిత్రించబడ్డాయి. రోమ్, పాంపే నగరాలలో కొందరు కులీనుల గృహాలలోని శయనాగారాలలో కొన్ని చిత్రాలు కనిపిస్తాయి. వీటి తరువాత చెప్పదగినది పార్థీనియన్ల (ఇరానియన్)ల చిత్రకళ. ఇది క్రీ॥పూర్వం 238కి సంబంధించినది. ఇక చైనా, జపాన్‌ల విషయానికి వస్తే క్రీ॥పూర్వం 1వ శతాబ్దం నాటికి చైనాలో చిత్రకళ సాధారణ స్థాయిలో ఉండేది. జపాన్‌లో చిత్రకళ చాలా ఆలస్యంగా మొదలయింది. అదికూడా జపాన్ చక్రవర్తులు చైనా చిత్రాలకు ఇష్టపడి ఆరీతిలోనే జపాన్ కళాకారుల చేత చిత్రాలు వేయించటంతో ప్రారంభమయిందని చరిత్ర చెబుతుంది. ఇదే

పరిస్థితి ఆగ్నేయ ఆసియా అంతా ఉంది. జెన్ బౌద్ధం క్రీ॥శ॥ 6వ శతాబ్దంలో చైనాలో మొదలయింది. అసలు చైనాలో చిత్రకళ ఒక గొప్ప కళారీతిగా రూపుదిద్దుకోవటానికి కారణం బౌద్ధమత ప్రవేశమేనని చరిత్ర చెబుతుంది. ప్రపంచంలో అప్పటి చిత్రకళ సమాధుల చుట్టూ తిరిగింది. అందులో ఎక్కువ భాగం పానగోష్ఠి, విందులు, విహారాలు, వేట, యుద్ధ దృశ్యాలే కాకపోతే రాసలీలలు. వీటన్నిటినీ విభేదిస్తూ అజంత చిత్రకళ మానవతా విలువలకు అద్దం పట్టింది.

అజంత చిత్రకళలో ఎక్కడా వేట, యుద్ధ దృశ్యాలు కానరావు. ఒక మనిషిని మరొక మనిషి హింసించటంగాని, జంతు బలులుగాని కనిపించవు. కరుణ, శాంతి ప్రధాన రసాలుగా రాజాంతఃపుర చిత్రాలు వున్నా వేటిలోనూ భౌతిక సుఖలాలస కనిపించదు. మానవ జీవితంలో నున్న దుఃఖం, తీవ్ర విషాదం కూడా కానరాదు. అంతా ఒక Positive thought. జీవితాన్ని క్రమబద్ధం చేసుకుంటే ఆనందమయంగా ఉంటుందన్న ఒక అంతర్లీన సందేశం ఇందులో కానవస్తుంది.

**27వ నెంబరుగల గుహ:** 27వ గుహలోని వెస్సంతర జాతకంలో దాన శ్రేష్ఠుడుయిన రాకుమారుడు తన రాణితో కలసి రాజమార్గంలో రథారూఢుడై వెళుతుండటము రాకుమారుని ఔన్నత్యం, ఋషిపుంగవుని నిరాడంబరత్వం ఉజ్వలంగా చిత్రించబడినవి. ఇందులో వివిధ వ్యాపారులు తమ వ్యాపారాలను నిర్వహిస్తుండటము చిత్రించ బడింది. ప్రాచీన భారతదేశపు ఆర్థిక జీవితాన్ని ప్రతిబింబించిన ఉజ్వల చిత్రమిది. చిత్రకళకు ముఖ్య అంగమైన రేఖాలాలిత్యంలోగాని, వర్ణక్రమం లేపనంలో గాని, ఉన్నతమైన అభిరుచితో కూడిన రసాస్వాదనలో గాని క్రీస్తు పూర్వం వచ్చిన అన్ని నాగరికతల చిత్రాల కంటే అజంత చిత్రకళ ఎవరెష్టు అంత ఎత్తయినది. అయినా ఎందుకో దీనికి రావలసినంత గుర్తింపు రాలేదనిపిస్తుంది. 20వ శతాబ్దపు ప్రారంభంలో ఆంగ్లేయులైన ఫెర్గూసన్, హేవెల్, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపాల్ అయిన కూల్డ్రే, ఆనంద కుమారస్వాములు వెలిబుచ్చిన అభిప్రాయాలు, వ్రాసిన వ్యాసాల వల్లే పాశ్చాత్యులలో కొంత మార్పువచ్చి, భారతీయచిత్రకళను అర్థం చేసుకొని ఆస్వాదించాలనే భావన కలిగింది.

20వ శతాబ్దపు మొదటి దశాబ్దం వరకూ ఐరోపా వాసులకు భారతీయ చిత్రకళ పై చిన్నచూపు ఉండేది. అది ఇంకా కొనసాగుతూనే వుంది. ప్రపంచ ప్రాచీన చిత్రకళకు సంబంధించి వివరణలతో కూడిన అనేక పుస్తకాలు చాల ఖరీదైనవి ప్రచురితమైనా, అజంత విషయానికొచ్చేసరికి ఎందుకో తప్పించుకునే ధోరణి కనపిస్తుంది. ఏది ఏమైనా అజంత అజరామం. అందులో మొదటి గృహచిత్రాలు వేసినవారు ఆంధ్రులవేనని ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. దానికి మనం ఆంధ్రులుగా, తెలుగు వారిగా గర్విద్దాం.

ఈ వ్యాస విస్తృతి పరంగా అజంతలోని శిల్పాలపై ఇంకా అనేక కుడ్య చిత్రాలపై విశ్లేషణలు ఎక్కువగా రాయటం జరగలేదు. ఎప్పటికైనా అజంత చిత్రకళపై తెలుగులో ఒక పుస్తకమే రావలసి ఉంది. స్థూలంగా అజంతలో కానవచ్చే శిల్ప భంగిమలు, అక్కడ వేయబడ్డ చిత్రాలలో కానరావు. శిల్పం, చిత్రం రెండూ భిన్న శైలులలో కనిపిస్తాయి. అజంతలోని చిత్రాలకు అమరావతిలోని శిల్పాలకు దగ్గర పోలికలున్నాయి. సాంచీ తోరణంపై నున్న సాలభంజికలు విసనకఱ్ఱరూపంలో ఉన్న శిరోవేష్ఠంతో ఉంటారు. ఇది మధురలోనూ, అమరావతి లోనూ కనిపిస్తుంది.

అజంత చిత్రకళలో ప్రతీచిత్రం ఒక కథ చెబుతుంది. ఇందులో వీరత్వం, శూరత్వం, లేనిపోని ఆడంబరాలు కానరావు. శృంగారం సహితం ఒక అలౌకికమైన ప్రశాంత తన్మయత్వంగా భాసిస్తుంది. చిత్రాలు ఎక్కువభాగం గౌతమ బుద్ధుని జీవిత గాథకు చెందిన ముఖ్యఘట్టాలు. మిగిలినవి బోధిసత్త్వుని కథలు. ఇవి ఆనాటి సాంఘిక జీవనానికి దర్పణం పడతాయి.

అజంత చిత్రాలలో మాయా, The black princes, అవలోకితేశ్వర, పద్మపాణి చిత్రాలలో కనిపించే ప్రశాంతత, ఐరోపాలోని పునర్వికాస చిత్రాలలో కానరానివి. ఈ పైచిత్రాలన్నీ *దావించి మైఖలాంజిలో* వేసిన చిత్రాలకంటే గొప్పవని అమృతాషేర్‌గిల్ అభిప్రాయపడటం ఒక కొసమెరుపు. ఆమెలా ఆలోచించే మరెందరో అజంత చిత్రకళకు ప్రాథమిక దశకాదు పరిణత దశ అని భావిస్తారు.

జె.గ్రిఫత్, "ఫ్లారెన్స్ చిత్రకారులు రేఖా విన్యాసంలో గొప్పవారు కావచ్చు. చిత్రకళలో వెనిస్ వారు రంగుల మేళవింపులో మెలుకువలు తెలిసిన వారు కావచ్చు. కానీ వీరెవ్వరి చిత్రాలు అజంత గుహలలో కానవచ్చే కరుణ, శాంతి రసాలకు మాత్రం సాటిరావు."



# అంతర్జ్జననం

– కె. శివారెడ్డి

ఎవరి కథయినా ఎక్కడ మొదలవుతుంది! పుట్టుక తోనే– అందరి పుట్టుకలు ఒకటి కావు. వారి వారి ప్రాంతాల నేపథ్యాల నుంచి – వర్ణం, కులం, ఆర్థిక స్థాయి – మొదలవుతుంది. ఇన్నేళ్ల తర్వాత, వెనుతిరిగి చూసుకొని – నా గురించి, నా సాహిత్య ప్రస్థానం గురించి మాట్లాడటం మొదలెడితే – దుఃఖ భరితంగానూ – ఆనందంగానూ – సంభ్రమాశ్చర్యంగానూ వుంటుంది. ఎన్నో పాయలు, ఎన్నో అంశాలు కలగలసి ఒక అవగాహనాధార ఏర్పడుతుంది. 'ఊహ' తెలిసినప్పటి నుంచి నిన్ను ప్రభావితం చేసిన పరిస్థితులూ, వ్యక్తులూ–విద్యా–నిన్ను తీర్చి దిద్దటంలో ఒక నిర్ణాయక పాత్ర తీసుకుంటాయి. సమాజంలో పుట్టి పెరుగుతున్న ప్రతివాడికీ– సామాజిక స్పృహ వుందనుకుంటాం – అది సరికాదని (కరెక్ట్) నువ్వు ఎదిగే కొలదీ చుట్టూ సమాజాన్నీ – సమాజ పరిణామాన్ని – ఒక సమాజపు చోదక శక్తులేమిటో అర్థమయ్యాక పుట్టుకతో వచ్చేది వర్ణ స్పృహ లేదు కులానికి, నీ ప్రాంతానికి సంబంధించిన స్పృహ మాత్రమే అని అర్థమౌతుంది.

ఒక రచయిత, లేదు కవి సృజనలో అతని నేపథ్యం ప్రధాన పాత్ర వహిస్తుంది. మూలాలు చాల బలంగా లోతుగా వుంటాయి. ఒక కవి తదనంతరం అనేక మార్పులకు లోనయి, అనేక పరిణామాలు జరిగి ఎదుగుతున్న క్రమంలోనూ – అతని నేపథ్యపు మూలతత్త్వం అంతరించదు. అది అంతర్లీనంగా అతని సృజన అంతటా అదృశ్యంగా పరచుకుని వుంటుంది. ఒక కవి కవిత్వం భాష– అతని నిర్ణయాలు (డెసిషన్స్) ఏర్పడే క్రమంలోనూ దీనిది పరిహరించలేని పాత్ర. తర్వాత తన చదువు అధ్యయనం – కొత్త దర్శనాలు, తాత్త్విక ధోరణులు, ప్రాపంచిక దృక్పథాలు, సామాజిక అవగాహనా క్రమంలో– నీ పదసముదాయం, కవితా భాష ఏర్పడి అభివృద్ధి చెందుతుంది. అప్పుడు కూడ నీ వేళ్ళు జీవసారం, నీ కవిత్వంలో ప్రతిఫలిస్తుంది. జీవితపు విశ్వరూపం ప్రత్యక్ష మయ్యేకొలది, సమాజ వైరుధ్యాలు, వైవిధ్యాలు అంతుబట్టే కొలది, కవి, వస్తు రూపాలు విస్తృతమవుతాయి – విశాలమయి, వైవిధ్య భరిత మౌతాయి. తనకీ తనచుట్టూ వున్న మనుషులతో, తన చుట్టూవున్న సమాజంతో నిత్యం ఘర్షణే – సృజన నిరంతరం కొనసాగి, ననలు వేస్తుంది.

మాది తెనాలి దగ్గర ఒక చిన్న పల్లెటూరు. కార్మూరు వారి పాలెం – కార్మూరు ఇంటిపేరున్న కుటుంబాలున్నాయి. మా అమ్మ ఈ కార్మూరు ఇంటి పేరుగలిగిన వారి ఆడపడుచు. మా ఇంటిపేరు కొల్లి. కింద మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. రెండు, మూడెకరాల పొలం కింద మధ్య తరగతి రైతు – రైతుకూలీతో సమానం. తనూ పొలంలో దిగి పనిచెయ్యాల్సిందే. ఒడ్డున గనెం మీద కూర్చుని పని చేయించుకునే కుటుంబం కాదు. పని చేయించుకునే కుటుంబానికీ, పని చేసే కుటుంబానికీ తేడా వుంటుంది. ఈ ఇద్దరిదీ ఒక కులమయినా ఒక Culture గాదు. చాలా వాటిని, నీ సామాజిక కార్యాచరణ నిర్ణయిస్తుంది. నాకు ఐదారేళ్ళప్పుడు మా అమ్మ చనిపోయింది. మా నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. నా కొక తమ్ముడు. అమ్మ చనిపోయినపుడు వాడికి మూడేళ్లుండ వచ్చు. మా అమ్మ టి.బి. తో ఒక సంవత్సరం పైగా బాధపడి చనిపోయింది. ఆమెని బతికించుకుంటానికి, ఆమెని రాజమండ్రి శానిటోరియంలో ఒక సంవత్సరం వుంచాడు మానాన్న. ఒక అరెకరం పొలం

కె. శివారెడ్డి, ఫోన్ : 040-24064195

అమ్మాడు. బండీ, ఎడ్లూ అమ్మాడు. మా అమ్మ చనిపోయేసరికి కుటుంబం అప్పుల్లో మునిగి పోయింది. మా నాన్నకి శుక్లాలు వచ్చాయి. నాకు బాబాయిలిద్దరు. మానాన్న కంటే చిన్నవాళ్ళే-మా పెద్ద బాబాయి యిల్లరికం పోయి, భార్య చనిపోయిన తర్వాత తన ఇద్దరి పిల్లల్ని తీసుకుని మావూరు వచ్చి మా రెండో బాబాయి ఇంట్లోనే వుండేవాడు. రెండో బాబాయికి ఒక కొడుకు-పెద్ద బాబాయికి ఒక కూతురు, ఒక కొడుకు. మా నాయనమ్మ వుంది; మా రెండో బాబాయి దగ్గరే వుండేది. మమ్మల్ని కనిపెట్టుకుని వుండేది. ఈ సోదంతా ఎందుకంటే-ఏ దుర్భరసితిలో ఒక పిల్లవాడు ఎదిగాడు, యుద్ధంచేశాడు; పరిస్థితులతో పోరాడి ఎంత దూరం ప్రయాణించాడు; తదుపరి అతని కవిత్వం నిండా నిండి నిబిడీకృతమయినదేమిటి? అని చెప్పటానికి –

గోర్కీ అన్నట్టు బాల్యం లేని బాల్యం నాది. మా అమ్మ చనిపోయిన దగ్గర నుంచీ, యింటిపని, పొలంపనీ, పశువుల పనులు అన్నీ నెత్తిమీద పడ్డాయి. తర్వాత అనేక యుద్ధాలందు ఆరితేరటానికి మూలం. తల్లిలేని పిల్లాడు, ఆర్థిక వసతి లేని పిల్లాడు – ఎంత దీనంగా ఎంత దరిద్రంగా బతికాడో అర్థం చేసుకోవచ్చు. కానీ, చిన్నతనం నుంచీ అర్థించటం కానీ, లొంగి వుండటం కానీ అలవడ లేదు.

బహుశ మానాన్న నుంచి సంక్రమించిన లక్షణం గావచ్చు. ఇంటిపనీ, వంటపనీ, పొలంపనీ అన్నీ చేసుకుంటూ ఈదు కొస్తున్న తరుణంలో చదువుకోవాలనే కోరిక. "ఎలారా నువ్వు బడికి వెళ్తే- ఈ పనులన్నీ ఎట్టారా" అని మానాన్న. ఆయనకీ చదువంటే ప్రేమే-ఆయనో గొప్ప గాయకుడు. మా రెండో బాబాయి పద్యాలు అద్భుతంగా పాడేవాడు-వర్షాకాలం, ముసురు పట్టినపుడు నన్ను తన ఒళ్లో కూర్చో పెట్టుకుని హరిశ్చంద్ర పద్యాలు నేర్పేవాడు. మా నాన్న, తల్లి లేని పిల్లలయిన మమ్మల్నిద్దరినీ చెరో పక్క వేసుకుని తెల్లార్లూ భజన కీర్తనలు పాడేవాడు.

చెరువు పక్క తాడి చెట్ల కవతల పొద్దు పొడవటాలు-వరిపొలాల కవతల పొద్దుగూకటాలు- చావిళ్ళలో పశువులు మేత తినే చప్పుళ్ళు, ఊరు మొత్తం ఒక చెరువులానో, తాటితోపులోనో కొట్టుకోవటాలు, విచ్చుకోవటాలు-వర్షాకాలాలు మట్టి డొంకల బురదలు, చీకటి నిండిన యిళ్ళూ-కాలవలూ, పంటపొలాలు, రైతుకూలీల పాటలు, జానపదకథలూ-ఓహో-ఏమి జీవితం-ఎక్కడా వైదొలగలేదు. అంతా నాలో యింకి పోయి-తవ్వుతుంటే తేగలు బయట పడ్డట్టు- తర్వాత కవిత్వం చెప్పటం మొదలయ్యాయి- అన్ని సంగతుల సందర్భాలు బయటపడ్డాయి. అలా మొదలయిన నా చదువు. దగ్గరలో – ఒక అయిదు కిలో మీటర్ల దూరంలో వున్న కూచిపూడి స్కూలుకు పోవటం, రావటం – అన్ని పనులు చేసి టిఫిను పెట్టుకుని స్కూలు కెళ్ళటం – మళ్ళా సాయంత్రం అయిదింటికొచ్చి అన్ని పనులూ చేసుకోవటం. ఇప్పుడు వెనుదిరిగి చూసుకొంటే – నేనేనా అన్ని పనులు చేసింది, యింత దూరం నడిచి వచ్చింది అన్పిస్తుంది.

ఏ ఆర్తి, ఏ స్ఫూర్తి, ఏ ధైర్యం, ఏ మొండితనం నన్నింత వరకు తీసుకు వచ్చాయో – వాటన్నిటికి పాదు ఆ చిన్న వయసులోనే పడింది. నేను కవిగా మొలవటానికి బహుశ రెండు కారణాలు – ఒకటి మా వంశంలో వున్న గానకళ – రెండు మా పెదనాన్నగారి అబ్బాయి మా అన్నయ్య వెంకటరామరెడ్డి – లైబ్రరీ కారణ మనుకుంటాను. సంగీత కారుణ్ణి కావాల్సిన వ్యక్తిని కవినయ్యాను. ఆ ఒంటరితనం, ఆ దుఃఖ భరిత సందర్భం నుంచి, నన్ను నేను విముక్తుణ్ణి చేసుకోవటానికి కవిత్వం ఎక్కువ ఉపయోగ పడిందనుకుంటా. మామూలు, జీవితంగాదు – మామూలు యుద్ధంగాదు. ఏడో తరగతిలో వుండగా మా తెలుగు మాస్టారు – జాస్తి శ్రీ రాములు గారు – పద్యం చదివి, విపులీకరించి, విశదీకరించే పద్ధతీ – నన్ను ఆకట్టుకుని తెలుగు పట్ల మమకారం పెంచుకునేట్టు చేసింది. ఆయన చంధస్సు నేర్పారు.

అప్పుడే మొదలయింది రాయటం – వున్న పదజాలంలో, తెలిసిన మాటలతో పద్యాలు రాయటం – చదవటం. మా అన్నయ్య దగ్గర వున్న గ్రంథాలయాన్ని కొల్లగొట్టాను. ఆ రోజుల్లో ఆ మారుమూల పల్లెటూరికి ఆయన క్రమం తప్పకుండా ఆంధ్ర పత్రిక వార పత్రిక, దినపత్రిక తెచ్చేవాడు. అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సాహిత్యం, కథాసాహిత్యం – అనువాద సాహిత్యం – అంతా ఆయన గ్రంథాలయంలో వుండేది.

ఆయన శరత్ మీద అథారిటీ. వచనం అద్భుతంగా చదివేవాడు. శ్రీనివాస శిరోమణి రాస్తున్న రామాయణం అందర్నీ కూర్చొబెట్టి అద్భుతంగా చదివి విన్పించేవాడు. ఎస్.యల్.సి అయిపోయే లోపల అర్థమయినా కాకపోయినా

శరత్, జైనేంద్రకుమార్ దగ్గరనుంచి, శ్రీపాద, చలం, లత, గోపీచంద్, బుచ్చిబాబు యిత్యాదుల్ని చదివేశా. శెలవుల్లో అన్నంతిని, ఒక నవల తీసుకుని సావిట్లోకి పోయి బండితొట్టిలో పడుకుని సాయంత్రానికి నవల చదివేసే వాణ్ణి. రాత్రికూడా పొద్దు పోయిందాకా – అందుకే అపుడపుడూ చెబుతూ వుంటా – వచనం నుంచి కవిత్వంలో వచ్చిన వాణ్ణని. బహుశ నా స్వభావమూ కవితా ప్రక్రియకు సరిపోయిందను కుంటా– ఉద్వేగ భరిత స్వభావం – కోపిష్టి లక్షణం – వెంటనే wild గా react అయ్యే లక్షణం – బహుశా నన్ను కవిని చేశాయేమో– చదువు ఎప్పటికప్పుడు ఆగిపోతుందనే భయం– కారణం ఆర్థికమే. అయితే చదువు పట్ల నా కున్న శ్రద్ధా పట్టుదల చూసి, మా కజిన్ బ్రదర్ సపోర్టుగా నిలబడ్డాడు. ఈ చదువు కొనసాగటానికీ సాహిత్య వ్యసనం కొనసాగటానికీ ఆయన ప్రత్యక్ష పరోక్ష అండ దండలు కారణం – కవిత్వం మీద ప్రేమ –Medicine చేయకుండా బి.ఎ. double literature తో చేసేట్టు చేసింది. History, English literature, Telugu Literature ఇదీ కాంబినేషన్–

మాకు ప్రబంధాలు బోధించిన గురువుగారు దర్శనాచార్య కొండూరి వీరరాఘవాచార్యులు గారు. ఆముక్తమాల్యద, వసుచరిత్ర, ఆయన క్లాసులో పాఠాలు చెబితే – బయట తెనాలి త్రిపురనేని రామస్వామి గ్రంథాలయంలో కళా పూర్ణోదయం, ప్రభావతీ ప్రద్యుమ్నం లాంటి ప్రబంధాలు అనేకం ఆ రోజుల్లోనే involve అవుతూ పద్య సాధన చేసిన రోజులు – ప్రబంధ శైలిలో పద్యాలు రాయటానికి ప్రయత్నాలు. విస్తృతంగా clasical literature చదవటాలు. అదొక పద్య సాధన దశ.

గురువుగారు క్లాసులో పద్యం నెమ్మదిగా చదివి, విపులీకరించి, విశ్లేషించి, ముగింపుగా మళ్ళీ చదివే వారు. ఆయన రెండో మారు పద్యం చదివే సరికి మాకు నోటికి వచ్చేట్టు సాధన చేసేవాళ్ళం. కొన్నాళ్ళ తర్వాత ఆయన రెండో సారి పద్యం చదవగానే మేము అప్పచెప్పేవాళ్ళం. కాలేజీ 3, 4 కిలోమీటర్ల దూరంలో వున్నా రూం నుంచి కాలేజీ వచ్చేలోపల, ఎన్ని పద్యాలు గుణించుకుంటూ కాలేజీకి రావటం. మధ్యాహ్నం విరామంలో బోర్డుపై రాయటం. ఏదో ఒక వస్తువనుకుని పద్యాలు చెప్పటం – intervel అయ్యాక ఆచార్యులు గారి క్లాసుండేది, లేదు సాల్మన్ రాజు అనే మేడం క్లాసుండేది. క్లాసు ఎవరిదయినా – బోర్డు మీద పద్యాలు చదివి – దిద్దేవారు – 'ఎవరయ్యా రాసింది, బాగున్నాయి' అనేవారు ముఖ్యంగా కొండూరి వీరరాఘవాచార్యుల వారు సూచనలిచ్చి వివరించేవారు. కాలేజి మాగజైన్‌లో మొదటి సంవత్సరం ఒక కథ, రెండో సంవత్సరం మా అమ్మమీద రాసిన పద్యాలు ఒక పాతిక అచ్చయ్యాయి. ఆ మూడు సంవత్సరాలు చదవటం, ధారణచేయటం, కొత్తపద్యాలు రాయటం – ఆధునిక కవిత్వం గొడవ లేమీ లేవు– తెలియవు– మా గురువు లెవ్వరూ ఆ ప్రసక్తి తెచ్చేవారు కారు.

తర్వాత తెలుగు ఎం.ఎ చేయాలని తపన పడ్డా. తెలుగు ఎం.ఎ చేస్తే భాషాధికారం వస్తుందనీ, ఉత్తరోత్తరా అది కవిత్వ పరిపుష్టికి పనికి వస్తుంది. తెలుగు ఎం.ఎ ఉస్మానియాలో చేయటానికి మొదటిసారి మా అన్నయ్యను తీసుకుని హైద్రాబాదు వచ్చా. నేను వచ్చిన క్రితం రోజే Extend చేసిన తేది కూడా అయిపోయింది.

తర్వాత ఆంధ్రాయూనివర్సిటీలో ఆంగ్లంలో ఎం.ఎ చేశాను. 64-66 ఆ రెండు సంవత్సరాలు – ఆంధ్రాయూనివర్సిటీ, పామ్ బీచ్ – వెన్నెల సముద్రం – విశాఖ – కొత్త అనుభవం – సముద్రపు హోరు హాస్టల్ రూంకే వినిపించేది. గదిపక్కనే సముద్రమున్నట్టు. జీడిమామిడి తోటలూ – చెట్లకింద చదువుతూ–పకృతితో సరససల్లాపాలు– నెలకు పదిహేను రోజులు – బీచ్‌లోనే – శుక్లపక్షం మొత్తం కృష్ణశాస్త్రి కవిత్వం, ఎంకిపాటలు – అదొక అద్భుతమయిన జీవితం – మావూరి తర్వాత నేనెక్కువ ప్రేమించింది విశాఖనే. విశాఖ అపుడు ఒక పెద్ద గ్రామం.

వావిళ్ళ వారి పుస్తకాల షాపు – చాల్‌ట్రీ, జగదాంబ జంక్షన్ – ఈ నేపథ్యం నుంచి – పద్యాలు, పాటలు– ఆ రెండు సంవత్సరాల్లో ఒక పుస్తకానికి సరిపోతాయి. హైద్రాబాదు వచ్చిన కొత్తలో పుస్తకం వేద్దామని ఆలోచన. వేయక పోవటం మంచిదయింది. విశాఖలో వున్నన్నాళ్ళు *భారతి, స్రవంతి* లాంటి పత్రికలు చదవటం తప్ప వేరే సాహిత్య పుస్తకాలు చదివింది తక్కువ. II Class తెచ్చుకోవటం ముఖ్యం 50% రాకపోతే లెక్చరరు అవ్వటానికి అర్హత రాదు. ఆ రెండు సంవత్సరాలు దృష్టంతా దాని మీదే.

66లో ఎమ్.ఏ. English II Class లో పాసయ్యి Marks List తీసుకుని హైద్రాబాదులో కాలుపెట్టాను.

కవిత్వం కొరకు హైద్రాబాదు వచ్చాను. ఉద్యోగం కోసం కాదు. నేను చదువుకున్న కాలేజీ V.S.R College తెనాలి వాళ్ళు పిలిచారు. Govt. college లో appointment వచ్చింది. మొదట నిజామాబాద్ తర్వాత గద్వాల్ గవర్నమెంట్ సర్వీస్‌లో చేరలేదు. దృష్టంతా కవిత్వం మీద; ఆ వయసులో 23,24 ఏళ్ల వయసులో కవిత్వాభివృద్ధికి, కవి ఎదుగుదలకీ హైద్రాబాదు కేంద్రమనీ అది అన్నింటినీ కలిపే ఒక జంక్షన్ అనీ. అపుడా నిర్ణయం మొండిగా చేసిందే, ధైర్యంతో చేసిందే. ఆనాటి శివారెడ్డి లోకానికి తెలియదు. కాలేజీ మాగజైన్‌లో అచ్చవడం తప్ప. కవిత్వం పట్ల అపారమయిన ప్రేమ: ఒక ఉద్విగ్న భావం – గాఢ ప్రేమికుడికి ఉండే ఒక ఉన్మాదపు స్వభావం – పనిచేశాయి. భవిష్యత్తులో నేనేమవుతానో నాకు తెలియదు. కవిత్వం సంగతి తేల్చుకోవాలి. అది సవాలు. అందుకే, ప్రభుత్వోద్యోగాలు కాదని, V.V college లో చేరా.

అంతకు ముందు కొన్ని నెలలు బహుశ ఐదారు నెలలు అన్వర్ ఉలుమ్ నైట్ కాలేజీలో చేశా. అది కూడా ఒక అదృష్టమే. ఎందుకంటే అక్కడే ఎమ్.ఎల్. నరసింహారావు, శ్రీకృష్ణదేవరాయ గ్రంథాలయ కార్యదర్శి ఎస్.వి. రామారావు పనిచేసేవాళ్లు. అపుడే శ్రీకృష్ణ దేవరాయ భాషానిలయంలో కవి కథకులు సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఎమ్.ఎల్. నరసింహారావుగారు నన్ను చదవమని, మహామహులొస్తున్న ఆ సభలో ఒక అనామక కవి చదవట మేమిటని నేను, 'నువ్వు కవివయ్యా – చదువు ఏంగాదు' అని ప్రోత్సహించటం ఆనాటి అద్భుత సభలోనే, సి.నారాయణ రెడ్డి, దాశరథి, వీర్రాజు, బుచ్చిబాబు, సింగరాజు లింగమూర్తి, కుందుర్తి వీరందరినీ తనివితీరా చూసింది. అప్పటికి వాళ్లందరూ లబ్ద ప్రతిష్టులు– ఆయా రంగాల్లో నిష్ణాతులు – Towering Personalities ఒక సంభ్రమం, ఒక ఆశ్చర్యం, ఒక ఆనందం, అపుడు నేను Ousmania University దగ్గర్లో మిత్రుడు సీతారాం రెడ్డి ఇంట్లో ఉండే వాణ్ణి.

యూనివర్సిటీ రోడ్లన్నీ తెల్లరేటప్పటికి పున్నాయి పూలుతో నిండిపోయేవి. అద్భుతమయిన దృశ్యం. రోడ్డంతా పూలు ప్రవాహమయినట్టు – దట్టమయిన ముదురు వెన్నెల పరిచినట్టు – ఈ దృశ్యాల మీద మాత్రా చంధస్సులో రాసిన కవిత గానం చేశా నారాయణ రెడ్డి గారికి గుర్తుండి వుండదు. దగ్గరకు పిలిచి, 'కవిత్వం గానం చేయకూడదు – recite చేయాలి. చాలా బాగుంది' అన్నారు. నేత పత్రిక – వారపత్రిక ఎడిటర్ పి.వి. రామనరసయ్య ఆ సభలోనే పరిచయం. తర్వాత నేత వారపత్రికలో నా తొలి కవితలు అచ్చయ్యాయి. నేత వారపత్రిక ఆఫీసులోనే మహాస్వప్నని చూశాను. కాలేజీ అయిపోయిన తర్వాత – ఇంటికి పోతూ పోతూ information office లో శీలా వీర్రాజుని, తద్వారా కుందుర్తి, గోపాల శాస్త్రి, చలసాని ప్రసాదరావుని కలిసే వాణ్ణి. చలసాని అపుడు ఆ Department లో ఆర్టిస్ట్‌గా పని చేసేవారు. అలా కిందికొస్తే Radio Station, ఎదురుగ్గా అసెంబ్లీ – అక్కడ అసెంబ్లీలో పనిచేసే నవలా రచయిత – సింగరాజు లింగమూర్తి, ద్వారా నగ్నముని పరిచయం. అక్కడే యితర దిగంబర కవులూ, ఆయన ద్వారా వేగుంట, స్మైల్ తదితరుల పరిచయం. అప్పటి దిగంబర కవుల దిగంబర కవిత రెండు సంపుటాలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఒక సంచలనం సృష్టించాయి. చర్చలు వాదోపవాదాలు జరుగుతున్నాయి. మూడో సంపుటిలో రాబోయే నగ్నముని కవితలు చదివి విన్పించేవారు – గంభీర స్వరంతో–

1967లోని సంగతులు – ప్రపంచం రెండుగా విడిపోయింది. చైనా, రష్యా రెండు క్యాంపులుగా – కమ్యూనిస్టులు భావజాల పరంగా చర్చలు – వాదోప వాదాలు; మార్క్సిజాన్ని ఆయా దేశాలకు అన్వయించే విషయంలోనూ, అభివృద్ధి చేసే విషయంలోనూ – అనేక సైద్ధాంతిక చర్చలు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చీలిపోవటం – వామ పక్ష భావజాలపు పార్టీల ఉత్పన్నం. మరొక్క సారి వర్గపోరాటం ఎజెండాలోకి దిగంబర కవుల మూడో సంపుటిలో మార్క్సిజపు స్పర్శ – వర్గ పోరాటాన సాగిన సూచించే కవితలు.

యజ్ఞం కథావిర్భావం. నగ్జల్ బరీభూపోరాటం ప్రారంభం. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం కేంద్రంగా దాని ప్రభావాలు, ప్రతి ఫలనాలు. అనంతరం అది కరీంనగర్, ఆదిలాబాద్, గోదావరి లోయ దాక అల్లుకోవటం. శ్రీశ్రీ షష్ఠిపూర్తి, విశాఖ విద్యార్థుల సవాల్ – సెవెన్ స్టార్స్ సిండికేట్, శ్రీశ్రీని సన్మానించ బూనటం – విరసం ఆవిర్భావం – దాని Manifesto.

ఇదీ 67ల నుంచి 70ల దాకా ఆంధ్రప్రదేశ్ సాహిత్య రాజకీయ రంగంలో తొంగిచూసిన స్థితి. ఫక్తు పల్లెటూరి వాడిగా నా కంతా అయోమయం. ఏది, ఏమిటి–ఎందుకు అని వివరంగా చెప్పే వాడు లేడు, నాకు దొరకలేదు. దొరికిన

వాళ్ళు నా తృష్ణ తీర్చలేదు. ఇక చదవటం మొదలుపెట్టా. మొదట మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాలు-'కమ్యూనిస్టు మ్యానిఫెస్టో' మొదలు పెట్టి-భౌతికవాదం, గతితార్కిక భౌతికవాదం, లెనినిజం, మావోయిజం-యిలా దొరికిన సిద్ధాంత గ్రంథాలన్నీ చదివి అర్థం చేసుకుంటూ-భారతదేశ సమాజానికి అన్వయించి చూసుకోవటం-

నా జీవితాన్ని సాహిత్య జీవితాన్ని మలుపు తిప్పిన పుస్తకం - కమ్యూనిస్ట మ్యానిఫెస్టో - అది నా ప్రాపంచిక దృక్పథాన్ని మార్చి వేసింది - కింద మధ్య తరగతి వ్యావసాయిక కుటుంబం నుంచి వచ్చిన నా మీద అనేక ప్రభావాలు - అశాస్త్రీయ ధోరణులు - వాటన్నింటినీ అది వడకట్టింది. ఒక స్పష్టమయిన చూపు నిచ్చింది. ప్రపంచాన్ని, దాని వర్గాలను, వర్గ స్వభావాలను కుటుంబం, పెట్టుబడి, భూ స్వామ్య విధానం దాని స్వభావం - పెట్టుబడి దాని స్వభావం - దాని సంస్కృతి- యిలా ఎన్ని విషయాలు నిన్నటి దాకా అయోమయంగా అర్థం కాకుండా వున్న విషయాలు చాలా అర్థమయ్యాయి. ఆ సందర్భంలోనే ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష భావజాల ప్రభావపు గొప్ప రచయితల్నీ, కవుల్నీ, చదవడం- అర్థం చేసుకోవడం - సిద్ధాంతంవేరు; సిద్ధాంతాన్ని అర్థం చేసుకుని, చుట్టూ వున్న సమాజానికి అన్వయించి - జీవనాను భవాన్ని కళగా మార్చటం - కవిత్వం చేయటం వేరు అన్న విషయం బోధపడటం-

అపుడే తెలంగాణాలో విద్యార్థి ఉద్యమాలు ప్రారంభమయి, పరివ్యాప్తి చెందే దశ. విద్యార్థులు గ్రామాలకు తరలండి అనే నినాదం. అది P.D.S.U కానీ R.S.U కానీ - అవి వ్యాప్తి చెందే క్రమంలో నేను విస్తృతంగా తిరగటం - విద్యార్థుల నుద్దేశించి మాట్లాడటం కవిత్వం చదవటం - ప్రైమరీ స్కూలు, హైస్కూలు, జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, సాహిత్య సంస్థలు - అన్నింటా అంతర్భాగమై కదలటాలు వాతావరణమంతా వేడెక్కి ఉండేది. ఎక్కడ చూసినా ఘర్షణే - పోరాటాలే.

కరెక్ట్‌గా రావాల్సిన సమయంలో హైదరాబాదు రావటం - దూకాల్సిన సమయంలో అన్ని రకాల ఉద్యమాల్లో దూకటం - విస్తృతంగా సైద్ధాంతిక గ్రంథాలు, సాహిత్యం - ముఖ్యంగా కవిత్వం చదవటం - రాయటం - నిన్నటిదాకా కవిత్వ సాధన - అంటే పద్యసాధన చేసిన వాణ్ణి. వచన కవిత్వంలోకి దిగటం - పరిపూర్తిగా పాత దోవని వదలాల్సి వచ్చింది. వస్తు రూపాల్లోనూ; భాష పరిపూర్తిగా మార్చాల్సి వచ్చింది. పద్య రచనకి కావాల్సిన సాధన వేరు. భాషవేరు. వామపక్ష భావజాలపు నేపథ్యం నుంచి ప్రపంచాన్ని అర్థం చేసుకుంటూ - సమాజాన్ని దాని సకల వైరుధ్యంతో అనుభూతం చెందుతూ కవిత్వీకరించటానికి కావాల్సిన - భాషాశిల్పాలు వేరు. అందుకని, దరిదాపు పదిసంవత్సరాలు నిష్ఠతో సాధన చేసిన దాన్ని వదిలి, కొత్త మార్గం తొక్కాల్సి వచ్చింది? కొత్త వస్తువు, కొత్త భాష, కొత్త వ్యక్తీకరణాలు - వ్యూహాలూ శైలీ అవసరమయ్యాయి. ఈ మారిన ప్రాపంచిక దృక్పథం నుంచి లోకాన్ని విశ్లేషించుకుంటూ - అన్వయించుకుంటూ, అనుభూతి చెందుతూ రాసి, అచ్చయిన కవితల్లో, కొన్నిటిని ఎంపిక చేసి 1973లో వేసిన పుస్తకం *రక్త సూర్యుడు* 70 నుంచి 72 దాకా *వేకువ* అనే త్రై మాసిక నడిపాను. నన్నిందులోకి దింపిన వాడు యిప్పుడు కృష్ణాజిల్లా రచయితల సంఘంబాధ్యుడు - మిత్రుడు గుత్తికొండ సుబ్బారావు - నువ్వు ఎడిట్ చేయి చాలు, తత్తిమ్మా వన్నీ నేను చూసుకుంటా నన్నాడు. అతనికి ఎల్.ఐ.సి లో ఉద్యోగం రాకుండా వుంటే, మచిలీపట్నం పోకుండా వుంటే - ఆయనన్నట్టు తానే చూసుకునే వాడు. కవీ, సాహిత్య కార్యకర్త. *స్పందన* అనే సంస్థను మచిలీపట్నంలో నెలకొల్పి, దిగ్విజయంగా నడిపాడు - ఆయనెళ్లిపోతే ఆ బాధ్యత మొత్తం నామీద పడింది.

అలా 6 సంచికలు, రెండేళ్ళు వేకువ సమరం. అదొక అనుభవం. అదొక వేదికగా నడపాలని నా కోరిక. అదొక చర్చా వేదిక కావాలని, అన్ని విషయాలు ప్రజా స్వామికంగా చర్చించుకుంటానికి అది కేంద్రం కావాలని. ఆరోజుల్లోనే భారతి లో కవితలు రావటం - శివలెంక శంభు ప్రసాద్ గారి పరిచయం. పుస్తక సమీక్షలు- విస్తృతంగా చదవటం, రాయటం- విరసం ఏర్పడ్డాక నేనందులో సభ్యుణ్ణి కాదుగానీ, అంతకంటే ఎక్కువగానే మమేకమయ్యాను.

ఆ క్రమంలో అరసం మిత్రులు, విరసం మిత్రులు - అందరూ నాకు సన్నిహితులే. నగ్నముని అన్నట్టు నేను సంపాదకుడిగానే మిగలటం - యిష్టం లేక వేకువ ఆపేశా- దాని బాధ్యత తక్కువేమీ కాదు. ఇప్పటి శివారెడ్డి వేరు. అప్పటి శివారెడ్డి వేరు. వేరంటే యింత మందీ మార్బలం లేదు. ఒక రకంగా ఒంటరి పోరాటం. కవిత్వం నా సర్వస్వం. దానికోసమే

హైద్రాబాదు వచ్చాను. జీవిక కోసం ఒక ఉద్యోగం– నా అదృష్టం బాగుండి; అద్భుతమయిన కాలేజి – వివేక వర్ధని కాలేజిలో – చేరటం. యజమాన్యం మహారాష్ట్రీయులు– ఆర్య సమాజపు నేపథ్యం నుంచి వచ్చిన వాళ్ళు. ఒక విధమయిన ప్రజాస్వామ్యం ఉండేది. నా కవిత్వం, నా యుద్ధాలు, నా భావజాలమూ – కాలేజీకి పోలీసులు వచ్చిపోవటాలు అన్నీ తెలిసీ, నన్నెపుడు యిబ్బంది పెట్టలేదు. Harass చేయలేదు. నన్ను గర్వంగానే Project చేసేవాళ్లు.

ఆ క్రమంలో అరసం మిత్రులు, విరసం మిత్రులు – అందరూ నాకు సన్నిహితులే. నగ్నముని అన్నట్టు నేను సంపాదకుడిగానే మిగలటం – యిష్టం లేక వేకువ ఆపేశా– దాని బాధ్యత తక్కువేమీ కాదు. ఇప్పటి శివారెడ్డి వేరు. అప్పటి శివారెడ్డి వేరు. వేరంటే యింత మందీ మార్బలం లేదు. ఒక రకంగా ఒంటరి పోరాటం. కవిత్వం నా సర్వస్వం. దానికోసమే హైద్రాబాదు వచ్చాను. జీవిక కోసం ఒక ఉద్యోగం– నా అదృష్టం బాగుండి; అద్భుతమయిన కాలేజి – వివేక వర్ధని కాలేజిలో – చేరటం. యజమాన్యం మహారాష్ట్రీయులు– ఆర్య సమాజపు నేపథ్యం నుంచి వచ్చిన వాళ్ళు. ఒక విధమయిన ప్రజాస్వామ్యం ఉండేది. నా కవిత్వం, నా యుద్ధాలు, నా భావజాలమూ – కాలేజీకి పోలీసులు వచ్చిపోవటాలు అన్నీ తెలిసీ, నన్నెపుడు యిబ్బంది పెట్టలేదు. Harass చేయలేదు. నన్ను గర్వంగానే Project చేసేవాళ్లు.

తర్వాత్తర్వాత్త చాలా మంది కవిమిత్రులకు – నా తర్వాత వచ్చిన తరపు కవులకు – ఒక్క విషయం చెప్పే వాణ్ణి – "నీ మొదటి ప్రాధాన్యత కవిత్వం కావాలి. అది నిరంతర చర్య – నిత్యవికాసి, అదొక క్రమం, జీవితాంతం చేయవల్సిన పని. నువ్వు పరిపూర్తిగా involve అయితే తప్ప సాధించలేనిది. నువ్వే భావజాలపు నేపథ్యం నుంచి లోకాన్ని చూసినా – కవిత్వం చేసే క్రమం – దాని మెలకువలు, అన్నీ నీ ముందు తరం కవుల్నుంచీ – అన్ని రకాల కవుల్నించీ నేర్చుకోవాలి. కవిత్వం ఒక కళగాబట్టి – ఒక వస్తువు కళగా మారటం అంటే బలమయిన కవితగా రూపుదిద్దుకునే విషయంలో సిద్ధాంతమొక్కటే చాలదు – ఆ సిద్ధాంతపు వెలుగులో వచ్చిన గొప్ప కవుల్ని చదవాలి. ఒక కవిత్వమే గాదు అన్ని ప్రక్రియలు చదవాలి. ఒక గొప్ప కవి చాలా మెలకువలు – కొత్త మార్గాలు నీకు చూపుతాడు. అక్కణ్ణుంచి నువ్వు అల్లుకుపోవాలి – అందుకని నీవు ముందుగ, గొప్ప కవుల్ని, సమకాలీన కవుల్ని – ప్రపంచవ్యాప్తంగా గొప్ప కవుల్ని శ్రద్ధగా, లోతుగా చదవాలి. వాళ్ళు నిన్ను నిలవనీరులా కాకుండా వుండేట్టు చూస్తారు." – అని.

నా ప్రతిక కవితా సంపుటి ఒక రకంగా ఒక ప్రయోగదశే. అన్ని విషయాల్ని సంలీనం చేసుకుని అభివృద్ధి చెందే క్రమంలో ప్రతి కవితా సంపుటి ఒక దశ. ఒక నిరిష్ట సామాజిక దశనుంచి అది పుట్టింది. ఆ నిర్దిష్ట సామాజిక దశ కనుగుణంగా వస్తురూపాన్ని మార్చుకునే ఒక క్రమం ఒక ప్రయోగం వుంది.

*రక్తసూర్యుడు* పాతదోవని వదలి – కొత్త మార్గం వేసుకునే క్రమంలో వుంది. 73 లో వచ్చింది. బాగా ఆదరించబడింది. అయినా అది తొలిదశ. కాస్త మొరటుగానే, వున్నట్టు – అంత నాజూకు తనం లేనట్టు – ఇపుడనిపిస్తుంది. తర్వాతది *చర్య*. *చర్య*లో దరిదాపు 80% చిన్న కవితలు. అప్పటి ఆలోచన ఏమిటి? భాష తప్పకుండా మామూలు – మాట్లాడుకునే భాష – మరీ అలంకారికం కానక్కరలేదు. ముఖ్యంగా కవిత మొత్తం ఒక Image లానే. ఒక బొమ్మలానే – శీర్షిక గూడా కవితలో భాగమే. శీర్షిక తీసేస్తే, కవితలో మొదటి వాక్యం లేనట్టుగా వుంటుంది. *చర్య* పేరే For every action, there is an opposite equal reaction *చర్య* కవిత మొత్తం ఒక గ్రామీణ – కోడె దూడ బొమ్మలో ఆవిష్కరించ బడుతుంది. విరసం ఆవిర్భావం – వర్గపోరాట ఆవశ్యకతను రంగం మీదకి తెచ్చింది. ఆ కోణం నుంచి చాలా కవితలు అందులో –

*చేగువేరా* ఆనాటి యువతకి (బహుశ యిప్పటి యువతకీ) ఒక హీరో – గెరిల్లా వాంపేర్ – రెగిస్ డెబ్రిస్ రాసిన Revolution in Revolution లాంటి పుస్తకాలు, మావో, *రెడ్ బుక్*– యిత్యాదుల పుస్తకాల పఠనం – బహుశ అప్పటి చోదక శక్తు లేమో.

అన్ని పుస్తకాల నేపథ్యాల – రూపాలు మార్పులు – ఇప్పుడు యిక్కడ విస్తృతంగా రాయటం, చర్చించటం సాధ్యం కాదు – కానీ – యీ నలభై అయిదేళ్ళు – లేదు యాభై ఏళ్లలో – నన్ను సమూలంగా మార్చిన పుస్తకాలు, వ్యక్తులు – లోనా బయటా – చాలా వున్నాయి – చాలా మంది వున్నారు. *ఆసుపత్రిగీతం* 76లో రాసిన కావ్యం. దానికి

Model ఏమీలేదు. ఒక సంవత్సరం పాటు నీలోఫర్ ఆసుపత్రిని దగ్గరగా – చాలా దగ్గరగా దాని అంతర్లోకంతో చూసే పరిస్థితి సంభవించింది. నోట్స్ తీసుకుని అన్నీ సిద్ధం చేసుకున్నా ఓ కావ్యం – ఎలా దిద్దుకోవాలో – దాని స్వరూప స్వభావ లేమిటో – దాని శరీరం – ఆత్మ ఏమిటో – ఎలా వ్యక్తీకరించాలో తెలియక – నరకయాతన పడ్డాను. బహుశ ఒక ఐదారు నెలలు – ఒకానొక సందర్భంలో – మళ్ళీ ఒక సారి ఆసుపత్రి చూసి వచ్చాక మొదలయింది – మొదటి *అల* ఆసుపత్రి వర్ణనతోనే – యిక ఆగలేదు. క్రమక్రమంగా అదొక నాటకంగా రూపొందిందనుకుంటా – ఆసుపత్రి గీతాన్ని చాల తేలిగ్గా నాటకంగా మార్చి, ప్రదర్శించవచ్చు. కావ్యం నిండా పాత్రలే. వాతావరణమే.

నిజానికి *చర్య, ఆసుపత్రిగీతం* ఎమర్జెన్సీలో వచ్చాయి. 75లో ఎమర్జెన్సీలో అరెస్టు చేయబడి – లకడికాపూల్ పోలీస్ స్టేషన్‌లో – ఒక వారం రోజులు – అదొక అనుభవం – ఆ అనుభవం ఆధారంగానే నాటిక రాయాలని. ఎప్పటికయినా రాయాలి. దాని పేరు *పి.యస్: చర్య.* కిష్టయ్య, భూమయ్య (గౌడ్‌లకి అంకితం.) ఆ పుస్తకం అచ్చయి బయటికొచ్చే నాటికి వాళ్ళు బతికే ఉన్నారు. ఆ విషయం వాళ్ళకి తెలిసిందో లేదో తెలియదు. ఎమర్జెన్సీ తర్వాత వాళ్ళు ఉరి తీయబడ్డారు.

ఆ రోజుల్లోనే – మన సైద్ధాంతిక భూమిక వదలకుండా గొప్ప కవిత్వం రాయలేమా – అనే చర్చ. విరసంలో కవిత్వ మేముంది – కొట్టు, చంపు, నరుకు అనేవేగా అనే ఒక విమర్శ, ఒక చులకన భావం ప్రచారమవుతున్న దశ. అప్పుడే ఉస్మానియా విద్యార్థులలో సిద్ధారెడ్డి, రఘునాథం, సుంకి రెడ్డి, శంకరం, కంశ్రీ, యిత్యాదులతో రోజూ కలవటం – కాలేజీలోనో, సిద్ధార్థా హోటల్లోనో, ఆ చర్చల ఫలితంగా, ఆత్మ విమర్శల ఫలితంగా – *నేత్ర ధనుస్సు* లోని చాలా కవితలు వచ్చాయి. రఘునాథం గొప్ప కవిత – పద్యంలో యిమడాల్సిన అందం ఆ నేపథ్యం నుంచి వచ్చింది. వస్తువును చూడటం గురించీ, ఎత్తుగడ, ముగింపుల గురించీ చాలా తీవ్రంగా చర్చలు జరిగేవి – ఆ నేపథ్యలోంచే –

ఆకులో ఆకాశాన్ని, ఆకాశంలో అడవుల్ని చూడలేని వాడు మనుషుల్లోని మహత్తర ఆకాశ అటవీ సౌందర్యాన్ని చూడలేడు అని మొదలయిన చూపు అనే కవిత. ఎప్పటికప్పుడు ఆనాటి నిర్దిష్ట సామాజిక రాజకీయ సాహిత్య సాంస్కృతిక సందర్భం మీద ఆధారపడి – వస్తువుతోపాటు, రూపాన్ని మార్చు కుంటానికి ప్రయత్నం – కొత్త పరిభాష నెన్నుకునే ప్రయత్నం కన్పిస్తుంది.

చాలా మంది విమర్శకులు, కవిమిత్రులూ అంటూ వుంటారు, శివారెడ్డి కవితా యాత్రలో *భారమితి* ఒక మైలురాయి అని. అక్కడ్నుంచే శివారెడ్డి బలమయిన ముద్ర తెలుగు కవిత్వం పై పడుతూ వచ్చిందని – నిజమే నేమో, నాకు తెలియదు. కానీ ఎప్పటి కప్పుడు up to date చేసుకోవటం – ప్రపంచవ్యాప్తంగా వస్తున్న అన్ని దేశాల కవిత్వాన్ని లోతుగా చదవటం – యిష్టమయిన కవుల కవితల్ని తిరిగి, తిరిగి చదవటం. అంతర్లీనం చేసుకోవటం, జీర్ణం చేసుకుని రక్త నిష్టం చేసుకోవటం. ఆగకుండా అప్పట్నుంచి జరుగుతూనే వుంది. *భారమితి* 1983లో వచ్చిందనుకుంటా – అవిచ్ఛిన్నంగా – విద్యార్థి ఉద్యమాన్ని కలిసి పనిచేయటం – స్కూళ్ళు – కాలేజీల్లో ఉపన్యసించటం – విద్యార్థులకు కవిత్వం చదివి వినిపించడం – ఆ నాటి నా కవిత్వ శైలిపై గొప్ప ప్రభావం చూపిందనుకుంటా – నా కవితా సంపుటాల్లో – ఖచ్చితమయిన, ప్రత్యక్షమయిన రాజకీయ అంశ వున్న పుస్తకాలు రెండు – ఒకటి *భారమితి* రెండు *అజేయం* అప్పుడు సాగుతున్న భూపోరాట రైతాంగ ఉద్యమాలు – దీన్ని ముందుకు తీసుకెళ్తున్న వామపక్ష పార్టీల భావజాలం – మార్క్సిస్టు మావో ఆలోచనా విధానాన్ని నమ్మటం – అత్యవసర పరిస్థితి, బూటకపు ఎన్‌కౌంటర్లు – ప్రజా రాశులు వెర్సెస్ రాజ్యం – నేపథ్యంలో –

కవులేం చేస్తారు
చెట్లకు కళ్ళిస్తారు, గాలికి గొంతిస్తారు
అనంత శక్తి సంపన్నమయిన పద్యాన్ని
ప్రజల చేతుల్లో పెడతారు.
జనమే సర్వస్వం
అధికారాన్ని దానం చేస్తే,
అధికారాన్ని ధ్వంసం చేసేవాళ్ళు

ప్రజలే సర్వస్వం – లాంటి చాలా కవితలు ఆ నేపథ్యం లోంచి వచ్చినవే. అయితే వాటిని విద్యార్థుల ముందు, సాహిత్యకారుల ముందు చదవటానికి, ఉత్తేజపరిచి వాళ్లని

కవిత్వంతో పాటే తీసుకెళ్ళటానికి ఒక ప్రత్యేకమయిన శైలి అవసరమయింది. పాటలా – అది అల్లుకుంటూ, అంటుకుంటూ పోవాలి; ఒక భిన్నమయిన నడక వుండాలి – దానిదయిన ఒక సంగీతం ఉండాలి; జానపద పాటకి, సంక్లిష్ట వచన కవిత్వానికి మధ్య నుండే ఒక ప్రత్యేక రూపమేదో అవసరమయింది. ఇదేదో ముందే నిర్ణయించుకుని అలా రాశానని కాదు. ఆ ప్రత్యేక సందర్భం డిమాండ్ చేస్తుంది. ఆ సామాజిక సందర్భమే తనకి కావాల్సిన, పాటనీ, వచన కవిత్వాన్నీ, నిర్మించింది. అదే సమయంలో యూరోపియన్ కవిత్వం, ఆఫ్రికన్ కవిత్వం విస్తృతంగా చదవటం – ముఖ్యంగా ఆఫ్రికన్ కవిత్వాన్ని లోతుగా చదవటం. అనువాదం చేయటం – మిత్రులు వాసిరెడ్డి నవీన్ ఒత్తిడి మేరకు ఆ రోజుల్లో *ప్రజా సాహితి* మాసపత్రికలో దరిదాపు పదహారు 21 దేశాలకు చెందిన ఆఫ్రికన్ కవుల్ని పరిచయం చేయటం – సెనెగల్ మహాకవి సెంఘూర్ అంటారు – 'మాకు పాటకి, కవిత్వానికి, వచనానికీ ఆట్టే తేడాలేదు. కవిత్వానికి గొంతెత్తి చదువుతా' అని.

అవన్నీ పోరాట దేశాలు, జాతి విద్వేషానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. పోరాట నేపథ్యం నుంచి చూస్తే, వాళ్ల కవిత్వానికి మన కవిత్వానికి చాలా పోలికలున్నాయి. అధివాస్తకవిత స్పర్శతో ఉత్తమ ప్రజా కవిత్వం ఎలా రాయాలో చూపించారు. West Indian poet Aime Cesair రాసిన Return to my native land కావ్యం నన్నూపేసింది. ఆంద్రేబ్రెతాన్ – అధివాస్తవిక ఉద్యమనాయకుడు దాన్ని – Master piece గా అభివర్ణించాడు.

ఇన్ని ప్రభావాల మధ్య – మరెన్నో సునిశిత అంశాలు మరెంత మంది కవుల్నించో స్వీకరించాను. అంతర్లీనం, ఆత్మగతం చేసుకునే క్రమంలో అనువాదాలు చేశాను. నువ్వు ఇష్టపడ్డ కవి – వస్తురూపాలు నీలోకి యింకాలంటే, reread చేయాల్సిందే. అనువదించాల్సిందే. ఈ క్రమంనుంచి *భారమితి – అజేయాల్ని* – ఒక దగ్గర పెట్టొచ్చు – వక్తృత్వ శైలి అనే మరొకటి అనీ విమర్శకులు ముద్ర వేశారు – బహుశ అది కొంత కాలం– కొంత కమ్యూనికేనిజం.

1988లో వచ్చిన *మోహనా ఓ మోహనా* దగ్గరకి వచ్చే సరికి రాజకీయ స్పర్శ అంతర్వాహినిగా ఉండి – మానవ సంబంధాల వైపు దృష్టి మళ్లింది. అంతిమంగా ఏ ప్రభావమైనా ఎక్కడ ప్రతిఫలిస్తుంది అంటే మానవసంబంధాలమీదే. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలవ్వటం – క్రమక్రమంగా మానవజీవితంలో ఒక ఖాళీ ఒక శూన్యం ఏర్పడటం మొదలయింది–అప్పుడే అనుకుంటా అన్నాను. 'కరెక్టుగా కవిత్వం రాసే వయసొచ్చిం'దని ఒక లోతైన అవగాహన, ఒక అమోఘమయిన ప్రేమ–ఒక పరిపక్వత–గొప్ప స్పందనాయుత ధార–ప్రతిదానికీ కదిలి, చలించిపోవటం–నెరూడాని, మయకొవిస్కీని, యతుసెంకోని, రష్యన్ వచన మహా రచయితలందర్నీ, లోతుగా చదవటం–ఆ దశలోనే, గ్రీకు మహాకవి Anis Ritsos నీ, అమిచయ్‌నీ లోర్కాని, వ్లాదిమీర్ హాలన్‌నీ, మరెంతో మంది మహాకవుల్ని తిరిగి తిరిగి చదవటం–సంలీనం చేసుకోవటం –నా చుట్టూ జీవితానికి అన్వయించుకుని, నా చుట్టూ ఉన్న జనజీవితం నుంచీ, వాళ్ల అనుభవాలనుంచీ, కవిత్వం తోడుకోవటమెలా–

ఇదొక సుదీర్ఘ క్రమం. అంతు లేని క్రమం. అన్వయించుకుని, అంతర్లీనం చేసుకుని పటిష్టమయ్యే క్రమం. నిన్న గణనలోకి రాని అంశాలు నేడు గణనలోకి వస్తున్నాయి. నిన్న గమనించని వాటిని నేడు గమనిస్తున్నాను. జీవితాన్ని దాని సకల అంశాలతో వైవిధ్యాలతో, వైరుధ్యాలతో పట్టుకునే ప్రయత్నం మొదలయింది. No stagnation. వస్తువు చుట్టూ తిరగటంమాని పైపైన చూడటం నుంచి కాక – వస్తువులోనికి ప్రవేశించటం – లోనుంచి వస్తు విస్తృతి చేయటం. అందుకని ఆ దశలో కవిత దృశ్యమాన మవటం మొదలయింది. ఒక image లోకి మరో image చొరబడుతుంది. పాఠకుడు శ్రోత, ఒక దృశ్యం మిస్సయినా, మరో దృశ్యాన్ని అందుకుంటాడు. images అన్నీ Metaphors అన్నీ దృశ్యాలన్నీ పాఠకుణ్ని, శ్రోతని ఒక climax కి, ఒక రసానుభూతికి నడిపించు కెళతాయి– *మోహనా ఓ మోహనా* నుంచి మొదలయిన ఈ శైలి, రాను రాను మరీ సునిశితమయింది. బహు స్పందనా భరితమయింది. నేనందుకుంటున్న ప్రపంచాన్ని, అన్ని యింద్రియాలతో, అనుభవాన్ని అదే స్థాయిలో పాఠకుడికి అందించాలి. అదీ తపన.

ఈ స్థితిలోనే నా మూలాల్లోకి వెళ్లటం మొదలయింది. ఒక నా స్టాల్జియా స్పర్శ కూడా తోడయింది. అటు సాహిత్య సామాజిక రాజకీయ రంగాల్లో త్వరితగతిని వస్తున్న మార్పులు – స్త్రీవాద, దళితవాద, మైనారిటీవాద, – తర్వాత అస్తిత్వవాద ఉద్యమాలు – ప్రపంచీకరణ, ముక్కల సంస్కృతి, సరళీకరణ

– సంస్కృతిమీద సామ్రాజ్యవాద సంస్కృతి ప్రభావం– వాటిన్నిటి ఫలితంగా మనిషి ఎన్నడూ లేనంతగా పరాయీకరణ పొందటం – ఏకాకి కావటం – ఆధునిక విషాద నాయకుడవ్వటం– యివన్నీ లోపలి లోకాల్ని ముట్టించిన అంశాలే. Ritsos, Holow – తర్వాత పోర్చుగీస్ కవి అంద్రాదె – కవిత్వంలో ఎలా – అప్రధానమనుకున్నవి – ప్రధానమవుతాయో – నిన్ను నీవు ఎలా ఎల్లప్పుడూ సజీవంగా ఉంచుకోవాలో చూపించాయి. దేన్నీ పరిహరించ నక్కరలేదే – అన్నీ inclusive, exclusive ఏదీ కాదు. ఆ విస్తృతీ, లోతూ– కొత్త నిర్మాణపు పద్ధతులూ – *నా కలల నది అంచున* కవితా సంపుటిలో మొదలై విశాలమవుతూ సర్వాన్నీ సంలీనం చేసుకుంటూ ముందుకెళుతూనే వుంది.

కవిత్వం రాయటానికేమీ అక్కరలేదు. ముఖ్యమయింది నువ్వు బతికుండటం. మానవుడు అమానవుడయ్యే స్థితి – అంతా Fragmetntaion విచ్ఛిత్తి – ఏ విలువలూ లేని విషాదస్థితి. మానవుడు తను చనిపోయి చానాళ్ళయినా బతికున్నానని భ్రమ పడుతున్నాడు.

ఈ దశలో 2001లో ప్రమాదం జరగటం, ఆసుపత్రిలో 2 సంవత్సరాలుండటం – నాలుగు ఆపరేషన్లు జరగటం – గదికి, మంచానికి పరిమితం కావటం – ఒక కొత్త చూపును, ఒక కొత్త మెలకువను, కొత్త మృదుత్వాన్ని ప్రసాదించింది. అక్కడ్నుంచి వచ్చిందే, *అంతర్జనం.* పూర్తిగా వస్తురూపాల్లో – పూర్వపు శివారెడ్డి కన్పించని భాషా శైలి. తరచి తరచి చూడటం. వస్తువులోలోతుల కెళ్లటం సారాన్ని గ్రహించటం– భాష, శైలి పూర్వపు శివారెడ్డివి కావు. తర్వాత వచ్చిన *వృత్త లేఖిని, అతను చరిత్ర, పొసగని వన్నీ, గగన మంత తలతో,* దీన్నే బహుముఖం చేస్తూ Multi dimensional చేస్తూ ముందుకు సాగాయనుకుంటా.

దేన్నీ పరిహరించటం లేదు. అంతా, అన్నింటినీ స్వీకరించటమే. యిముడ్చుకుని, అనుభవించి– కవిత్వం, రూపాల్లో పాఠకలోకాని కందించటం – Un siva reddy అయిందా శివారెడ్డి కవిత్వం? కాదనుకుంటా; నా రాజకీయ విశ్వాసాల్ని విడనాడలేదు. తర్వాత వచ్చిన వాదాలన్నింటినీ ఆహ్వానించా – అవి అందించిన పలు అంశాల్ని స్వీకరించి – నా కవిత్వాన్ని పరిపుష్టం చేసుకున్నా. సారాంశంలో నేను Marxist నే – యిప్పటికీ మార్క్సిస్ట్, లెనినిస్ట్, మావోయిస్ట్ భావజాలాన్ని నమ్ముతున్నా – అది ఆచరించే, అందించే కార్యాచరణలో భాగమయ్యే వున్నా –

ఒక మార్క్సిస్టు అయిన వాడు తప్పకుండా ప్రజాస్వామిక వాది కావాలి. మార్క్సిజం ఒక శాస్త్రం కాబట్టి తర్కించి విశ్లేషించి శాస్త్రీయంగా యితరుల్ని ఒప్పించాలే తప్ప – నియంతలా అభిప్రాయాన్ని రుద్దటం కూడదనుకుంటా – జడంగా ఉండటమూ కుదరదు. నీ సామాజికాచరణకి సంబంధించి, సాహిత్యాచరణకి సంబంధించి ఒక విశాల ప్రాతిపదికతో ప్రజాస్వామికీకరణ చెందుతూ ముందుకు సాగుతుందనుకుంటా – యిరవయొకటో శతాబ్దం విసిరిన సవాళ్లను అన్ని రంగాల్లో మనం చాలా సంయమనంతో – all inclusive attitude తో స్వీకరించి ముందుకు సాగాలనుకుంటా–

సామాజికాచరణ, సాహిత్యాచరణా విడదీయరానివి. పరస్పర ప్రేరకాలు, పూరకాలు. Basical గానే Literary activist నే సమాజంలో interact అయ్యేది నేను సాహిత్యం ద్వారానే word is deed అని సార్త్రే అన్నట్టు.

ప్రపంచ మహాకవులందరూ నాకు ప్రేరకులే, అలాగే ప్రపంచ గొప్ప వచన రచయితలూ నన్ను ప్రభావితం చేశారు. కవులెంతగా కవ్వించి, కుదిపివేశారో – కొత్త కొత్త విషయాలు చెప్పారో – అలాగే వచన రచయితలు. చాలా సార్లు వాళ్ళ మధ్య అభేదమే.

రాను రాను ప్రపంచం సమాజంను – ముఖ్యంగా భారతీయ సమాజం సంకీర్ణమవుతూ, సంక్లిష్టమవుతూ వస్తుంది. ఈ కొత్త జీవన సందర్భాన్ని పరిపూర్ణంగా కవిత్వీకరించాల్సిందే. మడిగట్టుకుంటే కుదరదు.

ఒక్కో తాత్విక దర్శనం ప్రపంచాన్ని ఒకో రకంగా వ్యాఖ్యానించి చూడటం నేర్పింది. ఏ దర్శనమయితే నిన్ను చలన శీలిగా క్రియాశీలిగా, సంస్పందనా భరితునిగా తయారు చేస్తుందో పదునయిన నేలగా మార్చుతుందో – నీ భ్రమల్ని, భయాల్ని పారదోలుతుందో దాన్నీ దేశకాలపరిస్థితులకు అన్వయించుకుంటూ అభివృద్ధి చేసుకుంటూ పోవాల్సిందే – కవిత్వమూ అంతే.

# ధ్రుపద్ గానం

– నండూరి పార్థసారథి

## చరిత్ర గర్భంలోకి..

ఏప్రిల్ సంచిక తరువాయి.....

ధ్రుపద్ గాన పద్ధతిలో అనిబద్ధగానానికి–అనగా ఆలాపనకు– అంతకు ముందెన్నడూ లేనంత ప్రాధాన్యం లభించినప్పటికీ గాయకులు స్వేచ్ఛగా రాగాన్ని ఆవిష్కరించకుండా ఒక నిర్దిష్టమైన చట్రంలో ఎప్పుడూ ఒకే రకంగా గానం చేయడం వల్ల, రచనను గాన చేసేటప్పుడు సాహిత్యభావంపై, రసావిష్కరణపై దృష్టిపెట్టకుండా తాళవిన్యాసాలకు అత్యధిక ప్రాధాన్యమివ్వడం వల్ల అది క్రమంగా ఆకర్షణ, దానితో పాటు ఆదరణ కోల్పోయింది.

ధ్రుపద్ పద్ధతిలో ఒక రచనను గానం చేసేటప్పుడు గాయకుడు ముందుగా విస్తృతరాగాలాపన చేస్తాడు. ఆలాపన మొదటిదశలో మంద్రస్థాయి షడ్జంనుంచి మధ్యస్థాయి మధ్యమం వరకు, రెండవదశలో మధ్యస్థాయి పంచమం నుంచి తారస్థాయి మధ్యమం, లేదా పంచమం వరకు గానం సాగుతుంది. ఆ తర్వాత గాయకుని శక్తిమేరకు ఎంతపైకి అయినా పోవచ్చు. మొదటిదశలో విలంబగతిలో సాగేగానం క్రమంగా వేగం పుంజుకొని **నొం తొం** ఆలాప్‌గా మారుతుంది. దాని తర్వాత ధ్రుపద్ రచన గానం మొదలవుతుంది. అక్కడినుంచి మృదంగం, లేదా పఖావజ్ అనుసరణ మొదలవుతుంది. ఆలాపనదశలోనే గాయకుడు తాను ఎంచుకొన్న రాగంలో వాది, సంవాది, అనువాది స్వరాలను, దుర్బల స్వరాన్ని, విశ్రాంతి స్వరాన్ని, ఉత్థాన (ఆరంభ) స్వరాన్ని, నిర్దిష్ట సంచారాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తాడు. ధ్రుపద్ రచనలు సాధారణంగా చౌతాల్, ధమ్మార్, ఝంప, ఆడా చౌతాల్, రూపక్ తాల్, ధీమా తాల్, శూలతాల్, శూర్‌ఫాంక్ తాళాలలో వుంటాయి. రచనలు సంస్కృతంలో, లేదా హిందీలో దైవ పరంగానో, నరస్తుతి పరంగానో వుంటాయి. కొందరు గాయకులు పూర్వపు 'నామావళి ప్రబంధ' రచనలనే ధ్రుపద్ పద్ధతిలో గానం చేస్తారు.

ఇందుకు ఒక ప్రసిద్ధ రచన ఉదాహరణ:

**స్థాయి:**

**పరబ్రహ్మ, పరమేశ్వర, పరమాత్మ, పరమపురుష ।**
**నందనందన, ఆనందకంద, జశోదానంద, శ్రీ గోవింద ॥**

**అంతర:**

**దీనానాథ, దుఃఖభంజన, పద్మనాభ, జగవందన ।**
**వాసుదేవ, బనవార, జగత్పతి, ప్రభు, నందనందన ॥**

ధ్రుపద్ గానానికి పక్కవాద్యాలుగా మృదంగం, లేదా పఖావజ్ ఉపయోగిస్తారు. ధ్రుపద్ రచనలకు సంబంధించిన తాళాలన్నీ ఈ వాద్యాలకు ఉద్దేశించినవే. ధ్రుపద్‌కు తబ్లాను పక్కవాద్యంగా ఉపయోగించే సంప్రదాయంలేదు. పూర్వం ధ్రుపద్ గాత్రానికి రుద్రవీణను ప్రక్కవాద్యంగా ఉపయోగించేవారు. ఇప్పుడు ఆ పద్ధతిలేదు. రుద్రవీణ, విచిత్రవీణ యిప్పుడు ధ్రుపద్ పద్ధతిలో సోలో వాద్యాలు. ఈ వాద్యాలను వాయిస్తున్న ప్రముఖులు యిప్పుడు దేశంలో నలుగురైదుగురు మాత్రమే వున్నారు.

ధ్రుపద్ రచనను గానం చేసేటప్పుడు సాహిత్యాన్ని తాళానుగుణంగా ఖండఖండాలుగా విరిచి పాడడం జరుగుతుంది. దాన్ని మరొకవిధంగా పాడడానికి వీల్లేదు. ప్రమాణమైన, కఠినమైన నియమాలకు లోబడి గానం చేయవలసిన పద్ధతి అనేది 'ధ్రువ–పద' అనే మాటలోనే వుంది. ఈ పద్ధతిలో గాయకుడు ఒక రాగం అందుకోగానే అతడి గానం ఎలా సాగబోతోందో–అలవాటైన శ్రోతలకు–ముందు గానే తెలిసిపోతుంది. ఆ రాగాన్ని ఆ గాయకుడు ఎప్పుడు పాడినా అలాగే పాడతాడని కూడా అనిపిస్తుంది.

ధ్రుపద్‌లో ఒకప్పుడు ఐదు బాణీలుండేవి. అవి–శుద్ధ, గోబరహార, ఖందార, డాగర, నౌహార బాణీలు. ఇవి ఖయాల్

నండూరి పార్థసారథి, ఫోన్: 9959734534

పద్ధతిలోని ఘరానాల వంటివే. బాణి (వాణి) అంటే పాడే పద్ధతి లేక శైలి అని అర్థం. వీటిలో యిప్పుడు డాగర్ బాణి ఒక్కటే మిగిలింది. మిగిలినవి అంతరించిపోయాయి. పూర్వం ధ్రుపద్ ప్రధానంగా రాజాస్థానాలలోనే వర్థిల్లింది. అయితే ఈ గాన పద్ధతిలో వైవిధ్యం, రంజకత కొరవడడంతో పోషకులకు, శ్రోతలకు కూడా దాని పట్ల ఆసక్తి తగ్గి పోయింది. ఆ సంగతి గ్రహించి గాయకులు తమ పద్ధతి కొంత మార్చుకొనే ప్రయత్నం చేశారు. నాలుగు ధాతువులతో మరీ సాగదీయకుండా స్థాయి, అంతరలతోనే సరిపెట్టుకోవడం మొదలు పెట్టారు. అయినా, అప్పటికే ఖ్యాయాల్ గానపద్ధతి బాగా ప్రచారంలోకి వచ్చింది. ధ్రుపద్‌కు ఆశ్రయస్థానాలుగా వుండిన ఢిల్లీ, మధుర, బృందావన్, రాంపూర్, వారణాసి, లక్నో, దర్భాంగా, విష్ణుపూర్, గ్వాలియర్, ఇండోర్, జైపూర్‌లలో ఖ్యాయాల్ విశేష ఆదరణ సంపాదించు కోగలిగింది. 18వ శతాబ్ది ఉత్తరార్థం నాటికి ధ్రుపద్ ప్రాభవం కోల్పోగా అప్పటినుంచి ఖ్యాయాల్ శకం ప్రారంభమయింది.

ధ్రుపద్ గాయకులు ఒక దశలో – తమ గానపద్ధతికి ఆదరణ తగ్గిపోతుండడంతో – లయకారీ (లయ విన్యాసాలు) బాగా తగ్గించి తాన్‌కారీ (స్వరవిన్యాసాలు) పెంచి తానాలు పాడడం మొదలు పెట్టారనీ, ఈ పరిణామమే ఖ్యాయాల్ అవతరణకు దారి తీసిందనీ కొందరు సంగీత చరిత్రకారు లంటున్నారు. ఖ్యాయాల్ గానంలో తాన్‌కారీ ముఖ్యాంశం. ఖ్యాయాల్ పోటీని తట్టుకోడానికి ధ్రుపద్ గాయకులు ఒకప్పుడు 'ఆలాప్' కూడా బాగా తగ్గించేశారు. అయితే యిప్పుడు ధ్రుపద్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి, ఖయాల్‌తో వంతు పెట్టుకోకుండా నికార్సయిన ధ్రుపద్‌కు 'హైబ్రో' సంగీత ప్రియుల ఆదరణను సంపాదించుకోడానికి డాగర్ కుటుంబంవారు విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఢిల్లీ, ముంబై,



రుద్రవీణ వాయిస్తున్న
జియా మొయిద్దీన్ డాగర్

కోల్‌కత్తా వంటి భారతీయ నగరాలలోనే కాక పాశ్చాత్య దేశాలలో కూడా కచేరీలు చేస్తున్నారు; సోదాహరణ ప్రసంగాలు చేస్తున్నారు; సంగీత విద్యాలయాలు నెలకొల్పి శిష్యులను తయారు చేస్తున్నారు. గమనార్హమైన మరొక పరిణామం– ధ్రుపద్ పద్ధతి యిప్పుడు గాత్రంలో కంటే వాద్య సంగీతంలో ఎక్కువగా ప్రయోగంలో వుంటున్నది. ధ్రుపద్‌లోని ఆలాప్, **నొం తొం** ఆలాప్ పద్ధతిని సితార్, సుర్‌బహార్, సరోద్, సంతూర్ కళాకారులు 'ఆలాప్–జోడ్–ఝాలా' రూపంలో బ్రతికిస్తున్నారు. ఇది గాత్రంలోకంటే వాద్యాలపై ఎక్కువ ఆకర్షకంగా వుంటున్నది. ప్రబంధ కాలం నుంచి యిప్పటి వరకు ఉత్తర భారతీయ సంగీతంలో క్రమంగా సాహిత్య ప్రాధాన్యం తగ్గిపోతూ స్వర ప్రాధాన్యం పెరుగుతున్నది. ప్రబంధ పద్ధతిలో ప్రథమ స్థానం సాహిత్యానిది; ద్వితీయ స్థానం తాళానిది; తృతీయ స్థానం స్వరానిది. ప్రబంధ రచనలన్నీ భక్తి రచనలు. ధ్రుపద్ పద్ధతిలో సాహిత్యానికి, స్వరలయలకు యించుమించు సమాన ప్రాధాన్యం వుంటుంది. ఖ్యాయాల్‌లో ప్రథమ స్థానం స్వరానిది, ద్వితీయస్థానం తాళానిది, తృతీయస్థానం సాహిత్యానిది. వాద్యసంగీతంలో అసలు సాహిత్యమే వుండదు. అందులో స్వరానిది ప్రథమ స్థానం, తాళానిది ద్వితీయ స్థానం.

'ఖ్యాల్' అనేది పర్షియన్ పదం. హిందీలో కలిసిపోయిన అనేక పర్షియన్ పదాలలో యిదొకటి. దీనికి కచ్చితంగా ఒక్క మాటలో అర్థం చెప్పడం కష్టం. నిఘంటువులో చూస్తే– ధ్యానం, స్మరణం, ఊహ, భావం, అంచనా, ఆదరం, ఆలోచన, జ్ఞాపకం వంటి పెక్కు అర్థాలు కనిపిస్తాయి. వ్యవహారంలో సందర్భాన్ని బట్టి ఈ పదాన్ని ఎన్నోరకాలుగా వుపయోగిస్తుంటారు. హిందూస్థానీ సంగీత సందర్భంలో దీనికి సద్యఃకల్పన, Improvisation అనే అర్థం సరిపోతుంది. 'మనో ధర్మ సంగీతం' అనే మాట యింకా చక్కగా అతుకుతుంది. ఎందుకంటే ఖ్యాల్ పద్ధతి గానంలో తొంభైశాతం మనోధర్మమే – రచన (చీజ్/బందిష్) పాత్ర పదిశాతం కంటే ఎక్కువ వుండదు. గానం గొప్పగా వుంటే పేరు నేరుగా గాయకుడికే దక్కుతుంది. "ఆహా..బందిష్ ఎంతగొప్పగా వుంది" అని వాగ్గేయకారుడిని ప్రశంసించడం సాధారణంగా జరగదు. కచేరీలో వాగ్గేయకారుడి పేరు ప్రకటించే సంప్రదాయంలేదు. బందిష్‌లో 'సదారంగ్' అనే ముద్ర కనిపిస్తే అది సదారంగ్ రచన అనీ, ' అదారంగ్' అనే



ఉస్తాద్ ఫయ్యాజ్‌ఖాన్

ముద్ర కనిపిస్తే అది అదారంగ్ అనే ముద్ర కనిపిస్తే అది అదారంగ్ రచన అనీ సంగీతజ్ఞులకు తెలుస్తుంది. ఖ్యాల్ అనే మాట హిందూస్థానీ గాత్ర సంగీతంలోని ఒకానొక పద్ధతికి మాత్రమే వర్తిస్తుంది. ఇది వాద్య సంగీతానికి వర్తించదు. ఈ ప్రక్రియ ఎప్పుడు అవతరించింది? దీని పేరు మొదటినుంచీ యిదేనా? లేక మొదట వేరే ఏదో పేరు వుండి కాలక్రమంలో ఖ్యాల్‌గా మారిందా? దీని జనకుడు ఎవరు? ఈ విషయాలపై చరిత్రకారులు చాలా తర్జన భర్జన చేశారు. ఖ్యాల్ అనేది పర్షియన్ పేరు కనుక దీన్ని అమీర్‌ఖుస్రోయే సృష్టించాడనీ, సృష్టించి వుంటాడనీ కొందరు అన్నారు. కాని, ఖుస్రో కంటే యాభయ్యేళ్ళు పూర్వుడైన నామదేవుడు ఒక అభంగ కీర్తనలో ఖ్యాల్ పాడే వారిని చౌకబారు గాయకులుగా పేర్కొన్నాడనీ, అందుచేత ఆ గానపద్ధతి ఖుస్రోకంటే చాలా ముందు నుంచీ వుందనీ మరి కొందరు అంటున్నారు. అసలు కాళిదాసు కాలానికే 'ఖేలపద' అనే పేరుతో ఒకానొక పద్ధతి వుందనీ, 'విక్రమోర్వశీయం'లో ఊర్వశి నడకను హంస నడకతో పోల్చుతూ వర్ణించే సందర్భంలో 'ఖేలపద' అనే మాటను కాళిదాసు ప్రయోగించాడనీ, ఖ్యాల్ నడకను వర్ణించడానికి అంతకంటే గొప్పపదం దొరకదనీ, 'ఖేలపద' అనేదే ఖ్యాల్‌గా మారిందనీ మరొక వాదం వున్నది. మరి అంత ప్రాచీనతన కలిగిన ప్రక్రియ అన్ని శతాబ్దాలపాటు ఎందుకు మరుగున పడిపోయింది? ఖుస్రో కాలంలో, యింకా ముందు కాలంలో వున్న ఖ్యాల్ గానానికి, ఇప్పటి ఖ్యాల్ గాన పద్ధతికి ఏవైనా పోలికలున్నాయా?

ఉస్తాద్ అమీర్‌ఖాఁన్, ఉస్తాద్ విలాయత్‌ఖాఁన్ తమ కచేరీలో అప్పుడప్పుడు కొన్ని ఖుస్రో రచనలను పాడుతూవుండేవారు. ఖుస్రో సప్తమ శతజయంతి ఉత్సవాల సందర్భంగా హెచ్.ఎం.వి గ్రామఫోన్ కంపెనీ 1975లో కొందరు అగ్రశ్రేణి గాయకుల చేత అనేక ప్రక్రియలలో ఖుస్రో రచనలను పాడించి ఒక లాంగ్‌ప్లే రికార్డును విడుదల చేసింది. వాటిలో రెండు ఖ్యాయాల్ రచనలు కూడా వున్నాయి. వాటిలో సాహిత్యం మాత్రమే ఖుస్రోది. సంగీతం ఇప్పటి వాళ్ళది. కాబట్టి ఖుస్రో కాలపు ఖ్యాల్ సంగీత స్వరూపం ఎలా వుండేదో మనకు తెలియదు. కాని, యిప్పుడు మనకు తెలిసిన ఖ్యాల్ గాన పద్ధతి మాత్రం కచ్చితంగా 18వ శతాబ్దపు పూర్వార్థంలో న్యామత్‌ఖాఁన్ ప్రవేశపెట్టినదే. అతడు తాన్‌సేన్ కూతురు సంతతిలో పదోతరం వాడు. అతడి కలంపేరు 'సదారంగ్'. మొగల్ చక్రవర్తి మహమ్మద్‌షా ఆస్థానంలో వుండేవాడు. శృంగారపురుషుడు, సంగీత రసికుడు అయిన మహమ్మద్‌షా పేరు చివర 'రంగీలా' అనే బిరుదాన్ని చేర్చి 'సదారంగ్' అనే తన వాగ్గేయకార ముద్రతోనూ, 'మహమ్మద్‌షా రంగీలా' అనే పోషక ముద్రతోనూ న్యామత్‌ఖాఁన్ రచనలు చేశాడు. అవన్నీ శృంగార రస ప్రధాన రచనలు.

న్యామత్‌ఖాఁన్ మేనల్లుడు, అల్లుడు అయిన ఫిరోజ్‌ఖాఁన్ 'అదారంగ్' అనే వాగ్గేయకార ముద్రతో పెక్కు ఖ్యాల్ రచనలు చేశాడు. అతడు ఎక్కువగా సూఫీ భక్తుడైన నిజాముద్దీన్ ఔలియా (అమీర్ ఖుస్రో గురువు)కు అంకితంగా వైరాగ్య భావాలతో రచనలు చేశాడు. న్యామత్‌ఖాఁన్ కుమారుడు భూపత్‌ఖాఁన్ 'మహారంగ్' అనే ముద్రతో ఖ్యాల్ బందిష్‌లు రచించాడు. ఇప్పుడు మనకు కచేరీలలో ఎక్కువగా వినిపిస్తున్నవి వీరి రచనలే. వీటిని అన్ని ఘరానాల వారూ గానం చేస్తున్నారు. సదారంగ్, అదారంగ్‌ల కాలంలోనూ, ఆ తర్వాత కూడా ఖ్యాల్ బందిష్‌లు రచించిన వారంతా ముస్లిములే కాని అందరూ సరస్‌రంగ్, దరస్ పియా, ప్రేమ్‌పియా (ఫయ్యాజ్‌ఖాఁన్), ప్రాణ్‌పియా (విలాయత్ హుసేన్ ఖాఁన్), సబ్‌రంగ్ (బడేగులాం అలీఖాఁన్) వంటి హిందుత్వాన్ని సూచించే కలంపేర్లతో, బ్రజ భాషలో రచించారు. బ్రజభాష ఉత్తర ప్రదేశ్‌లోని హిందీ మాండలికం. ఆ రచనలలోని భావాలు, వర్ణనలు అన్నీ పూర్తిగా భారతీయమైనవి. భార్య, భర్త, సవతి, అత్త, ఆడపడుచు, ఇరుగు పొరుగు అమ్మలక్కలు, ప్రోషిత భర్తృకలు, విరహోత్కంఠితలు, ఖండిత నాయికలు, దక్షిణనాయకులు – శృంగార ప్రధాన ఖ్యాల్ రచనలలో మనకు కనిపించేది వీరే. కర్ణాటక సంగీతంలోని పదాలు, జావళీల సాహిత్యానికి శృంగార ప్రధాన ఖయాల్ రచనలలోని సాహిత్యానికి చాలా పోలికలు కనిపిస్తాయి. పదాలు, జావళీలలో కనిపించే జానుతెలుగు వంటిదే ఖ్యాల్, ఠుమ్రీలలోని బ్రజభాష. పదాలు, జావళీలలో భక్తి వైరాగ్య భావాలు కనిపించవు. కాని, కొన్ని ఖ్యాల్ రచలలో – ముఖ్యంగా క్షిమిదారంగ్ రచనలలో–భక్తి వైరాగ్య భావాలు కనిపిస్తాయి.



ఉస్తాద్ విలాయత్ హుసేన్ ఖాఁన్



ఉస్తాద్ బడేగులాం అలీఖాన్

ఖ్యాల్ రచనల్లో రెండు రకాలుంటాయి. ఒకటి బడాఖ్యాల్. దీన్నే విలంబిత్ ఖ్యాల్ అంటారు. రెండోది ఛోటా ఖ్యాల్. దీన్ని ద్రుత్ ఖ్యాల్ అని కూడా అంటారు. బడా ఖ్యాల్ విలంబిత లయలోనే పాడడానికి ఉద్దేశించినది. కచేరీలో బడాఖ్యాల్ పాడుతూ కొంత వేగం అందుకొన్న తర్వాత దాన్ని వదిలి పెట్టి ఛోటా ఖ్యాల్‌ను అందు కుంటారు. ఛోటాఖ్యాల్ రచన వేగంగా పాడడానికి అనుకూలంగా వుంటుంది. సాధారణంగా బడాఖ్యాల్ ఏ రాగంలో వుంటుందో, ఛోటాఖ్యాల్ అదే రాగంలో వుంటుంది. అలాకాకపోతే బడాఖ్యాల్ రాగానికి అతి సమీపంగా వుండే మరొక రాగంలో ఉంటుంది. ఉదాహరణకు బడా ఖ్యాల్ దర్బారీ కానడరాగంలో వుంటే ఛోటాఖ్యాల్ దర్బారీ కాకపోతే మరో కానడ 'అంగ్' రాగంలో– అంటే సుహాకానడ, సుఘ్రయ్ కానడ, అడానా కానడ వంటి మరో రాగంలో – వుండవచ్చు. బడా, ఛోటా ఖ్యాల్‌లు రెండూ ఒకే వాగ్గేయకారుని రచనలై వుండక పోవచ్చు కూడా. రెండింటిలో తప్పని సరిగా ఒకే మాదిరి భావాలు వుండాల్సిన అవసరం కూడా లేదు. కాని, వుంటే మంచిదే. ఎలాగూ ఖ్యాల్‌లో సాహిత్యానికి ప్రాధాన్యం వుండదు కనుక ఈ విషయంలో పట్టింపు వుండదు. విలంబిత్ ఖ్యాల్ పాడిన తర్వాత ద్రుత్ ఖ్యాల్ పాడితేనే కచేరీ రక్తికడుతుంది. ద్రుత్ ఖ్యాల్ పాడకపోతే సగంలో ఆపేసినట్లుగా అనిపిస్తుంది. కొందరు గాయకులు ద్రుత్ ఖ్యాల్‌కు బదులు తరానా గానం చేస్తారు. తరానా కూడా ద్రుతలయలోనే వుంటుంది. విలంబిత తరానా లంటూ వుండవు.

ఖ్యాల్ రచనలో స్థాయి, అంతర అనే రెండే అంగాలు (ధాతువులు) వుంటాయి. ఇవి కర్ణాటక సంగీత కృతులలోని పల్లవి, అనుపల్లవి వంటివి. 'కృతి'లో వుండే చరణం వంటిదేదీ ఖ్యాల్‌లో వుండదు. సాహిత్యానికి కృతిలో వుండేంత ప్రాధాన్యం ఖ్యాల్‌లో వుండదు. ఖ్యాల్ గానం చేస్తున్నపుడు అందులోని పదాలు స్పష్టంగా వినిపించవు; వినిపించనవసరం లేదన్నట్లుగా వుంటుంది దాని గాన పద్ధతి. శ్రోతలు స్వరరచనా సౌందర్యం కోసం, రాగవిన్యాసం కోసమే తప్ప సాహిత్యభావాల కోసం వినరు. ఖ్యాల్‌లో సాహిత్యం రాగవిన్యాసానికి ఒక ఆలంబనం మాత్రమే. ధ్రుపద్‌లో మాదిరిగా ఖ్యాల్‌లో శుద్ధ ఆలాప్ వుండదు. ఒక అర నిమిషమో, పావునిమిషమో 'అవచార్ ఆలాప్' పాడి తర్వాత నేరుగా 'బోల్ ఆలాప్' అందుకుంటారు. అవచార్ ఆలాప్ అంటే పాట అందుకునే ముందు కాస్త కూనిరాగం తీయడం లాంటిది. 'బోల్' అంటే రచన లోని సాహిత్యం. 'బోల్ ఆలాప్' అంటే సాహిత్యంతో, తబ్లా అనుసరణతో ఆ ఆలాపన గానం చేయడం, బోల్ ఆలాప్‌తో పాటుగానే ఆకార్ ఆలాప్, సర్గమ్ ఆలాప్ కూడా వుంటాయి. సాహిత్యంతో కాకుండా 'ఆ' అని దీర్ఘం తీస్తూ ఆలాపన చేయడం 'ఆకార్ ఆలావ్'; స్వరాక్షరాలతో (సరిగమలతో) ఆలాపన చేయడం 'సర్గమ్ ఆలాప్'. ఈ మూడు రకాల ఆలాపాలు తబ్లా అను సరణతోనే సాగుతాయి. ఇదంతా బందిష్ (రచన)లోని 'స్థాయి' దశలోనే జరుగుతుంది. తర్వాత గానం 'అంతర' దశలోకి ప్రవేశిస్తుంది. తానా (తాన్)లు ప్రారంభమవుతాయి. బోల్ తానాలు, ఆకార్‌తానాలు, సర్గమ్ తానాలు లయకారీతో, మీండ్ (జారుగమకం)తో, అనేక రకాల గమకాలతో, మంద్ర మధ్య, తారస్థాయిలలో రాగస్వరూపాన్ని సమగ్రంగా ఆవిష్కరించడం జరుగుతుంది. కొంత వేగం అందుకున్న తర్వాత బడాఖ్యాల్‌ను వదిలి ఛోటా ఖ్యాల్ (ద్రుత్ ఖ్యాల్)ను అందుకుంటారు. ప్రావీణ్య ప్రదర్శనకు, సభారంజనకు అనువైన రచన ఛోటా ఖ్యాల్.

ఖ్యాయాల్‌గానం అన్ని ఘరానాలలోనూ ఇలాగే వుంటుందని చెప్పడానికి వీల్లేదు. ఒక్కొక్క ఘరానాకు ఒక్కొక్క ప్రత్యేకత వుంటుంది. ఖ్యాయాల్ ఘరానాలన్నింటికీ మూలస్థానమైన గ్వాలియర్ ఘరానాలో సర్గమ్ ఆలాప్, సర్గమ్ తాన్‌లు పాడే సంప్రదాయంలేదు. అది నిషిద్ధం కూడా. ఆ ఘరానాకు చెందిన కృష్ణరావ్ శంకర్ పండిత్, ఓంకార్ నాథ్‌ఠాకూర్, వినాయక్‌రావ్ పట్వర్ధన్, నారాయణరావ్ వ్యాస్, డి.వి.పలూస్కర్ సర్గమ్ పాడేవారు కారు. గ్వాలియర్ ఘరానావారు (1) ఆలాప్, (2) బోల్ ఆలాప్ (3) తాన్ (4) బోల్‌తాన్ (5) మీండ్ (6) గమక్ (7) ముర్కీ (8) లయకారీలతో కూడిన గానాన్ని 'అష్టాంగ గాయకీ' అంటారు.

ఖ్యాయాల్ గానంలో సర్గమ్ పాడడం మొదలు పెట్టినవాడు కిరాణా ఘరానా ప్రముఖ గాయకుడు అబ్దుల్ కరీం ఖాన్. దక్షిణభారతంలో విరివిగా కచేరీలు చేసిన మొదటి హిందూస్థానీ గాయకుడు ఆయన. కర్ణాటక సంగీత

విద్వాంసుల స్వరకల్పన పద్ధతి ఆయనను ఆకర్షించింది కాబోలు దక్షిణాది శ్రోతలను ఆకట్టుకోవడానికి పూర్తిగా తనదైన ప్రత్యేక శైలిలో సర్గమ్ పాడడం మొదలు పెట్టాడు. కాని, ఆయన శిష్య పరంపరలోని సవై గంధర్వ, రోషనారా బేగం, హీరాబాయ్, గంగూబాయ్ వంటివారెవరూ సర్గమ్ గానం చేయలేదు. బాలమురళీ కృష్ణతో జుగల్బందీలలో తప్ప భీమ్‌సేన్‌జోషీ కూడా సర్గమ్ పాడలేదు. పటియాలా ఘరానా ప్రముఖగాయకుడు బడేలాం అలీఖాఁన్ మహాద్భుతంగా సర్గమ్ గానం చేసేవాడు. ఆగ్రా, జైపూర్, రామ్‌పూర్ ఘరానాల వారెవ్వరూ సర్గమ్ గానం జోలికి పోలేదు.

ఆగ్రాఘరానా ముఖ్యగాయకుడు ఫయ్యాజ్ ఖాఁన్ పాడే ఖ్యాయాల్ పద్ధతికి యితర ఘరానాల ఖయాల్ పద్ధతికి చాలా తేడా ఉంది. ఆయన ధ్రుపద్ పద్ధతిలో మాదిరిగా శుద్ధ ఆలాప్, నొం తొం ఆలాప్ గానం చేసి, తర్వాత ఖ్యాల్ బందిష్ గానం చేసేవాడు. ఆయన గానంలో ధ్రుపద్ గాంభీర్యం, ఖ్యాల్ ఆకర్షణ రెండూ అద్భుతంగా వుండేవి. రసావిష్కరణకు, రాగస్వరూప చిత్రణకు బడాఖ్యాల్‌లో సువిశాలమైన కేన్వాస్ లభిస్తుంది. ధ్రుపద్, ఠుమ్రీల రెండింటి లక్షణాలు బడాఖ్యాల్‌లో కనిపిస్తాయి. ఖ్యాల్‌లోని 'స్థాయి'లో రెండులైన్లు, 'అంతర'లో రెండు లైన్లు వుంటాయి.

'స్థాయి' లో రచన మధ్యసప్తకాన్ని దాటి పోదు. 'అంతర'లో రచన తారస్థాయిలోకి పోతుంది. 'స్థాయి' లోని సాహిత్యాన్ని రెండు సార్లో, మూడు సార్లో పాడిన తర్వాత 'అంతర'లోని సాహిత్యాన్ని గానం చేస్తారు. అలా మొత్తం రచనలోని సాహిత్యాన్ని గానం చేశాక 'స్థాయి'కి తిరిగి వచ్చి అక్కడి నుంచి బోల్ ఆలాప్, బోల్ తాన్‌లు మొదలు పెడతారు.

మచ్చుకు మూడు ఖ్యాల్ రచనలు చూద్దాం.

***పూర్యాధనాశ్రీ రాగం - త్రితాల్***

**పాయలియా ఝనకా రమోరీ/**

**ఝనన ఝనన బాజే ఝనకారీ /**

**పియా సమఝావూఁ సమఝత నాహీఁ/**

**సాస ననద మోరీ దేగీ గారీ/**

"కాలి మువ్వలు మ్రోగుతున్నాయి. ఇవి యిలా గల్లు గల్లున మ్రోగుతుంటే ప్రియుని వద్దకు ఎలా వెళ్ళేది? చెబితే అర్థం చేసుకోడు. అత్త, ఆడపడుచు నన్నే తిట్టి పోస్తారు." ఈ కాస్తే సాహిత్యం. ఇందులో మొదటి రెండు లైన్లు 'స్థాయి', తర్వాతి రెండు లైన్లూ 'అంతర'. బోల్ ఆలాప్, బోల్ తాన్, బోల్ విస్తార్‌లతో ఈ కాస్త సాహిత్యాన్నే గాయకుని ప్రతిభను బట్టి ఎంత సేపైనా గానం చేయవచ్చు. కథక్ శైలిలో ఠుమ్రీ రూపంలో అభినయం కూడా చేయవచ్చు. ఇది ప్రసిద్ధమైన ఖ్యాల్ బందిష్. (జైపూర్ ఘరానా గాయని కిశోరీ అమోంకర్ ఆమధ్య బాలమురళీ కృష్ణతో జుగల్బందీలో ఈ బందిష్‌ను గానం చేసింది. బాలమురళీ తెలుగులో 'గజ్జెలు మువ్వలు ఘల్లనగా'... అంటూ గానం చేశాడు. ఈ జుగల్బందీ సి.డి.గా వచ్చింది కూడా.

ఉస్తాద్ ఫయ్యాజ్ ఖాఁన్ పెక్కు ఖ్యాయాల్, ఠుమ్రీ, దాద్రా బందిష్‌లు రచించాడు. ఆయన కలం పేరు 'ప్రేమ్ పియా'. ఆయన ఖ్యాల్ బందిష్‌లలో ఒకటి-

***సుఘ్రయ్‌కానడ రాగం - తీన్‌తాల్***

**నైనన్ సో దేఖీ ఏక్ ఝలక్ మోహన్‌కీ /**

**జబ్‌సే 'ప్రేమ్' మోహే ఉన్‌హీకో భయోహై/**

**సుధ్ న రహీ తన్ మన్ కీ /**

"ఒక్కసారి మోహనుడిని చూశానో లేదో అతడి ప్రేమలోపడిపోయాను. నా తనువు మనసు నా వశంలో లేకుండా పోయాయి".

ఫయ్యాజ్ ఖాఁన్ దే మరో బందిష్ -

***రామ్‌కలీ రాగం - తీన్ తాల్***

**ఉన్‌సంగ్ లాగీ లాగీ రే మోరీ అఁఖియాఁ /**

**సాస్ ననద్ మోరీ బోల్ బోలత్ హై /**

**కాసో కరూఁ లర్‌కైయాఁ**

"మా యిద్దరి చూపులు కలిశాయి. అత్త, ఆడపడుచు ఏమేమో అంటున్నారు. నేనెవరితో గొడవ పడేది"?

హిందూస్థానీ సంగీతంలోని ఖ్యాల్‌కు, కర్ణాటక సంగీతంలోని కృతికి ఎన్నో పోలికలు కనిపిస్తాయి. ఈ రెండూ యించుమించు ఒకే కాలంలో అవతరించాయి. వాటి తర్వాత యిప్పటిదాకా రెండు వందలేళ్ళలో వాటిని మించిన ప్రక్రియలను ఎవరూ సృష్టించలేకపోయారు. అతి సంక్షిప్తమైన సాహిత్యం, అందులోని భావాలను ఎంతైనా విస్తరించే అవకాశం. ఇవి ఆ రెండు ప్రక్రియల ప్రత్యేకతలు. కాని, హిందూస్థానీ గాయకులు, కర్ణాటక గాయకులు కూడా వీటిలో సంగీతం పైనే దృష్టి పెట్టి, సాహిత్యాన్ని అప్రధానాంశంగా పరిగణించడం దురదృష్టకరం. పాడే పద్ధతిలో కొద్ది పాటి మార్పులు చేసుకుంటే సంగీత ప్రాధాన్యం తగ్గించకుండానే సాహిత్య సౌందర్యాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించవచ్చు. మి



# బాపి బావ

- విరియాల లక్ష్మీపతి

**జం**బూ ద్వీప భరతవర్ష భరతఖండం పరాధీనమైన కాలం. వేద భూమ్మీద పాశ్చాత్య భీతావహతుఫానుగాలులు వీచి మాతృభూమిని అతలాకుతలం చేసిన రోజులు. ఆ నిబిడాంధకార నిరాశామయ సమయంలో భావి శుభ ప్రభాతాన్ని సూచించే ఆశాకిరణాలుగా కొందరు మహనీయులు ఈ పవిత్ర నేల మీద అవతరించారు. అలా ఉత్తమ పురుషుల్ని ప్రసవించి భరతమాత తన అజేయశక్తిని ప్రకటించుకుని రత్నగర్భ అనే సార్థక నామాన్ని నిలుపుకుంది. ఆ మహనీయుల ప్రతిభావిశేషాలవల్లనే భరత జాతి ఘనత దిగంతాల దాకా వ్యాపించి ఖండాంతర ఖ్యాతినార్జించింది.

భారతదేశంలో తెల్లవారి పరిపాలన సుస్థిరమై సతీసహగమనంలాంటి సనాతన మూఢాచారాలకు వ్యతిరేకంగా తెల్లదొరలు చట్టంచేస్తూ సాంఘిక ఉద్యమాలు రాజా రామమోహనరాయ్ వంటి సంఘసంస్కర్తల నాయకత్వంలో ఊపందుకున్న నిశాంత సమయం. జాతీయ కాంగ్రెసు ఉద్భవించి భారతీయుల్లో రాజకీయ నవ చైతన్యంకి అంకురార్పణ జరిగిన మంచి ముహూర్తం. జాతీయ చైతన్యం దేశం అంతటా వ్యాపించి ప్రజలు దీర్ఘనిద్ర లోంచి అప్పుడే మేల్కొంటున్న శుభసమయంలో 1895 అక్టోబరు 8వ తేదీన మన్మథ నామ సం॥ ఆశ్వీయుజ బహుళ పంచమి రాత్రి పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి సమీపంలో గల సరిపల్లె అనే గ్రామంలో మాతామహుల ఇంట ఉదయించింది ఒక ధృవతార. ఆ తారే శ్రీ అడివి బాపిరాజు. బాపిరాజు గారు నియోగి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. సాంఖ్యాయన గోత్రీకులు. బాపిరాజుగారి మతామహులు పేరు కూడా బాపిరాజే. సుబ్బమ్మ గారు వీరి సహధర్మచారిణి. వీరి కుమారుడు క్రిష్ణయ్య. వీరి అర్ధాంగి పేరు కూడా సుబ్బమ్మే. క్రిష్ణయ్య సుబ్బమ్మల ద్వితీయ సంతానం బాపిరాజు. బాపిరాజు గారి తండ్రి క్రిష్ణయ్య గారిది రైతు కుటుంబం. తనకు వంశపారంపర్యంగా సంక్రమించిన క్షేత్రాన్ని సుక్షేత్రంగా మార్చడం సాయంత్రం పొలం నుండి ఇంటికి వచ్చి ఇరుగు పొరుగువారితో సాటి రైతు కుటుంబీకులతోనూ కథలు కబుర్లు చెప్పుకోవడంతో కాలం గడిపే వారు క్రిష్ణయ్యగారు. కథల్ని అప్పటి కప్పుడు ఆసువుగా చెప్పేవారు. కథల కల్పన శ్రోతలకు ఆసక్తి దాయకంగాను జనరంజకంగానూ వుండడం చేత శ్రోతల సంఖ్య కూడా హెచ్చుగానే వుండేది. క్రిష్ణయ్య గారు కథ చెప్పనిదే ఆవూరు వారికి రాత్రి గడిచేది కాదు.

ఆ కథాకథన శక్తే కుమారుడు బాపిరాజుగారికి అనువంశికంగా సంక్రమించిన వారసత్వ సంపద. తండ్రి గారి దగ్గరనుండి వచ్చిన ఈ అపారమైన సృజనశక్తే బాపిరాజు గారిని ఉత్తమ నవాలాకారునిగా తీర్చిదిద్దడానికి దోహదపడింది. తండ్రిగారు అందించిన ఆ కల్పనా శక్తే చిన్నారి బాపిరాజుని లలితకళలన్నిటియందూ నిష్ణాతుణ్ణి చేసింది. 1903లో బాపిరాజుగారు తన ప్రాథమిక విద్య భీమవరం, కొవ్వూరులలో పూర్తి చేశారు. 1917లో ఉన్నత విద్య అభ్యసించడం కోసం నరసాపురం వచ్చారు. 1910లో వీరి తండ్రిగారు వీరికి ఉపనయనం జరిపారు. 1909 నుండి 1919 వరకూ గల మధ్య కాలంలో బాపిరాజు గారు రాజమండ్రి ఆర్ట్స్ కాలేజిలో ఉన్నత విద్యనభ్యసించారు. కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే బాపిరాజుగారు కూల్డ్రే దొరగారిని ప్రముఖంగా ఆకర్షించారు. ఆస్వాల్డ్ డెన్నింగ్ కూల్డ్రే ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపాల్‌గా పనిచేసి విద్యార్థుల్ని సుశిక్షితుల్ని చేసిన ఆచార్యులకు ఆచార్యుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహు భాషాకోవిదుడు, శిల్పి, చిత్రకారుడు, భారతీయ లలిత కళలన్నింటినీ ఆపోసన పట్టిన ప్రజ్ఞాశాలి, సంగీత సాహిత్యాదులలో అందెవేసిన చేయి. ఈత, గుఱ్ఱపు స్వారి,

---

**విరియాల లక్ష్మీపతి :** *మిసిమికి ఎన్నో వ్యాసాలు వ్రాశారు. ఇటీవల హఠాత్తుగా మరణించారు*

టెన్నిస్ క్రీడలలో మంచి నైపుణ్యం సంపాదించిన ఉత్తమ ఉపాధ్యాయుడు. తెలుగు వారి ఆచార వ్యవహారాల పట్ల సంస్కృతీ సంప్రదాయాల పట్ల కూల్డ్రే గౌరవాభిమానాలు ప్రదర్శించే వారు. కళాశాలలో చేరిన కొద్ది రోజులకే కూల్డ్రే దొర గారి ప్రేమాభిమానాల్ని పొందగలిగారు బాపిరాజు. రాజమండ్రి ఆర్ట్స్ కాలేజి గోదావరి నది ఒడ్డునవుంది. సాయంత్రం టెన్నిస్ ఆడిన తర్వాత కూల్డ్రే దొర కొందరి శిష్యుల్ని వెంటబెట్టుకుని గోదావరి నదీ తీరానికి వాహ్యాళిగా వచ్చేవారు.

గోదావరి లంకలమధ్య ఇసుక తిన్నెలు, రెక్కలు చాపి ఆకాశంలో పల్టీలు కొట్టే పక్షుల గుంపులు నదిలో తెరచాపలు ఎత్తి నెమ్మదిగా సాగిపోయే పడవలు మొదలయిన సుందర దృశ్యాలు విద్యార్థులకు చూపించి శిష్యుల్లో కళల పట్ల ఆసక్తి కలిగేలా చేసేవారు. వారిలో సృజన శక్తిని ప్రోదిచేసేవారు.

గోదావరి ప్రక్కగా వరిమళ్లల్లో వ్యవసాయం చేసే రైతులు, కలుపు తీసే మహిళలు, నదిలో పడవ నడిపే నావికుడు, మళ్లగట్ల మీంచి వరుసగా నడిచిపోయే రైతు కూలీలు, వారు శ్రమని మరిచిపోవడానికి జానపదగీతాలు పాడుకునే గాయకులు వీరందరూ గోదావరి నదీమ తల్లికి నిజమైన బిడ్డలు అంటూ విద్యార్థుల్ని విద్యాధికులుగా చేసేవారు. కూల్డ్రే శిష్యవర్గంలోని ప్రధాన శిష్యుడే బాపిరాజు. గురువు చెప్పిన ప్రకృతి రహస్యాలను ఎన్నింటినో ఆకళింపు చేసుకున్నాడు.

**ఉప్పొంగి పోయింది గోదావరీ / తాను తెప్పలా ఎగసింది గోదావరీ....**
అంటూ గురువు సమక్షంలో పాట పాడి విన్పించాడు బాపిరాజు. పాట పూర్తయిన తర్వాత కూల్డ్రే గోదావరిలా ఉప్పొంగి పోయి శిష్యుడ్ని కౌగిట చేర్చుకున్నాడు. "బాపిరాజూ గోదావరికి నిజమైన ముద్దు బిడ్డవు నువ్వేనయ్యా" అంటూ ప్రశంసించి తన్మయుడై పోయాడు. ఆనాటి నుండి కూల్డ్రే దొరగారికి అడివి బాపిరాజు ఆంతరంగిక శిష్యుడై తనలోని కళానైపుణ్యానికి మరింత విశిష్టత చేకూర్చుకున్నాడు. కూల్డ్రే దొరగారి గురుత్వము పరవళ్ళు తొక్కే గోదావరీ నది సాంగత్యము భవిష్యత్తులో బాపిరాజుగారు చిత్రీకరించబోయే ఎన్నో కళాఖండాలకి భూమిక నేర్పర్చుకుంది.

1909 నుండి 1919 వరకూ అంటే కూల్డ్రే ప్రిన్సిపాల్‌గా వున్నంతకాలమూ కూల్డ్రే శిష్య బృందానికి ముఖ్యంగా అడివిబాపిరాజు గారికి అది ఒక స్వర్ణయుగం అయ్యింది. కూల్డ్రే ప్రతి సెలవుల్లోనూ తన శిష్యబృందాన్ని వెంట బెట్టుకుని భారతదేశంలో గల చారిత్రక ప్రదేశాలనూ, సుప్రసిద్ధ యాత్రాస్థలాలనూ, పుణ్యక్షేత్రాలను, శిథిలమైన బౌద్ధారామాలను సందర్శించేవారు. అజంతా, హంపి, అమరావతి, గయ, ప్రయాగ మొదలయిన క్షేత్రాల్ని శిష్యబృందంతో సందర్శించి విహారయాత్రలో విజ్ఞానాన్ని శిష్యులకు బోధించారు. దామెర్ల రామారావు, దామెర్ల వెంకటరావు, కవికొండల, దబ్బాప్రగడ సుబ్బారావు, గూడూరు నమఃశ్శివాయ, జయంతి గంగన్న, భాష్యకార్లు, వరదా వెంకట రత్నం మొదలయిన ప్రజ్ఞావంతులు ఆంధ్ర కళానిర్మాతలు కళాకారులు కవులు కూల్డ్రే దొరగారి ఆనాటి శిష్యబృందం. వీరందరిలోనూ అడివిబాపిరాజు దొరగారి ప్రియశిష్యులు.

కూల్డ్రే సమకూర్చిన ఆనాటి విహారయాత్రా విజ్ఞానమే బాపిరాజుగారిలో గల కవిని, రచయితని, నవలాకారుని, చిత్రకారుడ్ని, శిల్పిని మేల్కొనేలా చేసింది. కూల్డ్రే, బాపిరాజుల గురుశిష్య సంబంధం ఆనాటి మేధావుల్ని అధ్యాపకుల్ని పురప్రముఖుల్ని ఎంతగానో ఆశ్చర్యపరచేది. ఎందుకంటే కొన్ని సమయాలలో కూల్డ్రే దొరగారు గురువుగా బాపిరాజుకి పాశ్చాత్య చిత్రకళామెలకువలు విదేశాల సంస్కృతీ సంప్రదాయాలు వివరిస్తే, మరికొన్ని సమయాలలో బాపిరాజుగారు గురుస్థానాన్ని అలంకరించి భారత దేశచరిత్ర ఆంధ్రరాజుల శిల్పకళావైశిష్ట్యము బౌద్ధధర్మ ఉచ్ఛస్థితి, క్షీణదశలు వివరించి అందరినీ అబ్బుర పరిచేవాడు.

కూల్డ్రే మహాశయునికి గ్రామీణ జీవన విధానం, తెలుగువారి ఆచారాలు, శ్రామిక పదాలు, జనపద గీతాలు, జానపద కళలు వీటి పట్ల ప్రత్యేక అభిమానాన్ని ప్రదర్శించే వాడు. గురువుగారి అంతరంగం గమనించిన బాపిరాజు గురువుగారి ఆనందం కోసం ఎన్నో జానపదగీతాలు వ్రాశాడు. శ్రావ్యంగా గానం చేసి గురువుని ఆహ్లాద పరచేవాడు. గురుశిష్యులిద్దరూ వెన్నెల్లో గోదావరీ నదీ తీరానగల ఇసుక తిన్నెల్ని, లంకప్రాంతాల్ని అడుగడుగునా సందర్శించేవారు. ఇరువురూ కవిత్వానికి, చిత్రలేఖనానికి కావలసిన పద చిత్రాల్ని, ముడి సరుకుని, రమణీయతని సేకరించుకునేవారు. ఇలాంటి ప్రకృతి రసాస్వాదన చేసే సమయంలోనే ఒక అద్భుత సంఘటన గురుశిష్యుల మేలు కలయికను మరింత గాఢతరం చేసింది. వారి ఇరువురి అంతరంగాల్ని అనురాగబంధంగా మార్చి లోకోత్తర వస్తు గుణాన్ని సాధించింది. ఒక ఇంద్రజాల శక్తికి ఆవిష్కరణ జరిగింది. అతీంద్రియ కవితా దేవత సాక్షాత్కరించింది. అదే ఎండీమియాన్ అవతరణ...

బాపిరాజుగారి సాహితీ విపంచి శశికళానాదం కొత్త నిక్వణాలు పలికిన మంచి ముహూర్తం. బాపిరాజుగారి సాహిత్యజీవితానికి కొత్త వెలుగు. రాజమహేంద్రవరానికి దూరంగా ఊరవతల ఒక విశాలమైదానం. పిలపిలమని కురుస్తున్న శరద్రాత్రి వెన్నెల్లో ఆకాశం మీంచి జారుతున్న వెండి జలతారు వెన్నెల తీగెల్ని తప్పించుకుంటూ నిశ్శబ్దంగా ప్రకృతి సౌందర్యాలు ఆస్వాదిస్తూ నడుస్తున్నారు గురుశిష్యులు. ప్రక్కగా గోదావరీ తరంగాలు గుసగుసమని ఏవేవో ఊసులు చెపుతూ తీరాన్ని ముద్దులాడుతున్నాయి. ఎక్కడో ఒక పక్షి గూడులోంచి జారిపోయి రెక్కలు టపటపమని కొట్టుకుంటూ ఆకాశంలో కన్పించని తీరాలకి ఎగిరి కనుమరుగయి పోయింది. తీతువు పక్షులు అప్పుడప్పుడు జలగీతాలు ఆలపిస్తున్నాయి. గురుశిష్యులు ఇరువురిలోనూ ఏవేవో నిశ్శబ్ద తరంగాలు కవితా గీతాలు ఆలపిస్తున్నాయి. కురుస్తున్న వెన్నెలనంతా గురుశిష్యులు ఇద్దరూ దోసిళ్ళతో జుర్రుకుంటున్నారు. వెన్నెల ధారల్లో స్నానం చేస్తూ కొన్ని వెన్నెల ధారల్ని కవితలుగా తర్జుమా చేస్తూ ముందుకు సాగుతున్నారు.

బాపిరాజుగారు ఒక శిల మీద కూర్చొని ఆకాశం కేసి తదేకంగా చూస్తున్నారు. పుంజీభవించిన ఒక వెన్నెల పాలపుంత దివ్యకాంతి ఆకాశం మీంచి జారి బాపిరాజు గారి దేహం మీద వాలి వారి శరీరంలో అది అంతర్లీనమైపోయింది. ఇదంతా ఒక లిప్తపాటు కాలంలో జరిగిన వింతయిన దృశ్యచిత్రం. దూరంనుండి ఇదంతా గమనిస్తున్న కూల్డ్రే ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ఏమిటీ వింతకాంతి ఎక్కడిదీ పాలపుంత. ఆకాశం మీంచి వచ్చిన ఈ దివ్యకాంతి బాపిరాజు గారి శరీరంలో కలిసి అదృశ్యం అయిపోవడం ఏమిటి? కూల్డ్రే దొర గారిలో ఆనందం గోదావరిలో ఉత్తుంగ తరంగం అయింది. మూడువేల సం॥ల క్రిందట గ్రీసు దేశంలో జరిగిన పురాణ గాథ స్ఫురణకు వచ్చింది.

ఎండీమియాన్ గ్రీసు దేశస్థుడు. చక్కని అందగాడు. గోవులను మేపుకుంటూ ఆనందంగా కాలం వెళ్లబుచ్చేవాడు. ఒకనాటి వెన్నెల రాత్రి పొలంలో నిద్రపోతున్నాడు. ఆ సమయంలో వెన్నెల రూపంలో గంధర్వ సుందరి ఎండీమియాన్‌ని కౌగలించుకుంటుంది. అతని శరీరంలో కలిసి మాయమైపోతుంది. ఎండీమియాన్ సౌందర్యానికి పరవసించిపోయి ఆ దివ్యకాంత వెన్నెల రూపంలో వచ్చి అతణ్ణి అల్లుకుపోయింది. ఈ దివ్యగాథని కాల్పనిక కవులు కీట్స్ ప్రభృతులు కవితాగానం చేసి ఎంతో మంది కవితారసజ్ఞుల్ని ఆనంద పరిచారు. ఇది జగత్ విదితమైన కవిత. తను చూసినది ఎండీమియాన్ దివ్యగాథ కూల్డ్రే తన శిష్యుడికి వివరించాడు. "నీకూ ఆనాటి ఎండీమియాన్‌కి భేదం కన్పించడం లేదు. ఆనాటి ఎండీమియాన్‌వి నువ్వే" అంటూ శిషుడ్ని గాఢంగా ఆలింగన చేసుకున్నాడు.

అలనాటి ఉదంతాన్ని దృష్టిలో ఉంచుకుని నాటి వెన్నెల కాంతి రేఖలకి అక్షర రూపం ఇచ్చాడు బాపిరాజు.

**కొండ తిరిగి కోన తిరిగి / కోనమధ్యను కొండవాగును**
**బండరాళ్లను పతనమయ్యే / పండు వెన్నెల పరుగు లెత్తె**
**లోయ చేరెనే ఓ నా వెన్నెల బాలా**
**మూడు వేల ఏళ్ళ వెనకే / ఈడు వచ్చిన గ్రీకు బాలుడు**
**ఆడుకొనెనే గ్రీసు దేశాన / ఓ అడవి మల్లె అందం దానా**
**గ్రీకు బాలుడు ఎండీమియానంట!**

అంటూ శిష్యుడు గానం చేసిన ఈ గానానికి కూల్డ్రే మరింత ముగ్ధుడయ్యాడు.

1915 జూలై 5వ తేదీన శ్రీ తటపర్తి సుబ్బారావు ద్వితీయ పుత్రిక సుభద్రను వివాహం చేసుకున్నారు బాపిరాజు. శిష్యుని వివాహానికి కూల్డ్రే దొర విచ్చేసి వధూవరుల్ని ఆశీర్వదించారు. అది ఒక మరుపురాని జ్ఞాపకంగా చిత్రించుకున్నాడు బాపిరాజు. భారత దేశంలో కంపెనీ పాలన తెల్లదొరల దాష్టీకం పెచ్చు పెరుగుతున్న సమయం. బెంగాల్ విభజన, మొదటి ప్రపంచయుద్ధం పరిసమాప్తి, 1919 జలియన్ వాలాబాగ్ మారణకాండ, శ్వేత జాతీయుల నిరంకుశ పాలన తేటతెల్లమౌతోంది. భారతీయుల్లో మేధావి వర్గం తెల్లవారి వలస విధానాన్ని కీర్తిస్తున్నారు. కాని బాపిరాజు మాత్రం వలస విధానంలో రహస్యం గ్రహించారు. ఇది వారిలోని క్రాంత దర్శనకి సాక్ష్యం చెపుతుంది. గాంధీజీ బోధనలు, అహింసా సిద్ధాంతం బాపిరాజుని ఎంతగానో ఆకర్షించాయి. జాతి విముక్తికి గాంధీజీ సూత్రాలే అసలయిన ఆయుధాలుగా గ్రహించి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. తన నూతన వైవాహిక జీవితాన్ని ప్రక్కకు పెట్టి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. ఈ కారణంగానే 1921లో ఆరు మాసాలు రాజమండ్రి జైలులోనూ, మరొక ఆరుమాసాలు నెల్లూరు జైలులోనూ కారాగార శిక్ష అనుభవించారు.

**కత్తు లేల మాకు మాతా**
**శక్తి లేద మా ఆత్మకూ**
**మా నాయకుడు మహాత్మాగాంధి**
**దండి తీరమునకు రండి! యాత్రయట**
**లవణ జలధికి, పదములు నడిచి**
**లావణ్యాన్ని సంగ్రహింతుము.**

అంటూ మహాత్ముడి నాయకత్వాన్ని, ఉప్పుసత్యాగ్రహాన్ని గేయ రూపంలో చిత్రించి జాతీయతను ప్రదర్శించుకున్న ఉత్తమ దేశభక్తుడు బాపిరాజు. హిందూ సమాజానికి పెద్ద కళంకంగా పీఠం వేసిన అస్పృశ్యతని కూకటి వేళ్ళతో పెకిలించడానికి గాంధీజీ చేస్తున్న ఉద్యమాన్ని హృదయ పూర్వకంగా స్వాగతించి, హరిజనోద్ధరణ ఇతివృత్తంగా *నరుడు* గాథ రచించాడు బాపిరాజు. పంచముడు కూడ నరుడే అని అంతరాలు పాటించడం నేరమని చాటి చెప్పాడు. 1923 సం॥ల పూర్వార్థంలో ప్రమోద్ కుమార్ చటర్జీగారు బందరు జాతీయ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించబడ్డారు. వారు హనుమంతరాయ చిత్రకళాశిక్షణా మండపం ప్రారంభించారు. కళాకారులకు శిక్షణ ఇచ్చే నేపథ్యంగా విద్యార్థులందరికీ ఆహ్వానాలు పంపారు. బాపిరాజు చిరకాల వాంఛ నెరవేరింది. ఎన్నో ఏళ్లపాటు తనలో దాగున్న చిత్రకళా విద్యకు మెరుగు పెట్టాలనే ఆశ ఈడేరింది. బాపిరాజు ఆనందంతో ఆ శిక్షణా శిబిరంలో చేరారు. ప్రమోద్ కుమార్ పర్యవేక్షణలో బాపిరాజు చిత్రకళ, శిల్పకళ, నాట్యకళ, నాటకకళ వీటిలోని మెళకువలు ఆకళింపు చేసుకున్నారు. భారతీయ పాశ్చాత్య కళలమధ్య గల భేదాల్ని, సారూప్యాల్ని నిశితంగా పరిశీలించి తనలోని కళాత్మకు మరింత ఓజస్సుని సంతరించుకున్నారు. ఎన్నో కళారూపాల్ని సృష్టించారు.

కాలగతిలో మారుతున్న సమాజాన్ని అభ్యుదయ పథాన్ని చూసి నీళ్ళుకారిపోయి గతకాలమే మేలు అంటూ వెనక చూపులు చూస్తూ ప్రస్తుత కాలాన్ని దుయ్యబెడుతున్న సంప్రదాయ ఛాందసుల్ని బాపిరాజు తీవ్రంగా నిరసించాడు. ఎన్నడో గతించి పోయిన ప్రాభవాల్ని చూసి మురిసిపోతూ వాటిని కీర్తిస్తూ కాలం గడిపే ప్రగతి నిరోధకుల్ని పూర్తిగా వ్యతిరేకించాడు. తన సమస్త సాహిత్యాన్ని అభ్యుదయ భావజాల నేపథ్యంతో


**ప్రమోద్ కుమార్ ఛటర్జి**


**శారద**

సృజించాడు. తను చేపట్టిన అన్ని కళల్ని నవన వోన్మేషంగా మలుచుకుని ఎన్నో సృజనాత్మక కళాఖండాల్ని తెలుగు జాతికి అందించాడు బాపిరాజు. జైలు నుండి విడుదలైన తర్వాత మద్రాసు లా కాలేజిలో బాపిరాజు 1931లో బి.ఎల్ పూర్తి చేశాడు. 1934లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు నిర్వహించిన నవలా పోటీలో తాను రచించిన *నారాయణరావు* జాతీయోద్యమ నేపథ్యం గల నవలకు ప్రథమ బహుమతిని అందుకున్నారు. 1935లో బందరు జాతీయ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించి ఎంతోమంది విద్యార్థుల్ని సుశిక్షితులయిన పౌరులుగా తయారు చేశారు. వారిలో జాతీయతా భావజాలాన్ని ప్రోది చేసి స్వాతంత్రోద్యమం వైపు నడిపించాడు. 1944-1950 ఈ మధ్య కాలంలో బాపిరాజు *మీజాన్ పత్రిక*లో పని చేశారు. మీజాన్ అనగా తులనాత్మక పరిశీలన అని అర్థం. ఇందులో పనిచేస్తున్న తరుణంలోనే బాపిరాజు సంపాదకత్వ వృత్తికి న్యాయం చేయాలన్న దృష్టితో ఎన్నో గ్రంథాల్ని పరిశీలించారు. పాశ్చాత్య తత్వవేత్తల వ్యక్తివాదనల లోతులు ఆకళింపు చేసుకున్నారు. భారతదేశ చరిత్రని, ఆంధ్రుల చరిత్రని ఆపోసనపట్టారు. పత్రికలో పనిచేసిన ఈ మధ్యకాలాన్ని సద్వినియోగ పరుచుకున్నారు. ఆంధ్ర శాతవాహన కాలానికి చెందిన *హిమబిందు*, కాకతీయుల కాలానికి చెందిన *గోన గన్నారెడ్డి*, ఇక్ష్వాకుల కాలంనాటి చారిత్రక ఇతివృత్తం *అంశుమతి* నవలలు

గ్రంథరూపంలో రచించారు. *మీజాన్ పత్రికలో* పనిచేసే కాలంలోనే బాపిరాజు *తుఫాను, కోనంగి* లాంటి సాంఘిక నవలలు రచించారు. అలాగే *శబ్దబ్రహ్మ, సూర్య దేవుడు మృత్యుంజయుడు, తిక్కన, గౌతమ బుద్ధుడు, గోధూళి రుద్రమదేవి, ఆనందతాండవం* లాంటి వర్ణచిత్రాలు కూడా *మీజాన్‌లో* పనిచేసేకాలంలోనే చిత్రీకరించారు. వీరి *శబ్దబ్రహ్మ* చిత్రం నేటికి డెన్మార్కు చిత్రప్రదర్శనశాలలో సందర్శకులను ఆనందపరుస్తోంది. విశ్వనాథ సత్యన్నారాయణ రచించిన *కిన్నెరసాని* పాటలు, నండూరి సుబ్బారావు రచించిన *ఎంకిపాటలు* గ్రంథాలకు బాపిరాజు ముఖచిత్రాలు వేశారు. 1951లో బౌద్ధ కళాశిథిల ప్రతిరూపాల చిత్రీకరణకు మద్రాసు ప్రభుత్వం వీరిని సింహళం పంపింది. స్వాతంత్ర్యం సిద్ధించింది. భారతజాతి స్వేచ్ఛావాయువులు పీల్చింది. ఆసేతుహిమాచలము భారతీయులు ఉత్సవాలు చేసుకున్నారు. మద్రాసు ఆల్ ఇండియా రేడియో వారు స్వాతంత్ర్యం ప్రథమ వార్షిక కవిసమ్మేళనం ఏర్పాటు చేశారు. అందులో గుర్రం జాషువా, పుట్టపర్తి నారాయణాచార్యులు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నాయని సుబ్బారావు, అడివి బాపిరాజు పాల్గొన్నారు. ఈ అయిదుగురు మహాకవులు స్వాతంత్ర్య సిద్ధించిన శుభ ముహూర్తంలో మొట్టమొదటి సారిగా స్వేచ్ఛాయుత భారతీయ సమాజాన్ని ఉద్దేశించి బానిస శృంఖలాలు తెగిన మహదానందాన్ని వారి కవిత్వంలో గానం చేసి జాతిని ఆనందంలో ముంచెత్తేరు.

**అవిరళమైన భారత సత్యాగ్రహాగ్ని**
**ఒక మహాత్ముని ఫాలనేత్రోద్భవమ్ము**
**స్వేచ్ఛ, శాంతి సమేత రుక్ జ్వలితమై ద**
**హించి చీకిపోయిన దాస్యహృదయ కోటి**

అంటూ–చివరగా ....

**వెడలిపో భారతమ్ము వీడి వెడలనున్న**
**వరము మంత్రమ్ము పఠించు బ్రహ్మ వెనుక**
**యాజకులమై బ్రతుకులో పూర్ణాహుతించె**
**యాజ్ఞ సేనాని స్వాతంత్ర్య మొందినాము**

అని దీర్ఘ పద్యాలలో జాతికి స్వేచ్ఛా సందేశాలు అందించారు. అవి ఆకాశవాణిలో కలిసి ప్రతి ఇంటి తెలుగువాడినీ పలకరించాయి. బాపిరాజుకి రాని విద్యలేదు. అలవడని కళ లేదు. సర్వకళలూ ఆయన్ని హృదయపూర్వకంగా వరించాయి. తెలుగు సాహిత్యంలో బాపిరాజు చేపట్టని కళాప్రక్రియ లేదు. కవిగా, రచయితగా, చిత్రకారునిగా, వ్యాసకర్తగా, సంపాదకునిగా, నాటకకర్తగా, గాయకునిగా, అభినయశాస్త్రకారునిగా, తత్త్వవేత్తగా, నటునిగా, నాట్యాచారునిగా, చరిత్రకారునిగా, ఉపన్యాసకునిగా, ఉపాధ్యాయునిగా, అభ్యుదయవాదిగా అన్నింటినీ మించి మానవతావాదిగా బాపిరాజు సర్వశాస్త్ర పారంగతుడు, సదాస్మరణీయుడు. వంగదేశీయులకు రవీంద్ర కవీంద్రుడు ఎంతటి ఆరాధ్యుడో తెలుగు వారికి బాపిరాజు అంతటి మహనీయుడు. అందుకే ఆనాటి ప్రముఖులు రసజ్ఞులు, సాటి మిత్రబృందం, విద్యాధికులు అందరు అడివి బాపిరాజుని *ఆంధ్రకవి రవీంద్రునిగా* తమ హృదయాలలో ప్రతిష్ఠించి కీర్తించారు. మాన్యమహోదయులు మూట్నూరువారు కులపతిగా అభివర్ణించి గౌరవించడం తెలుగువారికే గర్వకారణం. 22–9–1952న వీరు పరమపదించారు.

ఈ నేలమీద గోదావరి ప్రవహించినంత వరకూ, గట్టుమీద బసయవ్యలు అంకె వేసి మేస్తున్నంత కాలమూ, పొలాల ప్రక్క గోధూళి ఎగిరినంత కాలమూ, సంక్రాంతి పదాలకు గంగిరెద్దులు ఆటలాడినంత కాలమూ అడివి బాపిరాజు తెలుగువారి హృదయ క్షేత్రాలలో తిరుగాడుతూనే వుంటాడు అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ఌ

కార్మిక నాయకుడైనా, కర్మ సిద్ధాంతాన్ని
వదలని బుద్ధిమతి,

అద్వైత మూర్తి శంకరాచార్య
ఏకలవ్య శిష్యుడు లక్ష్మీపతి.

అరసానికి అండగా వున్నా – నవరసాల
నాటకాలను అందించిన రాగతి.

'సిద్ధాంత రాద్ధాంతాలతో వేడెక్కిన నా మస్తిష్కానికి
మలయ మారుతంలా మీ కవిత తాకింది'

అని మనసు విప్పి చెప్పగల
నిలువెత్తు నిజాయితి లక్ష్మీపతి.

తన ఇంటికి 'సిద్ధార్థ' అని పేరు పెట్టి
తను కట్టిన మేడకు 'వసిష్ఠ' అని
అనగలిగిన మేళవతి!

నెరుడా కవితలను అందరి అనువాదాలతో
బృహత్ గ్రంథంగా వెలువరించిన విశ్వపతి.

హఠాత్తుగా పరిచయమయి
అర్థాంతరంగా మాయమైపోయిన
శతమానంభవతి!

**(విరియాల లక్ష్మీపతి ఇక లేరు)**

# అడివి బాపిరాజు

అడివి బాపిరాజు 1944 నుండి హైదరాబాదులో ఉండి "మీజాన్" పత్రిక సంపాదకులుగా వ్యవహరించారు. ఆనాటికే నిజాం రాష్ట్రంలో జరుగుతున్న ఆంధ్రమహాసభల నాయకత్వం కమ్యూనిష్టులుగా, మితవాదులుగా ఏర్పడి వ్యవహరిస్తూ వస్తున్నారు. 1944 మే లో భువనగిరిలో జరిగిన 11 వ ఆంధ్రమహాసభకు రావినారాయణరెడ్డి అధ్యక్షులైనాడు. ఆ సభనుండి మితవాదులైన కొండా వెంకటరంగా రెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, మందుముల నరసింగరావు, మందుముల రామచంద్రరావు, మాడపాటి హనుమంత రావులు పాల్గొనకుండా వెళ్ళిపోయారు. వీరికి, వీరి రాజకీయాలకు గోల్కొండ పత్రిక మద్దతు పలికింది. సురవరం ప్రతాపరెడ్డి సంపాదకులుగా గోల్కొండ పత్రికలో మితవాదులకి అనుకూలమైన వార్తలు మాత్రమే ప్రచురిస్తుండేవారు. కమ్యూనిష్టులకు ప్రత్యేకమైన పత్రికంటూ తెలంగాణాలో ఆనాడు ఏమీలేదు. కాని మీజాన్ పత్రిక ఆ రోజుల్లో కమ్యూనిష్టులపై, ప్రజలపై జరుగుతున్న దాడులకు ప్రాముఖ్యాన్నిచ్చి వార్తలు ప్రచురిస్తుండేది.

ఆనాడు జరిగిన ఒక ముఖ్య సంఘటనకు సంబంధించి అడివి బాపిరాజు సంపాదకుడిగా మీజాన్ పత్రికలో ప్రచురించిన వార్త తెలంగాణా అంతా గొప్ప సంచలనం కలిగించింది. ఆ సంఘటన వివరాలలోకి వెళితే పాలకుర్తిలో శివరాత్రి సందర్భంగా జాతర జరుగుతుంటుంది. చుట్టుప్రక్కల గ్రామాలనుండి అధిక సంఖ్యలో ప్రజలు ఈ జాతరలో పాల్గొనేవారు. ఆంధ్రమహాసభ స్థానిక బాధ్యుడు, నాయకుడు అయిన ఆరుట్ల రామచంద్రారెడ్డి ఈ జాతరలో ప్రజలు అధిక సంఖ్యలో వస్తారు కాబట్టి ఒక బహిరంగ సభను నిర్వహించి ఆంధ్రమహాసభ ఉద్దేశాలను ప్రజలకు తెలియు జేయాలనుకున్నారు. ఆరుట్ల రామచంద్రా రెడ్డి ఆంధ్రమహాసభ జిల్లా కార్యవర్గ అనుమతి లేకుండానే సభ ఏర్పాటు చేశారు. ఆంధ్రమహాసభ జిల్లా నాయకత్వం ఆనాడు సంతలు, తిరునాళ్ళలో సభల ఏర్పాటుకు అంగీకరించే వారు కారు. కారణం ప్రజలు అధిక సంఖ్యలో వచ్చినప్పటికి వారు రాజకీయ సభలు లేక ఇతర సభలపై ఆసక్తి చూపరనే అభిప్రాయం వారిది. ఆనాడు విసునూరు దేశముఖ్ రామచంద్రారెడ్డి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, వారి తల్లి జానకమ్మ ప్రజలపై జరుపుతున్న దుర్మార్గాలకు వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఆంధ్రమహాసభ కార్యకర్తలపై నాయకులపై దాడులు జరుపుతున్న కాలం అది. ఆ సమయంలోనే ఆరుట్ల రామచంద్రారెడ్డి, పాలకుర్తి శివరాత్రి జాతరలో ఆంధ్రమహాసభ ఏర్పాటు చేయడంతో అదే అదనుగా భావించి అతనిపై దాడి జరపాలని విసునూరు దేశముఖ్ ప్రయత్నించాడు. విసునూరు రామచంద్రారెడ్డి గూండాలైన బనమానల వెంకన్న తరితరులు సభలో ఉపన్యసిస్తున్న ఆరుట్ల రామచంద్రారెడ్డిపై దాడికి ప్రయత్నించగా పాలకుర్తి గ్రామానికి చెందిన నరసయ్య ఆయన కుమారులు సోమయ్య, లచ్చయ్యలు వెంటనే బనమానల వెంకన్న మరియు ఇతర గూండాలను ఎదుర్కొని వారిని తరిమారు.

మరునాడు దీనిని అవకాశంగా తీసుకొని పోలీసులని పంపి విసునూరు రామచంద్రారెడ్డి, నరసయ్యను అతని కుమారులను అరెస్టు చేయించాడు. వారితో పాటు డి.సుబ్బారావు, గంగుల సాయిరెడ్డి, మనోహరరావు మరియు వావిలాల వాస్తవ్యులు నెమలిపురి చంద్రయ్య ఎడమరెడ్డి మోహనరెడ్డిలను కూడా అరెస్టు చేసి హత్యానేరం మోపి వారిని జైలులో పెట్టారు. ఈ కేసులో ఆరుట్ల రామచంద్రా రెడ్డి అరెస్టు కాకుండా ఆంధ్రమహాసభ ఆదేశానుసారం కొంతకాలం రహస్య జీవితంలోకి వెళ్ళారు. అరెస్టు అయ్యి జైలులో ఉన్నటువంటి ఖైదీలను బెదిరించి లొంగదీసుకోవడానికి విసునూరు రామచంద్రారెడ్డి ప్రయత్నిస్తున్నాడని తెలిసి వారి మనో నిబ్బరం దెబ్బతినకుండా ఉండటానికై ఆరుట్ల రామచంద్రా రెడ్డితో పాటు మరికొందరు కూడా అరెస్టు కావాలని ఆంధ్రమహాసభ నిర్ణయించింది. వీరి నిర్ణయాను సారం ఆరుట్ల రామచంద్రారెడ్డి అరెస్టుకాగా పోలీసులు అతనిని అనేక గ్రామాలలో తిప్పుతూ ప్రజలను భయభ్రాంతులని చేయటానికి ప్రయత్నించారు. ఈ పరిస్థితులలో ఆంధ్రమహాసభ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవులపల్లి వెంకటేశ్వరరావు రహస్యంగా గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలలో మనోధైర్యాన్ని కలిగించారు. ఈ వార్తలన్నింటిని అడివి బాపిరాజు ఎప్పటికప్పుడు మీజాన్ పత్రికలో ప్రచురిస్తూ, తెలంగాణా ప్రజల పక్షాన నిలిచారు. మరొక్క సంఘటనను కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. పాలకుర్తి కేసులో జైలుకి వెళ్ళిన నరసయ్య భార్య ఐలమ్మ. ఆమె సాగుచేస్తున్న వ్యవసాయపు పంట కోతకు రాగా విసునూరు రామచంద్రారెడ్డి

కుర్రా జితేంద్రబాబు, ఫోన్ : 9848882600

గూండాలను పంపి ఆ పంటను స్వాధీనం చేసుకోమని ఆదేశించాడు. అప్పటికే ఆమెపై దౌర్జన్యం చేయటానికి ప్రయత్నిస్తున్న రామచంద్రారెడ్డి గూండాలను ఎదుర్కోవడానికి భీమిరెడ్డి నరసింహారెడ్డి, యాదగిరి రావులతో పాటు మరికొందరు ఆంధ్రమహాసభ కార్యకర్తలను ఆమెకు రక్షణగా ఆంధ్రమహాసభ జిల్లా నాయకత్వం పంపింది. పంట కోతకొచ్చే సమయంలో ఆంధ్రమహాసభ కార్యకర్తలు మరికొందరు వీరికి తోడు సూర్యాపేట, బాలెముల మొదలగు ప్రాంతాలనుండి కూడా ఐలమ్మకు మద్దతుగా వచ్చారు.

విసునూరు రామచంద్రారెడ్డి గూండాలు ఐలమ్మ సాగుచేసిన పంట స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించగా ఐలమ్మ వారికెదురు తిరుగగా భీమిరెడ్డి నరసింహారెడ్డి తదితరులు ఆ పంటను స్వాధీనం చేసుకొని ఐలమ్మ ఇంటికి చేర్చారు. ఆ తరువాత ఒక దొమ్మీకేసు పెట్టి భీమిరెడ్డి నరసింహారెడ్డి, కట్కూరి రామచంద్రారెడ్డి, చకిలం యాదగిరిరావు, నల్లు ప్రతాపరెడ్డి, వెంకటేశ్వరరావు, కోట వెంకటరెడ్డిలను అరెస్టుచేసి విపరీతమైన చిత్రహింసలను పెడుతూ వీరిని కోర్టులో హాజరు పరచలేదు. ఈ సందర్భంగా ఆంధ్రమహాసభ కేంద్ర సంఘం వారు విచారణకు వకీలు ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డిని విచారణ నిమిత్తం పంపారు. పాలకుర్తి సమీపానికి కచ్చడం బండిలో రాగా, విసునూరు రామచంద్రారెడ్డి గూండాలు కచ్చడం బండికి అడ్డంపడి ఎడ్లను బండి నుండి విప్పతీసి, బండిని, చక్రాలను విడదీసి, ఎడ్లబండిని, బండి చక్రాలను చెరువులో వేశారు. ఆరుట్ల లక్ష్మీనరసింహా రెడ్డిని పట్టుకొని బలవంతంగా ఒంటిమీద ఉన్న వస్త్రాలను వొలిచేసి దిగంబరంగా వెళ్ళగొట్టారు. ప్రజలు ఈ సంఘటన గమనిస్తున్నప్పటికీ భయంతో అడ్డు చెప్పలేకపోయారు. అతను సరిహద్దు గ్రామమైన బమ్మెరకు అలానే దిగంబరంగా వెళ్ళి ఆ గ్రామ మఖ్తేదార్ ఇంట్లో ఆశ్రయం తీసుకొని అక్కడ వారిచ్చిన వస్త్రాలు ధరించి కచ్చడం బండిపై దగ్గరున్న రైల్వే స్టేషనుకు వచ్చి అక్కడినుండి హైదరాబాదు వచ్చి ఆ విషయాన్ని ఆంధ్రమహాసభ దృష్టికి తీసుకొచ్చారు.

ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి ఆంధ్రమహాసభ అధ్యక్షులు రావి నారాయణరెడ్డి ఆ నాటి పోలీసు డైరక్టర్ జనరల్ అండర్సన్‌కు ఫిర్యాదు చేయగా అతను నల్గొండ జిల్లా ఎస్పీకు విచారణకు ఆదేశించాడు. ఈ సంఘటన మొత్తానికి ప్రాముఖ్యతనిచ్చి అడివి బాపిరాజు *మీజాన్ పత్రికలో* ప్రచురించాడు. ఐలమ్మ కేసులో అరెస్టు అయ్యి బెయిలుపై బయటకు వచ్చి భీమిరెడ్డి నరసింహారెడ్డి ఆరుట్ల రామచంద్రారెడ్డిలపై విసునూరు రామచంద్రారెడ్డి గూండాలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. భీమిరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి వరంగల్ నుండి హైదరాబాదు వచ్చి అధికారులు ఫిర్యాదులు చేయగా వారు పట్టించుకోక పోవడంతో మీజాన్ పత్రికా కార్యాలయానికి వెళ్ళి వారి గాయాలను దాని సంపాదకులుగా వున్న అడివి బాపిరాజుకి చూపించారు.

ఆ గాయాలను చూసి చలించి పోయిన అడివి బాపిరాజు తెలుగు, ఉర్దూ ఎడిషన్‌లలో వీటిని కండ్లకు కనబడుతున్న దౌర్జన్యంగా పేర్కొంటూ ప్రధానంగా ప్రచురిస్తూ ఆంధ్రమహాసభ అధ్యక్షులు రావినారాయణ రెడ్డి ఈ సందర్భంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలను కూడా ప్రచురించారు. దీనితో ఈ సంఘటనలు అనేక గ్రామాలలో దావానలం లాగా వ్యాపించి ప్రజలను సంఘటిత పరచి దేశముఖ్‌ల, భూస్వాముల దౌర్జన్యాలను ఎదుర్కొనటానికి సన్నద్ధం చేసింది.

*మీజాన్ పత్రిక* సంపాదక వర్గంలో ఆనాడు రాంభట్ల కృష్ణమూర్తి, తిరుమల రామచంద్ర, విద్వాన్ విశ్వం, శ్రీనివాస చక్రవర్తి, బి.సి.కామరాజు, బొమ్మికంటి సుబ్బారావులు పనిచేసేవారు. *మీజాన్ పత్రికలో* ప్రచురితమయ్యే శీర్షికలలో "ధూపదీపాలు" పేరున అడివి బాపిరాజు వ్యంగ్య రచనలు చేసేవారు. "మిర్చి మసాలా" శీర్షికను రాంభట్ల కృష్ణమూర్తి నిర్వహించేవాడు. "నర్తనశాల" శీర్షికను శ్రీనివాస చక్రవర్తి; "కలంపోటు" శీర్షికను బి.సి.కామరాజు; "టైంబాంబ్" శీర్షికను బొమ్మికంటి సుబ్బారావు నిర్వహించేవారు. "లేఖలు", "రేడియో కార్యక్రమాలు", "శృంగాటకం" పేరుతో పుస్తక సమీక్షలు, "సాహిత్యవ్యాసాలు", "సీరియల్ నవల", "కథలు", "టాటా ఎయిర్‌లైన్స్" వారి సమయాలు, స్టాక్ మార్కెట్ వివరాలు మొదలైన అన్ని శీర్షికలను అడివి బాపిరాజు చూసేవాడు. ఈ పత్రిక నాలుగు పేజీలలో వెలువడేది. మొదటిపేజీ అంతర్జాతీయ వార్తలు, రెండు మూడు పేజీలలో జాతీయ వార్తలు, వార్తలు, నాలుగవ పేజీ అంతా తెలంగాణా వార్తలు ప్రచురించేవారు. *మీజాన్ పత్రిక* తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషలలో వెలువడేది. ఉర్దూ పత్రిక నిజాం నవాబును, ఆంగ్ల పత్రిక బ్రిటీష్ ప్రభుత్వాన్ని, తెలుగు పత్రిక తెలంగాణా ప్రజల న్యాయమైన పోరాటాలకు మద్దతు ప్రకటిస్తూ ప్రచురించేవారు. ఆంధ్రమహాసభ వార్తలు, తెలంగాణా గ్రామాలలో ప్రజలపై జరుగుతున్న అరాచకాలు, ప్రజల కష్టనష్టాలు, పోరాటాలు, ప్రతిఘటనలు అన్నీ *మీజాన్ పత్రిక* నాలుగవ పైజీలో ప్రముఖంగా ప్రచురించేవారు. తెలంగాణా గ్రామాలలో పటేల్

(అడివి బాపిరాజు గారి సంపాదకత్వంలో వెలువడిన "మీజాన్" దిన పత్రిక లోగో: 'మీజాన్' అంటే త్రాసు)




అడివి బాపిరాజు శతవార్షిక ప్రత్యేక సంచిక : 8-10-95

పట్వారీలు, భూస్వాములు, దేశముఖ్‌లు సామాన్య ప్రజలపై జరుపుతున్న దాడులు, అణచివేతలు వాటిని ప్రతిఘటిస్తూ సంఘటితంగా ప్రజలు, ఆంధ్రమహాసభ చేస్తున్న పోరాటాలు అన్నిటిని ప్రచురిస్తూ *మీజాన్ పత్రిక* దాని సంపాదకులుగా అడివి బాపిరాజు తెలంగాణా ప్రజాపోరాటాలతో మమేకమై, మద్దతు ప్రకటిస్తూ చారిత్రాత్మకమైన, చిరస్మరణీయమైన పాత్రను నిర్వహించారు.

కడవెండి గ్రామంలో ఆంధ్రమహాసభ కార్యకర్త దొడ్డికొమరయ్య 4 జులై 1946 నాడు విసునూరి రామచంద్రారెడ్డి గూండాల చేతిలో కాల్పులకు గురై మరణించగా అతని సంస్మరణ దినంగా 25 జులై 1946 నాడు సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తూ "కడవెండి దినంగా" నిర్వహించాలని ఆంధ్రమహాసభ పిలుపునిచ్చింది. దొడ్డికొమరయ్య మృతదేహాన్ని ప్రముఖంగా ప్రచురించి జులై 25, 1946 సంచికను దొడ్డికొమరయ్య ప్రత్యేక సంచికగా అడివి బాపిరాజు ప్రచురించారు. దొడ్డికొమరయ్య మరణం తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట ప్రారంభానికి తొలి అడుగు. తెలంగాణాలో ముఖ్యంగా నల్లగొండ, వరంగల్లు జిల్లాలో ఆంధ్రమహాసభ ఉద్యమాన్ని బలంగా నిర్మిస్తూ అన్ని రకాల న్యాయబద్ధమైన పోరాటాలను కొనసాగిస్తూ, స్థానిక భూస్వాముల, దేశముఖ్‌ల దౌర్జన్యాలను ఎదుర్కొంటున్న రోజులవి. ఆరోజుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి అనేక మంది యువకులు స్థానిక పోరాటాల, ప్రతిఘటనల వార్తలను *మీజాన్ పత్రిక*కు పంపుతుండేవారు. అడివి బాపిరాజు ఆ వార్తల్లోని ముఖ్యాంశాలను ఒక క్రమపద్ధతిలో ఏర్చికూర్చి ప్రచురిస్తూ స్థానిక యువకులను ప్రోత్సహించేవారు. అలా ప్రోత్సహించటం వల్ల ఎంతోమంది యువకులు రచయితలుగా తమ ప్రతిభను చాటుకున్నారు. అలా ప్రసిద్ధులైన వారిలో ప్రఖ్యాత కథకుడు ఆవుల పిచ్చయ్య ఒకరు. ఇతను నల్లగొండ జిల్లాలో ఆంధ్రమహాసభ గ్రామీణ ప్రాంత కార్యకర్త. అడివి బాపిరాజు హైదరాబాద్‌లో అభ్యుదయ రచయితల సంఘ శాఖను 8 అక్టోబర్ 1944 నాడు ప్రారంభించారు. దానికి తానే అధ్యక్షుడుగా ఉన్నాడు. భాస్కరభట్ల కృష్ణారావు, ఎల్లాప్రగడ సీతాకుమారి, వట్టికోట ఆళ్వారుస్వామి కార్యదర్శులుగా ఉన్నారు. హైదరాబాద్ సంస్థాన అభ్యుదయ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో హైదరాబాద్‌లోని రచయితలను ఆహ్వానిస్తూ 16 జనవరి 1946 నాటి *మీజాన్ పత్రిక*లో ఒక లేఖను ప్రచురించారు.

**హైదరాబాదు రచయితలకు పిలుపు :**

అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘానికి అనుబంధ శాఖగా ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం గత రెండేండ్ల నుంచి పని చేస్తూంది. ఆ శాఖకు అనుబంధ శాఖగా హైదరాబాద్ సంస్థాన అభ్యుదయ రచయితల సంఘాన్ని ఏర్పరచాలనుకున్నాం. విశాలాంధ్ర సాహిత్య రంగాన్ని ఒకే కేంద్ర సంస్థగా నిర్మించి, ఆంధ్ర సాహిత్య కళాభివృద్ధికి కృషి చేయాలనుకున్నాం. ఇది విశాలాంధ్ర సారస్వతాభ్యుదయానికి మార్గమని నమ్మాం. మానవజాతి కళ్యాణం కొరకు స్వాతంత్ర్యాభ్యుదయం కొరకు పాటుపడి జీవితములర్పించిన రవీంద్ర, ఇక్బాల్ మహాకవులకు వారసులైన అభ్యుదయ రచయితలందరూ, సామ్రాజ్యవాద ఫాసిస్టు దురాక్రమణల నుంచి భారతజాతిని, ప్రపంచ ప్రజలను రక్షించుటకు కంకణం కట్టియున్నారు. ఈ ఆశయాలతో పనిచేయుటకు సికింద్రాబాద్, హైదరాబాద్ పట్టణాలలోని రచయితలందరు ఒక సంఘంగా వుండాలి. ఆ అభిప్రాయంతోనే అక్టోబర్ 8 శుక్రవారం సాయంకాలం 4.00 గంటలకు థియోసాఫికల్ లాడ్జి (హైదరాబాద్) లో రచయితల సమావేశం జరుపుతున్నాం. పట్టణంలోని రచయితలు సాహిత్యాభిలాషులు సమావేశానికి వచ్చి సభను జయప్రదం చేయాలని కోరుతున్నాం.

| | |
|---|---|
| భాస్కరభట్ల కృష్ణారావు | ఇట్లు |
| ఎల్లాప్రగడ సీతాకుమారి | **అడివి బాపిరాజు** |
| వట్టికోట ఆళ్వారు స్వామి | (అధ్యక్షుడు) |
| (కార్యదర్శులు) | |

అడివి బాపిరాజు స్వాతంత్ర్య సమరయోధుడుగా, కవిగా, రచయితగా, చిత్రకారుడుగా, కళాభిమానిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా మాత్రమే గాక తెలంగాణాలో పటేల్, పట్వారీ, భూస్వాముల, దేశముఖ్‌ల, నిజాం ప్రభుత్వ దౌర్జన్యాలకు, వెట్టికి వ్యతిరేకంగా ప్రజలు నిర్వహించిన అన్నిరకాల పోరాటాలకు, ఉద్యమాలకు సంపాదకుడుగా తన మద్దతునిచ్చి ప్రజల పక్షాన నిలిచిన మహనీయుడు. ఇతని సేవలు చిరస్మరణీయం.

# నాటక వాణి

ఆకాశవాణి బాణి

- వోలేటి పార్వతీశం

తెలుగు నాటక చరిత్రను సమగ్రంగా రచించడానికి, ఎవరైనా పూనుకుంటే, అందులో ఒక ప్రకరణాన్ని తన సొంతం చేసుకుంటుంది శ్రవ్యనాటకం. అంటే శ్రవ్యనాటక ప్రత్యేకతలకు ఎంతటి విస్తృతి ఉందో మనకి అర్థమౌతుంది. పఠన నాటకానికి, ప్రదర్శన నాటకానికి, శ్రవ్య నాటకానికి మధ్యనున్న సున్నితమైన విభజన రేఖల గురించి మనం గతవారం కొన్ని విశేషాలు ముచ్చటించుకున్నాం.

ప్రదర్శన నాటకాన్ని తిలకించే ప్రేక్షకులు పఠన నాటకానికి వస్తే పాఠకులౌతారు. శ్రవ్యనాటకానికి వస్తే శ్రోతలౌతారు. ప్రేక్షకులకు లేని ఒక సౌలభ్యం పాఠకులకు, శ్రోతలకు వుంది. ఏమిటీ ఆ ప్రధాన సౌలభ్యం అంటే ఊహే. ప్రదర్శన నాటకంలో పాత్రలు, ఆ పాత్రధారులు, వారి ఆహార్యాలు, రంగాలంకరణలు, మన ఊహకు కళ్ళాలు వేస్తాయి. వేషధారణలు, రంగాలంకరణలు వంటి నిర్దేశిత చట్రంలో నుంచే మనం నాటకాన్ని తిలకించగలం. కళాకారుల నటనా వైదుష్యాన్ని ఆనందించగలం. కానీ, పఠన నాటకాలలోనూ, శ్రవ్యనాటకాలలోనూ నిర్దేశిత చట్రాలుండవు కనుక, మన ఊహలకు రెక్కలొస్తాయి. సన్నివేశాల్ని, పాత్రల్ని మన మనసుకి తెలిసినట్టు మనం కల్పన చేసుకుటాం. అందుచేత అవి మనసులో ముద్రితమైపోతాయి. ఈ సౌలభ్యంలో పఠన నాటకానికంటే, ఒక్క అడుగు ముందుంటుంది శ్రవ్యనాటకం. ఏమిటీ కారణం! అని మనం ప్రశ్నించుకుంటే, రేడియో నాటకంలోని పాత్రలకు ఊపిరిపోసే క్రమంలో పాత్రధారుల కంఠస్వరాలు మన కల్పనకు గొప్ప ఆలంబనగా నిలుస్తాయి. ఇక్కడే శ్రవ్యనాటకం గొప్ప విజయాన్ని సాధించింది.

తెలుగు సాహిత్యంలోని కొన్నినాటకాలు మనకి మూడు మాధ్యమాలలోనూ కన్పిస్తాయి. ఉదాహరణకి కన్యాశుల్కం, ఊరుమ్మడి బతుకులు, ప్రాణం ఖరీదు వంటివి. 'కన్యాశుల్కం' పఠన రూపంలో ఆనందించిన వాళ్ళున్నారు. ప్రదర్శనగా తిలకించి పులకించిన వాళ్ళున్నారు. రేడియో నాటకంగా ఆలకించి ఆనందించిన వాళ్ళూ వున్నారు. ఈ మూడింటి స్థాయిని మనం బేరీజు వేసుకుంటే కన్యాశుల్కం రేడియో నాటకంగా ఒక మెట్టు పైనే వుంది. ఇది కూడా శ్రవ్యనాటకం సాధించిన విజయం. రేడియో నాటకం మరొక ఘనతను కూడా సొంతం చేసుకుంది. ఏమిటా ఘనత? అంటే, కొన్ని గొంతుల్ని, కొన్ని పాత్రల్ని మనం విడదీసి చూడలేం. విశేషంగా ప్రాచుర్యం పొందిన కొన్ని పాత్రలపైన, ఆయా పాత్రధారులు వేసిన స్వరముద్రలు ఎంత బలమైనవంటే, ఆ రెండూ అవిభాజ్యాలు. ఉదాహరణకి, గిరీశం ప్రాత్రని కె. వెంకటేశ్వరరావు గారి గొంతులో విన్నాకా, మరో గొంతుని ఆ పాత్రకు శ్రోతలెవ్వరూ ఆమోదించలేరు. అలాగే గణపతి పాత్రను నండూరి సుబ్బారావు గారి గొంతులో విన్నాకా, మరో గొంతును దానికి సమాంతరంగా ఊహించలేం. అలాగే, గణపతి తల్లి పాత్రను సీతారత్నంగారు ప్రాణప్రతిష్ఠ చేసిందనడం సరైనమాట. అమాయకత్వం మూర్తీ భవించడమంటే ఏమిటో ఆ గొంతులో మనకి తెలుస్తుంది. శ్రవ్యనాటకంలో కొన్ని పాత్రలు నిర్వహించడం చాలా కష్టమైన పని. ఉదాహరణకి మూగవాడి పాత్ర. కంఠస్వరమే ఆలంబనగా నడిచే రేడియో నాటక పాత్రకు అసలు గొంతే లేకపోతే ఎలా? అయితే ఇటువంటి సందర్భాలను కూడా, ప్రయోగాత్మకంగా జయించిన సన్నివేశాలు రేడియో నాటకంలో వున్నాయి. ప్రదర్శన నాటకంగా ప్రాచుర్యంలోకి వచ్చిన ప్రాణంఖరీదు నాటకాన్ని రేడియోకి అనుసృజన చేసినప్పుడు, నాటకంలోని మూగ పాత్రనుకూడా అలానే వుంచి ఒక ప్రయోగాత్మక విజయాన్ని సాధించామని రచయిత సి.యస్. రావు జ్ఞాపకం చేసుకుంటూ వుంటారు.

కథ, నవల వంటి ఇతర ప్రక్రియల్లోని రచనలను కూడా రేడియో నాటకం తనలో ఇముడ్చుకుని సమతుల్యమైన ప్రాచుర్యాన్ని వాటిని సముపార్జించి పెట్టింది. 'ఊరుమ్మడి బతుకులు' ఆ కోవలోనిదే. రేడియో నాటకం పాత్రలన్నింటితో పాటు ఒక ప్రధానమైన అనామకంగానే సృజన చేసుకుంటుంది, ఆ పాత్రపేరే నేపథ్య సంగీతం. ఇది రేడియో నాటకానికి మూడోపాత్రం. ప్రదర్శన నాటకాల్లో కూడా నేపథ్య సంగీతం వున్నా ప్రేక్షకుల దృష్టి దృశ్యంపైన లగ్నమై వుంటుంది కనుక, నేపథ్య సంగీతం ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపే

డాక్టరు వోలేటి పార్వతీశం, ఫోన్ : 9440031213

సన్నివేశాలు చాలా తక్కువే. కానీ, రేడియో నాటకంలో అలాకాదు. నేపథ్య సంగీతం చాలా కీలకమైన భూమికను పోషిస్తుంది. సన్నివేశం రాత్రివేళ జరుగుతుంటే, నేపథ్యంలో వినబడే కీచురాళ్ళ శబ్దం, సముద్ర తీరంలో కనుక సన్నివేశం జరుగుతుంటే, నేపథ్యంలో వినబడే సముద్రపుహోరు, ఒక వేళ సన్నివేశం రైలు ప్రయాణంలో జరుగుతూవుంటే, నేపథ్యంలో వినబడే రైలుచప్పుళ్ళు, ప్లాట్‌ఫారమ్ సందళ్ళు ఇవన్నీ ఆ సన్నివేశాన్ని మన కళ్ళకు కట్టించేస్తాయి. శ్రవ్యాన్ని దృశ్యంగా రూపాంతరం చెందించి, ఆయా పాత్రల్ని మన మనసుల్లో స్థిరంగా ముద్రించిన సందర్భాలు ఎన్నో వున్నాయని రేడియోనాటకం చాలాసార్లు సాక్ష్యం చెప్పింది. ఒక సన్నివేశానికో, ఒక సంఘటనకో, ఒక గొప్ప వ్యక్తిత్వానికో, ఒక అందానికో, ఒక జ్ఞాపకానికో, ఒక చరిత్రకో ఇవేమీ కాదు. ఒక అందమైన ఊహకో, మనసు స్పందించినప్పుడు, ఆ స్పందనలను కలానికి అందించినప్పుడు అవి కవితగా ఊపిరి పోసుకుంటున్నాయి. నిజానికి ప్రతి మనిషి ఒక కవి. ఎందుకంటే స్పందనలు అందరికీ వుంటాయి కదా! ఈ స్పందనలను మనసులోనే దాచుకొనేవాడు మామూలు మనిషిగా మిగిలి పోతున్నాడు. ప్రకటించ గలిగిన వాడు కవిగా స్థిరపడిపోతున్నాడు.

కవికి, ఆకాశవాణికి, తొలిరోజుల్నుంచీ చాలా ప్రగాఢమైన అనుబంధం వుంది. దేవులపల్లి కృష్ణశాస్త్రి, జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి, కందుకూరి రామభద్రరావు, వింజమూరి శివరామారావు, దాశరథి, బాలాంత్రపు రజనీకాంతరావు వంటివారు తొలితరంగా ఆకాశవాణిలో పనిచేసిన ప్రసిద్ధ కవులు. అలాగే తదనంతరం కాలంలో, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, సుధామ వంటి పరిచిత కవులు, ఆకాశవాణిలో పనిచేశారు. కవితకు తొలి రూపం లిఖిత రూపమే. మరీ ప్రాచీన కాలానికి వెళ్తే కవులు తమ కవిత్వాన్ని తాళపత్రాలపై లిఖించేవారని చరిత్ర సాక్ష్యం చెబుతుంది. అయినా, ఆ కాలంలో కూడా కవి తన కావ్యాన్ని ఎవరికైనా అంకిత మివ్వాలన్నా, లేదూ ఆవిష్కరించాలన్నా వాగ్రూపాన్నే ఎంచుకొని వుండాలి. పండిత సభలోనో, రాజు లేదా పరిపాలకుల సమక్షంలోనో, తమ స్వీయ కవితాగానంతో రంజింపచేసి ఆవిష్కరణలు, ఆనందోత్సవాలు నిర్వహించివుండాలి. అంతకు మించి మరో మార్గంలేదు. సరే అచ్చు యంత్రాలు లభ్యమయ్యాక కవితా సంపుటుల ప్రచురణ ప్రారంభమైంది. కవితను గానంచేసే పూర్వ సంప్రదాయాన్ని తరువాతి కాలంలో కొంతవరకు, కవిసమ్మేళనాలు, అవధానాలు, పండిత గోష్ఠులు, కొనసాగించాయి. ఇక అనంతర కాలంలో ఆకాశవాణి కవులకు ఒక అపురూపమైన వేదికను ఏర్పాటు చేసింది. కవులు తమ కంఠస్వరాలతో తమ కవితలను తామే చదివి వినిపించడానికి రేడియో తన గొంతునిచ్చింది. అచ్చుపడిన గ్రంథాలు అందుబాటులో లేనివారికి, అక్షరాలు చదవడం నేర్వని వారికి కూడా కవిత్వాన్ని అందించడం ద్వారా ఆకాశవాణి ఒక గొప్పలోటును భర్తీ చేసింది.

ఒక సుప్రసిద్ధకవి, కవిత్వాన్ని మనకుగా మనం చదవుకోవడం ఒక పద్ధతి. కానీ అదే కవిత్వాన్ని ఆ కవి గొంతు నుంచి వినడం ఒక మధురానుభూతి. ఎందుకంటే కవి తన కవితలో ఏమి చెప్పాలని లక్ష్యంగా పెట్టుకున్నాడో అది అతని గొంతులో ప్రతిఫలించే అవకాశం వుంది. ఏ ఆవేశంతో కవిత వ్రాశాడో, ఏ అనుభూతితో కవిత వ్రాశాడో, దాన్ని యథాతథంగా తన కంఠస్వరంతోనే ఆవిష్కరించే అవకాశం వుంది. అలాంటి కవితలు మన మనస్సుల్లో మరింత గాఢంగా ముద్రించుకొని పోతాయి.

విశ్వనాథ కిన్నెరసాని పాటల్ని విశ్వనాథ గొంతులోనే వినడం ఒక గొప్ప అదృష్టం. సంగీతం పైన సమస్కంధమైన అధికారం కలిగిన పుట్టపర్తి నారాయణా చార్యుల వారు శివతాండవాన్ని లయబద్ధంగా చదివి వినిపిస్తే మనకి కలిగే అనుభూతి వర్ణనీయం కాదు. నిజానికి ప్రతీ కవి, తన కవిత్వాన్ని లిఖిత రూపంలో అందించినంత ప్రతిభావంతంగా తన గొంతులో పలికించ లేకపోవచ్చు. కానీ చాలామంది కవులు తమ కవితలపై స్వరముద్రలను చాలా ప్రచలితంగానే వేశారనే చెప్పాలి. శేషేంద్ర కవిత చదివే తీరు చాలా రమణీయంగా వుండేది. సినారె కవిత్వాన్ని చదవాలని ప్రయత్నించిన వాళ్ళు  ఆంధ్రదేశంలో కోకొల్లలు. దాశరథి కవితా పఠనంలో ఒక తమాషా ఆకర్షణ వుండేది. శ్రీశ్రీ, ఆరుద్ర వంటి ప్రముఖ కవులు తమ కవితలతో వేసినంతటి ప్రచలిత ముద్రలను కంఠస్వరాలతో వేయలేదు. ఇక కృష్ణశాస్త్రి గొంతు విన్న వారి సంఖ్య సాహితీలోకంలో అతి స్వల్పం. కవితాగానం ఎలా వుండేదో తెలియదు గానీ, కాకినాడ సూర్యకళామందిరంలో ఆయన చేసిన ఒక ఉపన్యాసం రికార్డింగ్ వినడం జరిగింది. అది మేఘగంభీరంగా వుండేది. ఏదిఏమైనా, కవిగొంతునుండే కవిత్వాన్ని వినడం మాత్రం ఒక గొప్ప అనుభూతి. ఈ అనుభూతిని మనకి పుష్కలంగా మిగిల్చింది ఆకాశవాణి. మి

# సాక్షి

- వి. భార్గవి

ఏ గల్లీలో పుట్టాడో తెలీదు. తల్లే పెంచింది. తండ్రి అతని తలపుల్లోనే లేదు. బ్రతుకే బజారయినప్పుడు చదువు కూడా వానాకాలమే. సరిగ్గా ఇలాంటి వాళ్ళకోసమే చూస్తుంటారు బజారు రౌడీలు-డెన్ డాన్‌లు! ఆ విధంగా నేర ప్రపంచంలో చేరిపోయాడు-రహీమ్ అలియాస్ రామన్ ఉరఫ్ రాజన్న! అతనికీ బాల్యం వుంది. యౌవనమూ వుంది. జీవితమే గాడి తప్పింది. దొంగతనాల్లో థ్రిల్ ఏముంటుంది? కత్తి పట్టి చిన్న చిన్న పీకలు కోశాడు-నాటు తుపాకీతో బాంకులు దోచాడు-తనే డాన్ అయి గాంగ్ నడిపాడు-పదో పదహారో హత్యలు చేశాడు-పగలు తిరగలేని పరిస్థితి- చివరికి స్పెషల్ స్క్వాడ్ తరుముతుంటే సుమో ఛేజింగ్‌లో ప్రమాదంలో కూడా ఎవరిమీదో ఎక్కించాడు-బండి తిరగబడి-చుట్టుముట్టిన చట్టానికి ప్రాణాలతో దొరికే పిరికివాడు కాదు-ఆఖరి పోలీసును పిస్తోలు గుళ్ళతో పడగొట్టాడు. అతని రైఫిల్ కాల్పులకే నేలకొరిగాడు-ఆ విధంగా చట్టానికి చిక్కకుండా తప్పించుకున్నాడు.

ఈ ప్రపంచంలో ఇన్ని నేరాలు చేసిన రాజన్నకు పరలోకం సుపరిచితంగానే తోచింది. అక్కడ ఎప్పుడూ వుండే ఎమర్జెన్సీ పరిస్థితులను చూసి-తనకిది కొనసాగింపు అనుకున్నాడు.

ఇక్కడ రాజన్న మీద ట్రయిల్ వెంటనే మొదలయింది.

మూడు ముఖాలున్న ధర్మాసనం ముందు నిలబెట్టారు. కోర్టులెక్కడయినా గంభీరంగానే వుంటాయి. కానీ ఇక్కడ దేవుని మీద ప్రమాణంచేసి...అనే ఫార్మాలిటీస్ వుండవు. దానికీ కారణముంది. జడ్జిలు ఎప్పుడూ పెద్దవారే వుంటారు-ముగ్గురూ కాస్త విసుగ్గానే కదులుతున్నారు తమ స్థానాల్లో-

రాజన్నను నిలబెట్టారు. పేరు అడిగారు. వృత్తిలేదు. ఎప్పుడు పుట్టాడో తెలీదు. కనీసం ఎప్పుడు చనిపోయింది తెలియదన్నాడు. అదే పెద్ద నేరం ఇక్కడ! 'సరే - నీ నేరాలు ఒప్పుకుంటున్నావా?' జడ్జి అడిగాడు.

రాజన్న 'నేను నిరపరాధిని..' ఇప్పుడు ఇక సాక్షులు కావాలి. 'మొదటి సాక్షిని ప్రవేశ పెట్టండి.'

భుజకీర్తులు మోగుతుండగా, కిరీటం మెరుస్తుండగా ఒక ఆజానుబాహుడు అక్కడికి వచ్చాడు - ఆయన ఠీవికి, వెలుగుకి జడ్జీలు కూడా లేచి నిలబడ్డారు! సాక్షి స్థానంలో ఆయన ఆసీనుడయిన తర్వాత వాళ్ళు కూర్చున్నారు.

'సర్వాంతర్యామీ, ఈ రాజన్న కేసులో మీకు తెలిసిన విషయాలు చెప్పడానికే మీకు కబురు చేశాం. మీరు ప్రభువులు, ప్రమాణం చేయవలసిన అవసరం లేదు కాబట్టి అన్నీ తెలిసినవారు కాబట్టి (కోర్టులో) మనకున్న సమయం పరిమితం కాబట్టి అడిగిన దానికి అవును, కాదు అని మాత్రమే చెప్పమని మనవి.'

'సాక్షిని చూశావు కదా! ఆయనకు అన్ని విషయాలు తెలుసు. నువ్వు కాదన్నా ఏమీ ప్రయోజనం వుండదు. ఆయన మాటలకు అడ్డు తగలకు... అని రాజన్నను జడ్జి హెచ్చరించి 'ఇక ప్రారంభిద్దాము' అని విచిత్రగుప్తుని వంక చూశారు జడ్జీలు-

సాక్షి చెప్పబోయే చాలా విషయాలకు ఏర్పాట్లు జరిగాయి. పెద్ద జడ్జి పెద్ద అద్దాలు తీసి కళ్ళు తుడుచుకున్నాడు. రెండో జడ్జి ఆవులించి కునుకు తీయడానికి సిద్ధమయ్యాడు. మూడో జడ్జి ఈక కలంతో ఏదో రాయడానికి ఏర్పాటు చేసుకున్నాడు. విచిత్రగుప్తుడు రాజన్న బ్రతుకు చిట్టా తెరిచాడు. సాక్షి గొంతు సవరించుకొని "ఈ రాజన్న అక్రమ సంతానం. చిన్నప్పటినుంచి అన్ని చెడు అలవాట్లు. తల్లి అంటే ఎంతో ప్రేమ. మొదటి దొంగతనం తల్లి మందుల కోసమే - తన్నులు తిని ఇంటికి చేరాడు. తల్లి చనిపోయింది. అక్కడనుంచి ఇతనికి తన చుట్టూ వున్న మనుషుల మీద కోపం పెరిగిపోయింది."

'అయ్యా! ఇతని నేరాలు చెప్పండి....' ఒక జడ్జి కాస్త విసుగ్గానే....

'రాజన్నా నువ్వు గులాబీ పువ్వులు కోశావు ఒక తోటలో'... 'ఆ అవును అవి ఆ పిల్లకి ఇవ్వటానికే కదా...' 'ఆ పిల్ల ఒక డబ్బున్న వాడిని చేసుకుంది. తర్వాత ఒకటి రెండు అబార్షనలు అయ్యి చనిపోయింది..'

'అయ్యో నాకు తెలీనే తెలియదు.' రాజన్న-

'నీకు రంగా గుర్తున్నాడా?' 'ఆ...వాడికేమయింది?'

'వాడు తర్వాత మిలటరీలో చేరి కార్గిల్‌లో చనిపోయాడులే'...

'మీ వూళ్ళో వున్న అబద్ధాలకోరువి, తాగుబోతువి నువ్వే. నీతో బాటు మారయ్య తాగుతుండే వాడు... వాడి కూతుర్నే

కదా...' 'ఆ..మీరాకి ఏమయ్యింది?' రాజన్న కంగారుగా అడిగాడు.

'అలాంటి దానికి ఏమవుతుంది-ఇష్టం లేని పెళ్ళి చేసుకుంది. నువ్వు కనపడకుండా పోయావు. ఇరవై ఏళ్ళకే రోగమొచ్చి నిన్ను తలచుకుంటూ చనిపోయింది.'

రాజన్న ముఖం విషణ్ణమయ్యింది,

'సాక్షి గారు - మనకేసు ముందుకు కదలటం లేదు. ఇంతకూ ముద్దాయి చేసిన నేరాలు చెప్పండి.' అన్నాడు జడ్జి

సాక్షి: 'చాలా చేశాడు-దొంగతనాలు, దోపిడీలు (అన్నీ తిండికి లేకే) చేశాడు. మొదటి హత్య ఆవేశంలో చేశాడు. తప్పించుకునే తెలివి లేక దొరికిపోయాడు. శిక్ష అనుభవించే సమయంలో కరడుగట్టిన నేరస్థులతో స్నేహం చేశాడు జైలులో... బెయిల్ మీద బయటకు వచ్చి ఒకమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి ఇంకొకడితో తిరుగుతుంటే ఇద్దర్నీ చంపాడు. అప్పుడే మరణ శిక్షపడింది. కాని జైలునుంచి తప్పించుకొని బైటకు వచ్చాడు.' రాజన్న గర్వంగా చూశాడు. 'తర్వాత ముసలిదంపతుల్ని ఇంట్లోనే డబ్బుకోసం చంపాడు. కాని అతనికి డబ్బు దొరకలేదు. రెండు వందలే వున్నాయి. కాని వాళ్ళ దగ్గర లక్షలున్నాయి.'

'ఆ..ఎక్కడ దాచారు?' రాజన్న తెల్ల మొహంతో.

'పరుపులో పెట్టి కుట్టారులే! వడ్డీ వ్యాపారం చేసేవాళ్ళ ఆలోచనలు నీకు అందుబాటులోకి రావు. బైటకి వస్తూ వాచ్‌మన్ తలమీద కొట్టావు'-'వాడు చచ్చిపోయాడా?' రాజన్న. 'లేదులే-తర్వాత ఆసుపత్రిలో మతిలేకుండా పడివున్నప్పుడు అతనికి ఆ నలుగురు సంతానం తెలుసా?' సాక్షి- 'నాకెలా తెలుస్తుంది-పాపం వాళ్ళకు దిక్కేమిటి?' రాజన్న.. 'నేను దాచిన డబ్బు దేవరకొండ గుడిలో వుంది. వాళ్ళకు పంపండి!' అన్నాడు. 'తర్వాత హత్య పోలీసు - అది చేస్తుండగానే ఇతను చనిపోయాడు.' సాక్షి ముగించాడు.

జడ్జి, 'ఇవన్నీ వుద్దేశ్యపూర్వకంగానే చేశాడా, కారణాలు ఏమిటి?'

'అందరికీ వుండే కారణమే. అన్నికార్యాలకు కారణాలుంటాయి. కోపంతో, అవసరానికి, అసూయతో, మోసపోయి, మరొకరికి సాయం చేయాలని - జాలిగుండె - సాటిమనిషంటే సానుభూతి - అయినా పరిస్థితులు కలిసిరాక - చాలా సుగుణాలున్నాయి - అన్ని చెప్పాలా?'

'అక్కర్లేదు'-నిద్రపోయే జడ్జి లేచాడు-

'ముద్దాయి ఏమయినా చెప్పదలచుకున్నాడా?' మరో జడ్జి..

రాజన్న చాలా విచారంగా-తల అడ్డంగా వూపాడు-

'తీర్పు త్వరలోనే ప్రకటిస్తాం-వుండండి.' అని ముగ్గురు జడ్జిలు కోర్టు వెనక ఛాంబర్లోకి వెళ్ళారు.

సర్వసాక్షి - రాజన్న ఇద్దరే మిగిలారు.

'ఆ ముగ్గురు ఎవరు?' అన్నాడు రాజన్న

'నీ లాంటి మనుష్యులే-మీ లోకంలోని జడ్జీలే.'

రాజన్న తలవంచుకొని *'నువ్వు జడ్జిగా వుంటావనుకున్నాను'* కాస్త ఆశగా.

'నేను దేవుణ్ణి కాబట్టి జడ్జిగా వుండాలంటావు? అవునా! అందులో ఒక చిక్కుంది. నాకన్నీ తెలుసు. కార్యం, కారణం. అన్నీ తెలిసిన వాళ్ళు న్యాయం చెప్పలేరు. నీ గురించి పోలీసులకు ఉప్పందించింది ఎవరో తెలుసా?

'ఎవరు?' ఆతృతగా అడిగాడు రాజన్న.

'నువ్వామధ్య ఒక హెూటల్లో దిగావు-వాడే డబ్బుకోసం చేశాడు.' సాక్షి మెల్లగానే చెప్పాడు. 'నీకు తెలియనివి వుండవు- కాని జడ్జికి చెప్పలేదు-మరో మనిషిని బొంబాయిలో సముద్రంలోకి తోశాను.' 'ఆ..వాడు చావలేదులే...' 'ఇంతకీ నువ్వు జడ్జిగా ఎందుకు వుండలేదో అర్థం కావడంలేదు' రాజన్న.

'పిచ్చివాడా, అందరి గురించి అన్ని రహస్యాలు, బలహీనతలు కారణాలు తెలిసినవాణ్ణి. ఇవన్నీ జడ్జిలకు తెలియకూడదు. ఇవన్నీ తెలిస్తే వాళ్ళ గుండెలు పగిలి పోతాయి. అప్పుడు తీర్పులు చెప్పలేరు. 'నాకు నీగురించి తెలుసు. నువ్వు నేరస్థుడివే కావచ్చు, ఒక దయగలవాడివి, సహాయంచేసే గుణం వున్న వాడివి. ప్రేమించే మనసున్న వాడివి. నిన్ను నేను జడ్జి చేయలేను'

'మా లోకంలో జడ్జీలే-ఇక్కడ జడ్జీలుగా వుండాలా?' రాజన్న.

'ఎందుకంటే, మనిషిని మనిషే జడ్జిచేయాలి. నేను సాక్షిని మాత్రమే. నా జడ్జిమెంటుకు నీకు అర్హతలేదు. మనిషి దేవుని తీర్పుకు అర్హుడు కాడు. తోటి మనిషే తీర్పు చెప్పగలడు. ఇక్కడ ఇంకో చిక్కువున్నది. అందరూ నన్ను నమ్మరు - అంటే దేవుణ్ణి నమ్మరు. అటువంటి హేతువాదులకు నా తీర్పు ఇవ్వలేను కదా-' ఇంతలో జడ్జీలు కోర్టులోకి వచ్చారు.

'రాజన్న అనే ముద్దాయికి, గులాబి దొంగిలించినందుకు, మందులు ఎత్తుకుపోయినందుకు, లైసెన్స్ లేకుండా పిస్తోలు వాడినందుకు, ప్రమాదంలో ఇరుక్కున్నందుకు, హత్యలు చేసినందుకు......'

జడ్జీలు తీర్పు చదువుతున్నారు-

సాక్షి గంభీరంగానే వుండిపోయాడు...

మి

# లోహియా లేఖ

రావెల సోమయ్యకు,

ప్రియమైన రావెల,

**నా** మీద నీ చిరుకోపం ఎందుకో తెలుసు. నీవు పంపిన ఎమ్.ఎన్. రాయ్ పుస్తకం *హ్యూమనిస్ట్ పొలిటిక్స్* చదివాను. కాని మళ్ళీ నిన్ను నిరాశకు గురి చేస్తున్నాను. ఎమ్.ఎన్.రాయ్ అభిప్రాయాలు కొన్నింటితో నేను ఏకీభవిస్తున్నా కాని ఆచరణ విషయంలో ఆయన ప్రణాళికలే అర్థం కావటంలేదు. నిజానికి అలాంటి ప్రణాళికలేమైనా ఉన్నాయా అని అనుమానం కూడా. అలాంటివి నీవు పంపిన ఈ పుస్తకంలో ఏమాత్రం నాకు కనిపించలేదు.

ఆయన చెప్పిన ఒకే ఒక్క స్థిరమైన విధానం : దేశమంతా కొంతమంది విద్యాధికులు ప్రయాణాలు చేసి ప్రజలను వారి వ్యక్తిగత స్వేచ్ఛ కోసం చైతన్య పరచాలని. కేవలం ఎన్నికల వాగ్దానాలతో, ప్రసంగాల ప్రవాహంలో కొట్టుకు పోవద్దని వారి ఇంగిత జ్ఞానాన్ని ఉపయోగించి నిజమైన వాగ్దానం ఏమిటి, వాటిలోని నిబద్ధత ఎంతవరకు తెలియజెప్పాలని. కాని ఈ కొద్ది మంది వ్యక్తులు ఇంత పెద్ద బాధ్యతను ఎలా నిర్వహిస్తారని నేను అర్థం చేసుకోలేక పోతున్నాను. ఒకవేళ ఇలాంటి సమూహం ఒకటి ఏర్పడితే (నాకు అస్సలు నమ్మకం లేదు) వారు ఏ రాజకీయ పార్టీకి అనుసంధానం కాకుండా ఎలా మన గలుగుతారు? వీరే కాలాంతరంలో ఒక రాజకీయ శక్తిగా మారి వారి వాగ్దానాలు వారు చేస్తూ వారి ప్రణాళికలు ప్రజలకు వివరిస్తూ ఉన్నతంగా కనబడ్డానికి ప్రయత్నిస్తారు. ఇక వారి ఆచరణ అసాధ్యమే. అలాంటి పరిస్థితుల్లో వారు నిరాశలో పడి, వారికి అవసరమైన ముఖ్యులతో సద్దుబాటు చేసుకుంటారు.

విమర్శనాత్మక చైతన్యం కావల్సిందే. ఓటు వేసే ప్రజలకు నేను చెప్పేది– ఈ విమర్శనాత్మక చైతన్యం వుండాలనే. బహుశా అందుకేనేమో నేను విఫలమౌతున్నాను. కాని నాకు ఒక బలమైన నమ్మకం ఉంది– ఏదో ఒక రోజున ఓటర్లు పార్టీ ప్రణాళికలను తప్పనిసరిగా పరీక్షిస్తారని. దానికి కర్త స్వతంత్ర వ్యక్తులు కాదు, కేవలం నిజాయితీగల రాజకీయపార్టీలే ఈ పని చేయగలవు. అదే ప్రజలను విమర్శనాత్మకంగా కార్యాచరణలోకి దింపగలుగుతుంది. చైతన్యంతో పాటు విమర్శకూడా చెట్టపట్టాలు వేసుకుని కదలాలి. అప్పుడే దాని ప్రయోజనం నెరవేరుతుంది.

ఎమ్.ఎన్.రాయ్ చెప్పేదాంట్లో, ఈ చైతన్యం, ఈ విమర్శన తప్పనిసరిగా నిరాశాజనకంగా తయారవుతాయి. పరస్పర విరుద్ధాలుగా మిగిలిపోతాయి. ఇప్పుడు సోషలిస్టు పార్టీ చెయ్యబోయేది ఈ ఉత్సాహాన్ని విమర్శనాత్మకంగా మేలుకొలపటమే. ఒకవేళ సోషలిస్టు పార్టీ విఫలమైనా మరొక రాజకీయ పార్టీ ఈ కార్యాన్ని నిర్వహిస్తుంది. ఎమ్.ఎన్.రాయ్ 'వ్యక్తి స్వాతంత్ర్యం ప్రజాస్వామ్యపు మూలాల్లోనే ఉందని' ఉద్ఘాటించారు. 'దీనిని పక్కన పెట్టింది కమ్యూనిస్టులు, ఫాసిస్టులు' అని కూడా అన్నారు. అంతేకాక మొదటి పురుడు అవగాహనా రాహిత్యంతో నిర్వీర్యమైందని అన్నారు. ఇప్పుడు కొత్తగా 'న్యూ హ్యూమనిజం' అవసరమని అంటున్నారు. ఇదంతా చారిత్రకంగా చర్చనీయాంశమే అయినా వ్యక్తి స్వాతంత్ర్యం మాత్రం అవశ్యనీయం.

దానిని సాధించడానికి ఐరోపా పాండిత్యం కంటే పూర్తి అధ్యయనం అవసరముంటుంది. వ్యక్తి స్వాతంత్ర్యానికి బయటి శక్తులతో పాటు మానసిక, వస్తుపరమైన సమానత్వం కూడా ఉండాలి. అందుకనే నేను ఈ నాలుగు 1. ప్రాదేశిక వనరులు, 2. వెలుపలి అవసరాలు, 3. బాహిరమైన, 4. ఆంతరంగిక మానసిక సంసిద్ధత, సమానతలు, అవసరమని చెప్పాను.



పరస్పర అనుబంధం లేకుండా ప్రశాంత వాతావరణం లేకుండా ఇదేమీ జరుగదు. ఇది పాండిత్యానికి లొంగేది కాదు. దురదృష్టవశాత్తు ఇది మన పూర్వీకులు దర్శించిన సంపూర్ణ సత్యం. ఇప్పుడు పాశ్చాత్యులు నేర్చుకుంటున్న రెండవభాగం!

మీరింకా ఎలెన్ రాయ్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారా? ఆమెకు నా శుభాకాంక్షలు తెలియజేయండి.

25 జూన్, 1958

*మీ శ్రేయోభిలాషి*

**రామ మనోహర్ లోహియా**



# ముగ్గు

– సి. వేణు

కంట్లో కడివెడు నీళ్ళు దాచుకొని ఇంటి ముఖం పట్టింది రంగమ్మత్త.

పక్కింట్లో నాల్గోతరగతి చదవుతుండే రఘు బడి నుంచి వస్తూ ఆమెను చూచి టక్కున ఆగిపోయాడు.

మల్లెపూలు తూరుపెత్తి నట్టు చిరునవ్వులు చిందిస్తూ కనిపించే రంగమ్మత్త ముఖంలో నవ్వుల పువ్వులు పూయలేదు కదా కన్నీళ్ళు ధారకట్టాయి.

"రంగమ్మత్తా! ఏం అలా ఉన్నావు?" అన్నాడు రఘు.

"ఒరే ! నా బట్టడి గున్నా! నీకూ అలుసయ్యానా? బొడ్డుకోసి పేరు పెట్టినట్లు రంగమ్మత్తా అంటావా?" అంది ఈసడింపుతో.

రఘు బిత్తరపొయ్యాడు. కమ్మని మాటలే తప్ప కాఠిన్యం కనిపించని రంగమ్మత్త కంఠంలో కత్తుల రాపిడులు వినిపిస్తున్నాయే అనుకొన్నాడు రఘు.

ఇంటికెళ్లి అనుకొన్న మాటే అమ్మతో అన్నాడు రఘు.

అమ్మద్వారా తెలిసిందేమంటే చేవ్రాలు తెలియని రంగమ్మత్తకు జర్సీ ఆవు పెట్టుకోవడానికి బ్యాంకువారు లోను ఇవ్వమన్నారని.

ఆ చిన్నారి రఘు మనస్సులో ఏదో ఒక ఆలోచనా తరంగం ఉవ్వెత్తున ఎగిసింది. అతని ముఖం కాంతితో మెరిసింది.

రఘు రంగమ్మత్త ఇంట్లోకి అదుర్తూ, బెదుర్తూ వెళ్ళాడు. కుక్కి మంచంలో మూసి పెట్టిన పుస్తకం లాగ పడుకొని ఉంది రంగమ్మత్త.

"రంగమ్మత్తా ! నా మీద కోపమా?" అన్నాడు రఘు మంచం మీద కూర్చొని.

"నీ మీదెందుకురా కోపం?" అని రఘును ఎదకు హత్తుకొంది రంగమ్మత్త.

రఘుకు ధైర్యం వచ్చింది. "నీకు ముగ్గులు వేయటం వచ్చా" అన్నాడు రఘు.

"ఒరే నా బట్టడిగున్నా! ఊరంత ముగ్గేయమన్నా వేస్తాను" అంది రంగమ్మత్త.

"ఊరంత ముగ్గువద్దులే! ముత్యమంత ముగ్గేస్తే చాలు. నేను వేసే ముగ్గే నువ్వూ వేయాలి" ఒక సవాలు విసిరాడు రఘు.

గారమీద చాక్‌పీసుతో ముగ్గేశాడు. రంగమ్మత్త ఆ ముగ్గే అంతకన్నా ముచ్చటగా వేసింది.

"ముగ్గు పిండితో వేసేస్తావు సరే! పెన్నుతో కాయితం మీద చిన్నదిగా వేస్తావా? అన్నాడు రఘు.

కాగితం, పెన్ను వచ్చింది.

ఆ ముగ్గే చిన్నదిగా క్షణంలో వేసింది రంగమ్మత్త.

ఆ ముగ్గంటే... అది ముగ్గు కాదు. 'రంగమ్మ' అనే పేరు.

ముత్యాలు పొదిగినట్టున్న "రంగమ్మ" అన్న చేవ్రాలు చూచి బ్యాంకు మేనేజరు సుందరమూర్తి ఎంతో సంతోషించాడు. జర్సీ ఆవు పెట్టుకోవడానికి అప్పు మంజూరు చేశాడు.

రంగమ్మత్తను అప్పుడు చూసి ఉండాలి ఎవరైనా మల్లెపూలు తూరుపెత్తితే ఎలా ఉంటుందో తెలుసుకోవటానికి.

మి

# చదవండి...

– ఎన్నార్కె




✦ **బౌద్ధధర్మ దర్శిని :** శాఖోపశాఖలుగా విస్తరించిన బౌద్ధధర్మం కాలక్రమంలో ఎన్నో అస్పష్టతలు, అపోహలు చోటుచేసుకున్నాయి. బౌద్ధధర్మం యొక్క స్వరూపాన్ని స్పష్టంగా మన ముందుంచిన వారు భదంత ఆనంద కౌసల్యాయన్. హిందీలో ప్రశ్నలు–జవాబులు రూపంలోనున్న ఈ రచనకు జనపన లక్ష్మీరెడ్డి గారు చేసిన తెలుగు అనువాదము ఈ పుస్తకం. వర్ణాశ్రమ విభజనను బౌద్ధం హేతువాద దృష్టితో ఖండించటం ఈ రచనలో స్పష్టంగా చెప్పబడింది. అనువాదం అద్భుతంగా ఉన్నది. ఎన్నో విషయాలపై బౌద్ధం పట్ల సామాన్య ప్రజలలోనున్న అపోహలకు ఈ పుస్తకం అడ్డుకట్ట వేస్తుంది.

*పేజీలు: 160, వెల: ₹100/- ధర్మదీపం ఫౌండేషన్, ఆర్ట్స్ & లెటర్స్, హైదరాబాద్ స్టడీసర్కిల్, గగన్‌మహల్ రోడ్, హైదరాబాద్. 040-27635654*




✦ **ప్రజ్ఞాదీపిక :** ఇది బౌద్ధధర్మంలోని కొన్ని ముఖ్యమైన సూత్రాల సంకలనం. ఆచార్య మైత్రేయ ఈ సూత్రాలను విశదీకరించి అందరికీ అర్థమయ్యేలా వివరించారు. మైత్రేయ రచనకు అనుసృజన చేసినవారు తియ్యగూర సీతారామిరెడ్డి, నందం శ్రీనివాసరావు. బౌద్ధాసక్తులకు ఉపయోగపడే రచనలివి.

*పేజీలు: 70, వెల: ₹60/-, ధర్మదీపం*




✦ **మెలకువ :** ఆంధ్రజ్యోతి, పాలపిట్ట, భూమిక లాంటి పత్రికలలో ప్రచురించబడిన సత్యవతి గారి కథల తోరణం ఈ పుస్తకం "ఒక సిద్ధాంతాన్ని, తాత్విక చింతనని, అర్థం చేసుకునే క్రమంలోనే జీవితం అర్థం కావాలి. అప్పుడే కథలు వ్రాయాలి." అంటారు ముందుమాటలో శివారెడ్డి. ఆ నిర్వచనానికి సరిపోయే కథలివి.

*పేజీలు: 125, వెల: ₹60/-, ప్రచురణ: నవోదయ పబ్లికేషన్స్*




✦ **తత్వగీతం :** పోతులూరి వీరబ్రహ్మం, ముదుమాల సిద్ధయ్య, యాగంటి లక్ష్మప్ప గార్ల తత్త్వగీతాలను ఒక పద్ధతిలో స్థిరపరచి, పరిష్కరించి ప్రచురింపబడిన రచనలివి. పాఠకులకు, గాయకులకు ఉపయోకరంగా ఉంటుందని, గీతాల రాగతాళ వివరణ కొన్ని రాజయోగ పారిభాషిక పదాల వివరణ సేకరించి అనుబంధంలో ఇచ్చారు.

*పేజీలు: 170, వెల: ₹100/-, ప్రతులు కావలసినవారు నవోదయ పబ్లికేషన్స్‌ను సంప్రదించండి.*




✦ **కళాప్రపూర్ణ పూర్ణచంద్రిక :** కళాప్రపూర్ణ, దర్శనాచార్య కొండూరు వీరరాఘవాచార్యుల స్మారక సంపుటి. కొండూరు వారు చతుర్వేదములలోని కొన్ని ముఖ్యమైన సూక్తులను తీసుకొని వానికి సరళ వాఖ్యానాలు వ్రాశారు. వీరు చారిత్రక నవలా రచయితగా శ్రీ కృష్ణదేవరాయల కుమార్తెయిన మోహనాంగి పై వ్రాసిన నవల ప్రసిద్ధిగాంచింది. వీరు శిల్ప, సాహిత్య, తత్త్వ శాస్త్రములలో చక్కని కృషి చేశారు. అత్యంత ప్రతిభాశాలియైన వారిపై వచ్చిన ఈ శతజయంతి ప్రత్యేక సంచిక అభినందనీయం. దీని విలువ అమూల్యం.

*పేజీలు: 220, ప్రతులు కావలసినవారు ఫోన్: 9848629811 లో సంప్రదించండి.*



❖ **సమ్మోహనం :** రచయిత కోటం చంద్రశేఖర్. హితం నామతం, మతం నా గతం. కులమత రహితం నా మనోగతం అంటూ మనసుకు సూటిగా తాకేలా అభ్యుదయ భావాలను, మానవీయకోణాలను తన రచనలలో ప్రతిఫలింప చేశారు.

*పేజీలు: 175, వెల ఇంతని చెప్పలేదు. ప్రతులకు కోటం చంద్రశేఖర్, ఫోన్ : 9490157391.*




❖ **పూతరేకులు :** సుధామ కూర్పుచేసిన ఛెణుకుల పెట్టె. కార్టూనిస్టుగా, కథకులుగా, కవిగా ఇలా వివిధ రంగాలలో పేరుగాంచిన రచయిత సుధామ. ఇవి మొదట ఆదివారం అనుబంధంలో వచ్చాయి. అందులోనుంచి ఇవి మచ్చుకి కొన్ని.

*పేజీలు: 60, ప్రతులు కావలసినవారు ఫోన్: 9848276929 లో సంప్రదించండి.*




❖ **అనుభవాలు జ్ఞాపకాలు :** 86 సంవత్సరాల వయస్సులో అడుగిడిన మువ్వల పెరుమాళ్ళు వ్రాసిన గతకాలపు అనుభవాలు జ్ఞాపకాలు. విన్నవి, కన్నవి ఈ రచనకు నాంది. 90 పేజీలు గల ఈ పుస్తకంలో 54 పేజీలలో ఆయన రచనలు, మిగిలిన వాటిలో ఆయనకు సంబంధించిన ఫొటోలు ప్రచురించారు. ఫోటోలలో కొన్ని అపురూపమైన సంఘటనలకు సంబంధించినవి. దాని క్రింద తారీఖులు కూడా ప్రచురించినట్లయితే మరింత బాగుండేది. రచన ఎంతో హృద్యంగా సాగింది. ఈ పుస్తకాన్ని ఆయన "1948, 49, 50 సంవత్సరాలలో ఆనాటి ప్రభుత్వం ఆంధ్రప్రాంతంలో 200 మంది కామ్రేడ్లును కాల్చి చంపింది. ఆ అమరవీరులకు ఇది అంకితం" అన్నారు. దీనిని బట్టి ఇందులోని విషయం ఏమిటో గ్రహించ గలరు. దీని వెల ఇంత అని పేర్కొనలేదు.

*పేజీలు: 90, నవశక్తి ప్రచురణలు. కారల్ మార్క్స్ రోడ్డు, విజయవాడ-52002*




❖ **రాగం భూపాలం :** పి. సత్యవతి వ్రాసిన వ్యాస కదంబం. ఇందులో 'పడమటి కిటికి' పేరుతో పశ్చిమ దేశాలలోని కొందరు ప్రముఖ రచయిత్రులు, స్త్రీవాద ఉద్యమాలకు సంబంధించిన వ్యాసాలు, అలానే నల్లతేజం పేరుతో ఆఫ్రికావాసులకు సంబంధించిన వ్యాసాలు, తూర్పువాకిలి పేరుతో వ్రాసిన మన ప్రాంతపు వ్యాసాలున్నాయి. ఏ విషయాన్నైనా ఫ్రాంక్‌గా, ఉత్తేజకరంగా చెప్పగలగటంలో రచయిత్రికి మంచి నేర్పుంది.

*పేజీలు: 104, వెల : ₹ 50/-, ప్రతులు* నవోదయ పబ్లికేషన్స్. కారల్‌మార్క్స్ రోడ్డు - విజయవాడ-2




❖ **గంగిరెద్దు బతుకులు :** మూఢనమ్మకాలపై తుమ్మా భాస్కర్ సంధించిన అస్త్రం. ప్రస్తుతం మన సమాజం చుట్టూ పేరుకుపోయి రోజు రోజుకూ ఎక్కువ అవుతున్న అశాస్త్రీయ భావనలను, 20 వ్యాసాలలో రచయిత శాస్త్రీయంగా విశ్లేషించి, కొన్ని ఉదాహరణలను ఉటంకిస్తూ వ్రాసిన వ్యాస సంపుటిది. ఈ పుస్తకాన్ని తేజ టాలెంట్ స్కూలు వారు ప్రచురించటమే కాదు, వీటిని విద్యార్థులకు అందించారు. హేతువాద దృష్టితో సాగిన ఈ రచనలు అవశ్యం పఠనీయం.

*పేజీలు: 170, వెల : ₹ 65/-, ప్రతులకు సహచర బుక్ మార్క్స్, బాగ్‌లింగం పల్లి, దశపుస్తక కేంద్రం, నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్‌లలోను, మైత్రి బుక్ హౌస్, విజయవాడలోనూ సంప్రదించండి.*



---ప్రజల దృష్టియందు తాను---      ---తన దృష్టియందు ప్రజలు---




---చందా దారుల దృష్టియందు---




---తన దృష్టియందు తాను---

*చిత్రకారుడు:* **తలిశెట్టి రామారావు**

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు**

| | | | ₹ |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-1 | " " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-2 | " " | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-3 | " " | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 8. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 9. | అమాహా | " " | 60.00 |
| 10. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 11. | సిద్ధార్థ | " " | 50.00 |
| 12. | నాలో నేను | " " | 30.00 |
| 13. | కథాంజలి-1 | *ఎస్సారె* | 80.00 |
| 14. | కథాంజలి-2 | " " | 110.00 |
| 15. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 16. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 17. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | కథా సాహితి | 150.00 |
| 18. | IN QUEST OF UTOPIA | Mrs. Daggubati Purandeswari | 250.00 |
| 19. | గురవాయణం | *డాక్టర్ గురవారెడ్డి* | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం - *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ : ఉపమలు - *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు - అన్నపరెడ్డి బుద్ధఘోషుడు | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం: జె. లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం - బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు - ఈమని శివనాగిరెడ్డి | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |
| 11. | విపశ్యనా ధ్యానమార్గదర్శిని (తియ్యగూర సీతారారెడ్డి & నందం శ్రీనివాసరావు) | 35.00 |
| 12. | మిళింద ప్రశ్నలు (బోధచైతన్య) | 150.00 |
| 13. | బౌద్ధ ధర్మదర్శిని (భదంత ఆనంద కౌసల్యాయన్ - అనువాదం జె. లక్ష్మీరెడ్డి) | 100.00 |
| 14. | ప్రజ్ఞాదీపిక (తియ్యగూర సీతారారెడ్డి & నందం శ్రీనివాసరావు) | 60.00 |
| 15. | ధమ్మపదం కథలు (బోధచైతన్య) | 150.00 |
| 16. | జాతకమాల (బోధచైతన్య) | 150.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | 40.00 |
| 2. | యతిగీతం- స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ................................................................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ................................................................................

వీధి ................................................................................

పేట ................................................................................

ఊరు ................................................................................

పిన్ ................................................................................

సెల్ ................................................................................

**3. సంతకం :** ................................................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

**మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి: **'సిద్దార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



వెలుగు నీడల పొత్తు

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



దీపాల వేళాయె...